

చెన్నపట్టణము, మే ౧౯౩౦

సంపుటము ౭ ప్రమోదూత సంవత్సరము వైశాఖమాసము సంఖ్య ౫

హంపీక్షేత్రము

కొడాలి వెంకటసుబ్బారావు, కామరాజుగడ్డ శివయోగానందరావుగార్లు

౨

నేటిస్థితి

రాళ్లు

శిలలు ద్రవించి యేడ్చినవి జీర్ణము లైనవి తుంగభద్రలో
పల గుడిగోపురంబులు సభాస్థలు లైనవి కొండముచ్చు గుం
పులకు చరిత్రలో మునిగిపోయెను ఆంధ్రవసుంధరాధిపో
జ్జ్వల విజయప్రతాపరభసం బొకి స్వప్నకథావిశేషమై.

నునుపులు సానబెట్టకయె నూత్నము లెప్పటి కప్పుడే శిలా
గణములు, ఒక్కటొక్కటి శకంబులనాటి చరిత్ర నూరిపో

సిన యది తత్కాల ప్రతిభ జీల్చిన దుష్టవిధిప్రధాన సా
ధనములుగూడ విస్మయవ్యాతింబులు కించి దుష్పాత్త దుఃఖముల్.

ఈ పెనుకొండబండ లెటులెత్తిరొ ఆకసమంట లాఘవ
ప్రాపితకార్యమా యిది "సభాస్థలులైనవి కోటలైనవం
తా పనివాండ్ర కౌశలవిధానమె చూపు బలే" నవీనయం
త్రోపకృతుల్ విదేశపువిధుల్ పిసరంతయు నేర్చినారటో!

కొక్కెముల్ రాతినొక్కులుగాగ ఉయ్యాల సలిపినా డొక కొండపలక తొలిచి
సోపానములు రాతిసుళ్లుగాగా నయ్యి కొట్టినా డొక కొండగుట్ట తొలిచి
దూలముల్ రాతిబాదులెగాగ హర్మ్యము కట్టినా డొకకొండకటిని తొలిచి
వేదులెల్లను రాతివిరుపులుగా రచ్చ దిద్దినా డొకకొండదిబ్బ తొలిచి
సర్వనిర్మాణముల నద్రిచయమునందె-శిల్పి చేతిసాధనముల చెక్కినాడు
మరలు లేకుండ యంత్రాలమహిమలేక-ఆమహాశక్తికిని హేతు వరయలేము.

సర్వనిర్మాణమును శిలాస్థావరంబు-నాడు హంపీ వెలుంగు విన్నాణమందు
సర్వనిర్మూలనము శిలాస్థావరంబు-నేడు హంపీ నశించిన పాడుస్థితిని.

తి మ్మ రు సు క చ్చే రీ

తిండికి లేక ఎంగిలి జతించిన మేనున తెల్గురాజ మా
ర్తాండుని తేరిపై ప్రణవతత్త్వము దెల్పెడి బాలకృష్ణుడై
యుండిన మంత్రితిమ్మరుసు ఊహాల పావనమైన రచ్చలో
మండిన మంటతో నదియు మారె మసీదుగ మాచరిత్రలో.

చా క లి దా ని మే డ

[రామరాజు చాకలి కన్నెను వలచినాడు. దానికి దివ్యభవనము కట్టించినాడు. తురకలు బద్దలుకొట్టినా పగలకుండా దాని పూర్వవైభవము ఇప్పటికీ కాస్త కనిపిస్తుంది]

చాకలికన్నె లేనగవుచాలున ముత్తెపుపంట మానస
వ్యాకులమైన తిచ్చరణవాతరయోద్ధత ధూళిధూసర

స్వీకృత మస్తకుండయి వసింపగ గట్టినమేడ శిల్పవి
ద్యాకృషిలోన శిల్పికి సతం బాకభావములూరువ్యాఖ్యయా.

చాకలిమూటలో మురికిచాలుల శాంతియు సేవ ఓర్పు లే
కీకృతమూట గాంచి గుణకీర్తన చేసెను రామరాజు మా
చాకలికన్నె వన్నె పరజా తళుకీనిన మేడగోడలన్
తాకిన చిత్రచిత్రముల తల్పముపై ప్రణయామలాత్ముడై.

అష్టకోణ జలక్రీడాగారము

జలధారాంతర కేళికానిలయ మష్టాస్యంబు తత్క్రీడలో
పల స్వేచ్ఛావరణీయ లూగుదురు శుంభద్వ్యోమగంగాసరి
త్కలహంసీ మృదురావగీతముల నాకాంక్షించుచున్ రాచవా
రలు చేటీజన హాస్యవాగమృత ధారామోహితాత్మావధిన్.

దురంతస్మృతి

బాకుపోటున చిమ్మబడిన నెత్తురుజల్లు వెల్లవేసెనె రాజవీథి నిచట
గళపాశములు నీలకబరీభరంబుల పదనులో మిత్తి సాపడెనె యిచట
కులదేవతకు మ్రొక్కుకొనువేళ హారతి పొగలతావికి కత్తులెగసెనె యిట
అంత్యసందేశ గాఢాలింగనంబుల కలియనొత్తెనె చురకత్తి యిచట
శిరము తెగి మొండెమై కోటబురుజుమీద-పడక నిలిచిన "కాపలా" భయముచేత
శాత్రవులు కోటకెగబ్రాకజంకి సమయ-మునకు వేచుక తలదాచుకొనిరె యిచట.

దేవాలయములు

ఏదేవి చిలికెనో యీ పాలమీగడ విఠ్ఠలాలయ శిలావేదులందు
ఏజోదు చిందెనో యీ రక్తగంధము నరసింహదేవు పేరురముమీద
ఏశిల్పి దిద్దెనో యీ కారుమబ్బులు ద్వారపాలక రాము తేరు[1]మీద
ఏరాజు తూగెనో యీతులాడోలలో తులసి బంగారుమొక్కలకు మ్రొగ్గి

1. ఈగుడిని హజార్ రామస్వామి ఆలయ మంటారు. అక్కడవున్న రాతిరథముమీద చిత్రములను గూర్చి.

ఏమహాభక్తు డిట జపియించినాడో-దివ్య కోదండరామ పత్రిశ్రమాప
నయన శబరీఫలాపేక్ష నియతుడగుచు-కాలవుం దాటులందు సంకరము లన్ని.

ఆంధ్రాధిపాతపత్రాచ్ఛాదనాచ్ఛ వైరూపాక్షనాథు కర్బురపుకాంతి
[2] సరిగమపధనిసస్వరవల్లకీతుల్యరవ విఠోబా స్తంభ రాగఫణితి
కోదండరామసాంగోపాంగ నీలరోచి ప్రసారార్ద్రి శిలాప్రతిష్ఠ
ద్వారదేశాధిష్ఠ శ్రీరామదేవాలయస్థ శిలా చిత్రయజ్ఞవాటి
పన్నగస్వామిశయ్యా నపాండురారు-ణచ్ఛ విప్రసన్న ప్రశాంత ప్రమోద
పద్మనాభ మహాదేవు ప్రతిమగాంచి-విస్మయాధిక్యతను దేహవిస్మృతులము.

కోదండరామస్వామి

ఇనవంశోద్భవు డాలికై రణము చేయించెంగదా నీకు నై
తన కోదండము నెక్కుపెట్టెనటె స్వార్థం బా మహాదేవదే
వుని కే కల్గ మనుష్యమాత్రులకు తప్పో నైజశక్తి ప్రతా
ప నిరూఢుల్ సుతు లుండగా కలిగెనా పంపాసతీ దుఃఖముల్!

నరసింహస్వామి-విరూపాక్షస్వామి

గజినిమహమదు కోపించి కత్తినెత్తి-సోమనాథుని పిడికెడు చూర్ణమయ్యె;
నారసింహునికోరల నరకి నేటి-కీవిరూపాక్షుకంటిలో నిసుముచల్లి. .

---

2. ఇది విఠోబా ఆలయములోనిది. అక్కడి స్తంభనిర్మాణం బహుచిత్రంగావుంది. ఒక పెద్ద స్తంభం మధ్య వుంటే దానిచుట్టూ ఏడు పిల్లస్తంభాలు వుంటవి. అవి ఆరోహణావరోహణక్రమంగా సప్తస్వరాలు పలుకుతవి.

ఎఱ్ఱన "నృసింహపురాణము"

గుఱ్ఱం వేంకటసుబ్బరామయ్యగారు, యమ్.ఏ.

౧

పీఠిక

ఆంధ్రకవికూటమునం బ్రథమ తాంబూలమున కర్హులయ్యుఁ, గొన్ని కారణములచే నించుక నిరసనమందువారలలో నొకఁ డెఱ్ఱన. భారతకవిత్రయమునం దొకఁడయ్యు, నన్నయ తిక్కనలకు వెనుకటి వాఁడగుటనో, వారిని భక్తిపురస్సరముగా స్వయము స్తుతించిన కతమునో, ఆదికవులకును దనకును రాజహంసక్రౌంచాంతర మని తననోటనె చెప్పికొనుట చేతనో, యిప్పటివార లీతనిని దొలియిరువుర సమానునిగ భావించుట కిచ్చగింపరు. ఇంతియకాక, నన్నయభట్టే ఆరణ్యపర్వమంతయు వ్రాయఁగా, నందుఁ గ్రిమిదష్ట భాగముల మాత్ర మెఱ్ఱన పూరించెనని యొకవాదము గూడ నిటీవల బయలు వెడలినది. మఱి యీతని "నృసింహపురాణ" "హరివంశ" కథలలోఁ గొన్నిటికిఁ బోతన "భాగవతము"తోడను, గొన్నిటికి సోముని "యుత్తర హరివంశము"తోడను సామ్యము గలదు. మూలకావ్య ప్రాశస్త్యము, నిజలలిత మధురశైలి, శబ్దాలంకార భూయిష్ఠత, అనన్యపద్యశిల్ప భక్తిరస సంపద, యిత్యాదులు పోతన పండిత పామరజనాదరణమునం బడయుటకుఁ గారణము లైనవి. సోముఁడును శబ్దాలంకార ప్రియు లగు నొకతెగ పండితులకు అభిమాన పాత్రుఁ డయ్యెను. కావున, ఎఱ్ఱనకుఁ బోతనతో సామ్యముగల భాగములఁ బోతనయే అధికుఁడనియు, సోమునితో సామ్యముగుపట్టుల సోమన్నయే మిన్నయనియుఁ బలువురు వచించుట ఘటిల్లినది. "హరివంశపు" పీఠికలో శేషాద్రిరమణకవు లిట్లు వ్రాసిరి. "ఎఱ్ఱాప్రగడ వ్రాసిన నృసింహపురాణములోని ప్రహ్లాదచరిత్రము పోతన సప్తమస్కంధములోని ప్రహ్లాదచరిత్రముతోఁ బోల్కి లేకున్నను, రసాతిశయమునఁ బోతనదే మేలుచేయిగ నున్నది." ఇట్టి వ్రాఁతలకుఁ జేయూఁతయో యన్నట్లు "నృసింహపురాణ" ముద్రిత గ్రంథము అచ్చుతప్పుల కుప్పయై, పెక్కెడలఁ గవిభావమును మఱుఁగుపఱచి, రసభంగమునకుఁ, బఠితలకుఁ విసువును బొడమించుచున్న దనవలసినందులకుఁ దత్ప్రకాశకులు నాపైఁ గినియకుందురు గాక.

తొలుదొల్తనే, పోతనార్య ప్రహ్లాదచరిత్రమందుఁ గైకొనునంత భక్తిరసంపుఁబెల్లి నృసింహపురాణమున నలముకొనదని యొప్పుకొనవలయును. ఎఱ్ఱనయేల, నన్నయ తిక్కనాదులుగూడ, భక్త్యావేశమునఁ బోతనకు లోకువయే గదా! భాగవతమునందలి "శ్రీవల్లభుఁడు తన్నుఁ జేరిన యట్లయిన", "వైకుంఠచింతావివర్జిత చేష్టుఁడై", "మందార మకరంద మాధుర్యమునఁ దేలు", "అడుగడ్గునకు మాధవానుచింతన సుధామాధుర్యమున" ఇత్యాది పద్యపద్మోపహారాస్త్ర పరంపరంగల చొక్కు "నృసింహపురాణము"న ప్రాయికముగా లేనిమాట వాస్తవము కాని తక్కుంగల కవితాగుణములం దేమిటను నృసింహపురాణమును పోతన కృతియే గాక మఱియేకబ్బమును మించఁ జేరదని నాకుఁ దప్పని యభిప్రాయము. కల్పనచమత్కృతియందును, ఔచిత్యపోషణమందును, మానవస్వభావానుకరణమందును, ప్రకరణోచిత భాషాశైలియందును, వీనిచే ఘటిల్లు రసపుష్టియందును ఈకృతి కియ్యదియె యీడని చెప్పవచ్చును. ఏతద్గుణ సంపత్తిచే, నియ్యది ప్రబంధరూపమునను, సర్వోత్కృష్ట దృశ్యకావ్యకల్ప మనఁదగును. వేయేల, కవి నామము మనకు మున్నుగాఁ దెలియని యెడల, నియ్యది తిక్కనకవనమే యని తప్పక మనము భ్రమింతుము. "ఈ యనర్గళధార, ఈయల్లిక బిగిబిగి, ఈ యొండురెండక్క రంపుఁబదములకూర్పు, ఈ భావగాంభీర్యము, ఈతత్త్వ విజ్ఞానము, ఈరసపోషణము ఆ తిక్కనార్యునివే గాని మఱియొకరి సొత్తు గాఁ జేరవ"ని యీగ్రంథముఁ జదువు

నవ్వుడు మనకుఁ దోఁచుటలో వింత లేదు. ఇందు మఱి యొక విశేష మేమన: ఈకావ్యము భారత భాగవత హరివంశాదులవలె, ఏ సంస్కృత మూలమునకును అనువాదము గాదు. కవి యిందలికథను బ్రహ్మాండాద్య నేక పురాణములనుండి యేర్చి, తన యిచ్ఛవచ్చినరీతిని మార్చి, పొంపుఁగూర్చెను. నేనెఱిఁగినంతవఱకు, ఇందు మూలకథలతో సామ్యముకన్న భేదమే అధికముగఁ గానవచ్చును. ఈ యుద్గ్రంథముపై నా కిట్టి భక్త్యనురాగములుండుటచే, ఎల్లనార్యుని కీర్తికిని, ఆంధ్రవాణికిని వరివస్యంగావింప నభిలషించి, మదీయాభిప్రాయ సమర్థకములగు విశేషాంశముల నిందుండి యుదాహరించుచు నీవ్యాసము వ్రాయ నుపక్రమించినాఁడను. దీనిచేఁ గొందఱకేని యిక్కావ్యముం బఠింపఁ గుతూహలము వొడమునేని, లేన్ముద్రణమున దీనికి నిర్దుష్టమగు చక్కని పునర్ముద్రణము లభించునేని, ఈ నా యుడుతసేవ సఫలమయ్యెనని భావించువాఁడను.

౨

ఔచిత్యపోషణము:— కథయందలిమార్పులు

ఔచిత్యగుణము కావ్యకళకుఁ బ్రాణతుల్యము. ఇయ్యది ప్రకృత్యనుసారులగు రచనలచేతను, మానవ స్వభావానుకరణముచేతను రూఢిపడును. ఔచిత్యము నీకవి యెట్లు పోషించినదియు, ఇతఁడు పూర్వకథ యందుఁ గావించిన మార్పులవు, ఒనర్చిన పెంపకమును గాంచిన విశదమగును. ఇందులకు నిదర్శనము లీగ్రంథమున వేనవేలు తోఁపఁగలవు. కాని గ్రంథవిస్తర భీతిచే నిట దిక్ప్రదర్శనముగ ఎల్లన యొనర్చిన కథా వ్యత్యయముల యౌచితికిఁ గొన్ని యుదాహరణము లొసంగెదను.

౧. ప్రహ్లాదచరిత్రమునకుఁ బూర్వరంగ మగుఁదగు జయ విజయ శాపకథ యెల్లరకుఁ దెలిసియే యున్నది. విష్ణుదర్శనకుతూహలులై యేతెంచిన సనకసనందనాదులకు జయ విజయులు ఆనమానము యడ్డుటయు, అందుల కమ్మహాత్ములు కినిసి వారి నసురయోనిం బుట్టుఁడని శపించుటయు, నపుడు శ్రీమన్నారాయణు లే యచటికే తెంచి, యాఋషుల బుజ్జగించి, జయ విజయ శాపమున కనుమతించి, వీర లచిరకాలమున నాయంతికమునకు నరుదెంచునట్లుగా ననుమతింపవలయు నని కోరుటయు, దానికి వారు వల్లెయనుటయుఁ దత్కథా సారాంశము. ఇందు విమర్శనీయాంశములు రెండు కలవు. శ్రీవిష్ణువు వైకుంఠప్రాప్తి నొసఁగు నధికారము తనకేయుండఁగా నందుల కనధికారులగు ఋషులను వేఁడుకొన నేల? త్రికాలవేది, "సమస్తభూతచేతోవిదితాత్ముఁడను" దేవదేవున కెఱుక లేక, ఋషుల కట్టి యపచారము, ద్వారపాలకుల కట్టిశాపము ఘటిల్లు టెట్లు! కాదా; యెఱిఁగియు నౌదాసీన్యమూని, మాకీభావము వహించెనా! ఇందుఁ దొలిపంశయమునకు "నారాయణుఁడు సనకాదులను వేఁడుట, జయవిజయులు తనయంతికమున కరుదెంచుటకుఁ గాదు. వారు తిరిగివచ్చుట అచిరకాలమున నేఁగుటెల్లుటకు" అని సమాధానమేని, తన యంతికమునకు రప్పింపశక్తిగల వైకుంఠునకు "అచిర కాలమున" రప్పించుటకు మాత్ర మధికారము లేదా? మఱి రెండవప్రశ్నమునకు "విష్ణువు, సర్వమును ముందుగా నెఱిఁగియు కర్మబద్ధులగు జయవిజయుల దుర్బుద్ధియె వారలఁ జెఱుచునని యూరకుండెను" అని యుత్తరమేని, జయవిజయవృత్తము ఆశాపమును బొందఁదగినంత దుష్టమా? "మా ప్రభువు భార్యాయుతులై యేకాంతమున నున్నవారు. ఇంచుక వేపుఁ" డనుటయే కదా వారి మహాపరాధము! ఇంతమాత్రమునకు వారలు "అసుర యోనింబుట్టి లోకకంటకులు గండు" అను ఘోరశాపమున కర్హులా? అపచారలేశమున్నను, దండన దానిని మించినదనియే యొల్లన యాశయముకూడ. "ఇమ్మహాపురుషుల కింతమాత్రకుఁగాఁగ నేలకో యీకోప మిట్లు పుట్టె?" నని యచ్చటివారి గుజగుజ.

పై సందియములను ఎల్లన తనమార్పులచేఁ దొలంచెను. ఎట్లన, నిప్పురాణమున విష్ణువు సనకాదులను "జయవిజయులొనర్చిన యపచారము నాయది. ఉపశమనము నొందుఁ" డని యనునయించునే గాని, "మరల వీరల కచిరకాలమున వైకుంఠప్రాప్తిఁ గలిగింపుఁ"డని కోరఁడు, మఱియు విష్ణువు తనద్వారపాలకులతో "మీరు

తుది నసమ్మదైకశ్యత్వంబు నొందఁగలవారలు-(అంతికమునకు వచ్చుట మాత్రముకాదు). ఇదియంతయు నేన మాయాబలంబున మీకు శ్రేయఃకారణంబుగా నుత్పాదించిన యుపాయంబు. సనకాదులు కాదు; శర్వుండైన మద్భక్తజనంబుల ధిక్కరింప శక్తుండగునె! ఇత్తెఱంగు మాంగళ్యంబు నా నంగీకరించునది" యని సెలవిచ్చును. ఇందుచే భగవంతుని యనన్యశక్తిసంపదయు, సర్వజ్ఞతయుఁ బ్రస్ఫుటములగుటయే గాక, యీసంవిధానమెల్ల భగవత్సంకల్పిత మనియు, నిక్కథకు శ్రీవిష్ణువే సూత్రధారుఁ డనియునుఁ దెల్లమగును.

౨. తనతమ్ముని వధించినాఁడని విష్ణువుపై హిరణ్యకశిపుఁడు పగఁగొనినట్లు భాగవతకథ. ఇందుచే హిరణ్యకశిపు దౌష్ట్యమునకు వ్యక్తిసంబంధమగు పగ యొకటి కారణమగుచున్నది. ఇట్టి వృత్తము లోకసామాన్యమగుటచే, అతని ద్వేషమునకు అతిలోకదౌష్ట్య మాపాదింపదు. మఱియు నియ్యది "హిరణ్యకశిపుఁడు దేవతలను, గడకు శ్రీమన్నారాయణుని నెదుర్చుటకుఁ బురికొల్పినది యతని యహంకారమే. అదియే యతని సమూలనాశమునకు ఏకైకకారణము" అను కథాప్రయోజనమునకు భంజకముగా నున్నది. కావున ఎఱ్ఱన తనకథయందు వ్యక్తిద్వేషకారణమును బూర్తిగఁ దొలఁగించినాఁడు. ఇందు హిరణ్యకశిపుఁడు

"అసురుల తల్లికంటెను మదంబ వరిష్ఠ; త్రిలోకరాజ్యభోగములను నాకె యోగ్యములు గాని, నిలింపులకెట్లు కల్గు"నని తనహక్కును సాధించుటకు నిజజ్ఞాతులగు దేవతలపై నెత్తివచ్చును. "సర్వలోకైకవీరునికిఁ గశిపునికి స్వర్గజైత్రయాత్రకు ఏ హక్కు నెప మేల! బాహుబలమున మిన్నయగుటయె చాలినహక్కు గదా! రాజ్యము వీరభోజ్యముగదా!" అనిన, లోకైకవీరుఁడు హిరణ్యకశిపుఁడుగూడ నొక న్యాయ్యమును బాటించి ప్రవర్తించె ననుటచే, ధర్మాధిదేవత యట్టి అసురహృదయమును గూడఁ బూర్తిగ విడువలేదని తేటపడును. ఇయ్యది "There is a soul of good in things evil" అను మహావాక్యమునకు నుదాహరణమును అగును. ఈ న్యాయాన్యాయావలంబనముచే హిరణ్యకశిపుని వీరత్వమునకు మెఱుఁగెక్కునే గాని, వన్నె తఱుఁగదు గదా!

౩. భాగవతకథయందు ఇంద్రాదులు హిరణ్యకశిపుని తపము వేఁడి సైరింపఁజాలక, బ్రహ్మతో మొఱపెట్టుకొనినట్లును, అందుపై నాతఁడు వచ్చి యసురకు వరమిచ్చినట్లును ఉన్నది. నృసింహపురాణమున, బ్రహ్మ తనంతఁదానే ప్రీతుఁడై "కృప నెంపుదలిర్ప" వచ్చి, వరమిచ్చినట్లున్నది.

౪. భాగవతమున హిరణ్యకశిపుని బ్రహ్మస్తుతి వేదాంతమయమై, యతని యసురగుణమున కననుగుణముగ నున్నది. నృసింహపురాణమున "సముచితార్థ మధుర బహువిధస్తోత్ర సమృద్ధ రచన మున్నుగా నతఁ డిట్లని విన్నవించె"నని మాత్రమున్నది.

౫. హిరణ్యకశిపుఁడు కోరిన వర మెల్లరకు విదితమే కాని యట్లు కోరుటకుఁ గారణము భాగవతమునఁ గాన్పింపదు. "అయ్యది యూహకు సులభగోచరము కదా? హరిపైఁ బగదీర్చుకొనుటకే కదా యతఁడు దేనిచేతను చావులేకుండునట్లు వరము కోరినది." అందు మేని, అతని కోర్కె పగఁదీర్చుకొనుటే యైన యెడల, దానినే యేల కోరరాదు? మఱి యేమార్గముచేనైన పగదీఱు నుపాయమేల కోరరాదు? చావులేకుండు వరమే యేల కోరవలయును? అను ప్రశ్న స్ఫురించును. ఇందులకు ఉత్తమశిల్పమునం దుచితసంవిధానముచే నగు సమాధానము వలయును. అయ్యది నృసింహపురాణమునఁ గాన్పించును. ఇందు హిరణ్యకశిపుఁడు తపమునకేగుట తనహక్కగు అసురేంద్రత్వమును సాధించుటకొఱకు కావున నయ్యది కృపసేయుమనియే, యతఁడు బ్రహ్మను దొలుత నడుగును. అందుల కాయన యిట్లు నిపుణముగాఁ బ్రత్యుత్తరమిచ్చి, వాని కాకోర్కెను దొలఁగించును:

"సమధిక పూర్వదేవకులసంజనితుండవు నీవు; నీకు న-య్యసురపదంబు దక్కు-వ; సురాధిపతిత్వము నీకెంత! య-య్యమరవరేణ్యసంపదకు నగ్గలమై పెనుపొందు వైభవం-బనురుట యేమిటం గలుగు నట్టి వరంబుఁ దలంపుమింపుగన్"

అందుపై, దనపదమే అడుగునో, త్రిమూర్తులపదమడుగునో యని కాఁబోలు "వనజభవుఁ డింక పీఁడేమని వేడునో యనుచు నాకులాత్మత నొందుచుండ" హిరణ్యకశిపుఁడు నెమ్మనంబున "నూహించి" యేమిటం జావ పొందునట్లు వరము వేఁడును.

౬. హిరణ్యకశిపుఁడు తపము సేయుచుండఁగా, దేవేంద్రుఁడు గర్భిణియగు లీలావతిని కైకొని పోవుట; నారదుఁ డతనిని వారించుట; నారదాశ్రమమున గర్భస్థుఁడగు ప్రహ్లాదుఁడు నారదుల యుపదేశము నాలకించుట ఈ భాగవతకథాభాగము నృసింహపురాణమున వర్జ్యము. ఈ కథయందు దేవేంద్రుని వర్తనము మిక్కిలి యనుచితముగా నున్నది. "తత్ప్రసూతిపర్యంతము బద్ధుఁ జేసి జనితార్భకు వజ్రముధారఁ ద్రుంచెదన్" అను ఇంద్రునివాక్యము కడునీచముగను అతిఘోరముగను ఉన్నది. హిరణ్యకశిపుఁడు "నూఱు దివ్యసంవత్సరములు" తపస్సు చేసెనట! లీలావతికి గర్భ మెప్పుడు వచ్చెను? అతఁడు తిరిగివచ్చినపిమ్మట గదా ప్రహ్లాదుని శైశవము భక్తియు వర్ణింపఁబడుట. ప్రహ్లాదుఁ డెప్పుడు జన్మించెను? ఇందులకు, "శతవత్సర గర్భ వృత్తాంతము మున్నగు స్వభావాతీతవిషయములు పురాణములఁ బెక్కులు కలవుకదా? ఇదియు నట్టిదే యేల కాఁగూడదు? స్వభావవిరుద్ధములు వర్జనీయములు గదా యనిన, మొదల నరసింహుని మూర్తియే స్వభావవిరుద్ధము గదా, దాని నేల యెత్తిన వదలలేదు?" అని బదులు పల్కుదురేని, యందులకు సమాధాన మిట్లు చెప్పవలసియుండును. కాళ్లు లేని కథ లనేకములు పురాణముల నుండుట సత్యమే కాని, శ్రవ్యదృశ్యకావ్యకర్తలు ఆకరములగు నితివృత్తములను ఔచితీపోషణార్థమై మార్చుటయు జగద్విదితము కదా. ఈ మార్పు కత్తిసాముపంటి పని వారు గ్రహించి యందు మిక్కిలి జాగరూకత వహించిరి. కథాస్వరూపము మూలముట్టుగఁ జెడకుండునట్లు, ముఖ్యాంశములను బాహ్యాంగములను అట్లే యుంచి క్రియాశీలాది సూక్ష్మాంగములందుఁ దగుమార్పులు గావించిరి. అట్లు యెత్తినయుఁ బ్రకృతికతీతమగు నరసింహమూర్తిని కథకుఁ బ్రధానాంగ మగుటచే మార్పక, కథాస్వరూపముఁ జెఱుపక మార్పుటకు వీలగు శతదివ్యవర్ష గర్భవృత్తాంతమును అవిశ్వసనీయమును, మహేంద్రకళంకాపాదకమును అగుదానిని వదలుట సమంజసము గాదా!

౭. భాగవతకథలోఁ బురోహితుఁడు హిరణ్యకశిపునితో "ఈమాటలు ప్రహ్లాదునకు మేము చెప్పలేదు, పరులును చెప్పరు. నీచరణంబులాన!" అని పల్కును పురోహితుని నోట ననుచితంబగు నీ "నీచరణంబులాన" నృసింహపురాణమున లేదు.

౮. హరి యెల్లెడల నున్నాఁడని ప్రహ్లాదుఁడు భాషింపఁగా, ఎందును లేఁడని దైత్యుఁడు సుతునిఁ దర్జింపఁగా విష్ణువు "నానాజంగమస్థావరోత్కర గర్భంబుల నన్ని దేశముల నరసింహాకృతి" నుండెను అని భాగవతము. ఇట్లుండెనను టచే భగవంతుని సర్వాంతర్యామిత్వము తెల్లముగాని, హిరణ్యకశిపుఁడు తన్నెందు చూపుమని ప్రహ్లాదునడుగునో తనకుఁ దెలియకుండినచో గదా యిట్లుండవలయును! "ఇది కవివాక్యము; భాగవతకవు లగు వ్యాసబోపదేవపోతనాదులు మహాభక్తులు, వారికి విష్ణువు ఏరూపమునఁ గానిఁ గన్పట్టవచ్చునుకదా?" అనుచోఁ, గన్పట్టవచ్చును; కాని కవితాశిల్పముం జర్చించునపుడు, హరి "నానాజంగమస్థావరోత్కర గర్భంబుల నన్ని దేశముల నరసింహాకృతి నుండె"నను కవిసంవిధానమునకుఁ బ్రయోజన మరయవలదా? ఇట నా ప్రయోజనము హిరణ్యకశిపుఁడు ప్రహ్లాదునిఁ దన్నెందుఁ జూపుమన్నను అందే విష్ణువు నృసింహరూపమున నావిర్భవించు నన్నగడయే కదా. ఇయ్యది కంబముఁగూర్చిన హిరణ్యకశిపుని ప్రశ్నను తనకుఁ దెలియకున్నచో గదా యవసరమగును. అది తెలియనిచో, నతని సర్వజ్ఞత్వమునకుఁ గొఱంత యగునుగదా? అందుచే, ఎఱ్ఱన యీసంవిధానముం ద్యజించినాఁడు.

౯. హిరణ్యకశిపుఁడు భగవంతుని స్తంభముననే చూపుమని యేల అడుగవలయును? "మఱి యెందేని జూపుమని అడిగినను, ఇట్టి ప్రశ్న కవకాశము కలదు గదా!" యనినఁ, గలదు; "జరిగినది జరిగినట్లు వ్రాయఁబడినది" అనుటయుఁ గథాదృష్టిచే సాధువగు నుత్తరము

గానేరదు. ఇందులకు సమాధానమొసఁగు సంవిధానమూత్తమశిల్పమునం గల్పితము గావలయును. మఱియుఁ బ్రహ్లాదుఁడు బదులు పల్కుచు "ఎల్లెడల నున్నట్లే కంబమునను గలఁడు" అనిమాత్రము చెప్పక, "స్తంభాంతర్గతుఁడయ్యు నుండుటకు సందేహము లేదు; నిర్గంథత్వంబున నేఁడు గానఁబడుఁ బ్రత్యక్షస్వరూపంబునన్" అనుటలో, "ప్రత్యక్షస్వరూపంబునన్" "నిర్గంథత్వంబున" అను మాటలచే, నృసింహావతారమును హిరణ్యకశిపు వధయును అతనికిఁ బూర్వమే పొడకట్టినవని మన మూహింపవలెనా? ఇందులకు సమాధానము భాగవతమున మృగ్యము. ఏతన్నిమిత్త మెఱ్ఱన అద్భుతసంవిధానముం గూర్చెను. ఎట్లన హిరణ్యకశిపుఁడు "పసమించి తకాంచన రత్నఖచిత మహాస్తంభ శతసంభారమండితంబగు సభామంటపంబు బ్రవేశించుచు." ప్రహ్లాదుఁడు భక్తిపరవశుఁడై విష్ణుమూర్తి శంఖచక్రాదులతోఁ దన యెదుట వర్తించునట్లు నర్తింపఁగా, హిరణ్యకశిపుఁడు "ఇతనికి వెఱ్ఱిపట్టినది" అని నిశ్చయించుకొనును. మఱల ప్రహ్లాదుఁడట్లే "విష్ణుమూర్తి యెల్లెడను గలఁడు గలఁడు" అని ఘోషింపఁగా, "అతఁడిందుఁగల్గనె యనుచున్ జగద్వలయ ఘోరకరాహతిచేఁ గంబమును వ్రేయును." తత్క్షణమ నృసింహస్వామి యావిర్భవించును.

తత్సభామంటపమున "స్తంభశతము" లున్న వనుటచేఁ, గంబములే యటనెల్లెడ నున్నట్లు చూపట్టుచుండె ననియు, హిరణ్యకశిపుని గద్దియకుఁ గరము సమీపమునఁ గూడ నొక స్తంభముండె ననియు, అతఁడు "స్తంభమున విష్ణువు కలడా"యని అడుగుట ఆలోచనతోఁ గూడిన ప్రశ్నమే కాదనియుఁ, బ్రహ్లాదునిచేష్టచే "క్రోధావేశ" వివశుఁడై, నానితో "ఓరీ పిచ్చివాఁడా, కలఁడటరా నీచక్రి యిచ్చట?" అని భావోద్రేక పూరితుఁడగు వక్త (orator) బల్లగ్రుద్దునట్లు పటిష్ఠముగ కంబమును గొట్టెననియుఁ బాఠకు లూహించుకొనుటకు సులువగు నాధార మేర్పడినది. ఈ స్వాభావిక హృద్య సంవిధానమునఁ జెల్ల "మహాస్తంభశతసంభారమండితం"బను విశేషణమును బునాదిచేసిన యెఱ్ఱకవీంద్రుని కళావైశారద్యము కరము ప్రశంసనీయము గదా!

౧౧. నృసింహస్వామి యావిర్భవింపఁగా, హిరణ్యకశిపుఁడు

"నరసింహశరీరముఁ దాల్చి, చక్రి శిక్షింపఁగ వచ్చినాఁడు; హరిచే మృతియందుఁ దలంతు; నైన,నా-సాంపున శౌంపునందఱును జూడఁ జరింతు, హరింతు, శత్రువున్".

అనుచు "మెత్తంబడిన చిత్తంబున" నతనితో యుద్ధమునకు సమకట్టెనని భాగవతకథ. దీనింబట్టి, హిరణ్యకశిపుఁడు భయముచే సగమును, నృసింహునిచేఁ గొఱ వడయుఁ జచ్చెనని యేర్పడుచున్నది. ఇచ్చట ఎఱ్ఱన యొనర్చిన మార్పు, అమర్చిన సంవిధానమును గరము హృద్యములుగా నున్నవి. అవి మూడవభాగమున విశదము కాఁగలవు.

3

ఔచిత్య పోషణము: కథావిస్తృతి

పూర్వకథ యందు ఉచితములగు మార్పులం గావించుటయె గాక, యెఱ్ఱన రసవంతములగు పట్టులఁ బెంచి, తన కావ్యరాజమును నిర్మించెను. ఈ విస్తరముచే నతనికిఁ గథనల్లుటయందుఁ గల నేర్పును, అతని రసజ్ఞతయు, ఔచిత్యపరిజ్ఞానమును దెల్లమగును. ఉదాహరణములు:

౧. హిరణ్యకశిపుఁడు తపముసేయునపుడు, ఇంద్రుఁ డాతనిఁగూర్చి దేవగురునితో నాలోచించుట, వారియుద్బోధము, పిమ్మట నతఁడు వైరితపముఁ జెఱచుటకై అప్సరసలను బంపుట, వారివిభ్రమము లాతనిపట్ల వమ్మగుట – ఈ విస్తర మిక్కావ్యమున రసవత్తరమగు ఘట్టము, అమూలకము.

౨. దేవేంద్రుఁడు సపరివారుఁడై, బృహస్పతి సలహాఁగొని, వారితోఁగూడ వైకుంఠమున కేఁగుట, అచ్చట గరుత్మంతుఁడు వారి నెదుర్కొని, గారవించి, కొలువుకూటమున నుండ నియోగించి, శ్రీమన్నారాయణ మూర్తికి వారిరాక నెఱిఁగించుట; భగవానుఁ డంతట వారికి దర్శన మొసంగి, వారి మొఱవిని

"వానికిన్ (హిరణ్యకశిపునకు)
గోఱలు నిండువంకకును
గ్రూరతఁ గైకొనకున్న వాఁడె; న
క్కొఱఁ దిమిరం బడంపఁ దిమి
రారియుఁ బూనునె వేగకుండినన్."

అని ప్రత్యుత్తరమిచ్చి, తాను నృసింహావతారమెత్తి యతని వధింపఁబోవుట వారికిఁ దెలిపి, వారిని తిరిగి పంపివేయుట, దేవతలు "తత్కాలోచితోద్యోగప్రవర్తకుం"డని వాచస్పతిని స్తుతించుట—ఈయుచిత విస్తరమును అమూలకప్రాయమే.

3. వసంతము, అస్తమయము, చంద్రోదయము వీనివర్ణనయు, అంతటిహిరణ్యకశిపునివిహారము; కాంతయుఁ దాను సురాపానకేళి సల్పుట; పిమ్మట నిరువురు "రాగాకులసుప్తి" నొందుట; లీలావతి కలఁగనుట; అందువిష్ణువు సంతానఫలము నామెకిచ్చి, ఆమె మెడనున్న హారముఁ గైకొని పోవుట; ఆమె మేల్కొని తనకలను భర్తతోఁ జెప్ప నెంచి, శుక్రాచార్యులకు విన్నవించి, ఫలమడుగఁగా, నాతఁడు "నీకుఁ బుత్త్రుఁడు, సద్గోత్రధ సమగ్రుఁడగు పుణ్యుఁడు కలుగును. ఇంతట సంతసిల్లుము ధృతి దూలఁబోవ, మీది శుభాశుభస్థితులఁ దలంపనేల? అసుర సింహుఁడు ఎవ్వారిని లెక్కిం గొనఁడు; నారాయణుఁ జేరుకొన్న మదినైఁపఁడు, మేలిట నెట్లు కల్గును?" అని చెప్పుట, ఆమెకు గర్భమగుట; గర్భస్థుఁడగు పుత్త్రునివలన నామెబుద్ధి నారాయణాయత్తమై యుండుట; హిరణ్యకశిపుఁ డామెకు భార్గవనిరూపితప్రకారంబునఁ బుంసవన సీమంతాది కలాపంబును నిర్వర్తించుట; పుత్త్రోదయమున, నాతనికి "మును లోకత్రయరాజ్యము నిరమిత్రముగాఁ గనినకంటె అధికపమ్మదము" కల్గుట; శిశువు మహిమచే "దివ్యకుసుమవర్షములు, దేవదుందుభిస్వనములు, అప్సరోభినయగతులు, కల్పభూరుహాంబరపతాకలుఁ" దనర్పగా, నవియెల్ల నిజోత్సవమునకుఁ దనబంట్లగు దివిజు లొనర్చు పనులుగా నాతఁ డూహించుట; "నిజ జన్మంబున నఖిలలోకప్రహ్లాదం బొనరించుటం జేసి" బాలునకు ప్రహ్లాదుఁడను నామము కల్గుట. ఈ విస్తరము సరసవర్ణనలసర్వస్వమును, ఔచిత్యసౌకుమార్యముల పెన్నిధియునై మనంబలరించును.

4. హిరణ్యకశిపునాజ్ఞచే బ్రాహ్మణులుకృత్యను ప్రయోగించుట; అది ప్రహ్లాదునెడ విఫలమై పాలుల మీఁదికే తిరుగుట; వా రాక్రోశింపఁగాఁ, బ్రహ్లాదుఁ డనుకంపమానమానసుఁ డగుచు, నారాయణమూర్తిని ధ్యానించి, కృత్య నుపసంహరింపఁ జేయుట, అట్లే యముఁడును గింకరులను బ్రహ్లాదుని ప్రాణముఁ దీయ నెంచుటయు; వెంటనే విష్ణుసేనాపతి విష్వక్సేనుఁడు నిజకింకరకోటితో నరుదెంచి, యమకింకరుల వెడలఁ గొట్టి, యముని "మెంగమును మఱక్కొను జడియఁగ బిగువగు పిడికిళ్లఁ బొడుచుట"యు, విష్ణుభృత్యులు దైత్యపతి దాగికొనుట నెఱిఁగి, "వాఁడు నరసింహనఖంబులకెర గాఁగలవాఁ"డని నిశ్చయించినవారై, అతని నేమియుం జేయనొల్లక, "అదితిమానుపురంబుఁ గాల్చి, దైత్యులఁ గొందఱ వారిసమని, మరలి చనుట"యు ఈ పెంపకమునందు, విష్ణుని మహిమయుఁ, బ్రహ్లాదుని భక్తివిశేషమును, కృపాళు స్వభావమును చక్కఁగాఁ జిత్రింపఁబడినవి.

5. నృసింహరూపం బవతరింపఁగనె, ఆయన తేజమును "దేఱిచూడలేక, ఎక్కడనేని జనంగఁ దెరి యింపు నెఱుంగక, దైత్యుఁ డెంతయుంజొక్కె, మనంబున దిగులు పొచ్చెను, చేష్టలు దక్కెను." అప్పుడు ప్రహ్లాదుఁడు భక్తితన్మయుఁడగుచు, స్వామి నెదుర్కొని, నిశ్చేష్టితుఁడగు తండ్రిని చేర్కొని "మహాతపస్సంపన్నులకుఁ గానరాని పరమాత్మమూర్తి యిదె తోఁచెఁ; గృతార్థుల మైతిమి, ఇంక నీ కతలను మాని యిన్విభు నగణ్యకృపానిధి నాశ్రయింపుము; దాన నీదుష్కృతముల కల్ల శుద్ధి యగు; నీకు ననంతసౌఖ్యములు చేకుఱును;

"నీకడుపునఁ బుట్టిన బుధ
మేకరణిం బాఁచునొకో యేనని పడితిన్
గైకొనవే నాపలుకు; కీ
పాకము దప్పుటయు భయము వాటిల్లఁ జుమీ."

అని పల్కెను. కాని హిరణ్యకశిపుఁడు "తనంత గాల్వఁ గొనిన చలము" విడువఁజాలక, రేఁగి "చేల యేల మాటల జెఱపింప నన్నుఁ జూచి, యెవఁడు సవతు, ఇటు చూడు మింక,

ఈ వికృత రూప మిటులై
చావఁదలఁచి తోఁచె; దీని సమయించెద; నా
లావున కడుర్రై పెనఁగఁగ
నీ విశ్వమునందుఁ గలఁడె యెవ్వఁడైనన్."

అని పలికి 'యుత్సాహంబు మెఱయ' నృసింహునిపైకిఁ బోవును. దైత్యవధానంతరము నృసింహుని అదితిసుతులును, అదిమునులును బ్రహ్మాదిపురస్సరంబుగా నభినందనంబు లొనర్చుచు వినుతింతురు. అప్పుడు

" వీరరౌద్రభయానక విస్మయాఖ్య
రసములను బోధ్యభంగుల నెసక మెసఁగ
నఖిలభువన హృద్యంబుగ నవ్విభుండు
నిపుణ ప్రకౌశనటనంబు నిర్వహించు."

తదనంతరము ఆ యున్మదఘోర విజృంభణము మాని, శాంతిల్లి ప్రహ్లాదునితో

" తండ్రి యొక్క లేమికి విషాదంబువలదు;
కాలగతిఁ బోవ నతనికి మేలు కలుగుఁ;
బుత్త్రికృత్యంబు లెల్లను బూని నడుపు;
జననికును దృద్విభూతియు సంభవించు.

దైతేయరాజ్య విభవ
ఖ్యాతి యెసఁగ, నీవు పెద్ద కాలము భవభో
గాతిశయము నాసక్తుఁడ
వై తగ భజియించి, పొందు మస్మత్పదమున్.

నాయెడ ననూనమగు సే
వాయమ్మ యడంగవలదు; నిజ మతిఁ జెను దో
షాయత్తుఁడవు గాఁడు; తుదిన్
శ్రేయంబు నతనికిని బరమ సిద్ధి, కుమారా!"

అని సెలవిచ్చును. ఈమనోజ్ఞ విస్తరమునకును భాగవత కథకును గల తారతమ్యముఁ బరికించినయెడల, మానవ స్వభావజ్ఞత యందును, కల్పనసౌకుమార్యమందును, ఔచిత్యపరిపోషణమందును, ఎఱ్ఱన దంటయని యెుఁక పడును.

౪

రసము, శైలి, విజ్ఞానము

ఇక్కావ్యమున భక్తియుతశాంతరసము అంగి యయ్యెఁ, గథయందు శృంగారమునకు లేశమవకాశము కలిగినను ఎఱ్ఱన దానిని శ్రద్ధసేసి విపుల రమణీయవర్ణనల నింపి తన రసప్రబంధకనుఁ దెలిపికొన్నాఁడు. గ్రంథాదిని వైకుంఠపురవర్ణనమందును, లక్ష్మీనారాయణుల కేళివర్ణించుపట్టునను, హిరణ్యకశిపుతపమును, అప్సరసలు నిజవిలాసములచే భంగపఱుపయత్నించు తావునను, లీలావతీహిరణ్యకశిపుల చంద్రికాచంక్రమణము, సురాపానకేళి యిత్యాదుల వర్ణించుభాగమునను, ఇక్కవి సార్వభౌమునకుం గల శృంగారరసలోలుపత స్పష్టమగును. మఱియు నప్సరల యాటపాటల వర్ణించుచోట నిక్కవికి గీతనృత్యాది లలితకళలపైఁగల యనురక్తినిఁ జాటు పద్యములు గానవచ్చును. విస్తరభీతిచే, అప్సర గానము వర్ణనమాత్ర మిట నుదాహరించెద:

" అమృతంబుసోన పైవడరిన ట్లై, పాట
　　చెన్నున ప్రోడులఁ జెవులు లెత్తె;
మారుతాహతి పేర, మ్రాకులు తలయూఁపఁ
　　దొడఁగెను గాన మాధుర్యమునకు;
ఇంపులగని యైన యీ రాగరసము తీఁ
　　గలకుఁ గోరకపులకముల నొసఁగె;
శిలలేశులను నశ్రుజలములు దొరగించె
　　గిరులును మంజుల గీతిఁ గరఁగి
యనిశఁ బోలుఁ బొసఁగు, నగుఁ, దగు ననఁగ, స
చేతనంబులెల్లఁ జిత్రరూపు
లట్లు పోలి నిలుచ నంగన యొక్కతె
పాడెఁ గలమనోజ్ఞ భంగు లలర."

కాళిదాసాది మహాకవులకుంబలె, నిక్కవికిని అలంకారములపై, ముఖ్యముగా అర్థాలంకారములపై నత్యభిలాషము గలదు. ప్రౌఢములగు చక్కని యుపమలకును,

ఉత్ప్రేక్షలకును ఇక్కావ్యము గని యనఁదగును. అందుండి రెండు పద్యరత్నములు మాత్రము వెల్వరించెదను:

" కుడువఁగనొల్ల కంత్రయనఁ
గ్రొవ్వునఁ గూలఁగఁ ద్రోచునన్, ఉగం
బడిరయొడు దానవప్రభుని
పాలిటి భాగ్యమువోలె, మేడమీఁ
దడలెడు బాలు విష్ణుమయ
హృత్కు ధరించె ధరిత్రి మాటప్రా
విడె, మనుమన్న వాతనికి
నింపుగఁ జేసిన పెజ్జమో యనన్."

" సురుచిరతారకా కుసుమ
శోభి నభోంగణభూమిఁ, గాలనన్
గరువపుసూత్రధారి జత
నంబున దిక్పతికోటిముఁ దటన్
సరసముగా నటింపఁగ ని
శాపతి కత్తిన క్రొత్తతోఁపుఁ జెన్
దెరయన, నొప్పు సాంధ్య నవ
దీధితి పశ్చిమదిక్తటంబునన్."

భక్తియు శృంగారమునే కాక, హాస్యాద్భుతకరుణవీరాది రసములు నిక్కావ్యమునఁ దత్తదుచితస్థలంబులఁ బ్రకటము లగుచున్నవి. హాస్యమున కుదాహృతి:

" పేదప్రేతములఁ జేరికొను బిరుసు మగఁడ
వకుడు పీ నని యందంద మొగము మీఁదఁ
జప్పటలు వెట్టి దైత్యుఁడు జముని లావుఁ
జెవరయునఁ బొల్లుగాఁ గాపసేసి విడిచె."

' నవనిధులు పుచ్చుకొని, భ
వ్యవిమానము నాచికొని, సురారి కడిమిపై
'భవపఖుఁ డితఁ, డట్టిఁడ కా
నవు' నని, భిక్షుకుఁ జేసె నయ్యక్షేశున్."

" తపములఁ గ్రుస్సిన తపసులఁ బట్టి తె
ప్పించి యప్సరలతోఁ బెండ్లి సేయు;
మోదంబుతో నశ్వముఖుల లాయంబులఁ
గట్టి బొక్కని యలఁ గఱణమెత్తు;
భుజగేశ్వరుల శిరంబుల నున్న మణులూడ్చి
కొమరార వస్త్రువగుండు లెత్తుఁ;
జెలఁగి గంధర్వుల చేతివీణెలు పిశా
చులకిచ్చి పాడించి చూచి నవ్వు;......"

అద్భుతమున కొక్క యద్భుతోదాహరణము:

" నీపున నద్రి నొక్కపృథివీ
ధరమున్ దగఁ దాల్చెనంచు, ల
క్ష్మీపతి పేర్మిసాలఁ గడుఁ
జిట్టలుగా గ్రుక్కు లుగ్గడించు; నీ
రూపునఁ గోటిసంఖ్యల గి
రుల్ ధరియించిన విష్ణుదాసు పెం
పేపగిదిన్ నుతింతునొకొ
యింకని, వెక్కసమందె లోకముల్."

కరుణ కుదాహరణము:

" మునుమునఁ బట్ట నీకకట
ముద్దులపట్టి గదయ్య నీఁడు; మె
త్తని యొడ లింతయోర్చునె; కృ
తంబుల సైఁచునె; మాను మింతతోఁ
గినుకలు; నీవు కట్టలుకఁ
గీడొనరింపఁగఁ బొందఁజాలు వా
రనిమిషసిద్ధయక్షసుర
రాదులు గాక, తనూజుఁడే నృపా!"

ఉదాహృతపద్యములం బట్టియే, యిక్కవీంద్రునియందు నన్నయార్యుని "యుభయవాక్ప్రౌఢి"యుఁ, దిక్కన "రసోచితబంధము"ను ఏకీభవించినట్లు తోఁచును. ఇది గాక, యీతనియందు "సూక్తివైచిత్రి" యొకవిశేషముగ నుండుపుట కవిసాంప్రదాయసిద్ధమైయున్నది. ఈసంగతి మిక్కిలి సమంజస మనుటకు రెండుదాహరణము లొసంగెదను:

" వ్రతములఁ గ్రొచ్చి, శీలముల
వ్రచ్చి, జపంబులఁ గ్రోలి, యుత్తమ
క్రతువులఁ ద్రోలి, యోగములఁ
గ్రాఁచి తపంబుల వేఁచి యొంధున

ప్రతిహతలీలమై, మదను
బాణచయంబుల తోడునీడలై,
ధృతులఁ దూలించుచుండు నుద
తీ మదతీక్ష్ణకటాక్షకోణముల్."

"నిన్నింతవానిఁ జేసిన
యన్నలుగుమోములతఁడు హరి పొక్కటి యం
దున్న వెలిదమ్మి యీనిన
కున్న యగుటఁ దెలిసి, విడువు కోపముఁ, దండ్రీ!"

ఈ కృతియందు నేను నుడివినట్లు, రసోచితశైలియందును, చిన్ని తెనుఁగుమాటల కూర్పునందును, పద్దెంపుటల్లిక జిగిబిగియందును, తిక్కనకవనము భ్రాంతిఁ గొల్పు పద్యము లిక్కావ్యమున వేనవేలుగలవు. స్థాలీపులాక న్యాయమున నొక్క యుదాహరణము:

"తనవాడిమికిఁ గందర్పుని కీపని
గైన సాధించు దివ్యాస్త్రమనఁగఁ
దను తియ్యపలుకులు ప్రమదరాగాంబుధిఁ
దనరారు మన్మథుఁ దరఁగ లనఁగ
దను వింతచెయ్వులు కమనీయ కోమల
శృంగారతిరువు లేఁజివుళు లనఁగ
దను ముద్దునవ్వులు తనుకంపుఁ జీఁకటి
నిగిడించు నరిది వెన్నెల లనంగ
జొక్కు మందులనఁగ, సోయగంపు గను ల
నంగ, శుకమునికిఁ లనఁగఁ జాలి
యనుపమానమూర్తులై యొల్ల పిల్లదు
రంబుజాయతాక్షు లప్పురమున."

ఇట్టికావ్యము కవితామతల్లికా శిరోవతంస మగుటయే గాక, జ్ఞానప్రదాయి మోక్షసంధాయియనియుఁ, గవి గొప్పతత్త్వవేత్తయు భక్తపుంగవుండు ననియుఁ జదువరులకు గోచరము కాఁగలదు. ఇందలి తత్త్వబోధ కొకటి రెండుదాహరణములు:

"భవ దురువాభిరంధ్రభవ
పద్మరజః పరిమాణపాక సం
భవుఁడు విధాత; తద్విమల
భావకళాకణమాత్ర వైభవో
ద్భవము జగంబు; తద్వివిధ
భంగిక సర్గములోన నొక్క రుం
డివియని నిశ్చయింపఁగలఁ
డే భవదీయగుణంబు, లచ్యుతా!"

"విన్నంజాలు భవన్మహత్త్వము
భవ ద్విజ్ఞానసద్గోష్ఠియం
దున్నంజాలు భవత్పదాంబు
రుహసేవోత్సాహ సంపన్నులన్
గన్నంజాలు భవత్సమంచిత
జగత్కల్యాణనామంబుఁ జే
కొన్నంజాలు నరుండు శాశ్వత
శుభారూఢుండగు లక్ష్మీశ్వరా!"

"అతఁడు కనుదెఱవ బ్రహ్మాండ వితతి యొదవు;
నతఁడు కనుమూయ నన్నియు నడఁగి పోవు,
భువన సంభవ సంహార భూరిమహిమ
తోయజాక్షుని కరయ లీలాయితంబు."

ఇంతటి దివ్యజ్ఞాని యగుటచేతనే, ఎఱ్ఱన స్వకవిత్వమైపులికి గర్వపడక గ్రంథాదినే తన నిరహంకృతి నిట్లు ప్రకటించెనో చూడుఁడు:

"......కతిపయాక్షర పరిగ్రహజనితం బైన
నైసర్గిక చాపలంబుకతంబున, -
మించిన వేడ్కఁ, బీనులకు
మిక్కుటమై మధుసృష్టి గ్రమ్మ, రా
యంచలు కూయఁ గ్రౌంచమును
నావలఁ గూయఁ గడంగు భంగిఁ, బ్రౌ
ఢాంచిత శబ్దపాకులు మ
హాకవు లాద్యులు కావ్యకేళి గీ
లించిన కీర్తి సంగసుఖ
లీలకు, నేనును గాంక్ష సేసితిన్."

ఇట్టివ్యాసమందు నిరూపితములగు నుత్తమకవిలక్షణములు గను ఎఱ్ఱనార్యుని యౌచిత్యనిర్వహణమును, రససంపూర్ణత్వమును, రచనాప్రౌఢియును, విజ్ఞానసంపత్తిని, సకల సుగుణమకుటమై ఆంధ్రకవుల నరుదగు వినయవిశేషమును మరల స్మరించి కొనియాడుచు నింతట విరమించువాఁడను.

ప్రతాపకుమారి

శ్రీ శివశంకరశాస్త్రి గారు (సాహితీసమితి)

హమీరసింగు—

ఆశ్చెరు వయ్యె, మీనగరమందు వివాహమహోత్సవాంకముల్
ఎచ్చట గానరావు జలజేక్షణ! మీపరివారవర్గమో
ముచ్చట లేకయున్నయది, మోసముపోలిక గోచరించెడున్
చెచ్చెర సత్యముం దెలియజేయఁగదే భువనైకసుందరీ!

ఆయతమైన ఖడ్గమిదె హస్తమునందు, మహాపరాక్రమ
శ్రీయుతులైన సైనికులు చేరువకావలి యున్నవారదే!
ఏయెడ దాచెనో పటకుటీరమున న్నిజవీరవర్గముల్
న్యాయము వీడి నీజనకు డంబురుహోజ్జ్వల చారులోచనా?

ఇంకొకమాట నిన్నడుగ నెంతయుసిగ్గు జనించుచున్నదో
పంకరుహాయతాక్షి, పొరపాటున నీకటిదివ్యమండలా
లంకరణమ్మునన్ నిపుణలగ్నముగా చురకత్తియున్నచో
అంకిలిచెప్పకే ఛురిక నావలనుంచుము రాజపుత్రికా!

మాయలలో మహామహుఁడు మాళవదేవనృపాలుఁ డందుచే
ఈయెడ జాగరూకత వహింపక తప్పనిదయ్యె నిన్ను మీ
నాయన రాజ్యరక్షకయి నా కుపహారముగా నొసంగెనా?
నీయనురాగమే యిచట నెక్కొనెనా సరసీరుహేక్షణా?

పెండిలియాటచే నెటులొ ప్రేమనటించుచు భర్తృగేహమం
దుండెద, నిందయేటికని యోర్పువహింపకు రాజపుత్రికా!

ప్రతాపకుమారి—

మీనామమ్మును విన్నదాదిగ మదిన్ మీపాదపద్మద్వయీ
ధ్యానంబే యొనరించుచున్నయది యీదాసి ప్రవీరాగ్రణీ!

హామీరసింగు—

ఖండితవాక్యముల్ పలికి కష్టముగూర్చితి నీకుభ్రాంతినై,
నిండుమనమ్ములో నిపుడు నిన్నువరించినవాడ ప్రేయసీ!
బంగరుబొమ్మ, నీలలిత బాహులతాదృఢబంధనార్థినై
సంగరకర్కశుం డయినసైనికు డువ్విళులూరు నెంతయున్!

ప్రతాపకుమారి—

మీనిష్కల్మషవాక్యముల్ వినగ నా మేనెల్ల కంపించెడున్!
నేనిక్కమ్ముగ నిల్వజాల తమసాన్నిధ్యమ్మునందున్ ప్రభూ!

హామీరసింగు—

మంగళదేవతా, ముఖము మ్లానము చేయగబోక బంధురా
లింగన మీవె! దుర్లభనిలింప సుఖాంబుధి నోలలాడెదన్.
వింతగ నీముఖాంబుజము విన్నదనంబు వహింపనేల, క
న్గాంత విశాలనేత్రముల నశ్రువు లూరగనేల, సాధ్వసా
క్రాంత మనోజ్ఞఫాలమున ఘర్మకణమ్ములు నిల్వనేల, నీ
కింత వికారముం గనగ నేమిటి కోజగదేకసుందరీ?

ప్రతాపకుమారి—

ఆకర్ణింతురయేని మానమహతా మగ్రేసరా, మత్కథన్
మీకోపోగ్రకృశానుకీలలను భస్మీభూతమైపోవుదున్!

హామీరసింగు—

నిక్కపుప్రేమ గాటముగ నీయెడనుండగ నాకు నేటికో
చక్కనిచుక్క, యింతభయసంభ్రమగాద్గదికప్రసక్తి? నా
యక్కున జేర్చుకొంటిగద!—అన్యవిచారములం ద్యజింపుమా!
ఎక్కడ కట్లుపోయెదు?—క్షమింపుము యోధునికర్కశత్వమున్.

ప్రతాపకుమారి—

మీకీర్తిధ్వజమందు నిల్చినది యీమిథ్యావివాహమ్ముచే
ఆకల్పాంతము దుర్భరంబయిన నీలాంకంబు వీరాగ్రణీ!

హామీరసింగు—

నీమాటల్ మనముం గలంచినవి యోనీరేజపత్రేక్షణా,
ఏమాడ్కిన్ ఘటియిల్లు దుర్యశము నా కీతద్వివాహమ్మునన్!

ప్రతాపకుమారి——

పౌరుషమందు గణ్యతను ప్రాభవమం దసమానమైన దీ
ధారుణి బప్పరాట్కులము ; తద్వరవంశమునన్ జనించుటన్
మీరు మహాకులీనులును మిక్కిలిపూజ్యులు కాని నేటితో
గౌరవహాని సంఘటిలె గైకొనుట న్నను ధర్మపత్నిగాన్.

నాయనగారు సౌమ్యముగ నన్నునొసంగుటలో మహాప్రభూ,
మాయ మహానిగూఢ! మిది మంగళదేవత కాదు, శుభ్రమా
మీయశమున్ హరించుటకు మేదినిమీద మనోహరాంగనా
కాయముతోడ సంభవముగాంచిన పెద్దపిశాచియే సుడీ!

కావున మండలాగ్రమున కాయముజీల్చి కవోష్ణరక్తధా
రావభృథంబునం బునరనావిలమై నిజకీర్తిచంద్రికల్
దేవ, చెలంగగా నిఖిలదిక్తటులందు సమాచరింపుడీ
భూవరధర్మ, మత్యధికపుణ్యము నాకు లభించు రూఢిగా!

హమీరసింగు——

ఏమాత్రంబు భయంబులే, దిక నిజంబేమో నిరూపించి ని
స్సీమానందము సంఘటింపదగదే శీఘ్రంబు ప్రాణేశ్వరీ!

ప్రతాపకుమారి——

ఊహము నాకు లేనపుడు యోధకుమారునితోడ జేసి రు
ద్వాహము తల్లిదండ్రులు, వివాహముమాత్రము కాకపూర్వమే
ఆహవభూమియందు నత డంతమునొందెను పోరునల్పుచున్
సాహసమున్ వహించి కలసత్యముపల్కితి ప్రాణవల్లభా!

హమీరసింగు——

పాదద్వంద్వమువీడి లేవగదవే ప్రాణప్రియా, ఇంక నీ
ఖేదంబున్ విడనాడి నాభుజముపై గ్రీవమ్ము గీల్కొల్పవే!
ఏదీ నాప్రియకాంతకున్ సదృశురా లేతన్మహాంభోధి మ
ర్యాదాలంకృత ధారుణీతలమునం దంభోజపత్రేక్షణా!

శ్రీకృష్ణునిపాత్ర-పారిజాతాపహరణము

విశ్వనాథ నరసింహముగారు, బి.ఏ.

పారిజాతాపహరణ ప్రబంధమున శ్రీకృష్ణుఁడు శృంగారనాయకుఁడు. అందు పారిజాతప్రసూనము నారదమునిచే శ్రీకృష్ణున కీయఁబడుటయు, తత్ప్రసూన మాతఁడు రుక్మిణీ రమణికి,—సమక్షంబునఁ దనతో విలాసముకొఱకాడుచున్న రుక్మిణీరమణికి-ఒసఁగుటయు, తరువాత సత్యభామా వృత్తాంతమును, పిమ్మట పారిజాతప్రసవాపహరణము మొదలుగాఁ గల యంశములు వర్ణింపఁబడినవి.

ఆప్రబంధమందలి కథా సంవిధానము, శ్రీకృష్ణుఁడు ప్రియభార్య యగు సత్యభామ కొఱకు నాకంబునకరిగి యచ్చోనున్న పారిజాతవృక్షంబును పెకలించి తెచ్చి యామె విలాసారామంబున నాటించుట, శ్రీకృష్ణుఁడు సత్యయెడ యెక్కువ మక్కువఁ దగిలియుండెనని స్ఫురింపఁజేయుచున్నది. అంతియకాక శృంగారరసమున నాయకుల నేకరీతుల నాయికలను తృప్తులఁజేయుట విశదమయి యుండ, శ్రీకృష్ణుఁడు సవతియగు రుక్మిణీదేవికి భర్త పారిజాతంబొసంగెనను నీర్ష్యావేశంబునఁ దన్నూరార్పు భర్తను కాలితోఁదన్నినంత

"నెయ్యపుఁగిన్కఁ బూనితాఁ
చినయది నాకు మన్ననయ"

యంచు గ్రహించుట యత్యధికమగు శృంగారరస ముప్పతిల్ల జేయుచున్నది. మఱియు శ్రీకృష్ణుఁడు రుక్మిణీదేవికి పారిజాత మొసంగిన తరువాత నారదుఁడు తత్ప్రసూన ప్రభావమామె కెఱింగించి యిట్లు నుడివెను:

"ఇన్ని దినంబులన్ సవతు
లిందఱలో నలసత్యభామ కన్
సన్నల ద్రిమ్మరున్ హరివ
శంవదుఁడై యన విందుఁ గాని యో
కన్నియ! నీయెడం గలుగు
గౌరవ మెయ్యెడఁ జూచి కానలే
కున్న నసర్ఘ దివ్యకుసు
మోత్తమ మేరికైన నిచ్చెనే."

దీనిఁబట్టిచూడ శ్రీకృష్ణుఁ డగ్గలపుందమి రుక్మిణీరమణియెడఁ గలిగియుండెనని తెల్లమగుచున్నది. అయిన నిం దెవ్వరియం దాతని కెక్కువ మక్కువ?

సహృదయుండు దక్షిణుఁడనియు, గూఢవిప్రియకారి శఠుఁడనియు నాయకభేదము లెఱిఁగించుచున్నవి. శ్రీకృష్ణునకు రుక్మిణీసత్యలలో నెవ్వరియందైన నధికానురాగ మున్నయెడల నాతఁడు శఠనాయకుఁడు కావలసి వచ్చును. ఇంకొకనాయికను గోరినవాఁడయి జ్యేష్ఠభార్య యెడ మనసులేక నప్రియ మొనరించువాఁడు శఠుఁడు. శ్రీకృష్ణునకు సత్యయెడఁ బ్రేమ యధికమనిన నాతఁడు శఠుఁడని నిశ్చితమగును.

కాని శ్రీకృష్ణుఁడు దక్షిణనాయకుఁడే యనుట నిశ్చయము. ఆతని కందఱి యందును సమానమయిన ప్రేమయే కాని యొకరియం దెక్కుడు లేదు. ఏలన నాతఁడు

"ఏయే వేళల నే సరోజముఖి యే
యేలీలలం గోరుఁ దా
నాయా వేళల నా సరోజముఖి నా
యాలీలలం దేల్చి..."

యుండెనని మున్ను వచింపఁబడినది. ఇందు మూలమున కృష్ణునకు మహిళామణు లందఱి యెడను సమానమయి స్వచ్ఛమయిన ప్రేమ యుండెనని తేటపడుచున్నది. అయినను శ్రీకృష్ణుఁడు నారదదత్తం బగు పారిజాతంబును రుక్మిణీదేవికి సమర్పించుటఁ గూర్చి యించుక యోజింపవలసి యున్నది. తొలుత కలహప్రియుండగు నారదుండు రుక్మిణీ సత్యభామల కిఱువురకును కలహకారణ మగుటకొఱకే యాదివ్యసుమంబుఁ దెచ్చెను. తెచ్చుటయు కృష్ణుఁడు రుక్మిణితో విలాసక్రీడ నున్నతఱి యాతని కిచ్చెను. అంతట కృష్ణుఁ డాపారిజాతంబును మనమున వినయమును, విస్మయంబును బెనఁగొనఁగఁ గైకొని రుక్మిణిం గాంచి సత్యభామ తలంపున నిలువ


"ఇది భోజాత్మజ కిచ్చినం గినుకతో
నేమంచు నూహించునో
మది సాత్రాజితి దాని కేనిపుడు ప్రే
మం బంపినం దీని నె
ల్లిదముం జేసిన జాడఁ దోఁచునొకొ యా
లెమ్మిందు నేనున్కిఁ జె
ల్లదువో యేరికిఁ బంపఁగా..."

నని యనుకొనియెను.

రుక్మిణి కాదివ్యకుసుమ మిచ్చిన సత్యభామ యలుకఁ జెందునేమో యనియు, సత్యభామకే యాపారిజాత మంపిన నిజ సమక్షమం దుండిన రుక్మిణీరమణి చిన్నవోవు ననియు కృష్ణుఁడు మనంబున నించుక చింతించెను. దీని వలన నాతని కిఱువురయందును సమానమైన ప్రేమయని నిశ్చయమగుచున్నది. ఏమయినను సమక్షమందుండిన రుక్మిణికే యాసుమమిచ్చుట సమంజసమని యూహించి యాపారిజాతమును రుక్మిణి కాతఁ డొసఁగెను.

మఱియు పారిజాతమును రుక్మిణి కిచ్చుచో "కనుఁగవ పిన్ననవ్వు దొలఁక న్మునినాథుని కన్నుసన్న నిచ్చిన..." యని చెప్పఁబడియున్నది. ఇందు కృష్ణునకు చిఱునగ వంకురించుటయం దర్థమున్నది. పైకి స్ఫురించునది యేమన నాయకుఁడగు కృష్ణుఁడు నాయికకు కుసుమము మందహాసముతో నిచ్చుట శృంగ రచేష్టితము. ఇంతియకాక శ్రీకృష్ణుఁడు సురసుమము రుక్మిణీరమణి కిచ్చుచో సత్యభామ కినుకనొందు ననియు నాపె పొలయల్కను తాను తీర్చుట కవసరమగుచో పారిజాతవృక్షమయినను తెచ్చి యిచ్చెదననియు మనమున నూహించియే చిఱునగవుతోడ రుక్మిణికి పారిజాత మిచ్చెనని వ్యంగ్యము. పైఁజెప్పిన హాసకారణము శ్రీకృష్ణుఁడు దక్షిణనాయకుఁడని స్థిరపరచుచున్నది.


కొలంబో మ్యూజియము



కొలంబోమ్యూజియము



పోల నరువలోని యొక్క ప్రాచీన బౌద్ధాలయము-సింహళము



అనూరాధపురమునందలి చంద్రకాంత సోపానములు-సింహళము



ఒకానొక హైందవ దేవాలయము-సింహళము

ఈక్రమముం దుదాహరించు నారదవాక్యము, "ఇన్ని దినంబులకు నవతులిందఱిలో" యనుపద్ధియము కేవల కలహప్రియుండగు నారదవాక్యముకాని వేఱుకాదు. మఱియు భాగవతమందలి దశమస్కంధములో

"మాధవుండు దా
నరకునిం ద్రుంచి వానిభవ
నంబున నున్న పదాఱువేల సుం
దరులను నొక్కమాటు క్రమ
దంబున నందఱ కన్నిరూపులై
పరిణయమయ్యె ... " నని చెప్పంబడి

యున్నది. దీనింబట్టి శ్రీకృష్ణుండు దక్షిణనాయకుండని స్థిరపరచి యింతటితో విరమించుచున్నాము.

సబ్రహ్మచారి

పెనుమర్తి వెంకటరత్నమ్మగారు

నిర్దయమహావిధీ! గతిననింద యొనర్చుట నాల్కచేటు నీ
దుర్దశ కార్యకారణవిధుల్ ఫలియించినదేగదా! నిదా
ఘార్దితవేళ మేఘములకై వినువీథిని తొంగిచూచిన౯
వ్యర్థమకాక, చాతకి లవంబును గ్రోలునటే పయస్సుల౯.

పోడిమిపోయి కాయలును బూవులు లేతచివుళ్లతోడఁ గ్రే
ళ్లాడుటఁ దక్కి జీవకళలన్నిటికిం బెడఁబాసి భానుపె
న్వేడిమిబారిబడ్డ విటపీ! చెలికారము సేయవచ్చి నా
మ్రోడుపడంద స్నేహరసము౯ జిలికింపఁగ నిచ్ఛయించెద౯.

నావలెనీవును౯ మఱచినావనుకొంటి గతానుభూతదుః
ఖావళులేల యెండి, వరుగై, యెపుడో ధరపైన వ్రాలగా
బోవుచు భావిచింతనము బోవిడనాడవు! భూతపూర్వపుం
జీవనగాథ త్రవ్వెద, కృశించెద వృక్షితనూత్నవేదన౯.

నిద్దురమంపులోన శయనింత మొకండు తలంపులేక, యే
సద్దును లేక, జీవనవిచారము పోకడపెట్టి, మ్రోడులై
యుద్ధర వ్రాలిపోయి గతియించిన నాడును నేడునువ్వలె౯
వద్దు! విధి౯ దిరస్కరణవాక్యము లాడగవద్దు నెచ్చెలీ.

ఆధునికకృతులు తద్భిన్నాభిప్రాయములు

ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రిగారు

విద్వత్ప్రభువులారా! ప్రస్తుతము తెలుఁగున రచనలఁ బ్రధానముగ నున్న (ఆధునిక) కృతులపైఁ బలువురు భిన్నాభిప్రాయులై వివదించుచున్నారు. ఇట్టి వివాద లోకాంతరమున కలిగి వారితో నాకే చాలసారులు తటస్థించెను. ఆధునికకృతుల నూతనత లేదనియు "మన సారస్వతమునకు నూతన వసంతోదయమైన"దని వ్రాయువారి వ్రాఁతలు కేవలపక్షపాతమాత్రసారములనియుఁ గొందఱి వారి మిత్రుల యూహయును. అద్యతన ఖండకావ్యములఁ గొందఱకైన నూతనత్వము కలదనియు భావకవుల నుడికారముల వింతవింత తీయఁదనములు లేకపోలేదనియు నాయభిప్రాయము. ఈ విషయము కొంతవఱకు చర్చించి నాయభిప్రాయమును సహృదయలోకమునకుఁ దెలియఁజేయ యథామతి సిద్ధాంతీకరింపఁ గోరకొంటి. సుధీవరు లెవ్వరేని భిన్నాభిప్రాయులైనఁ గృప నెఱింగింపఁ బ్రార్థితులు.

ఆంధ్రసారస్వతకాలము మూఁడుయుగములుగఁ బెద్దలచే విభజింపఁబడెను. అందు మొదటిది పురాణయుగము, రెండవది ప్రబంధయుగము, మూఁడవది నాటకయుగము. పైఁ జెప్పిన పురాణయుగమునందలి మొదటి గ్రంథము నన్నయభారతము. అప్పటివారు సాధారణముగ నాగమాభ్యాసనిరతులు, నిరతజపహోమతత్పరులునై యుండి యాంధ్రమున విశేషాసక్తులు గాక గీర్వాణగ్రంథములయందే యాసక్తులై యుండ రాజనరేంద్రుని యానతిని నన్నయ భారతము నాంధ్రీకరించెను. ఈ యాంధ్రీకరణము కేవల మార్యమతవ్యాప్తికై పామరసుసాధముగఁ జేయఁబడెను. తరువాతివాఁడగు తిక్కయజ్వయు నీయభిప్రాయమును జక్కఁగ గుర్తించి యీ యుద్యమమును సమీచీనముగ నెఱవేర్చి కృతార్థుఁడయ్యెను. ఎఱ్ఱన కీయభిప్రాయము కొంతవఱకు నడలేదు. వారి శేషమును బూరింపవలసినవాఁడగుటఁ దానిచే యనుసరించి తుదకు మతవ్యాప్తికే యుద్యమమని తలంపక క్రొత్తవర్ణనల నారంభించి ప్రబంధపరమేశుఁడను బిరుదముఁ గాంచెను.

గీర్వాణగ్రంథములఁ బరివర్తించుట మతవ్యాప్తి కొఱకనుమాట స్మృతిపథమును దప్పిపోయెను. కవిత్వమునఁ జిత్రవిచిత్రగతులు పొడమినవి. నగరార్ణవాది వర్ణనలఁ గావ్యములఁ జేయఁదొడంగిరి. కొన్ని రోజులు జరుగునరికి మనకుఁగూడ లక్షణగ్రంథములు సమగ్రముగా నుండవలయునని కాఁబోలు కావ్యాలంకారచూడామణి మున్నగు గ్రంథములు పుట్టినవి. స్వతంత్రపుంబోకడలతో గ్రంథరచన యొనరించిన బాగుగ నుండునని తలఁచి పెద్దనార్యుఁడు తక్కువపద్యముల కథాభాగమును మిక్కుటముగాఁ బెంచి రసవత్ప్రబంధ మొకటి వ్రాసి ప్రబంధయుగమునకుఁ బ్రారంభకుఁ డగుచున్నవాఁడైనాఁడు. ఆంధ్రభాషాయోషామణి బహువిధవిలాసవతియై "దేశభాషలందుఁ దెలుఁగు లెస్స" అని నుతిఁగన్న దీయుగముననె. ఈ యుగమునందే యొక ప్రక్క ముద్దుకవిత్వపు టూపులు, వేఱొకవంక నేకైకదిన ప్రబంధధారాయవిలాసములు, మఱియొకదెస ద్వ్యర్థిగ్రంథగ్రథనానుభవములు, నింకొకచక్కి శుద్ధాంధ్రకావ్యనిర్మాణదక్షతలు, కొండొకవంక నేకాక్షరి, ద్వ్యక్షరి, పాదభ్రమక, చిత్ర, బంధ, గర్భ, నిరోష్ఠ్యజంఝూప్రభంజనములు, నింకొకవంక నుత్కటశృంగారప్రబంధరచనావైదగ్ధ్యములునై యాంధ్రకవిత పలుత్రోవలం ద్రొక్కెను.

పైవారి ప్రబంధములకన్న నూతనపథములఁ బోవు నుద్దేశములు మొలకలెత్తఁ జొచ్చెను. సముఖము వెంకటకృష్ణప్పనాయఁడు జైమినీభారతగద్యగ్రంథమును వ్రాసెను. గద్యగ్రంథములలో రెండవది చిన్నయసూరి నీతిచంద్రిక. పైయుద్దేశములు క్రమముగాఁ బరిపుష్టములై

వికాసవంతములయ్యెను. ఆంగ్లేయభాషలోను, గీర్వాణభాషలోనుగల రమ్యదృశ్యప్రబంధములు మన వాఙ్మయమున లేకయుండరాదని కాఁబోలు వీరేశలింగ మహాకవిచేఁ గాళిదాసుని శాకుంతల మాంధ్రీకరింపఁబడెను. పదపడి యాంగ్లేయవాఙ్మయమునందువలెనే రాజశేఖరచరిత్ర మను నవల నీతఁడు రచించెను. ఈ యుగమునకు మూఁడు నామములు గలవు. ౧ నాటకయుగము, ౨ నవలాయుగము, ౩ వీరేశలింగయుగము. ఈ యుగమునఁ గవిత నానారీతులతో నడచినది. కొందఱు భాషాంతరీకరణ నాటకములను, నట్టినవలలను, స్వతంత్రనాటకములను నవలలను వ్రాయఁదొడఁగిరి.

మఱియు నీయుగమునఁ జక్కని విమర్శనలు పొడమినవి. వ్యుత్పిత్సువులకు విమర్శనలు జీవాతువులు. ఇట్టి విమర్శకులలో వేదము వేంకటరాయశాస్త్రులుగారు, నస్మద్గురువరేణ్యులగు వజ్ఝలచినసీతారామస్వామిశాస్త్రులుగారు నగ్రగణ్యులు. వీరివ్రాఁతలు విద్యార్థిసార్థవాహరత్నాకరములంట యతిశయోక్తి కానేరదు. ఇట్లే యింక నీకాలమున విమర్శనలు, వివేకవర్ధనులగు పత్రికలు మొదలగునవి యెన్నియో వెలువడినవి.

క్రొత్తయుగ మారంభమైనది. ఆంధ్రసారస్వతోద్యానవనమునకు వాసంతకల్యాణవాసరములు వచ్చినవి. శ్లేషయమకానుప్రాసాదిజరత్పర్ణావళి రాలిపోయెను. ఏకాక్షరి, ద్వ్యక్షరి గర్భబంధాదికముతో నసహ్యరూపముతోనున్న గొంగళిపురుగు చచ్చిపోయెను. భావప్రధానమై నవరసాభిరమ్యయగు నాకు చిలుక తన మిసిమిఁ గొలుపు పసిఁడిఱెక్కల విదిర్చుచు నలుగడల రసికుల 'హాయి' యనిపించుచున్నది. ఇదియే నూతనసువర్ణరసఖండకావ్య చతుర్థయుగము. ఇందలికవులు పాశ్చాత్యనాగరకతాచతురమతులు. ప్రకృతితోఁ దమరమ్యభావముల మేళగించి తదేకతానముగ గాన మొనరించు గాయకులు. ప్రకృతిసౌందర్యముల నాలోకించి యాలోకించి ప్రముగ్ధులైపోవు భావకులు. తమకర్ణ్యముల సారస్వతముఖమునఁ జిత్రించి కుంచియ నొల్లక నవరసరాగభరితముగా నొనరించు చిత్రకారశిఖామణులు. పోసఁగ ముత్తెపుసరుల్ పోహళించినట్లుఁ దమలోనఁ దొరయు శబ్దములఁగూర్చు ప్రోజకులు. లోఁబలంబినక్, రాతిరియున్ బవల్ మఱపురానిహాయల్ చెలియార బెంపు నిద్రాతిరి తీపులంబలెను దానసిలంజేయు నేర్పరులు. వీరిలో ముఖ్యులు దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు, రాయప్రోలు సుబ్బారావుగారు, దువ్వూరి రామిరెడ్డిగారు, విశ్వనాథ సత్యనారాయణగారు మున్నగువారు. వీరు స్వతంత్రులు, ప్రాచీనశుష్కనియమముల నంతగాఁ బాటింప నిచ్ఛలేనివారు. ఇట్లు వీరిలోఁ గొందఱి గ్రంథములవలననే తెలియవచ్చెడిని. చూడుఁడు: కృష్ణశాస్త్రిగారు, కృష్ణపక్షాన-గీతిక.

"నవ్విపోదురు గాక నాకేటిసిగ్గు
నాయిచ్ఛయే గాక నాకేటివెఱపు
కలవిహంగమపక్షములఁ దేలియాడి
తారకామణులలోఁ దారనై మెఱసి,
మాయమయ్యెదను నామధురగానమున,
నవ్విపోదురు గాక నాకేటిసిగ్గు"

అని తమనిరంకుశత్వమును బ్రవ్యక్తీకరించినారు. ఇంక రామిరెడ్డిగారు.

"గీ. పంజరనిబద్ధ కీరంబు బయలుగాంచి
యడ్డుకమ్ముల దాటంగ నాసచేయు
నటుల బహిర్నియమంబుల నతిక్రమించి
మన్మనంబు స్వాతంత్ర్యసీమకుఁ జరించు.

కాన యెవరేమియనుకొన్న దాననేమి
గలుగు కాల మనంతము యిల విశాల
భావలోకము క్రమముగాఁ బడయుమార్పు
లేలహృదయంబు వెలిపుచ్చ నింకేయుగంబు."

అని తమ బహిర్నియమనైరాశ్యమును, నిర్భయత్వమును నుగ్గడించుచున్నారు.

కాలానుగుణముగఁ బ్రాచీననియమముల మార్చుటయే నాగరకత. ఇట్టిది మనవారిలోఁ గొందఱికి సరిపడదు. కనుకనే వీరు ప్రస్తుతరీతులకు సరియగు శారదాబిల్లు మొదలగు సంస్కరణముల గర్హించి నాగరకలోకహాస్యాస్పదు లగుచున్నారు. ఏతాదృశులు కొందఱు

బహిర్నియమంబులను, ప్రాచీనఛాందసత్వములను సడలించిన భావకవులఁ గొన్ని యాక్షేపణలతో నిందించుచున్నారు. అందుఁ గొన్నింటిఁ బొందుపఱచి నాకుం దోఁచినటుల సమాధానము వ్రాసెదను చిత్తగింపుఁడు.

1. మొట్టమొదట భావకవిత్వమనఁగా నర్థము లేదఁట, 2. వీరి వ్రాఁతలలోఁ గవిత్వము లేదఁట, 3. వీరి కవిత్వమునఁ బ్రౌఢత్వము శైథిల్యపాకమఁట, 4. నీతి మృగ్యమఁట, 5. పచ్చిబూతులు వ్రాసి లోకమును నీతిబాహ్యముగా నొనరించుటలో వీరద్వితీయులఁట, 6. వీరు వ్రాసినదానినే వ్రాయ సమర్థులఁట, 7. వీరు చేతఁగానివారగుటచే శ్లేషచిత్రాదికకవిత్వమును విడిచికొనిరఁట, 8. జానపదులజీవితములు వీరికి వర్ణ్యములగుటనున్నతభావములు కలుగుటకు వీలులేదఁట.

పైవారివాక్యము లెంతవఱకు యుక్తియుక్తములో విచారింతము. భావకవిత్వమనుమాట కర్థము లేదఁట—'కవేర్భావః కవిత్వం—భావప్రధానం కవిత్వం భావకవిత్వ' మని మధ్యమపదలోప సమాసము. కొందఱు దీని 'కప్రాధాన్య' మని యనుకొనవచ్చును. రసపరిపంథియగు ప్రతిబింబయమునకు ప్రాధాన్యమని సమాధానము.

రెండవ యాక్షేపణ—వీరి వ్రాఁతలలోఁ గవిత్వము లేదఁట. ఈమాట కవిత్వమన నేమియో తెలియక యనినది.

తాను దేనిని వర్ణింపఁదలఁచినాఁడో దానినిఁ బాఠకుల యెట్టయెదుట నిలుపఁగలవాఁడే కవి. ప్రకృతిలోఁ దన్మయుఁడై రసికుల తనయపూర్వ కవితాసుధాతరంగిణి దోఁగింపఁగలవాఁడే కవి. కవి యొక్కొక్కతఱిఁ బాఠకుల గగనకల్లోలినీ శీకరసేకమున హాయిహాయి యనిపింపఁగలఁడు.

ఒక్కతఱి సుధర్మలో సుత్రామునంక భాగమున నిలిపి రంభాద్యప్సరఃకాంతల నాట్యానందాంబుధి నోలలాడించును. ఒక్కకపరి కాంతారాంతములఁ గందమూలములఁ దినిపించి కాషాయాంబరములఁ గట్టించి "కఠినవిధీ"యనిపించును. వేఱొకతఱి ప్రకృతికాంత యొడిలోఁ బరుండఁబెట్టి జోకొట్టి ప్రముగ్ధునిఁ జేయును.

ఇట్టివాఁడే కవి, వీనిదే కవిత్వము. ఇట్టిదే, వినఁగనే పాఠకునిచిత్తము నుఱ్ఱూతలూగింపఁగలదు. అంతియకాని యేవో నల్లరాళ్ల వంటిపదముల దొర్లించియనుప్రాస విరోధ్యాది నీరసనియమములఁ బెట్టికొని చెప్పినది కవిత్వముకాదు. ముమ్మాటికి కాఁజాలదు.

చూడుఁడు: పైనిఁ జెప్పినరీతిగా నూరనార్యుఁడు తన ప్రద్యుమ్నునిపారవశ్య తిమురమునఁ జిత్రించి పాఠకుల యెట్టయెదుట నెట్లు నిలిపినాఁడో—

"కలకల నవ్వినట్ల తెలి
కన్నుల నిక్కమునమూచినట్ల తోఁ
బలుకఁగడంగినట్లఁ గడుభా
వగభీరత లబ్బినట్లఁ జెం
పొలయుఁ జవ్వి జీవకళ
యుట్టిపడఁగా శ్రవ్రాసినట్టియా
చెలువున కాభిముఖ్యము
భజింప దలంకెను దానుబోఁటిరూ కా"

తరువాతఁ బెద్దనార్యునికోన యెట్లు మనదృక్పథము నంటియున్నదో పరికింపుఁడు.

"కులిశదరాహతి పొలుపున పైనుండి
యడుగుమో వఁగ జేగు రైవతటుల......
గాన ఘూర్ణితమగునొక్క కోనఁగనిరొ."

"తావుల్ క్రేవలఁ జల్లుచెంగలువ కే
దారంబు తీరంబునన్
మావుల్ క్రోవులు నల్లి బిల్లిఁగొను కాం
తారంబునం బైఁడిప
గ్రావాకల్పిత కాయమానజటిల
ద్రాక్షాగుళుచ్ఛంబులం
బూవుందీవల నొప్పునొక్కభవనం
బుక్షా గారుడోత్కీర్ణమున్"

ఇట్టి చిత్రణము సత్కవులకె యలవడును. ఇదియే నిజమగు కవిత్వము. ఈకవిత్వము మనభావకవులకున్నదో లేదో చూతము.

"చిలుకలదండు కేంకృతులు
సేయుచుమామిడియాకు తోరణం
బుగ చదలెల్లఁ గట్టినటు
మూఁగి చివుక్కున వ్రాలి దోరకం
కలు దమనోటఁ బెట్టికొని
గూళులకుం గొని పోవుచుండె సం
చలనము లేని నామనము
సందడి చప్పటి కుల్కి మేల్కనెన్."

రామిరెడ్డిగారి ఒకపంటకాపు - సాయంకాలము. పైపద్యమున పాలముపైఁ దోరణాకారముగా వ్రాలినచిలుకలదండు నెంతస్వభావమధురముగ వర్ణించినారో సహృదయులకు వేరే చెప్పవలయునా?

మఱియు విశ్వనాథము సత్యనారాయణగారు.

"కోనలన్నీ ముంచు కొనివచ్చు సెలయేటి,
చావకిన్నెరసాని జలజలాస్రవియించు
నురగలోఁ బైకగయు తరగలోఁగొంగ్రొత్త
తేనెకాలువలూరెనో యమృతంపు
వానచినుకులుజారెనో."

"తేనెతరగలపింఛము లోనజలజలసాగు
చావకిన్నెరసాని జాలైన మేలైన-వాకలో
యందాల-రాకలో-బంగారు
జిలుఁగుగంటలు మ్రోగెనో చిన్నారి
చిగురునవ్వులుసాగెనో."

అని రొండువాఁగును పాఠకుల దృష్టిపథములఁ బలురకాల వింతలతో మృదుమధురమగు పదజాలముతో నడిపించిరి.

మూఁడవ: యాక్షేపణ-నూతనత లేదట,

ఆంగ్లేయభాషలోని పెద్దకవుల గ్రంథములఁజదివి యందలి రమ్యభావముల మనజాతీయతతో మేళవించి యాంధ్రభాషకు వన్నెఁదెచ్చు నేటికవిత్వమునకుఁ ధాతలనాటి కవిత్వమునకుఁ జాలభేదము కలదు. వారి ప్రధాన వృత్తములు వేరు- వీరి ప్రధానవృత్తములు వేరు - వారి శైలి వేరు, వీరిశైలి వేరు; శయ్యలో భేదము, కల్పనలవ్యత్యాసము, తలంపులభిన్నత, వర్ణనలఁ దారతమ్యము. చూడుఁడు- పెద్దనార్యుని సాయంకాలము.

క. "క్రుంకె నపరాంబురాశిం
బంకజబంధుఁడు తదీయ బడబాముఖవీ
ఖాంకురిత కుతుకరథ్యని
రంకుశ వేగాపహృతశతాంగుఁడు వోలెన్."

ఆధునికుని మునిమాపుం దిలకింపుఁడు.

గీ. "చల్లగా మెల్లగాసాఁగు పిల్లగాలి
తరగలంను కలసిపోవు విరులవలపు
వాలె రజని పడంతుక పేలిముసుఁగు
చాయలం దైక్యమైపోయె సాంధ్యరోచి."

పై రెండుపద్యములఁ జక్కగా విని యాధునికులలో నూతనత యున్నదియు లేనిదియు సహృదయులే నిరూపింతురు గాక!

వీరికవితలోఁ బ్రౌఢత్వము లేదని యింకొక యాక్షేపణము, కవితాప్రౌఢిమ యనఁగా వీరికిఁ దెలియదని సువ్యక్త మగుచున్నది.

వ్యర్థపదములు లేక రసానుగుణములగు పదములతోఁ గూడి వినఁగనే హాయియనిపించునదియే ప్రౌఢకవిత్వము గాని నల్లరాళ్ల వంటి 'ఘూర్ణమానా' 'తుండపరిసృజ' 'ఆముష్యాయణ' మున్నగు పదముల శబ్దశాస్త్రములనుండి మోసికొనివచ్చి కవితాప్రవాహమున కానకట్టు కట్టుట ప్రౌఢకవిత్వము కాదు. ఈ యభిప్రాయముతోనే మన యద్యతనకవిచంద్రులే మనుచున్నారో చూడుఁడు.

క. చెప్పవలెఁ గప్పురంబును
నుప్పులుగాఁ బోసినట్లు కుంకుమ పైఁ బైఁ
గప్పినక్రియ విరిపొట్లము
విప్పినగతి ఘుమ్మనన్ గవిత్వము సభలన్.

మఱియు మెల్ల యేమనుచున్నదో చూడుఁడు.

ఆ-వె. తేనెసోక నోరు తీయనయగురీతిఁ
తోడనర్థమెల్లఁ దోఁపకున్న
గూఢశబ్దములను గూర్చిన కావ్యమ్ము
మూగచెవిటివారి ముచ్చటగును."

అదియునుంగాక సంగీతమునకుఁ గవిత్వమునకు నెడతెగని సంబంధము కలదు. ఈ సంబంధమును మన పూర్వకవీంద్రులు కొందఱెఱిఁగి నాతిదీర్ఘ సమాసముగఁ దమకవితను నడపినారు.

అందు కవిబ్రహ్మయగు తిక్కనామాత్యుని పద్యములు నాతిదీర్ఘ సమాసములై, మనోహరములై యుండును. చూడుఁడు:

క. క్షీరోదకగతి మనయును
వారలునుం గలసి బ్రతుక వలవదె కిమ్మిన్
వారిడుముల బడఁదగియెడు
వారే? పితృభాగమేలు వారలుగారే.

ఉద్యోగపర్వము.

మన పెద్దన యెంతకమ్మని కవిత్వమును జెప్పినాఁడో యారయుఁడు:

ఉ. అబ్బురపాటుతోడ నయ
నాంబుజముల్ వికసింపఁగాఁ దల పె
ల్లుబ్బి కనీనికల్ వికసి
తోత్పలపంక్తులఁ గ్రుమ్మరింపఁగా
గుబ్బమెఱుంగు చన్గవ న
గుర్వొడువన్ మదిలోని కోరికల్
గుబ్బతిలంగఁ జూచె నల
కూబరసన్నిభు నద్ధరామరున్.

కొందఱు తమ పాండిత్యమునంతయు నుపయోగించినచ్చి పచ్చడయిపోయి యొక నల్లరాతిసంతెన కట్టినారు. చిత్తగింపుఁడు.

శా. "మాణిక్యక్రియ మాణపోషవలభీ
మాయాసరిత్తర్తుకా
మైణాక్షీసహాభీలి సంభ్రమశర
వ్యాలోకమానార్భగా
క్షీణాసర్గళ హాసభావిధళిత
స్ఫీతాంధకారశ్రితీయా
మాణానూత పిశాచ్యపక్షతతికం
బాపట్లాం బల్పవే!?"

పెద్దన దీర్ఘ సమాసములతోఁ జెప్పలేదా యని కొందఱడుగవచ్చును. ఈతని "అటజనికాంచె" మొదలగు పద్యములలో, లయపోషక పోవుటచేతను, చక్కనివడక యుండుటచేతను నాతని పద్దియములు ముద్దులుమూటఁ గట్టుచున్నవి. పై పక్కాళ్ళల కబ్బిన ప్రౌఢకవిత్వము మన యాధ్యతనకవుల కున్నదో లేదో చూతము:

"చ. దొనదొన జాఱుబొవ్వములఁ
దోయిటఁబూని భవత్పదాభిషే
కనియతి వచ్చుచున్న వ్రజ
కన్యలు బృందము త్రోవఁ దప్పిరో
యనిమది నైన నెంచవవు
రా తలిచిక్కని నుమ్మపాలు త్రా
వివ చిఱుబొజ్జలోఁ గలఁక
పెట్టదురా జగదేకసుందరా"

విశ్వనాథ సత్యనారాయణగారు

చ. అలరుఁ బసేతు లెల్లరు హి
మాంబువుల న్నవ మల్లికాసరిన్
జలకము లార్చినారు ఘన
జాతపరాగ మలందినారు మేల్
జిలుఁగు హొరంగు పొందపుఁ
జీరలుకట్టిరి పెండ్లికంచుఁగో
మలజలజాతపత్రముల
మాటున నేటికి దాగినాఁడవో.

శ్రీ కృష్ణశాస్త్రిగారు

మఱియు వీరికవితలో నీతి మృగ్యమఁట.

ఈ విషయమును విశేషముగ విమర్శింప నవసరము లేదు. ఈ క్రిందిపద్యములఁ జదివినవారి కిందలి యథార్థము గోచరింపకపోదు.

"చ. సమయు మహాల్య మొక్కనిము
షంబు వృథాచన గ్రమ్మరింపనే
రము; మనయాయువా త్రుటి ప
రంపరగాగ నెఱింగి నిద్రమాం
ద్యమును దొలంగి మీపనుల
నారయుఁ డోజనులార యంచు డం

బముగ మెడ న్నిగుడ్చి కృక
వాకము గూసెడి నింటికోళ్ళనన్"

ఉ. వెలుఁగుల రత్నభూషలను
వేలకుఁ దాల్చిన నిన్నుఁ గాంచుచోఁ
గలుఁగదు ప్రేమ భర్తకు; వి
కస్వరమా వదనారవిందముం
దోలికడు ముద్దులేనగవు
లొక్కని మేపము తోఁపకున్న భూ
షలు ప్రణయానుబంధసదృ
శమ్ములు గావు కులాంగనాళికిన్.
— రామిరెడ్డిగారి 'కృషీవలుఁడు'

ఇంక వీరు పచ్చిబూతులు వ్రాసి లోకము నాశనము నేయుచున్నారను మాటను విచారింతము. పూర్వాధునిక కృతులు సమగ్రముగఁ జదివినవారి కీవిషయము విదితము.

చూడుఁడు-'నతోరుక్సవదాయి-నన్నెదోయి' భాగ.

ఉ. "గుట్టసియాడ గబ్బిచను
గుట్టలపైఁ బులకాంకురావళుల్
తెట్టువఁగట్ట..............."
"మూఁడుమలపుల్ వలచెన్
ఫణిరాజకన్యకన్"
అని చే. వెంకన్నయు,

"జలజల మరునిల్లు పెల్లు
చెమ్మగిలంగన్" అని

కూచిమంచి తిమ్మన్నయుఁ దమయపూర్వశృంగారమును వెలువరించిరి. ఇట్టిపద్యములు యుక్తాయుక్తవివక్షణా దక్షులగు కవిపుంగవుల నోటరాఁదగినవా? బాలురకు నీతులు, దేశభక్తియుఁ గఱపవలసిన నోటితో పచ్చిబూతు లుచ్చరింపటయా?—"కొదమ గుబ్బలపైని కొంగు తొలగింప, యిదియేమనడిగితే - తుదినన్నుఁ గూడెనే" అని సిగ్గులే కోటిరూప్యములకన్న మేటియగు మానముం బోనాడి చేతులఁద్రిప్పి యభినయించు భోగముదాని జావళీలకన్న నీపద్యములు భిన్నములా?.

ఇట్టిపద్యములు బూతులో, యీక్రిందిపద్యములు బూతులో రసికులే నిర్ణయింతురుగాక!

గీ. క్రొమ్ముసుస్నిగ్ధనీలాంశుకమ్ముఁదాల్చి
ఎదురుపడితివి దేవి, నీ వింపులొలుక
సంజుపశ్యామముఁ డెన ము రారిదేవు
లలితసంశ్లేషమందలి లక్ష్మివోలె.

గీ. కన్నులఱమోడ్చి యౌవన కమల మల్ల
రమ్యముగ వాల్చి లజ్జాభిరామగతిని
లలితజంగమకాంచన లతికవోలె
హర్మ్యభాగములోనికి నరిఁగినావు.
—శివశంకరశాస్త్రిగారు.

" హేమమణిరత్నగణమేల లేమ మనసు
సాంధ్యసమయసువర్ణిత చ్ఛాయ లరసి
తారకాశోభితాంబరతలము లరసి
చింతలను బాయుదము చేయి చేయి కలిపి"
—కృష్ణశాస్త్రిగారు.

సంస్కృతకవుల పరిపక్వశృంగారమును పరికింపుడు.

" కిమపికిమపి మందం మంద మాసత్తియోగా
దవిరళితకపోలం జల్పతో రక్రమేణ;
అశిథిలపరిరంభవ్యాపృతైకైకదోష్ణో
రవిదితగతయామా రాత్రిరేవ వ్యరంసీత్."
—భవభూతి.

ఇఁక వీరు వ్రాసినదానినే వ్రాయ చేతఁగాని వారని యింకొక యాక్షేపణము.

ఇది మన మెవరు మహాకవు లనుకొనుచున్నామో వారిగ్రంథములందే కానంబడుచున్నది. చూడుఁడు:

" యథా ప్రసిద్ధైర్మధురం శిరోరుహైర్జటాభిర
ప్యేవ మభూత్తదాననమ్; న షట్పదశ్రేణిభిరే
వ పంకజం సశైవలాసంగ మపి ప్రకాశతే."
—కుమారసంభవము.

అని వ్రాసి తిరిగి శాకుంతలమున.

"సరసిజ మనువిద్ధం శైవలేనాపి రమ్యం మలిన మప్తి హిమాంశోర్లక్ష్మ లక్ష్మీం తనోతి, ఇయ మధిక

మనోజ్ఞా వల్కువేనాలపి తన్వీ కిమివ హి మధురాణాం మండనం నాకృతీనామ్." అని మురారి నాభావమునే యుపనిబద్ధించినాఁడు. సాధారణముగఁ గవులు తాము జక్కని కథాభాగములఁ గాని, వర్ణనలఁ గాని చొప్పించిన రమ్యభావములఁ, దనివి నణక మరల నట్టి తావుల వ్రాయుచుందురు.

ఇంకొక యాక్షేపణ—వీరు రసమగ్నులగుటచే, నియమములను, శ్లేషాదికమును విడచికొనిరని. రసమునకడ్డము ప్రతినియమమును నుల్లంఘింపఁ గవికి స్వాతంత్ర్యము కలదు. ఇట్టి యభిప్రాయముతోడనె మురారి "యాచ్ఞాదైన్యపరాంచి యస్య కలహాయంతే మిథస్త్వం వృణు" అని స్వేచ్ఛగా యతిభంగ మొనరించినాఁడు. ఇట్లే భవభూతి "వికసతి హి పతంగస్యోదయే పుండరీకమ్" అని యతిభంగమును గణింపనైన లేదు. కాళిదాసు కూడ "తదన్వయే శుద్ధిమతి ప్రసూతః శుద్ధిమత్తరః" అని గురులఘువులఁ దారుమారు చేసినాఁడు. ఇట్టి స్వాతంత్ర్యము మన తెనుఁగు కవులకుఁ గూడ నున్నట్లు నారాయణకవికృత పంచతంత్రముఁ జదివిన వారికిఁ దెలియక పోదు. అదియునుం గాక యీ యతిప్రాసలు గ్రామ్యతకుఁ బుట్టినవి. అట్టి గ్రామ్యత యే యక్షరమున కా యక్షర మావృత్తి జరిగినఁ గలుగును గాని తకార సకారములకు సరిపెట్టుకొన్న చోటఁ గలుగదు. రే యక్షరమున కా యక్షరము దొరకుట కష్టము గదా! కనుకనే మొట్టమొదట దశవిధములుగాఁ బుట్టిన యతి యనంతవిధములైనది. తుదకీ యతిప్రాసలే మన యాంధ్రకవుల ప్రాణములు తీసి మన కవితను వ్యర్థపదభూయిష్ఠముగ నొనర్చినవి. గీర్వాణకవితలో నీ కుమ్మక్కు నియమములు లేకపోవుటచేతనే యా వాఙ్మయమున, నంత దివ్యకవిత్వము పుట్ట వీలు కలిగినది. ఇట్లనుటలో మన వాఙ్మయమునఁ గ్రమకవిత్వము లేదని నాతలంపు కాదు. ఈ కుమ్మక్కు నియమములు లేనిచో నింకను జక్కని కవిత్వ ముద్భవింప నవకాశము గలిగెడిదని నాతలఁపు.

శ్లేష బంధాది కవిత్వము వీరు చేతనయి వ్రాయరో చేతకాక వ్రాయరో యెవరు నిశ్చయింపఁగలరు? అదియునుం గాక "కావ్యాంతర్గతభూతా యా సాతు నేహ ప్రపంచ్యతే" అని సాహిత్యదర్పణమున విశ్వనాథుఁడు శ్లేషాదులయందలి తన నైస్పృహ్యమును వెల్లడించెను. ఇంకొక యాలంకారికుఁడు "ప్రాయశో యమకే చిత్రే రసపుష్టి ర్న మృగ్యతే" అని యమకాదుల రసపుష్టి గనసుమనెను. పూర్వలాక్షణికులచే నిట్టిసన్మానములఁ గొన్న పాదుకైత యలవడకున్న మంచిదని సంతసింపవలసిన విషయములో వీరి నిందించుట తెలివితక్కువ కాదా?

జానపదుల జీవితము వీరికి వర్ణ్యమగుటను నున్నత భావములు గలుగ వీలు లేదని యింకొక యాక్షేపణము. ఇది జానపదజీవితరహస్య మెఱుంగక యన్నమాట.

నిజముగ మన మున్నతులము, మనచేఁతలు సవిలీనము లనుకొనుచున్నాము గాని వారివద్ద మనము నేర్చుకొనవలసిన వెన్నియో కలవు. వారు పగలెల్ల నెంతియో శ్రమపడి తమ కార్యములఁ దాము నిర్వర్తించుకొనుచు నెల్లరు నిట్లే సోమరులు గాక యుండుఁడను చక్కని నీతిని బోధించుచున్నారు.

కాపువారి యాఁడువారు కూడ భోజనాదికమును చేలలోనికిఁ దీసికొనిపెళ్లి భర్తకిడి తదుచ్ఛిష్టమును భుజించి మగలతో సమానముగఁ బాటుపడి భర్తల ప్రేమాపాంగములకుఁ బాత్రులై తమ నిష్కపట ప్రణయపాశముల నొండొరుల బెనవైచికొని నాగరకులమని చెప్పుకొనుచు భర్తల లక్ష్యపెట్టక స్వేచ్ఛగాఁ జరించు నవనాగరకాంగనామణులకు బుద్ధివచ్చునట్లు తమ జీవితాదర్శములఁ జూపుచున్నారు.

అదియునుం గాక వారి నిష్కలుషాశయములను, సజ్జన భక్తిపరాయణతలను, నకృత్రిమసౌందర్యములను, బ్రముగ్ధభావములను గన్గొనిన యే సహృదయునకు వర్ణింప నిచ్ఛపోడమదు? కాఁబట్టియే రామిరెడ్డిగారు "కృషీవలుఁడు" అను నొక ఖండకావ్యమునఁ గర్షకులఁ గూర్చిన పెక్కు సందర్భములను నెంతో రమ్యముగ వర్ణించినారు.

కవిహృదయము దర్పణమువంటిది. హంసతూలికాతల్పంగతుఁడయి సర్వభోగాభిరాముఁడై వెలుఁగు మహారాజెట్లు కవిచిత్తదర్పణమునఁ బ్రకాశించునో యట్లే త్రాగ

గంజిలేక కట్ట గుడ్డలేక యూరివెలుపల మఱిచెట్టుక్రింద "సర్వేశ్వరా" యనుచుఁ జింకిగోనెముక్కల శయ్య నధివసించి వనరు భిక్షుకుని జీవితమును బ్రతిబింబించుచు. గులాబిపూల సౌరభము వెదజల్లుచుఁ దియ్యని మావిజొంపముల జనులచిత్తములఁ జూరఁగొనుచుఁ జంద్రోపలవేదికలో నింపునింపు నుద్యానవన మెట్లు కవికి వర్ణ్యమో యట్లే, కంకాళములతోడను నెడనెడ హృదయవిదారణ మొనర్చు గృధ్రనిస్వనములతోడను, పాతివశిశువుఁ జైకొక్కెలాగె బీభత్సముగఁ దినునక్కలతోను జాగుప్సావహముగనున్న మసనమును దప్పక వర్ణ్యము. ఈ విషయమును భవభూతి మాలతీమాధవమున స్పష్టపఱచియున్నాఁడు.

ఇట్టి యలవాటు మనయాంధ్రకవులకుఁ దరుచు లేదు. ఆంగ్లేయుల కిది ముఖ్యము. వారికి మనకవులవలె, నా మహారాజులే, యా సువర్ణసౌధములే, యా మన్మథోపాలంభనలే, యా చంద్రోపలవేదికలే యక్కఱలేదు. సామాన్యజనుని జీవితమును వారు గ్రంథముల వర్ణింతురు. ఇట్టి పద్ధతినే మన యాధునికకవు లవలంబించిరి. చూడుఁడు:

రామిరెడ్డిగారు తమ 'కృషీవలుఁ'డను ఖండకావ్యమున:

సీ. వ్రాలినకొప్పులోపలి పూలరేకులు
సడలి యొక్కొక్కటి జారుచుండ
బరువంపుబొమ్మపై బర్వెడి చిను
గుబ్లు గాలికి నట్టిటు గదలియాడ
యొలుగెత్తి పాడెడి యేలలు విని బాట
సారు లెక్క సకెము సల్పుచుండఁ
దమ్ములంపుంబూతఁ దవిలిన వాతెఱ
పైఁ బలుచాలు నవ్వకరయునవ్వ
చేతికొడవలి ఝళిపుచు చిన్నెలాడి
కన్నెమాలెత పిడి చుట్ట మున్న మున్న
మునువుతఱుగుచు నింటికిఁ బోవువేళ
సందడోద యీలేవె కర్షకకుమార!.

అని యొక కన్నెమాలెతఁ గంటఁగట్టినట్టెంత యభిరమ్యముగ వర్ణించినారు. మఱియు వీరలున్నదున్నట్లు వర్ణించుటలోను, బ్రకృతిలో లీనమై యాపాయుజ్య సుఖముచేఁ బరవశులై మాటలాడినారో యన్నట్లు వ్రాయుటలోను నిపుణులు. చూడుఁడు:

ఉ. అత్తల యాడుబిడ్డల భ
యం బొకవంక యొఁ గోర్కె వేఱొకట
జిత్తములాగఁ గ్రొవ్వెదయుఁ
జీరయు వేసవరించి తూఁగు పై
మత్తుననున్న వల్లభుని
మంచము మెల్లన పీడి నీవల్లై
యిత్తరికోడ లిల్వెడలె
వేకువఁ బ్రాచిపనుల్ పొనర్పగాన్.
—రామిరెడ్డిగారు

"అమ్మ యీచిన్ని జాబిల్లి కమ్మ యెవరు
యీతనికి బువ్వపెట్టువా రెవ్వరమ్మ"

* * * * *

"పోరుపెట్టెడి కొండపైఁ బోవలేక
భయము వేయదె క్రిందికిఁ బడునో యేమొ?"
—వేంకటపార్వతీశ్వరులు

ఇంక నాధునికులు పూర్వకవిత్వమో యని దేవులాడు ఛాందసుల నెట్లు పరిహసించుచున్నారో చూడుఁడు:

సీ. ప్రౌఢసమాస కల్పనమున్న మీయొద్దఁ
జూపుమీ యని చేయి చాపె నొకఁడు
శ్లేషకవిత్వంబు జూపు మీకడనున్నఁ
గొనియెద నేనంచుఁ గోసరె నొకఁడు
ఆశుకవిత్వమ్ము నల్లమంత్రమ్మన్న
నూదుమీ యని చెవి యొగ్గె నొకఁడు
సత్కావ్యరచనార సాయనం బున్నచో
నీబుడ్డి నిపుణం బిచ్చెనొకఁడు
ఘోరసీమట్లు వ్రాయంగఁ
బనికివచ్చు..........."

సీ. కవితాలతాంగికిఁ గర్ణభూషణమైన
కలువ మీచేఁబడి వలిగిపోవు
... ...
... ...

ఈతు పారజలమ్ము మీ చేతులంటి
మలినమై పోవు కొనకున్న మాని పొందు"
తొలకరి, పింగళి లక్ష్మీకాంత ప్రభృతులు

కావున నో మిత్రవరులారా!

ఆధునిక కవిచంద్రుల లేనిపోని యాక్షేపణల జేసి నిందించుట మీకుఁ దగనిపనియని యిప్పటికైనఁ దెలిసికొండు.

నాగరకతా ప్రవాహము కొనలన్ని ముంచుకొని ప్రవహించుచున్నది. చదువులు మారెను. గురువులు మారిపోయిరి. తలఁపులు వేరు—అభిరుచి భిన్నము. వివాహములమాదిరి వేఱు—ప్రేమల తెరంగు వేఱు—ఇంక కవిత్వమునకా నూతనత యుండరానిది? చూడుఁ డొకయభిజ్ఞుఁ డెంతరమ్యముగఁ జెప్పినాఁడో.

గీ. " కాలపరివర్తనంబునఁ గలుగుమార్పు
దాని మాన్పంగఁ దరమె యెవ్వానికైన"

* * * *

"నవవసంతము నవ్యవనరమ మావికొమ్మలఁ గమ్మచివురులు
పాటపాడెడి పరభృతంబును యెవ్వరాపుదురో"

అని శ్రీకృష్ణగారు.

హిమవత్పర్వతమునఁ బుట్టి యెన్నియో పుష్పనికుంజములఁ దూఱి సెలయేటి చెలిమికత్తెల చట్టాపట్టాలతో గానకళల వెల్లివిరియు తరంగనిస్వనాలతో మహావేగమున హోరుమని పాఱు గంగాతరంగిణి నెవ్వ రాపఁగలుగుదురు? ఆంగ్లేయమహాకవుల రమ్యభావముల మన జాతీయతతో మేళగించి మృదుమధురపదజాలముతో మురిపములగు భావములతో ముద్దుల మూటఁగట్టు ముత్యాల సరములతో — స్రావ్యముగ ప్రవహించు నాధునికకవితాసుధా ఝరి యెవరిచేతుల యడ్డుతో నిలచిపోవును? కనుక నీకవిత్వ మెంతమాత్రము నిందింపఁదగనిదనియు, క్రమముగ నూతనత్వ నభిలషించు మన యాంధ్రకవుల కియ్యది యాంగ్లేయ సంపర్కమువలనను, శ్లో. "పరిపాండు దుర్బలకపోలసుందరం దధతీ విలోలకబరీక మాననం, కరుణస్యమూర్తిరథవా శరీరిణీ విరహవ్యథేవ వనమేతి జానకీ." అను దివ్యకవిత్వము వ్రాసిన కొంద ఱపూర్వకవుల సాంప్రదాయములవలనను వలవడినదనియు "నీవు గమించువేళ, పూర్వకాలంబునందునఁ భోపథాంత" మున్నగు దుష్టప్రయోగము లున్నను మనకుఁ గౌరవనీయ భావప్రధానకవిత్వమును వ్రాయసమకట్టిన వీరు మన కభినంద్యులనియు, తక్కుంగల లోపంబులను, దుస్సంధ్యాదిదోషంబులను జక్కఁదిద్దికొనఁ బ్రోత్సాహ్యులనియు, వినయపూర్వకముగా మనవిసేయుచు గ్రంథవిస్తరభీతి నింతట విరమింతు.

" సుకవిభోగ్యమ్ము లివటి వస్తువులు వీని
కలిపి వేయకుఁ డటునిటు కలఁచివైచి"

ద్రావిడభాషలు-వర్ణవినిమయము

కోరాడ రామకృష్ణయ్య గారు, యం. ఏ.,

జీవద్వస్తువు లన్నిటివలెనే జీవద్భాషలకును మార్పు సహజము. సజీవములగు పదార్థముల యభివృద్ధికిఁ దోడ్పడు లక్షణములు కొన్ని సహజముగ వాని జన్మమునకుఁ గారణములగు పదార్థములనుండియే సంక్రమించుచున్నను పరిసరముల స్థితిగతులు కూడ కొంత తోడ్పాటు గావించుచున్నవనుట నిశ్చయము. ఈ రెంటియొక్క సమ్మేళనసాహాయ్యముచే నాజీవము పెంపొంది యభివృద్ధి గాంచుచు ననేకవిధములగు మార్పులకు లోనగుచు దనజీవయాత్ర కొనసాగించుచున్నది. అట్లే భాషలవిషయమునగూడ గాంచవగును. సమీపస్థములగు కొన్ని భాషలకు సహజములై సాజాత్యమును నిరూపింపఁగలిగిన సమానలక్షణములు కొన్ని స్థూలదృష్టికే యగపడుచుండును. అట్లయినను వీనికి భిన్నభాషలతోడి సాంగత్యమువలనఁగాని, దేశకాల స్థితిగతులనుబట్టి ఆయా భాషలను వ్యవహరించు జనుల యుచ్చారణపరిపాటిలోఁ గలుగుచుండు మార్పులవలనఁగాని మఱికొన్ని విశేషలక్షణము లబ్బుటచే నొక్కభాషయే భిన్నరూపములు గల దగుటయు, వీనిలో నొకదానికంటె మఱియొకటి విలక్షణమైన రూపమునొంది ప్రత్యేకభాషగా పరిగణింపఁబడఁ దగినదై యుండుటయు సంభవించుచుండును. ఒక్క చెట్టునుండి వెలువడిన విత్తులే సహజముగ వానిలో సంక్రమించిన సత్తయందలి భేదమువలనను, పిదప నవి నాటఁబడిన క్షేత్రవిశేషములందలి గుణభేదమువలనను, అనంతరము వానికిఁ జేయఁబడిన దోహదవిశేషమువలనను, దేశకాలస్థితిగతుల సాహాయ్యమువలనను, భిన్నరీతులుగల వృక్షములై పెరిగి యొక్కొక్కప్పుడు వేఱువేఱురుచులు గల ఫలముల నిచ్చుచుండుటయు గలదు గదా. భాషలు నట్లే యొకమూలభాషనుండి బయలుదేరినవైనను దేశకాలస్థితులనుబట్టి యత్కించిద్భేదము గలవై పెరుగుచు వచ్చి తుద కొకకాలమున విడివడి పరస్పరసంబంధమును నిరూపించుటకు గూడ వీలులేనంతగా మాఱిపోయి కొంత కాలమునకు ప్రత్యేకభాషలుగ పరిగణింపబడుటయు తటస్థించును. భాషాబీజములు మొలకెత్తి శాఖోపశాఖలఁ దొడిగి వృద్ధినొంది భావఫలంబుల నొసంగుచు భిన్నరూపములుగల వృక్షములై విజృంభించుటకు వలయునావాపభూమి మానవుని యాస్యరంగమే. ఈ రంగమున నా భాషానర్తకి వాచికాంగముల సాహాయ్యముచే ననేక చిత్రవిచిత్రరూపముల దాండవించుచు దననాట్యకలాకౌశలముచే నొక్కభావమునే యనేకవిధములగు విచిత్రరూపముల వ్యక్తము చేయుచుండును. ఆంతరంగికమగు భావ మొక్కటియేయైనను ఆస్యరంగమున తాత్కాలికముగ గ్రహించిన ధ్వన్యాత్మక రూపభేదమునుబట్టి, ఆయాకాలములయందా భాషానటిని పూర్వరూపమున మనకగపడినదానికంటె భిన్నమైనదానినిగనే మనము తలంచుచుందుము కాని తత్తత్కాలములందా నర్తకిచే గ్రహింపబడుచు వచ్చిన యాహార్యకసామగ్రి నించుక సూక్ష్మదృష్టితో పరికించినగాని తొలగించి చూచినగాని నైజంబగు మూలస్వరూపము మనకు వెంటనే గోచరింపక పోదు. ఈ భాషానర్తకి సులభముగ గుర్తింపఁబడుటకు వీలులేని యపూర్వరూపములను గ్రహించుట కనువగు నాహార్యకసామగ్రిని సమకూర్చు ప్రధానసాధనము మానవుని యాస్యరంగమునం దమరియున్న వాచికావయవములే (Organs of Speech) యగుచున్నవి. ఈ యవయవసామగ్రియొక్క సౌష్ఠవాసౌష్ఠవములు, ప్రయోగసరణి, మొదలగువానియందలి భేదమునుబట్టియే యాభాషానటి క్రొత్తక్రొత్తరూపములను వహించుచుండుట తటస్థించుచున్నది. విచిత్రరూపధారిణియగు నీమెరూపములలో నొకదాని నొకకాలమునఁ జూచి దానికలవాటుపడిన యొక జనసంఘ మదియే యామె నిజస్వరూపమని తలంచుచుండును. ఆ కాలముననే మఱికొంద ఱామెను మఱియొకరూపమునఁ గాంచి తాము గాంచినదే యథార్థరూపమని తలంచుచుందురు. ఈ జన

సంఘమే మఱికొంతకాలమున కావెను మఱియొకరూపమును గాంచి వెనుకటిరూపమే నిజరూపముగాని యిది కాదనియో లేదా ఈ నూతనరూపమే నిజమైన రూపముగాని వెనుకటిది కాదనియో తలంచుచు భ్రమించుచుందురు. ఇట్లీభాషాపతి దేశకాలానుగుణంబుగ భిన్నరూపములను బొంది ఆయా జనసంఘములం దాయారూపములతో గొంతకొంతకాలమువరకు నిలచియుండును. తమకు గోచరించిన రూపమునే భావించుచు తద్రూపప్రకటనమున కనువగునట్లే తమ వాచికాంగములను బ్రయోగించుట కలవాటుపడిన యా జనసంఘమున కారూపమే సంప్రదాయ సిద్ధంబైన దగును. భాషారూపములం దిట్టి సంప్రదాయములు స్థిరపడినకొలఁది మూలస్వరూపమును గనుఁగొనుట కవకాశము వీరికి తప్పిపోవుచుండును. కాని సూక్ష్మదృష్టితో పరిశీలించినచో నీభాషారూపములకును, జనుల వాచికావయవముల ప్రయోగపరిణియం దేర్పడిన ప్రత్యేక సంప్రదాయములకును గల సంబంధముమూలముగా భాషారూపములకుగల పరస్పరసంబంధము, వాని పౌర్వాపర్యమును గొంతవఱ కన్వేషించి తెలిసికొని భాషాపతియొక్క మూలస్వరూపమును గూడ గుర్తించుట కేవల మసాధ్యము కాదు. ఈ మార్గము ననుసరించుటచేతనే భాషల సంబంధబాంధవ్యములు, వందలి సన్నిహితాసన్నిహితత్వములును గూడ నిర్ణయించి భాషాకుటుంబముల నేర్పఱచుట సంభవించుచున్నది.

ప్రస్తుతము దక్షిణహిందూదేశభాగముల వ్యవహరింపఁబడుచున్న యాంధ్ర తమిళ కన్నడ మళయాళాది భాషారూపములకు ప్రాచీనంబగు మూలరూపం బెట్టిదో, యది యాయా ప్రాంతజనుల వాచికావయవ ప్రయోగభేదమునుబట్టి యెట్టి మార్పులను జెందుచువచ్చి తుదకిట్టిరూపములను వహించినదైనదో యించుక పరిశీలింతము. మూలభాషారూపములయు, ధ్వనులయు యాథార్థ్యమునుగూర్చి చెప్పుట యంత సులభసాధ్యము కాదు గాని సమానార్థకములై సజాతీయములగు సన్నిహిత భాషా పదములలో నీధ్వనులు పొందిన మార్పులను బట్టియు, నాధ్వనుల యుచ్చారణరీతులయందలి సౌలభ్యాసౌలభ్యములను బట్టియు నొక్కొకదేశమందలి యుచ్చారణపరిపాటిని బట్టియు మూలరూపము లివియై యుండునని కొంతవఱకు నిశ్చయింపవచ్చును.

ఈభాషలలోని పదాంతమందలి 'అ'కారధ్వనిని తిలకింపుడు. అది తమిళమున 'ఎయ్'అనియు,కన్నడమున 'ఎ'అనియు మాఱుచున్నది. మళయాళమున గూడ తెలుఁగున వలెనే అకారముగనే పలుకఁబడుచున్నది.

తె	తమి	మళ	కన్న	తుళు
తల	తలై	తల	తలె	తలె
మల	మలై	మల	మలె	మలె
వల	వలై	వల	బలె	బలె

తమిళమునకు రెండుప్రక్కలనున్న తెలుగు మళయాళములు రెండుభాషలలోను నీ 'అ'కారము తమిళమందువలె మార్పులేక అకారముగనే యుండుటను బట్టియు, అకారాంత సంస్కృతపదములు గూడ తమిళమున ఐత్వమును గ్రహించుచుండుటచేతను, cf ఆశ-త. ఆశై, చిత్ర-త. చిత్తిరై etc. ఈ పదముల ప్రాచీనరూపము అకారాంతమే యనియు, తమిళమున ఐకారాంతములు లేదా ఎయ్‌కారాంతరములుగను,కన్నడమున 'ఎ'కారాంతములుగ పలుకఁబడుట ఆ జనసంఘముల యుచ్చారణవైఖరినిబట్టి తరువాతికాలమున నేర్పడినదే యనియు తలంపదగియున్నది.

కన్నడమున నిది 'ఎ'గా మారుటను బట్టి, దీనికి పూర్వరూపము తమిళమునందలి 'ఎయ్' అనియు నా 'ఎయ్'నుండియే ఈ 'ఎ' అంత్యరూపము లేర్పడియుండుననియు తలంపవచ్చును. ఇంతేకాక పై పదములలో అకారాంతములే ప్రాచీనద్రావిడభాషారూపములని మఱియొక కారణముచే గూడ సాధింపవచ్చును. వలై, కొలై నడై, మొదలగు రూపములు వల, కొల్, నడ, అను అకారాంతధాతువులనుండి నామవాచకరూపములను కల్పించుటకుగా 'ఇ'కారప్రత్యయమును జేర్చుటచే తమిళమున నేర్పడినట్లగపడుచున్నది. cf మలె వెట్టి-వెట్టు + ఇ;(తె. కోటు)=మన్నునకఱకునది; త్రవ్వునది. అలరి—అలర్ ఇ= పువ్వు; పుణరి-పుణర్ + ఇ=అల, సముద్రము. ఈకార

ణముచే వల + ఇ, నడ + ఇ, కుజ్జ + ఇ-చేరి వలై, నడై, కుజ్జై అనురూపము లేర్పడి అవి కాలక్రమమున వలెయ్, నడై, కుజ్జయ్ అని యుచ్ఛరింపబడుచువచ్చి కన్నడదేశమున వలె, నడె, అను రూపములను బొంది యుండవచ్చును. దీనిని బట్టి ప్రాచీనభాషలోని 'ఐ'కారధ్వని కాలక్రమమున వాయా భాషలలో వాయా దేశజనుల యుచ్చారణరీతులను బట్టి యెట్లు మార్పునొందినది తెలియుచున్నది.

కొన్ని భాషలలోని పదముల ఇకార, ఉకారములు మఱికొన్ని భాషలలో ఎ, ఒ, లుగా మాఱుచున్నవి. వీనిని బట్టి ప్రాచీనభాషారూప మిదియని నిశ్చయముగా చెప్పుట కవకాశము చాలకున్నను సరళాక్షరములతో (simple vowels) గూడిన రూపములే సంయుక్తాక్షరములతో (diphthongs) గూడినవానికంటె ప్రాచీనములై యుండునని తలంపఁదగియున్నది.

తమి.	తెలు.	కన్న.	
ఇడమ్	ఎడము	ఎడ	
ఇలసు	ఎల	లేత	
ఇలదు	(ఎలదు)	లేదు	
చెవి	చెవి	కివి	
చెవిడు	చెవుడు	కివుడు	
చెడి	చెట్టు	గిడ	
కేడు	చెడు, కీడు, చేటు	కెడు	
కీఱు		కెఱు	to scratch
ఇఱంకు	ఎఱఁగు	ఎఱఁగు	to descend, to setdown as from a tree
కుట్టు	కొట్టు	కుట్టు	to beat
కొయ్	కొయ్యు	కుయి	to cut
కుఱి	గొఱ్ఱె	కుఱి	sheep
	కొఱుకు	కుఱుకు	to bite
కుడై	గొడుగు	కొడె	
	గుత్తి	కొత్తు	bunch
కునై	కొన	కొనె	point
కో, కోర్	గ్రుచ్చు	కో	to string
		కోవె, క్రోవె	pearls, bead, etc
ఉడల్	ఒడలు		
ఉళ్	లో	ఒళ్	
ఉఱి	ఒఱ	ఒఱె	
	గుఱ్ఱుకొట్టు	కొఱ (నిద్రాంగధ్వని)	to snore

ఇం దికారోకారములతో గూడిన రూపములే ఎకారొకారములతోగూడిన రూపములకంటె ప్రాచీనములుగా నున్నట్లీ రెండవతరగతి రూపములలో గలిగిన మార్పులను బట్టిగూడ మన మూహింపవచ్చును. అట్టి రూపములు తమిళ, కన్నడములందే తెలుగునందలివానికంటె హెచ్చుగా నున్నట్లగుపడుచున్నది. ఈపదములయందలి ఇకారోకారములు ఎకారొకారములుగ మాఱుటకు వానితరువాతి వర్ణముపై గనబడుచున్న వివృతాకారముయొక్క సాహచర్యబలమే కారణమై యుండును. అనగా సంవృతాచ్చులగు 'ఇ', 'ఉ'లు వానితరువాత వచ్చిన వివృతాకారసాహచర్యముచే వివృతములై ఎ, ఒ,లుగా మాఱినవనుట. ఇట్టిమార్పు విశేషముగ నాంధ్రశాఖలో ప్రబలినట్లగపడుచున్నది. తుళుభాషలో మఱియొక విశేషముకూడ కలదు. ఇతరభాషలలో కొన్ని పదములలోని ఎకారము తుళుభాషలో ఒకారముగ పలుకబడుచున్నది.

త.	వేండుమ్	తు.	బోడ్
త.	వెల్లి	తు.	బొల్లి

ఇచ్చటకూడ వకారము ముందుగా బకారమై, యాయోష్ఠ్యబకారము తాలవ్యఎకారమును ఓష్ఠ్యఒకారముగా మార్చివేసియుండును. మొత్తముమీద నీభాషలలో వర్ణసమీకరణ విధానము అనగా నొకవర్ణముయొక్క సాహచర్యమువలన సమీపమందలియితర వర్ణము మార్పునొంది తత్ప్రభావమునకు లోబడి దానితో సమత్వమును, లేదా సావర్ణ్యమును జెందుట విశేషముగాఁ బ్రబలినట్లు గానవచ్చుచున్నది.

ఇట్టి మార్పు కేవల మచ్చులవిషయమున నేకాక హల్లులవిషయమునను గాంచవగును. దక్షిణ హిందూదేశ భాషలలో సజాతీయములని చెప్పదగిన యనేకపదముల లో పదాదికకారము కొన్నిభాషలలో చకారముగ మాఱుచున్నట్లీక్రిందినిదర్శనమునుబట్టి మనకు తెలియ వచ్చుచున్నది. అనఁగా పదాదియందలి కంఠ్యకకారము లేదా కంఠ్యధ్వని తాలవ్యచకారము లేదా తాలవ్యధ్వనిగ మాఱుచున్నదనుట. ఈభాషలలోని యీ క్రిందిపదము లను గమనింపుడు:—

కన్న.	తుళు.	తమి.	తెలు.	
1 కిచ్చు	కిచ్చి	కిచ్చు	చిచ్చు	Fire
2 కెట్ట	కెట్ట	కెట్ట	చెడ్డ	Bad
3 కిఱు / కిత్తు	కిన్ని	చిఱు	చిఱి / చిఱు	small
4 కిలబు / కిలుబు / కిలిబు	కలెంగు	కళిమ్బు / మ.కిళర్పు	చిలుము	rust
5 కివి	కెమి / కిబి	చెవి / మ. చెవి	చెవి	ear
6 కివుడు	కెప్పు	చెవిడి	చెవుడు	deafness
7 కిళి	గిళి	కిళి / మ.కిళి	చిలుక	parrot
8 కెన్నె	కెప్పె	కన్నం	చెక్కిలి / చెక్కు	cheek
9 కెం / కెచ్చనె	కెంపు	చెం / కెంపు ruby	చెం / చెన్న	red
10 కెఱె	కెరు	చెఱై	చెఱువు	tank
11 కల్లె	...	చిల్లి	చిల్లి	a piece a splinter
12 కెళతి	...	చిలది	చెలి	a female companion
13 గిడ	...	చెడి	చెట్టు	a tree
14 గేణ్ / గేణ	గేణ్	చాణ్ / శాణ్	జేన / జాన	a span
15 కై-కహి	కైపె	కశపు / కైప్పు	చేదు	bitterness
16 ...	...	కిట్టం	చిట్టము	rust, ore stone
17 కెల	కెల	చిల / శిల / మ. చిలె	...	some
18 కీర	...	కీరై / మ. చీర	కూర	greens
19 కయ్	...	కయ్	కయి / చెయ్యి	hand

ఇట్టిమార్పు కొన్ని ధాతువులలోగూడ గానవగును.

19 a ...	...	కీఱ్పు	చింపు	tear off
20 కిఠ	...	చిరై	...	to slave
21 కిడు / కెడు	కెడు	కెడు	చెడు	to get spoiled
22 కెత్తు	కెత్తు	చెత్తుక్కు	చెక్కు	to chip to make thin
23 కెదుకు	...	...	చిలుకు	to stir
24 కెదఱు	...	చెదఱు	చెదరు	to scatter
25 కెయ్	...	చెయ్	చేయు	to do
26 కెర	...	...	చీరుట	to scratch with nails
27 కీ	...	చీల్ / మ. చీ	చీము / చీకు / చివుకు	to become pus
27 ...	...	కిత్తు / కింతు	చిందు	to hop, to leap about
28 ...	...	కిరంకు	చిరాకు	to be jaded fatigued
29 కెణకు	కెణకు	...	చెనకు	to provoke
30 కిముల్చు	...	...	చిముడు ?	
31 కెళర			చెలరేగు	to expand
32 కేఱు	శూర్పకరణే		చెఱుగు	to winnow

ఈ పదములలోని మార్పులనుగూర్చి విచారింపగా నిందలి పదాదికకారము తాలవ్యచకారముగా మారుటకు గల ముఖ్యకారణము ఈ పదములన్నిటిలోను నీకకారము తాలవ్య ఇ, కార, ఎ కారములచే ననుసరింపబడు

టరేమో యని తలంపవలసివచ్చుచున్నది. కంఠ్యకకారముపై వచ్చిన తాలవ్యములగు ఇ, ఈ, ఎ, ఏలు ఆకంఠ్యధ్వనిని తాలవ్యముగా మార్చియుండనోపును. కాని యిది సర్వ సామాన్యమని చెప్పుటకు నవకాశము లేదు. ఏలయనఁగా కొన్ని పదములలోని కకారము తాలవ్యకారానుసృతంబె యైనను ఇట్టిమార్పు పొందిన ట్లగపడదు. దీనినిబట్టి ఈ మార్పు భాషలో నెదోయొకకాలమున ప్రాధాన్యము వహించి తనప్రభావమును నెరపినదనిగాని, లేదా ఈపదములు మొదటినుండియు తాలవ్యాచ్చులతో గూడినవిగాక కొంతకాలమున కొకజనసంఘము నుచ్చారణమందు గలిగిన మార్పుచే తాలవ్యాచ్చులతో గూడినవైనవని గాని చెప్పవలసియుండును. అట్టిపదములను కొన్నిటి నీక్రింద బొందుపఱచుచున్నాడను.

తమి.	కన్న.	తెలు.	
కెట్టం	గడ్డ	గడ్డము	Chin
కెట్టి	గట్టి	గట్టి	Firmness
కెచ్చుకాయ్	గజగ	గచ్చకాయ	
కెచ్చం	గెజ్జె	గజ్జె	Tinkling anklet
కిళఱు	కెళరు	కెలకు	to poke, to dig up, stir
కిల్లు	చివుటు } చిమటు }	గిల్లు	to pinch pluck
కిటికి	కిటికి	కిటికి	window
కిట్టు గిట్టు	కిడై మ.కిడై	కిట్టు గిట్టు	to touch
కీఱు	కీఱు	గీరు గీచు	to scrape rub off
కీజ్	...	క్రిందు (cf క్రీ గాలు)	
కెడువు	...	గడువు	term, fixed time
కెళై	...	గడ	pole
కెంపళై	గంపె	గంప	basket
కేల్ } కెలి_త్తల్ }	గెల్	గెలుచు	to conquer

ఇట్లు తాలవ్యములుగా మార్పునొందని పదములలో సామాన్యముగా 'క'కార మాంధ్రకన్నడములందుఁ 'గ' కారముగా పలుకబడుచున్నట్లు వీనినుండి మనము గ్రహింపవచ్చును. గడ, గంప, గజ్జె మొదలగు కొన్ని పదములలో కంఠ్యముపై నకారమె తెలుగులో కనబడుచుండ తమిళమున 'ఎ'కారము కనబడుటయనునది యొక వేళ యిటీవలికాలమున జరిగినమార్పై యుండినను ఉండవచ్చును. ఏలయనగా పదాదికంఠ్యముపై అకారముగల సంస్కృతపదములు తమిళమున నుచ్చరింపబడునపుడు 'ఎ'కారముతో గూడినవగుచున్నవి.

సం. గజ—త. కెజం
సం. గర్జిత—త. కెర్చితం

ఈ కారణముచే తెలుగులోని గజ్జ, గచ్చకాయ గడ మొదలగుపదములు ప్రాచీనకాలమునుండియు 'అ'కారముతో గూడినవిగ నేయుండ, నిటీవలికాలమున తమిళమున నెత్వముతో పలుకబడు నలవాటు ఏర్పడియుండునని యూహింపదగియున్నది.

దీనినిబట్టి చాలవఱకు మూలభాషలో ఇ, ఈ, ఎ, ఏలతోగూడిన పదాదికంఠ్యధ్వనులే, అనగా తాలవ్యాచ్చులు పరముగాగల కకారాదులే తాలవ్యధ్వనులుగ ననగా 'చ'కారాదులుగ మాఱినవి గాని తాలవ్యాచ్పరకములుగాని ధ్వను లట్లు మారక సారళ్యమును మాత్రము (Softened) బొందినవని తెలియుచున్నది. ఈ కంఠ్యధ్వనులు తాలవ్యములుగ మాఱుటకు వానికి బరములైన తాలవ్యాచ్చులప్రభావమే (influence) కారణమని నిశ్చయించుటకు మున్ను తాలవ్యేతరాచ్పరకము లగు సజాతీయపదములను మఱికొన్నిటిని పరికింతము గాక! ఈక్రిందిపట్టికలోని పదములలో నీతాలవ్యధ్వనులు గానరాకుండుట గాక పైపదములలోవలె గొన్నిటిలో పదాదికకారము సరళత్వమునుబొంది 'గ'కారమగుటమాత్రము గానవగును.

కన్న.	తమి.	తెలు.	
కక్కు	...	కక్కు } (కఱకు) }	Irregular surface, a notch

కక్కు	కఱ్కు	కక్కు	to vomit
కణ్	కణ్	కన్ను	
కంకి	...	కంకి	an ear of jola
కట కట్ట కడ ...		కడ	end. corner
కడల్	కడల్	కడలి	sea
కట్టు	కట్టు	కట్టు	to bind
కత్తు	కఱుత్తు	కుత్తుక	neck, throat
కత్తై కత్తి	కఱుతై	గాడిద	an ass
కదలు	కదలు	కదలు	to move
కన కనసు	కనవు	కల	a dream
కనర్	...	కనరు	bitter
కనలు	కనల్	కనలు	to burn
కన్దు	కన్ఱు	కన్దు	a calf
కప్పం	కప్పం	కప్పము	tribute
కప్పు	కప్పు	కప్పు	to cover
కప్పు	కఱుప్పు / కప్పు	కప్పు / cf కాఱు	blackness
కమ్బు	కమ్బు	కమ్మ	beam
కరై	కరై	కర	bank, shore
కల్	కల్	కల్లు	stone
కసవు	...	కసవు	rubbish sweepings
కళ్ళ కళ్ to steal	కళ్ళ	కల్ల / కల్లరి	
కాయ్	...	కాయు కాపు	to protect
కాడు	కాడు	కాడు	forest
కాదల్	కాదల్ / మ. కాతల్	గాదిలి	affection
కాల్	కార్	కారు	black rainy season
కాల్	కాల్	కాల్	foot
కావి	కావి	కావి (రంగు)	red earth
కుట్టు	కుట్టు	కొట్టు	to beat
కుడి	కుడి	cf కుడిచి గ్రోలు	to drink
కుదురు	...	కుదురు	fit

కుఱ	...	కుదియు	to become tight
కుయ్ కొయ్ కోయ్		కోయు	to cut
కురుడ	కురుడ	గ్రుడ్డి	blind
కురుళ్	కురళ్ / కురుళ్	కురులు	a curl
కుఱళ్	కుఱళ్	కుఱు (చ)	shortness
కుఱుకు	కొఱె	కొఱుకు	to bite
కుయ్య	...	కొయ్య	wood
కుఱుచు	...	గుజ్జు	dwarfish
కుగ్గు కుగ్గు	...	క్రుంగు	to shrink bend.
కులుకు	కులై	కులుకు	to shake
		to be agitated	the body as in dramatic action
కుళి	గుఱి	గొయ్యి	a hallow pit
కూగు	కూగు / కూవు	కు. తె. / కూయు	to cry aloud
కూడల్	...	కూడలి	a junction
కూడు	...	కూడు	to join
కూన్ / కూను / గూను	...	గూని	a hump
కూర్	కూర్	కూర్చు	to be attached
			to lose
కూలు	కూలు	కూలు	to fall down
కూసు	కుంజు	కూన / కూతు	a young one, daughter
కొద	...	కొదమ / కొద	youth tenderness
కొడై	కొడై	గొడుగు	umbrella
కొండెయ	కుణ్డియ / మ. కుఱళ	కొండెము	back biting
కొత్తు	...	గుత్తి	bunch
కొనె	కునై, కొనై	కొన	point extremity

కొబ్బరి	కొప్పరై	కొబ్బరి	
కొమ్ము	కొమ్ము	కొమ్మ	a horn
కొమ్ము } కొమ్మె }	కొప్పు } కొమ్ము }	కొమ్మ	the branch of a tree

కొన్ని ధాతువులు

కొఱె	కుఱై	కొఱ	to cut, smallness remainder
కొళ్	కొళ్ } కొళ్లు }	కొను	to take
కో	కో } కోర్ }	క్రోవ	
	cf ముత్యాలకోవలు		to string
	గ్రుచ్చు		to thread

కొంకు=కౌటిల్యే　　cf కొంకి　to get crooked
కరగు=విలీనే　　కరగు
కడంగు=ఔత్సుక్యే　　కడంగు
కర్చు=ఖదనే　　కరచు
కుట్టు=తాడనే　　కొట్టు
కడి=ఖండనే　　కడికండలు
కడే=మథనే, అవసానేచ　　కడగూడు } కడయు } = వచ్చు
కాణ్=దర్శనే　　కను
కందు=గతకాంతౌ　　కందు
కొందు=క్షయే　　కుందు
కుప్పు=పుంజీకరణే　　కుప్ప
కుమ్మ్=ముసలక్రియాయాం　　కుమ్మ
కొయ్=లవనే　　కోయు
కూర్=స్నేహే　　కూర్చు
కనర్=అపక్వరసనే　　కనరు
కిళిర్=హయస్వనే　　సకిలించు?
కవి=ఆచ్ఛాదనే　　కవియు
కాను=దాహే　　కాచు

ఈపైజూపిన సజాతీయపదములను, ధాతువులను బట్టి చూడగా సామాన్యముగా 'క'కారము—లేదా, కంఠ్యహల్లునకు ఇ, ఈ, ఎ, ఏ, ఐ—అనగా తాలవ్యాచ్చులు పరమైనపుడే అది తాలవ్యహల్లుగా - చకార, జకారములుగా మార్పునొందినట్లును ఆకంఠ్యహల్లునకు తాలవ్యేతరములగు నచ్చులు పరమైనపు డాకంఠ్యధ్వని యన్ని భాషలలోను గూడ నట్లే నిలచియున్నట్లు గానవచ్చుచున్నది. ఈ నియమము చాలవరకు అన్ని భాషలకు సమానములను మూలధాతువులలో గూడ గానవచ్చుచుండుటచే నీసంప్రదాయ మతిప్రాచీనకాలముననే బయలుదేరినదనియు గూడ తలంపవచ్చును. కాని యిది యాంధ్రశాఖలో హెచ్చుగను, తమిళ మళయాళములలో స్వల్పముగను గానవచ్చుచున్నదే గాని, కన్నడభాషలో నంతగా వ్యాపించినట్లగపడుటలేదు. కావుననే తమిళాంధ్రములను, అందు విశేషముగా నాంధ్రమునను గానఁబడుచున్న తాలవ్యచకార మాదివర్ణముగా గలిగిన పదములకు సజాతీయంబగు కన్నడపదము సామాన్యముగా కంఠ్యాదియై యుండుటను పైపట్టిక మనకు జూపుచున్నది. ప్రాచీనభాషలో నీపదములు కంఠ్యాదులే గాని తాలవ్యాదులని చెప్పుట పొసగదు. ఏలయనగా తాలవ్యస్వరకములగుటచే తాలవ్యములనగా మారిన పదాదిచకారముతో గూడిన పదములు, ధాతువులు విశేషము గాగల ఆంధ్రమునందు గూడ తక్కినభాష లన్నిటి యందువలె నాపదకుటుంబమునకుఁ జెందిన కొన్ని రూపములలో కంఠ్యకకారమే కనఁబడుచుండుట వలన కకారాదిపదములే ప్రాచీనములని చెప్పుగాని చకారాదులే ప్రాచీనములై యుండి కారణాంతరముచే నందలి చకారము కకారముగ మాఱినదని చెప్పుట కవకాశమేమియు నగపడదు. కయిశబ్దము చూడుడు. ధాతువు — కెయ్, గెయ్ అనునది. ఇది తెలుగున 'చేయు' ధాతువైనది. ఏ పనిచేయుటకైన నుపయోగించునది గావున హస్తము 'చేయి' అయినది. కాని ఇదియే దీని ప్రాచీనరూపమా యని పరిశీలించినచో 'కయి' రూపంబొకటి హస్తపర్యాయమై యేకవచనమునను బహువచనమున 'కేలు' అను రూపమును వ్యవహారసిద్ధంబులై యున్నవి. తక్కిన సజాతీయభాషలలో 'కయి' రూపమే ప్రాచుర్యమును వహించియుండుటను జూచియేయున్నాము. తమిళమున తెలుగునవలెనే 'శెయ్' ధాతువు 'శెయ్' అనురూపముతో

గానవచ్చుచున్నను కన్నడమున 'కెయ్' 'గెయ్'ధాతువులును, 'కయి' రూపమునేగాని తాలవ్యముతోగూడిన రూపమే లేకపోవుటచే ప్రాచీనధాతురూపము కకారవిశిష్టమే యనియు దానినుండి యేర్పడిన 'కయి'యే చెయ్-చెయ్యిలకంటె ప్రాచీనమనియు మనము నిశ్చయింప దగియున్నది. కన్నడభాషలో తాలవ్యచకారముతో గూడిన రూపమొక్క 'చేయు'ధాతువునకే కనబడకపోవుట లేదు. ఇట్లు తాలవ్యములుగ మారిన పదాదికంఠ్యధ్వనిగల సజాతీయపదము లేవియుగూడ తాలవ్యాదులై కన్నడమున గానవచ్చుట లేదు. అట్టిపదములన్నియు కంఠ్యాదులేయై యాభాషలోగావచ్చుచుండెననుటకు పై పట్టికయే నిదర్శనము. ఈకారణముచే నీధ్వనికి లేదా యీపదములకు సంబంధించినంతవరకు కన్నడభాషయే ప్రాచీనభాషారూపములను నిలుపబెట్టి కొనినదని మనము నిశ్చయింపవచ్చును.

కాని యీభాషలోగూడ నొక్కపదములో నీ మార్పు కనబడకపోలేదు. 'కెయ్' గెయ్‌లు చేయ్‌గా మారకపోయినను కెం-చెం చెన్నుగా మార్గము మాఱినదగుటచే వ్యాకరణములలో నీమార్పొక ప్రత్యేకసూత్రమున విధింపబడవలసి వచ్చినది. శబ్దమణిదర్పణమున,

"జని యిసుకెం కెచ్చనె చె
చ్చనె పచ్చనెగళ చకారదోళ్ మత్వం కె
చ్చనె యాదిగె చత్వం మే
ణినెతర మకారమిత్వక్కె-త్వం.

కెచ్చనె, బెచ్చనె, పచ్చనె, పదముల చకారమునకు మత్వము విధించుచు కెచ్చనె పదమునకుమాత్ర మాది 'క'కారమునకు 'చ'త్వవిధానముకూడ చేయబడినది. అనగా కెచ్చనె+నీర్=కెం+నీర్=కెన్నీర్ (చెన్నీర్). బెచ్చనె (=వెచ్చన)+నీర్=బెం+నీర్=బెన్నీర్. పచ్చనె+నీర్ =పం+నీర్=పన్నీర్. కెచ్చనె+కణిగిలె=చెంగణిగిలె (cf కెందమ్మి, చెందొవ) కెచ్చనె+తెంగు (=త. తేంగాయ్; తె-టెంకాయ)=చెందెంగు.

ఇట్టి 'చెంగణిగిలె' మొదలగు కొన్ని రూపములలో దప్ప నీభాషలో కకార కంఠ్యధ్వని తాలవ్యస్వరకమైనను తక్కిన కొన్ని భాషలలోవలె తాలవ్యచకారముగ మార్పునొందక, సామాన్యముగా ప్రాచీనభాషారూపమువనే నిలచియున్నట్లగపడుచుండుటచే తను, తెలుగున విశేషముగను, తమిళమున తెలుగునందుకంటె కొంచెము తక్కువగను నీమార్పు ప్రాచుర్యమునువహించియుండుటచే, తెలుగు తమిళములు కన్నడమునుండి విడిపడినపిదపనే యీమార్పున కనువగు పలుకుబడి యీ జనసంఘములలో ప్రారంభించియుండునని తలంపవలసి వచ్చుచున్నది. పైని జూపిన సుమారు ముప్పదిపదములు గల పట్టికలో కన్నడమున కకారముతోగూడినపదముల కన్నిటికిని తెనుగున చకారముతో గూడిన రూపములే గానవచ్చుచుండ తమిళమున సుమారు సగము పదములు మాత్రమే తాలవ్యముతో గూడిన రూపములుగానున్నవి. తాలవ్యస్వరకములైన కంఠ్యధ్వనులు తాలవ్యములుగ మాఱుటనుబట్టి "తాలవ్యీకరణ విధానము" (Law of Palatalization) నీద్రావిడభాషలలో నొక 'భాషానియమము'గా మనము గ్రహింపవచ్చును. ఈసూత్రవ్యాప్తిమాత్రము బట్టిచూచినచో కన్నడము తమిళాంధ్రములకంటె ప్రాచీనభాషారూపముల నెక్కుడు జాగరూకతతో నిలుపుకొన్నదనికూడ మనకు దెలియవచ్చుచున్నది.

ఇండో యూరోపియన్ కుటుంబభాషలలో గూడ నిట్టి స్వరసూత్రమే (Sound law) కొంతపని చేసిన ట్లగపడుచున్నది. ఆ భాషలలో సయితము తాలవ్యస్వరకములకు కంఠ్యము లనేకపదములలో తాలవ్యములుగ మాఱుట తటస్థించినది. దీనిమూలమున పాశ్చాత్యశబ్దశాస్త్రజ్ఞులు ఇండోయూరోపియన్ కుటుంబమునకు జెందిన భాషలకు గల సంబంధమును వాని సన్నిహితత్వమును గూడ కొంతవరకు నిర్ణయింపగలిగినారు. ఈకుటుంబమునకు జెందిన ఆర్యన్, ఆర్మీనియన్, ఆల్బేనియన్, బాల్టోస్లెవోనిక్, లాటిన్, గ్రీక్, ట్యూటానిక్, కెల్టిక్ మొదలగు భాషాశాఖ లతిచిరకాలము క్రిందటనే మొట్టమొదట రెండుశాఖలుగా విడిపోయి యటుపిమ్మట నింకను భిన్నశాఖలుగా మాఱిపోయినవని ప్రాచీనభాషలోని కంఠ్యధ్వను లీభాషా

శాఖలలో పొందిన మార్పులనుబట్టి నిశ్చయించుచున్నారు. ఈ యాదిశాఖలకు దేశవిభాగమునుబట్టి పూర్వపశ్చిమశాఖలనియు (Eastern & Western) సాధ్వనికి గలిగిన మార్పునుబట్టి—శతం-కెంటుం-భాషలనియు పేరిడిరి. 'నూరు' అను నర్థముగల ప్రాచీన భాషలోని 'కెంటుం' అనుపదము పశ్చిమ భాగమందలి లాటిన్, గ్రీక్, కెల్టిక్ భాషలలో వరుసగా 'కెంటుం, ఎకెటాన్, హండ్' అను రూపములను బొంది యేదో విధముగా కంఠ్యధ్వనిని నిలుపుకొనియుండ ప్రాచ్యభాషలను జెందు, సంస్కృతము, బాల్టో స్లెవోనిక్ భాషలలో నీ కంఠ్యకకారము 'ఊష్మము'గా మాఱిపోయి వరుసగా, 'సెతెం, శతం, జింతాస్' మొదలగు రూపములను బొందుటచే నీ ప్రాక్పశ్చిమభాషల కీ ధ్వని ననుసరించు విషయమున చిరకాలముక్రిందటనే భేద మేర్పడినదని తెలియుచున్నది. ఇంతేకాక పశ్చిమ భాషలలో—బహుశః ప్రాచీనార్య ఇండో యూరోపియన్ భాషలో గూడ నిప్పుడు సంస్కృతమున గలయట్టి 'చ' కారమువంటి తాలవ్యధ్వని యున్నట్లగపడదు. సంస్కృతమునను,—సంస్కృతముననేగాదు — ప్రాచ్యభాషలలో నీ తాలవ్యచకారము కనబడుచున్న పెక్కుపదములు పశ్చిమశాఖకు జెందినభాషలలోని సజాతీయరూపములలో (Cognate forms) కంఠ్యకకార మేకనబడుచున్నది. ఇందుకు నిదర్శనముగా నీక్రిందిపదములను జూడుడు.

సం. పంచ	లాటిన్ పెంక్వె—గాథిక్, ఫిమ్ఫ్.
సం. చత్వార్	లాటిన్—క్వటోర్
సం. చరః	గ్రీక్—కెర్నోస్
సం. జఠరః	గాథిక్ కిల్థై
సం. ఓజస్	లాటిన్ ఔగెఒ
సం. జనః	లాటిన్ గెనోస్
సం. జజాన	లాటిన్ గెగ్నో

కాని మఱికొన్ని పదములు కంఠ్యయుక్తములుగనే యెట్టి మార్పు లేకయున్నవి.

సం. కర్కః	గ్రీ. కర్కినోస్
కారః	గ్రీ. కారుస్
కాలః	గ్రీ. కాలోస్
కతరః	గ్రీ. కొతెరోస్
యుగ్మం	గాథిక్ జూక్ ఇంగ్లీ యోక్
గౌః	గ్రీ. బౌస్ (బ=గ)
గిరిః	లిథూ. గిరియ

వెనుకటి పట్టికలోని పదము లట్లు తాలవ్యచకారములుగ మారుటకు గల కారణ మేమి యని విచారించినచో, మొదటిపట్టికలోని లాటిన్ మొదలగు భాషాపదములలో కంఠ్యధ్వనిగా గనబడుచున్న 'క' కారము తాలవ్యస్వరకం బగుటయు, రెండవపట్టికలోని కంఠ్యధ్వను లట్లుగాక, తాలవ్యేతరములగు నచ్చులు పరమందు గల వగుటయే యని మనము తెలిసికొనగలుగుదుము. ఇట్లు తాలవ్యాచ్చులు తమకు పూర్వమునగల కంఠ్యధ్వనులను తాలవ్యములుగ మార్చునట్టి విధానమునే యిండో యూరోపియన్ భాషలలో పరిశ్రమచేసిన శబ్దశాస్త్రజ్ఞులు (Indo European Philologist) 'తాలవ్యీకరణ విధానము' (Law of palatalization) అని చెప్పియున్నారు. ఇట్టి రెండు భాషాకుటుంబములలోను గూడ నీ మార్పొకరీతినే సంభవించియుండుటచే వాచికావయవముల ప్రయోగసరణి ననుసరించి భాషలలో గలుగుచుండు వికారములు ఒకవిధముగ స్వాభావికముగు పద్ధతినే జరుగుచుండునని తలంపదగియున్నది.

ఈ కంఠ్యధ్వనులు పొందు మార్పునుబట్టి ఇండో యూరోపియన్ భాషల సంబంధమును నిర్ణయించినరీతిని ద్రావిడభాషల సంబంధమును గూడ నిర్ణయింపదలచినచో తుళుకన్నడములు తక్కినభాషలనుండి, ప్రాచీన భాషనుండి చిరకాలముక్రిందటనే విడిపోయియుండునని యూహింపదగియున్నది. కాని యిది యింక నితర ప్రబలసాక్ష్యముచే ఋజువుచేయబడునంతవరకు నిశ్చయింప వీలులేదు.

గంగాలహరి

చెఱుకుపల్లి శివరామయ్య గారు (వాణీసేవాసంఘము)

[వెనుకటి సంచిక తరువాయి]

కమలా భర్తృపదాంబుజంబె జననాగారంబు-సంవాసమా!
ప్రమథాధీశ జటానికేతనమునన్-వ్యాసంగమా! పాపకూ
పములన్ గూలిన మానవాళులఁ దరింపన్ జేయు కార్యంబె-లో
కమునం దెయ్యెడ నీకు లేదు బహుళోత్కర్షంబు? మందాకినీ!

శైలాగ్రంబులనుండి పాఱు తటినీసంఘంబులం దెద్ది నీ
లీలన్ శూలి జటాగ్రమం దలరె తల్లీ! ఏనదీతోయమా
శ్రీలోలాంఘ్రిసరోజమందు వసియించెన్ నీవలెన్ దేని నీ
తోలేశంబును సాటిదెత్తురు కవిస్తోమంబు భాగీరథీ!

స్థిరచిత్తుండయి పద్మసూనుఁడు సమాధిన్ బూనినన్ హాయిగా
హరి నిద్రించిన శేషతల్పమున నాట్యంబుల్ భవానీమనో
హరుఁడున్ జేసిన నేమి దానములు ప్రాయశ్చిత్తముల్ చాలు నీ
ధర నేరెన్ దలపోతు నర్థిజనమందారంబు నీవుండఁగన్.

పతితుండన్ రోగతప్తుఁడ నపారభవాబ్ధినిమగ్నుఁడన్ సమా
శ్రితుఁడను తృష్ణచేత వగఁ జెందెడివాఁడ సుతుండ లోకపూ
జితవు నిరంతరం బమృతసింధువవున్ పరమౌషధంబ వా
శ్రితులను బ్రోచు నీదఱికిఁ జేరితి నెట్లు సముద్ధరించెదో?

పరమంబైన భవత్కథామహిమయే వ్యాపింప ధాత్రిన్ భయం
కర కోలాహలముల్ నశించె యమలోకంబందునన్ కాలకిం
కరు లెందో జని రట్ల ప్రేతహరణాకాంక్షన్ సురావాస సుం
దరమార్గంబులఁ గూల్పఁజొచ్చెను విమానవ్రాతముల్ వింతగన్.

మాలోనన్ దినవర్ధమాన మగు కామక్రోధ జాత జ్వర
జ్వాలాజాలము సంతతోజ్జ్వలితమై బాధించు మమ్మున్ మరు
జ్ఝాలోత్తుంగ తరంగఖేలనముచే సంఛిన్నమై లేచు నీ
లీలాంభఃకణరాసులే సతము తల్లీ! తాపముల్ మాన్పుతన్.

పరికింపన్ భువనాళికిన్ భవనమౌ బ్రహ్మాండభాండంబు వి
స్ఫురదుత్తుంగ తరంగమాలికలలోఁ బూబంతిచందంబునన్
దొరలన్ శూలిజటాప్రదేశమున సంతోషంబుచే మించి కా
పురమున్ జేయు భవజ్జలప్రతతి రూపున్ మాపు మా పాపముల్.

ధర నెవ్వాని సముద్ధరించునెడ తీర్థంబుల్ త్రపన్ గాంచునో
పరమేశాది సుపర్వులెల్ల శ్రవణద్వంద్వంబులన్ మూసికొం
దరో! ఆముష్కరు నన్ను దోషరహితాత్మున్ జేయ పాపాత్ములన్
పరిరక్షించెదమంచు లోఁదలఁచు గర్వం బీగ్గదే వారికిన్.

కరుణవహించి లోన శునకంబులఁ జంపెడివారు సైతమున్
దురితమటంచు మాను పలుదోసము లన్నిట కేనుజూడ తె
ల్లిరో! నిలయుండ నిట్టి నను లీలగఁ బ్రోవఁ దలంచుచుండఁగన్
నరపశువా సమర్థుఁడు ఘనంబుగ నిన్నిల సంస్తుతింపఁగన్?

తల్లీ! ఎవ్వానినుద్ధరింప భువికంతన్ విస్మయభ్రాంతి సం
ధిల్లం జేయునో! అట్టి పాపి యొకఁడేనిన్ గానరాఁ డంచు నీ
యుల్లంబందుఁ గలంతఁ జెందెదుగదా! ఒక్కండ నీకుండు లో
టెల్లన్ మాన్పఁగ సిద్ధమైతి కరుణాదృష్టిన్ బ్రసాదింపుమా.

తలపఁగరాని సేవనయు దబ్బరలాడుట దుష్టవాదముల్
సలుపుట నాత్మలోఁ జెడుతలంపులఁ బెంచెడు మద్గుణంబులన్
పలుమఱు గాంచియున్ వినియుఁ బాపునిఁ బ్రోవఁగ నీవుగాక న
న్యులు ననుజూతురే? సురమనోహరవాహిని, లోకపావనీ!

అనిశము తావకీన విమలాకృతిఁ గాంచఁగ నేరనట్టి యా
జనులకుఁ గన్ను లెంతటి విశాలములైన ఫలంబుగాదు నే!
జననిరో! నీమనోహరవిశాలతరంగకలస్వనంబులన్
వినకయె యుండినన్ జనులవీనులకే యవమాన మిద్దరన్.

అమరావాస సుఖంబుగాంతురు ప్రపుణ్యాత్ముల్ యథేచ్ఛన్ విమా
నములం దెక్కుచుఁ బాపులెల్ల నరకాంతర్మగ్నులై పాపకూ

పములన్ గూలుదురంచుఁ జేయఁబడు నేర్పాటెల్ల తల్లీ! జనా
ఘములన్ మాన్పెడి నీవు లేని కుజనగ్రామంబునం దొప్పెడిన్.

గురుదారాగమనంబుఁ జేయు ఖలులున్ గోబ్రహ్మహత్యాది దు
ర్భరపాపప్రవిభిన్నచిత్తులు సురాపానప్రియుల్ స్వర్ణత
స్కరులున్ మేనుదొఱంగ నీజలములో స్వర్గంబునన్ పుణ్యులం
దఱికన్నన్ సుఖయింత్రు దివ్యపదవిన్ మన్నింప బృందారకుల్.

ప్రసవాలభ్య మనోజ్ఞసౌరభము నాఘ్రాణించుచున్ మన్మథ
వ్యసనాభీల శరక్షతాత్ములకుఁ బ్రాణాపాయమౌ మారుతం
బసమానంబయి తావకీనవిమలోద్యద్వీచికాసంహతిన్
వెస పూతం బొనరించుచుండెగద! దేవీ! మూఁడులోకంబులన్.

ఇహవాంఛల్ సమకూర్పు సజ్జనులు స్వర్గేచ్ఛల్ ప్రసాదింతు స
న్మహితాత్ముల్ గల రెందఱెందఱొ జగన్నాథుండుమాత్రం బిలన్
రహి నీమీఁదనె రెండులోకముల భారంబంతయున్ మోపుచున్
బహుళానంద సుషుప్తిలో మునిఁగె నంబా! లోకసంభావనీ.

పరమవ్రాత్యుల నీచులన్ పతితులన్ పాపంబులన్ నీకు నె
క్కురణిన్ బ్రోచెడి ప్రేమవీడఁగ నశక్యంబౌనొ! యారీతి నే
ధర నాకున్ దురితంబుఁబాయఁగ నసాధ్యంబయ్యె నూహింప నె
వ్వరికిన్ లోకమునందు నైజగుణమున్ బాయంగ శక్యంబొకో.

పటుసంధ్యానటనంబుఁ జేయు గిరిజాప్రాణేశు చంచజ్జటా
తటలోలల్లహరీకరాభినయమున్ దద్దివ్యజూటాంతరో
త్కటఖేలజ్జలపూర ధంధమరువాద్యభ్రాజితంబౌ వియ
త్తటినీతాండవకృత్యమెల్ల పుడు మాతాపంబులన్ మాన్పుతన్.

క్షేమలాభంబులను గల్గఁ జేతువనుచుఁ బెట్టుకొనియుంటి నాశచే వీడినంత
నణఁగు విశ్వాసము జగత్త్రియంబునందు నగు నిరాధారమమ్మ నిర్వ్యాజకరుణ.

అవిరళప్రేమచే నలరు నర్ధశరీరుని దివ్యమౌ జటా
భవనమునుండి జాఱి వడి పాపటపైఁ బడినంత నైజమౌ
సవతితనంపుమూడ్కలను శైలజ చూచుచుఁ బైకి హస్తప
ల్లవమున జిమ్ము తావ కవిలాసతరంగము లింపుమీఱెడిన్.

అర్థిజనకల్పవృక్షంబ వయినకతన-నెందఱెందఱో నిన్ను భజించుచుంద్రు
నేనుమాత్రంబు సహజామితానురాగ-భరితుఁడనుసుమ్ము! తల్లి, నీపాదమాన.

అమ్మరో! ఫాలపట్టికలయందు నలంకరణంబుఁ జేయుమా
త్రమ్మున మానవాళులకు తాపతమిస్రము భానురశ్మిచం
దమ్మున మాన్పి ధాతృలిఖితంబగు దుర్లిపి నూడ్చివేయు పూ
తమ్మగు నీదు మృత్తికయె దారుణదుఃఖములన్ హరించుతన్.

భవతాపాస్పదులైన జానపదులన్ బ్రాంచత్ప్రసూనాళి కై
తవవృత్తిన్ గని గేలిసేయుచు సుగంధవ్రాతసంపత్తిచే
భువియందున్ మధుపాళి నిత్యమలినంబుల్ మాన్పు మందాకినీ
సవిధక్ష్మారుహముల్ మదీయసఖులై సంతోషముం గూర్చుతన్.

కొందఱు కష్టదైవముల గొల్చుచునుండిరి మేటిజన్నముల్
కొందఱు చేయుచుండి రిఁకఁ గొందఱు సన్నియమవ్రతంబులన్
బొందుచునుండి రే నెపుడు పొందుగ తావకనామకీర్తనా
నందమునన్ జగంబును తృణంబుగఁజూచుచునుంటి తల్లిరో!

అరయ పుణ్యపూరుషుల కాశ్రితభక్తులకెల్ల మేలుచే
కూరుచు వేల్పులెందఱొనగూడరు పుట్టినదాది పున్నెమే
కూరిమిజేయరన్ వెతలగుందెడి పాపజనావళిన్ నిరా
ధారుల నీవుగాక మఱి ధాత్రిని నెవ్వరు బ్రోతు రమ్మరో!

పరమానందముతోడ నీకడ పయఃపానంబు గావించి ము
ష్కరులౌ నేస్తులతోఁ జరింపఁ జని విశ్రాంతిన్ దరిన్ గొంటి స
త్కరుణన్ మేల్కొనియున్న నన్ను భవదుత్సంగంబునం దుంచి ని
ద్దురపుచ్చంగదె మందమారుతములందున్ దేహ ముప్పొంగఁగన్.

బాలేందుఁ ముకుటంబునన్ ఫణులతో బంధించుచున్ వేగమే
లీలన్ వెన్నడుమున్ బిగింపు మిఁకఁ దల్లి ! లోకసామాన్యవేషం
చాలోచిఛ్ఛి హసింపఁగా వలదు కాసంతన్ జగన్నాథునిన్
పాలింపన్ ధరణిం బిదే తడయకన్ బాపాత్ము రక్షింపవే.

శరదమృతాంశు సన్నిభము చంద్రకళా విలసత్కిరీటమున్
స్ఫురితసుధోపమాంబర విభూషణముల్ కరమందు కుంభమున్
వరమభయాబ్జముల్ మకరవాహనవై చెలువొందు నిన్ను సం
స్మరణముఁ జేయువారి కవమానము లెన్నఁటికైనఁ గల్గునే.


దరహాసావన కాంతిపూరముల చేతన్ ఘోర సంసార దు
ర్భరవహ్ని చ్ఛటలన్ తపించునరులన్ రక్షించుచున్ జన్మదా
దరణీదోర్జ్వల చంద్రికాతతిఁ జమత్కారంబులన్ జేయు నా
సరసీజేక్షణ శంతనాంగన సదాసౌఖ్యంబులన్ గూర్చుగన్.

మాతా శ్రీ మన్త్రము; లౌషధంబులకు సామర్థ్యంబు లీల్లెన్; సుధా
సారంబెల్ల నశించె; మేల్గరుడపచ్చల్ క్రుంగె; స్వర్లోకసం
చారుల్ భీతిలి; రార్తిమునిగితి; భవజ్వాలాప్రభావంబులన్
వారింపంగదె! కాళియాహిత పదాబ్జద్వంద్వసంతానసీ!


ప్రమథాళిన్ గజచర్మమున్ నిజఫణివ్రాతంబు నందీంద్రున్
ప్రమథాధీశ్వరుఁ డొడ్డి జూదమున సర్వమ్మోడుచున్ దానె సం
దెమునం దోఁగఁ దలంచి శైలతనయన్ వీక్షింప లేనవ్వులన్
భ్రమతన్ దోరెడు నీ తరంగనటనారంభంబె మమ్మేలుతన్.

శివ జటాజాలకతల విభూషితశుభాంగ-కలుష చయభంగ విభాసురంగ తరంగ
భక్తపోషణ తత్పరాపాంగ గంగ-క్షితిని దురితము లడఁచి రక్షించుగాత !

ఘనయశోండు జగన్నాథకవివరేణ్య-విరచితం బగు గంగాలహరిని జదువు
వారికఖలాయురారోగ్యవైభవాలి-శయము లొనగూడు భువిని నిస్సంశయముగ.



సముద్రతీరము-సింహళము



(పైభాగము) ఇసురుమునియ కొండపైగల దేవాలయము

(నడుమ) చంద్రకాంత సోపానములు

(క్రిందిభాగము) జేతవనారామమునందలి డాగోబా-సింహళము



ఏనుగుల నీరాటము-సింహళము



మౌంటులిపీనియా హోటలువద్ద సముద్రప్రాంతము-సింహళము

చతుర్థాంకము

రంగము ౧

స్థానము:—విశ్వపతిమందిరము

సమయము:—ఉదయము

(విశ్వపతి సర్వసేనాధిపతి దర్జాన ముస్తాబు చేసి కొనుచు ప్రవేశము.)

విశ్వపతి:—ఏమిటీ అపశకునము? ప్రొద్దుననే కార్యాలయమునకు పోవువేళ నీ దాసి ప్రత్యక్షమైనది! (దాసిదీనావదనముతో ప్రవేశము.) ఏమి, బదరికా! ఇట్లు వచ్చితివి? రాణి శుదయాలంకార మెవరు చేయుచున్నారు!

దాసి:—పూర్వపుదాసియే.

విశ్వపతి:—నీవేల చేయలేదు?

దాసి:—నన్ను చేయనీయలేదు. తిమ్మరుసు మంత్రిగారు తనను నియోగించినారట. వారు చెప్పవలెను కా నా యుద్యోగ మెవరిని చేయనీయదట.

విశ్వపతి:—నిన్ను మేము నియోగించితిమని చెప్ప లేదా?

దాసి:—చెప్పితే, నవ్వి యూరకుండె. నాకు కోపమువచ్చి బయటికి గెంటపోయాను. ఇద్దఱము పోట్లాడుతుంటే ఇంతలో మహారాజుగారు వచ్చారు. రాణీగారు మా తగాదాసంత వారికి చెప్పారు. రాజుగారు, నవ్వి, "అది ఎంతకాలమునుంచో ఇక్కడ ఉంది. దానితో పోట్లాడకు పో" అని నన్ను సాగనంపారు.

విశ్వపతి:—పోనీలే! దానితోపోట్లాడకు, పో. (దాసి తెలతెలబోవుచు ప్రస్థానము.) ఇప్పటికిని వాని నాగ్రహము విడిచిపెట్టనేలేదు. ద్వారరక్షకా! ఎవరు అచ్చట నీతో సంభాషించునది? విజయసేనాపతియా! రావచ్చునని చెప్పుము (విజయుడు ప్రవేశించును) ఏమి విజయా! అంగరక్షకులు మార్పబడిరా?

విజయుడు:—తియరు పేర్కొనినవారి నందులకు నియోగించుటకు దుర్గాధ్యక్షు డంగీకరింపలేదు.

విశ్వపతి:—ఎందుచేత?

విజ:—ఇప్పుడున్న వారే శ్రీవారి విశ్వాసమునకు గూడ పాత్రులనియు, అయినను తమతో స్వయముగ ముచ్చటింతుననియు జెప్పెను.

విశ్వ:—మంచిది, నీవు పొమ్ము. (విజయుడు ప్రస్థానము.) అన్నియు నశుభముగ నేయున్నవి. నేడెప్పటికిని కదలకూడదు. (కూర్చుండి) ఏమి, యీ తిమ్మరుసు ప్రతిభ! బూజుపట్టిపొమ్మనిఅటకపైపారవైచితినను కొంటినేవాని కెంతపలుకుబడి యున్నది! మేరుపర్వతమును దోచుకొనవలయునన్నను, గడ్డిపోచను పెఱికివేయవలయునన్నను, ఎల్లరకు వీని యాలోచనయే కావలెనా? అహా! అతని బుద్ధినిబద్ధమగు నీ రాజ్యయంత్రము చిత్రమై, అతిగూఢమై, దుర్భేద్యమగుచున్నదే! కదలింపబోయిన కరువవచ్చును; ముట్టుకొనబోయిన కుట్టవచ్చును. దాని పొందలుకొని దుర్గాధ్యక్షునివఱకుకూడ నెల్లరికి 'అప్పాజీ' పిచ్చిరేఁ. ఇంతగ్రంథము జరిగినను రాయలనుకూడ చిరంతనదురభ్యాసమువలెనే, యీ 'అప్పాజీ విధేయత' విడువలేదనియే తోచుచున్నది. పుత్రహంతకుడని తెలిసియు, నురిశిక్ష వేయలేదు; కారాగృహమున త్రోయలేదు. తండ్రిని కుమారుడు బెదిరించిన ట్లొకనిష్ఠురమును వైచి, ఏమో గొప్ప శాస్తిచేసినట్లే; చేతులు కడుగుకొని కూర్చునినాడే! ఏమి భయభక్తులు! (ద్వారమువైపు చూచి) ఓహో, బలభద్రుడా! రమ్ము. (బలభద్రుడు ప్రవేశించును) ఏమి నీ శవసాధన ఎంతవఱకువచ్చినది?

బల:—నగరువంతను మూలమూలలగాలించి వెదకితిమి. విశ్వప్రయత్నము లొనర్చినను కుమారుని కళేబరము జాడయైన గోచరింపలేదు.

విశ్వ:—కుడ కగ్ని సంస్కారమునకైన నోచుకొనలేదు. పాపము దురదృష్టవంతుడు!

బల:—హంతకుడు పట్టుబడినప్పుడు వానినే నిర్బంధించి అడిగి తెలిసికొనవలెనే కాని.

విశ్వ:—ఏమీ! తాము నిర్దోషులట మాసైపగ సాధింతుమని నిరాఘాటముగ ప్రతిజ్ఞ సేయుచు గోవింద రాయలు దుర్గమును విడిచిపోవుచున్నపు డొక్కడైన నిరోధింప గలిగెనా; ఏమి. యీ అరాజకము! పోవు వాడు శవమును చంకబెట్టుకొని పోయియుండడు. పొమ్ము, వెదకింపుము. (బలభద్రుడు పోబోవును.) ఎప్పట వెదకించెదవు? చేతిలో ఆ గ్రంథమేమిటి?

బల:—భగవద్గీతలు.

విశ్వ:—ఇది పారాయణచేయుచు శవాన్వేషణ మా? దీని వైరాగ్యబోధలో మా పని యెట్లు జరుగును? అయ్యా! మా కృష్ణరాయల నెట్లో "ఆంధ్రభోజుని" చేయవలయునని మీ సంకల్పమే అయినయెడల, నా మాట వినుడు. తిన్నగ శ్మశానమునకుబోయి పాతాళ పర్యంతము కుళ్లగించి పుస్తెలను భద్రము సేయుడు. "సంస్కృతభోజుని" వీయుద్యోగి పుస్తెరైన నం దుండ కపోదు. పాండిత్యముయొక్క ప్రయోగజ్ఞాన మేమూల నైన నింత యంటియుండవచ్చును. దానిని దక్కించు కొనుడు. మీకును మాకును శ్రేయస్కరము.

బల:—తమ యాజ్ఞప్రకార మెప్పట శోధింప మన్న, నప్పటనే శోధింతుము.

విశ్వ:—కోపమువలదు. నా దుఃఖము తమకేమి తెలియును? దయయుంచి, నే నుపాయము చెప్పెదను. చేయుడు. ఈ రాత్రి రహస్యముగ మంత్రిగృహోపరణను శోధింపుడు.

బల:—భాగ్యము.

(ప్రస్థానము.)

విశ్వ:—శవ మేమైనది? నేల వ్రాడ్చబడి ధ్వంస మయ్యెనా? (నేలదన్ని) ఏమి ధాత్రీ! నీవు రత్న గర్భవా, శవగర్భవా? శవగర్భవే, పో...ఆ తిమ్మరుసు హంతకుడే గోవిందరాయలను పంపియుండును. తానిప్పటనే యుండునా? ఉండడు. అవును.

ఉ. నాయనుమానమే నిజము
 నట్ట వలె నేటనె వీని మారణో
పాయము చూడగావలె న
 పాయముదాటవలెన్ శుభోదిత
శ్రేయుడనై జయేందిరను
 జెందుటొ, యీశవగర్భయందె నే
జేయుటొ యంత్యవాసము ని
 శీథిని నంతయు తేలగా వలెన్.

(సేవకుడు ప్రవేశము)

సేవ:—దేవా! పోర్చుగీసువర్తకశ్రేష్ఠి వచ్చియున్నాడు.

విశ్వ:—సగౌరవముగ దోడ్కొనిరమ్ము.

సేవ:—చిత్తము. (ప్రస్థానము.)

విశ్వ:—ఆఁ, వీనిచే నాపనిగావింపవలెను. స్వయముగ జేయరాదు. ... చేతకాదు కూడ. (మందసము నుండి ఒక నగలపెట్టెను దీసి తెచ్చి బల్లపై నుంచును. ఇంతలో వర్తకశ్రేష్ఠి ప్రవేశము.) ఓహో; స్వాగతము!

పోర్చుగీసు వర్తకుడు }:—శుభవందనములు.

విశ్వ:—(వాని కాసనమును జూపి) తమ సైనికులు మంత్రిభవనమును జాగ్రత్తగ గాచుకొనియుండిరా?

పోర్చు:—తమయాజ్ఞ ప్రకారము పోతంటీగ నైన లోనికి బోనిచ్చుట లేదు, లోనివారిని బయటికి రానిచ్చుటయు లేదు.

విశ్వ:—వానిగృహమే వానికి కారాగృహమైనది.

పోర్చు:—తమ కీయాజ్ఞ నీ వఱకే యిచ్చియుండిన గోవిందరాయలుకూడ పోయియుండెడివాడుకాడు.

విశ్వ:—గతమునకు విచారమెందులకు? ఇదిగో మా కృతజ్ఞత (నగలపెట్టెను ముందుపెట్టి) యీ రత్నాభరణములు ౮ లక్షల దీనారముల విలువసేయును.

పోర్చు:—మహాభాగ్యము.

విశ్వ:—కాని, మీవలన నింకొకసాయము కావలెను. దానికి ప్రతిఫలముగా గొప్ప జాగీర్ల నిప్పించెదము.

పోర్చు:—తమయాజ్ఞ ?

విశ్వ.—హత్య చేయగలరా ?

పోర్చు.—తమ విరోధం లేవరు!

విశ్వ.—నాకు విరోధులు లేరు. మహారాజు విరోధులు.

పోర్చుగీసు:—వారికై మాప్రాణములనైన నిచ్చుటకు సిద్ధముగ నున్నాము.

విశ్వ:—రాజకుమారుని చంపించినది తిమ్మరుసు మంత్రి యని తమ రెఱుగుదురుకదా ?

పోర్చు:—చిత్తము.

విశ్వ:—చిన్ననాటనుండియు పెంపబడిన మెంగ పోటముచే వారి సేమిచేయుటకును శ్రీవారికి మనస్కరించుటలేదు. కాని వారివిధిరి మనము చేయుట మన విధి. మీరీపనిచేసిన నొకటికాదు, రెండు జాగీరులనైన నిచ్చెదను.

పోర్చు:—నేటిరాత్రియే! ఇక మాకు సెలవు.

విశ్వ:—ఏః! ఈ విన్యాలో వారి తేరినదే యీ ఘటము. సంభాషణ క్లుప్తముగ నడచినది. జాగీరు లని నంతనే కనుబొమలు విప్పారినవి. మ్లేచ్ఛా! నీ బుఱ్ఱను కూడ రాజ్యకాంక్షయే తొలుచుచుండెనా! వ్యాపారివి, పరిపాలనకూడ నుండవలసినదే! "ఏకక్రియా ద్వ్యర్థకరీ" అని ధర్మగ్రంథములను, శాసనమునకును తూనికకుగూడ నుపయోగింపగలవు! కానిమ్ము. ఈరాత్రి యీపని కానిమ్ము. మంత్రి హత్యాపరాధము వీరి తలరుద్ది సర్వశోకీల దోచుకొని, ఒక్కొక్కని కొక్కొక్క జాగీరు శ్మశాన గర్భమున శాశ్వతభుక్తములుగ నిచ్చెదను.

(పెద్దిరాజుగారు ప్రవేశము)

పెద్ది:—బిజాపురము సుల్తాను దాడివెడలివచ్చు చున్నాడట, వింటిరా ?

విశ్వ:—లేదు. అయిన మనమిపుడు యుద్ధము సేయవలెనా ?

పెద్ది:—లేదు. కప్పురంపు వీడెములను సేవించుచు నుయ్యాలమంచముపై నూగుచు సరసాలాపంబుల వినోదించుచుండవలెను.

విశ్వ:—"నిరుపహతిస్థలంబు, రమణీప్రియదూతిక ఆత్మకింపయిన భోజనమును" మరచిపోయినారు పెద్దలు.

పెద్ది:—అది కవిత్వమునకు.

విశ్వ:—తాతగారూ! తమపద్యము చిత్రముగ నున్నది. కవిత్వమునకు—"నిరుపహతిస్థలంబు, రమణీప్రియదూతిక తెచ్చియిచ్చు కప్పురవిడె, మాత్మకింపయిన భోజనము"—తాంబూలమైన తరువాత భోజనమా ?

పెద్ది:—కవిత్వమున ఛందోనుకూలంబుగ నిట్టి తారుమారులకు స్వాతంత్ర్యంబు రసికలోకంబు కటాక్షించినది. మా అపరాధము లేదు.

విశ్వ:—పోనిండు. ఇదేమిటి ?..."ఒప్పుతప్పెరయు రసజ్ఞు లూహ తెలియంగల లేఖకపాఠకోత్తముల్ దొరకినగాక యారక కృతుల్ రచియింపు మనంగ శక్యమే ?" అంటిరి. "ఇదియొప్పు యిదితప్పు" అని లేఖకులు పాఠకులు చెప్పుచున్న వారితో సంప్రదించి సవరించుకొని తాము పద్యములు వ్రాయుదురన్నమాట. ఆంధ్రభోజునకు తమరున్నలోటును సంస్కృతభోజునకు కాళిదాసుకూడ తీర్చలేక పోయినాడు. గొప్ప కవిత్వపాకనిపుణులే, ఆంధ్రకవితాపితామహు లల్లసానివారు! నావాచాలతను పితామహులు క్షమింపవలెను. నిజముగ మనము సరసాలాపములనే వినోదించుచున్నాము...సరి తమరిపుడేమి నిశ్చయించిరి ?

పెద్ది:—అన్ని ఏర్పాటులును గావింపబడెను. బిజాపుర సుల్తాను కొండపల్లి మీదుగా వచ్చునట. అతడా ప్రాంతముల జేరునప్పటికే గజపతిగూడ 'కృష్ణ'ను సమీపింపవచ్చును.

విశ్వ:—ఏ గజపతి ?

పెద్ది:—కటకపురాధీశ్వరుడు.

విశ్వ:—అతడుకూడ దండెత్తి వచ్చుచున్నాడా?

పెద్ది:—అవును.

విశ్వ:—అంతటి సమర్థుడా ?

పెద్ది:—సుల్తానుతో గలసి రాయలదాకవచ్చుచున్నాడు. కృష్ణను దాటిరాకమునుపే వారిని నిరోధించుటకు శ్రీవారు నిశ్చయించుకొనినారు.

విశ్వ:—శ్రీవారు స్వయముగ సైన్యసంచాలన సేయుదురా ?

పెద్ది:—చిత్తము.

విశ్వ:—మేము ?

పెద్ది:—నగరరక్షణమునకు తమరు నియుక్తులైరి. ఆ యుదంత మెఱింగించుటకే వచ్చితిని.

విశ్వ:—ఈ ఏర్పాటు లన్నియు నెవరు చేసినవి?

పెద్ది:—నేను

విశ్వ:—మాతో సంప్రదింపక ఆజ్ఞలను జారీ చేయవచ్చితిరా ? ఏమి, యింతస్వాతంత్ర్యము తీసికొని నారు?

పెద్ది:—ఈ ఖడ్గము నెప్పుడు ధరించితినో అప్పుడే నా కా స్వాతంత్ర్యము వచ్చినది.

విశ్వ:—ఆహా! దాని అధికృతయేమి ?

పెద్దిరాజు:—దీని అధికృతయా?—పూర్వప్రస్తుతాగామిమహామాత్యులకు శిరోమణియై, ఆంధ్రసామ్రాజ్య నిర్మాతయై, దుర్లభ జయశ్రేయముల నెన్నిటినో చక్రవర్తికిగూర్చి, దుర్లోక్య తేజోవిరాజియైన శ్రీ తిమ్మరుసు వారు ధరించుకారణమున దీనికా మహత్తు వచ్చినది. ఇది ధరించు మహత్వమువనే మా నిర్ణయమమోఘమగును. చక్రవర్తికూడ యీగౌరవమును శిరోధార్యమని మమ్ము ధన్యులజేసె.

విశ్వపతి:—మంచిది. ఏదీ ఆఖడ్గమునిటు తెండు. అందులకు నేనే యోగ్యుడ నేమో ?

పెద్దిరాజు:—యోగ్యులేయైన నేనిచ్చుటఎందుకు? నగరరక్షణము తమ కంగీకారము కాకున్న మేము వేఱుగచూడవలయును.

విశ్వపతి:—చిత్తము. శ్రీవారితో నాలోచించి వర్తమానమంపెదము.

పెద్దిరాజు:—చిత్తము. (ప్రస్థానము)

విశ్వపతి:—వానిఖడ్గమును ధరించు మాత్రమున నా మహాత్మ్యరి సర్వతోముఖజాగ్రద్బుద్ధి శాలిమ వీని కబ్బునా? వృద్ధుని స్థానమున వృద్ధుడేర్పడవలె. ఏర్పడినాడు, మందకొడివృద్ధుడు. ఏమైనను మంత్రిపదవినుండుటచే నాకడ్డువచ్చుచున్నాడు. నావ్యూహములు నిరాఘాటముగ నిర్వహించుకొనుటకు నాకీపదవియే కావలయును. చూచెద నేల రాదో? (యవనిక.)

రంగము ౧

స్థానము:—తిమ్మరుసు భవనము.

సమయము:—రాత్రి.

(తిమ్మరుసు పెద్దిరాజు ప్రవేశము)

పెద్ది:—గోవిందరాయలు చక్రవర్తిపై తిరుగుబాటుచేయుటకే లేచిపోయెనా ?

తిమ్మ:—కాని, నే నాపుకొనలేకపోతిని. అక్కటా! నా అంశే, నావస్తువు నేనే ఆకర్షించుకొనలేకపోతినే. నా శ్రద్ధ నెచ్చటనో వ్యయపరచి స్వార్థలక్ష్యమునే మరచితిని. (రామకృష్ణకవి ఒక పేటికను గొని ప్రవేశించి పరికించుచు నిలుచును. ఉభయులు నాతని చూడరు) పితామహా! యీ దుఃఖములో నాకు కవిత్వము వచ్చుచున్నది. చూడుడు. దుర్గరక్షణయందలి ఆతురతతో నొకడు జాగరణ గోపురారోహియై శత్రుసంచారమును దూరమునసే పసిపట్టి యరికట్టుటకు దృష్టిసర్వస్వమును యంత్రమునకే అర్పించి అచలుడై యుండెను. కాని దగ్గఱనుండియే శాత్రవముచుట్టును లేచి, ముసిరి, రెక్కలువిరిచి కట్టునప్పుడు, దేనితో గింజుకొను వాని నవ్వులాట బ్రదుకు నాకు సామ్యమునకు వచ్చుచున్నది. ఆహా! మానవునికి స్వార్థము లేకపోవుటయు నొక దోషమేకదా!

గీ॥ పేటెదనుకపరార్థ జీవాటనంపు
సైపు గను బ్రామ మెలఁగి దుర్గరుఁడనై తి
సంఘహిత ధర్మమయ కార్య చరణకైన
స్వార్థయోగమహాతపశ్చరణబలయు.

రామ:—సూత్రధారుడు యీ జమాన్యరును మరచి కథానకమున రసముగ్ధుడై పాత్రమున తన్మయుడగుచున్నాడు. నాటకము నడచునా ?

తిమ్మ:—(దృష్టించి మందహాసముతో) ఏల నడు పదు? "తన జగన్నాటకంబున తాను నొకపాత్రమై సూత్రధారుడు నొచుపరలు" నీశ్వరుని మానవుడనుక రించుచునే యుండును. అ పేటికయేమి?

రామ:—మహారాణీవారి రత్నాభరణములు పోర్చుగీసు వణిగ్వరునకు విశ్వపతిరాయలిచ్చిన బహుమానము.

తిమ్మ:—నన్నీజు గారు వెడలిపోయిరా?

రామ:—ఈ రాత్రి వెడలిపోవుచున్నారు. తమ విధేయులై యుండునట్లు పోర్చుగీసులందఱచేతను ప్రమాణము చేయించుకొనినాడు. ఈ సుందపము సర్వవిషయముల నెఱింగించుచు వారే మనవళము చేసినారు.

పెద్ది:—విదేశీయులు కదా యని వీరిని విశ్వసించె గాబోలు విశ్వపతి.

తిమ్మ:—పితామహా! ఈ నన్నీజు నాత్మగరిమ నన్ను మోహమున ముంచుచున్నది. అట్టి మహానుభావుడు నా ఆశయము నింతగా గౌరవించుటకూడ సిద్ధగనే యున్నది. నా భద్రమును శిరమున బెట్టుకొని అవస్థ పడుచున్నాడు.

రామ—అవస్థ ఏమున్నది? తన దేశస్థులగుట సులభముగనే వారిని మనదాసుల జేయగలిగెను.

తిమ్మ:— మా ప్రయాణమున కన్నియేర్పాటులను జరిగెనా?

రామకృష్ణ:—చిత్తము. తమరెప్పుడు ప్రయాణమయ్యెదరు?

తిమ్మ:—ఆమె వచ్చుటతోడనే.

రామకృష్ణ:—ఆమె వచ్చియేయున్నారు.

పెద్ది:—ఎవరు?

తిమ్మ:—నేను నాకుమారుని వెంబడించి పోవుచున్నాను. నా వ్యూహములను సావధానముగా రామకృష్ణకవిగారు మీకు విశదము చేయగలరు. తమ రాశీర్వదించిపంపుడు. తొందఱపనులున్నవి. (రామకృష్ణకవి ప్రభృతి నభినయించి లోనికిపోవును.)

పెద్ది:—అయిన నేను సెలవు పుచ్చుకొందునా? ఆఁ, విశ్వపతి నగరరక్షణ కంగీకరింప లేదు.

తిమ్మ:—అవును. అంగీకరింపడు. గజపతిరాయలు తొరపిల్లుచున్నారు. తానచ్చట నుండవలెను. సుల్తానుకూడ వచ్చును. ఎవరి అంత్యముమీద తనభాగ్యమాధారపడియున్నదో, పొంచియుండవలదా?

పెద్ది:—నే ననునది ఎందులకువచ్చిక యీయీ సమిది. విశ్వపతిని రహస్యముగ నేల తెగటార్చరాదు?

తిమ్మ:—(చిరునవ్వుతో) అధీరులనీతి, అది మన కెందుకు? పితామహా! తమరినిజూచిన భయమగుచున్నది. ఎప్పుడో తమరాపని గావింతురు. తమకోప ముగ్రనర్మల కుఱుకును. తమకొక పరమరహస్యమును దెల్పెదను. వినుడు. మనము వృద్ధుల మగుచున్నాము. ఈ రాజ్యసంవృద్ధికి మఱియొక సమర్థుడగు యువకుడు కావలెను. అప్పుడు గాని, మనమిప్పుడు ప్రతిష్ఠించిన ధర్మములు మఱికొంతకాల ముత్సాహక్రమమున నడచుటకు నూతయివ్వవు. విశ్వపతి రహస్యము నాకు తెలియగనే వాని అద్భుత సాహసము వాని యోగ్యతను స్ఫురింపజేసినది. వీనిని సాధుత్వమునకు, త్యాగశీలమునకు, పరోపకారమునకు లొంగదీసిన నితడు మన రాజ్యమున కెంతయు నుపకరింపగలడు. వానిని నాకు దక్కింతునని నాకు వాగ్దానము చేయవలెను.

పెద్ది:—తమకు నే చెప్పుడు విధేయుడనే కావలసి వచ్చుచున్నది. తమ ఆశయము జయమగు గాక! (పోబోవును)

తిమ్మ:—ఆఁ, నగరమునందుకాని యుద్ధమునందు కాని సేనాపతులకు నాయాజ్ఞలు గుప్తముగ వారికే సరాసరి చేరుచుండును. అందుచే వారొకప్పుడు తమ యాజ్ఞల నుల్లంఘించునట్లు తోచవచ్చును. కాని తమరు క్షమించవలెను.

పెద్ది:—ఎప్పటికో పునర్దర్శనము?

తిమ్మరుసు:—భయము లేదు. తమదీవన యమోఘము. పోయిరండు.

పెద్దిరాజు:—జయము. (ప్రస్థానము.)

తిమ్మరుసు:— రామకృష్ణా! (రామకృష్ణకవిలో నుండి ప్రవేశించును.) మమ్మువహత్యచేయు భార మెుకటి పాప మావర్తకులపై నున్నదికాబోలు. శేపువారు విశ్వపతికి చెప్పవలయు సమాధానమును వారి కెఱింగించుట మంచిది. లేఖవ్రాసి పంపుదమా?

రామకృష్ణకవి:—వారి సైనికు లిచ్చటనే యుండిరికదా!

తిమ్మరుసు:—మన భటునిచేతనే శ్రేష్ఠికడకే పంపుము. వాని కీలేఖనుచూపి వెంటనే దానిని చించివైచిరావలెను.

రామకృష్ణకవి:—వ్రాయుడు. మన వేగులలో నొకని కీపని నిచ్చెదను. [ప్రస్థానము]

తిమ్మరుసు:—(లేఖవ్రాయుట నభినయించి) ఈ యుపాయముచాలును. సుల్తానని మోసముచేయవలెను. యుద్ధముకూడదు. గజపతిని రాయలకు స్నేహితుని జేయవలెను. చిన్నారాణినే అందులకు ప్రయోగించుట మంచిది. సరి— (యవనిక.)

రంగము 3

స్థానము—రాయలమందిరము.
సమయము—ఉదయము.

(విశ్వపతి ప్రవేశము.)

విశ్వ:—అడుగడుగునకును సుడులుగొట్టుచు గండము లెదు రగుచున్నవి. పగసాధింపవెడలిపోయిన గోవిందరాయలు నాప్రాణము నేల గురిచేసికొనడు? అబ్బో! యుద్ధమా! ఆయుధభివము లేదే! నాయాట లేమి సాగును? క్షత్రియవిద్యల నన్నిటినెంతో శ్రద్ధతో నభ్యసించితిని. ఏమిలాభము? విద్యలెప్పటికిని విద్యలే. రిపుప్రాణహరణలాలసుడగు యోధుడు బలిమిమై వీలుగొని యాక్రమించునేగాని శాస్త్రగౌరవమున క్రమపాశముల ఖడ్గమును ద్రిప్పునా? వ్యూహప్రయోగములనైన ప్రత్యక్షపరిచయము లేదు. ఈసామగ్రితో నేబోయి చేయునదేమి? ......ఏమియు లేదా? (దాసీప్రవేశము) ఏమియు లేదా నివేశము?

దాసి:—చిన్నారాణిగారు కనబడలేదు. రాజుగారు కోపముతోనున్నారు. మీకు ముందుగా—

విశ్వ:—శకునపక్షీ! నీకు మతి సరిగనున్నదా? ఏమి పదరుచున్నావు? (దాసీ భయము నభినయించి ప్రస్థానము) ఇది కూడ తప్పించుకొని పోయినదా? నాపై పగసాధించును కాబోలు. నా ప్రాణమున కీ పిశాచి యెక్కడ దాపరించినది? ఇంక కొలది దినము లోపిక పట్టిన, తాను పోవు టెందులకు? సంతోషమున నేను సాగనంపెడి వాడనే మృత్యుగర్తమునకు?...ఆహా! రాయల కిప్పు డేదియో సమాధానము చెప్పక తప్పదే? "మా పుట్టుపూర్వోత్తరము లేమి" యని ఇప్పుడైన నిర్బంధపెట్టక పోడే! ఏమి దిక్కు? ఇదియైన నెపటికి బోయె? ఇచ్చట ఎవరు దానికి దిక్కు? ద్వారరక్షకా! మాకొఱకై పోర్చుగీసువర్తకశ్రేష్ఠి మామందిరమునకు వచ్చియుండును. ఇచ్చటికి దోడ్కొని రమ్మని సేవకుని పంపుము...అతడైన రాత్రి నాపని గావించియుండెనో లేదో!

(విజయుడు ప్రవేశము)

విజ:—ప్రభూ! ఈ లేఖతో బాటు నా జీవితమును తమ కృపాధీనము చేసికొనుచున్నాడను. ఇందుచే నేను రాజద్రోహులకు ద్రోహమును, రాజభక్తులకు దాస్యమును జేయుచుంటినను విశ్వాసమున గర్వించుచున్నాడను (లేఖనిచ్చును.)

విశ్వ:—(లేఖను జదువుకొని ఆశ్చర్యము నభినయించి) నీ రాజభక్తి అత్యద్భుతము. నీకు గొప్ప బహుమానము సేయవలెను. ద్వారరక్షకా! (ద్వారరక్షకుడు వచ్చివేచియుండును.) వీనిని కారాగృహ యజమానికొప్పజెప్పుము. మాయాజ్ఞవచ్చునంతకు వీనిని నిర్బంధమున నుంచవలెనని తెల్పుము.

విజ:—ఇదియా, నా రాజభక్తికి ఫలము!

విశ్వ:— రాజద్రోహులనుండి నిన్ను రక్షించుటకు వేఱుమార్గము లేదు. క్షమించి సహనము నుపాసింపుము. (ద్వారరక్షకుడు విజయునితో ప్రస్థానము.) ఔరా! ఇది ఏ మాశ్చర్యము? పెద్దిరాజు గారికికూడ

రాజ్యకాంక్షయా? మేము యుద్ధమున కేగిన తోడనే దుర్గమును తాను వశముచేసికొనుట! పరస్పరసహాయము నకు ప్రతిఫలసూచనగ గజపతితో రాయబారము నడుపుచున్నట్లీ లేఖవలన స్పష్టపడుచున్నదే? ఆహా! ఈ రాజ్యలక్ష్మిపై నెందఱు కన్నువైచి కాచియున్నారు? జీవితము తిరిగిపోవుచున్నను గుఱుతుకూడ మఱచి స్వార్థమునెల్ల నిందే జయించుకొను చుండిరే!

శా. ఆదిక్ గొన్ని తరాలుగా మురిసి రా
జ్యంబెల్ల వర్ధించె నా
త్మాదాయంబుగ వృద్ధతిమ్మరుసు; మీ
దక్ వాని బోద్రోలి నా
కే దక్కంగది రాజ్యమింక నని శం
కే లేక నేనుండ నే
దో దుర్మార్గత నన్నాక్రమింగ నవవృ
ద్ధుం డేడ ప్రాప్తించెనో?.

కాని, యిప్పుడు కర్తవ్యమేమి? వీని నిప్పు డెదుర వచ్చునా? ప్రతిక్రియ స్ఫురించుట లేదు. ప్రమాదము ప్రబలముగ నెంట్రినప్పుడు గాని ప్రతివిధానమునకు నా బుద్ధి ప్రకాశింపదు. వీని ప్రయత్నము కూడ నాకే విని యోగపడవచ్చునేమో! వీని కుట్రను గనిపెట్టి కల్పించు కొనవలెను. సరి. ఈ లేఖను రాయలకు చూపవలెనా? చూపెదను. ప్రయోజనమే కలదు. కాని, వీనిని రాజాగ్రహము నుండి కాపాడుకొనవలయునుగూడ. (పోర్చుగీసు వర్తకుడు ప్రవేశము.) ఏమి, విశేషము?

పోర్చు:—గోవిందరాయలు ముందే పారిపోయె గాని, లేకున్న నతడుకూడ చిక్కువడెడివాడే!

విశ్వ:—మిగిలినవారు?

పోర్చు:—మంత్రిని సకుటుంబముగ బంధించి కొండవీడునందలి మా కోటకు బంపితిమి.

విశ్వ.—అప్పటి కెందులకు?

పోర్చు:—ఎవరుగాని వారి నీ రాజ్యమున సంహ[illegible]ంచి బ్రదికిపోగలరా? వారి యభిమానులను సేనాపతు రహస్యమును పసిబట్టుదురేని అప్పుడు మన ప్రాణమునకే ముప్పుగదా! అందుచే నిట్లుచేయవలసివచ్చినది. గమ్యస్థానము సేరగనే ఆపనికాగలదు.

విశ్వ:—అవును. ఇప్పుడు వారే ఎప్పటికో పారిపోయిరని వదంతివేయవచ్చును. మంచిది. ఆవార్తతో తిరిగి దర్శనముచేయుడు.

పోర్చు:—భాగ్యము. (ప్రస్థానము.)

విశ్వ:—జిత్తులలో నక్కలను మించినవి యీ బుడతకీచులు. పెద్దననుకూడ నీ నక్కలకే వేయవలయ వచ్చును. ఏమి, ఎంతసేపటికిని బయటికిరాడు? (అంతఃపురమువైపు చూచి) సేవకా, శ్రీవారేమి చేయుచున్నారు?

సేవకుడు:—(ప్రవేశించి) ఇప్పుడే తమరి నడిగిరి. సౌగంధశిల్పికిరీటమును చక్కనేయుచున్నారు.

విశ్వ:—సరి, నీవుపొమ్ము. (సేవకుని ప్రస్థానము.) కిరీటము నొకడు చక్కజేయవలెను. పాదరక్షల నొకడు తొడుగవలెను. ఆభరణముల నేఱొకడలంకరింపవలెను. బాగున్నది. కట్టుబట్ట నెవ్వడుకట్టవలెనో! రాజనుకావలెననుకొంటిని. నాకు నీ యస్వతంత్రజీవనయోగమేపట్టును కాబోలునే! పోనీ, మానుదునా? నాకెందు కీరాజ్యము? ఆహా! సద్భావము నొకింతధారణచేసినంత మాత్రముననే దుర్లభ పరాక్రమౌన్నత్యమునుండి సాధు సౌశీల్యమున కొకే అధఃపతనమగుచున్నదే! జాగ్రత్తగనుండవలెను. (రాయలు ప్రవేశించును. విశ్వపతి లేచి) ఓహో! దయచేయుడు.

రాయలు:—(కూర్చొనుచు) నీ సోదరియెచ్చట?

విశ్వ:—కూర్చుండుడు. చాల ఆరాటముపడి యుందురనుకొందును. ముందుగనే చెప్పిన తమ రంగీకరింపరను భయమున కొంచెము స్వతంత్రించితిని. క్షమింపవలెను. మనమా, యుద్ధమునకు బోవుచుంటిమి. రాజ్యమా, చాల అల్లకల్లోలముగ నున్నది. కుమారు డట్లయ్యెనా? ఈమె ప్రాణమున కెవరు ముప్పుదలతురో! ఈభయములచే నాకేమియుదోచక ప్రస్తుత మామెను మాపితృగృహంబున కంపితిమి. మనము యుద్ధమునుండి తిరిగివచ్చుటతోడనే మాతలిదండ్రులే 'చిన్నాను' వెంట

పెట్టుకొనివత్తురు. బావా! అప్పుడు నేనొక దేశమునకు యువరాజునని తెలిసినచోఁ గోపమున నన్నా రాజ్యమునకు తరిమివేయఁగూడదు సుమా!

రా:—అబ్బా! గొప్పబరువును తీసివేసినావు. ఆభయమే నన్నును వేధించుచుండెను. పోనిమ్ము. మంచి పనినే చేసినావు. నామనస్సిప్పుడేమియు బాగుండ లేదు. నిన్నకొండలు సేనాపతులు తిరుగబడిరే! కారణము నూహించితివా?

విశ్వ:—ఏమైయుండును?

రా:—అప్పాజీకి నే నన్యాయముచేసితినట! నాకు నకనికి ఎవరో విరోధు లీరాజ్యమునవుండి యీ చిత్రమును నడుపుచుండిరని వారియనుమానమట! వారు నిర్దోషులైన నాతో నేల చెప్పుకొనరాదు? మీదు మిక్కిలి నాపై పగసాధింప గోవిందరాయలు రాజ్యము వీడిపోయెనే! నాయపరాధ మేమి? శిక్షింప లేదు; తరిమి వేయ లేదు.

విశ్వ:—అవును. వారిచర్యలు నిర్దోషత్వమును, సాధుత్వమును సమర్థించుచున్నవా? ఈవిచార మెందులకు? ఆసేనాపతుల నేమిచేసిరి?

రాయలు:—అప్పాజీయే వారిని పిలిపించి ఏమో నచ్చజెప్పి పంపిరట! వారు తిరిగివచ్చి విధేయతను దెలిపికొని క్షమాపణఁగోరిరి.

విశ్వ:—తమరు క్షమించితిరి. ఓయి, యమాయిక రాజా! ఏమి, బుద్ధావతారమిది? మేల్కొనుము, నినకు విధేయులగు సేనాపతుల మనయొద్దకాపుంచి రాత్రియే అప్పాజీకూడ లేచిపోయెనే! ఎందులకు? తండ్రికుమారులిరువురు జేరి విపక్షులఁగూడి నిన్నుదాకుదురు. ఆత్మరక్షణమునకు వాని సేనాపతులా, నీకుదిక్కు? అదియుగాక, యీ కపటమేమో నాకర్థమగుట లేదు. ఈ విద్రోహులెల్ల రెవరికివారో, లేక నిన్నును నన్నును మతిభ్రష్టుల జేయుటకు వేర్వేఱవర్తించు నొకేకుట్రలోనివారో, యీ లేఖను జూడుము.

రాయలు:—(లేఖను జదువుకొని) ఆఁ. పితామహులా! రాజద్రోహమా? ఇది వారి దస్తూరియే. నీ కెట్లు చిక్కెన దీ జాబు?

విశ్వ:—ఈ లేఖను గజపతికి గొనిపోవ వానిచే పంపబడిన విజయుడే రాజభక్తి గలవాడగుటచే రహస్యము వెలిగించుచు నాచేతికిచ్చె.

రాయలు:—విశ్వపతీ! ఇందఱెట్లు కాచుకొనియుండ నాకీ రాజ్యమెట్లు దక్కును? దక్కినను ఇందఱి ఘోషతో నాకీ సౌఖ్యమెందులకు? వారిని పిలిపింపుము. రాజ్యమును నేనే పంచియిచ్చెదను.

విశ్వ:—విద్రోహులు వారి కెందులకు? ముద్దుల మఱదిని నేనుంటిని. నాకు పంచిపెట్టుము. వారితో నే నెట్లో వేగెదను. బావా! ఆగ్రహము వచ్చినప్పుడు సన్యసింపరాదు. దాని ముమ్మరము తగ్గగనే, కాషాయాంబరునకు తిరిగి కామినీ చేలాంచలమే గతియగును. ప్రియబంధువు లనుకొనబడువారు విద్రోహులైనప్పుడిట్టి విచారము కల్గుట ఉత్తమప్రకృతియే, కాదనను; కాని, ధర్మసంరక్షణ మానవుడైన ప్రతివానికినివిధి. అందును నీవుక్షత్రియుడవు. దుష్టశిక్షణ, శిష్టరక్షణ నీవిధులు. లెమ్ము. ముందు విద్రోహుల జయింపుము. రెక్కలు గట్టి యీడ్చుకొనివచ్చి సభామధ్యమున బడవైచి—అప్పుడు—వలయుచో నింత రాజ్యమిచ్చి కనికరింపుము. అప్పుడొక యనిర్వచనీయ తేజము నీపరివేషమున నృత్యము చేయగలదు. రమ్ము. ఈ జయయాత్రలో నేను నీకు సారథ్యము చేసెదను.

రాయ:—కానిమ్ము. అర్జునునకు కృష్ణుడు. నీవు—నాకు.

విశ్వ:—అవును.

మ. జగమేలే పరమాత్మ కృష్ణుడె యటన్
సారథ్యమున్ జేసె నీ
జగమేలే నరుడైన కృష్ణుడె; యిటన్
సారథ్యమేఁ జేసెదన్
యుగధర్మంబులు మాఱుచుండు నరుడో
హో! ఈశ్వరాదృష్టథా

తగవర్ధిల్లుట నేడు నావలన సా
ధ్యంబయ్యె, నేనమ్యుడన్.

రాయ:—విశ్వపతీ! వారు చర్యలచే భయపెట్టుచుండిరి. నీవు వింతభాషములచేతనే భయపెట్టుచుంటివి. అయిన నా విశ్వాసము ననుభవించుటకు నీ వొక్కడవే మిగిలియుంటివి. పద; శత్రునిర్మూలనమునకు సంకల్పించితిని. ఇక నీవే నా ప్రధానివి. నీ సామర్థ్యమును విశ్వసించి జయయాత్రను సేయుచుంటిని.

విశ్వ:—ధన్యోఽస్మి. ధన్యోఽస్మి. బావా!

ఉ. శ్రీ విజయోస్తు, దేవతలు
శ్రేణుల దీర్చుచు నీజయోదిత
శ్రీ విభవాధ్వమందున ర
చింతురు స్వాగతతోరణంబు లు
ర్వీశ్వర విన్ము, నీకు జయ
పెట్టుచు క్షోణితలేంద్ర కోటి నీ
త్రోవను వెంటనేనడువ
తోలుకువచ్చెద ముందుసాగుమా.

(ఇరువురు నిష్క్రమింతురు.)

యవనిక.

ప్రణయభిక్ష

దివాకర్ల వెంకటావధాని గారు

ధీరవరేణ్యపూజితుఁడు దేశహితైక విధాయకక్రియా
శూరుఁడు సత్త్వమూర్తి గుణసుందరుఁ డంచు జను ల్వచింప నీ
కీరితి వింటి మేను పులకింపఁగ నెంతయు నాఁటినుండియుం
గూరిమి నీపయింగలిగెఁ గొంతయునం మరలింపరానిదై.

కాదనఁబోక నీ చెలిమి గాంచుటకుం బ్రయతించుచున్న న
న్నాదృతిఁ జూడఁగోరెద మహాత్మ! నిరాదరణంబె కల్గినన్
నా దురవస్థ కేమి యొక నాతి పవిత్రమనోంబుజన్మముం
మేదినిఁ ద్రోసి త్రొక్కెచను మేటియఘంబది నీకుఁ గల్గెడిన్.

ఆననమైన నీ వెఱుఁగ వక్కట, నాపయి మోహమేల? నీ
కో నవలా! యనంగఁ దగ దో మహితాత్ముఁడ! నీమనంబు స్వా
ధీనము నీకుఁగాని కలదే? నను వారణ సేయుశక్తి యెం
దైనను, గోరి నిన్వలచు టందలిదోషము నీ గుణాళి దే.

ఎద విధి చోదితంబనుచు నెంచి ననుం గ్రహియించు పూన్కి త
ప్ప దిఁక ఘుమంఘుమార్భటు లపారముగాఁ జెలరేఁగ మోహ సం
పదవెలిఁ జిమ్ముచుం దరికి వచ్చెడు వాహినులం మరల్పఁగా
నుదధికి శక్తియున్నదె? తదుత్తమ సంగమ భాగ్య మొందదే?

సన్నిధిఁ జేరి నీ చరణ సారసము ల్భజియించు భాగ్య మిం
కెన్నఁటి కెన్నఁడంచుఁ జలియింపని రాగము తీగ సాఁగఁగా
నెన్నిప్రయత్నము ల్సలిపి యేమిఫలమ్ము మహాత్మ, నేఁటికిన్
గన్నుల కాంతుదీర నినుఁ గాంచితి విన్నప మాలకింపుమా.

వనితతనయాంత వలచివచ్చిన రవంత
యైన గౌరవ ముండఁ బోదని యెఱుఁగుదు
వశము గాకుండ నుప్పొంగు ప్రణయరక్తి
నాపుకొన నెంతునేని శక్యమగునొక్కొ.

మానెదవేమొ ? సంసరణ మగ్నుఁడ నౌనెడ మాతృదేశ సే
వానిరతప్రచార వినిపాతము గల్గు నఁటంచు నెంచి దే
వా, ననుగూడ నీ యభిమతాధ్వము లందునఁ ద్రిప్పికొమ్ము వి
జ్ఞానమొసంగి నీ నియమ సాధన కేల ఘటిల్లు నడ్డముల్?

చదువన్ నేర్చినదాన బ్రాణవిభు నిచ్ఛాపూర్తికిన్ బ్రాణముల్
వదలన్ జంకని హైందవాంగనను ద్రోవంజూపుచుం బొమ్ము నీ
పదపద్మంబుల వెంటనంటెదఁ గదన్ భారంబె యౌఁగాక, సం
పదలన్ భోగమె కోరుదాన నని సంభావింపఁగాఁ బోకుమా!

ఇంతకు మించి నీకు వచియింపఁగఁ దగ్గది కానరాదు, నీ
స్వాంతము వచ్చెనేనియు శుభంబె తిరస్కృతిఁ జూపుదేని జ
న్మాంతము దాఁక నీశ్వరు ననంతరజన్మము నందునైన ని
న్గాంతునిఁ జేయఁగోరి యధికంబగు భక్తి భజించుచుండెదన్.

బండి సేతుపతిసౌధముముం దాగినది. ఆగి నెమ్మదిగా నంతఃపుర ప్రదేశముకడకు పోయినది. ఏకవీర గవాక్షమునుండి మీనాక్షిని చూచిమేడదిగివచ్చి యామెనుగలుసుకొన్నది. మీనాక్షి యేకవీరను చూచినది.

ఏకవీర ఆనాడు తెల్లని పట్టుచీర ధరించినది. శిరోజము లభ్యంజన మాచరించినట్లు పొడిపొడిగా నున్నవి. ఆమె కనులలో నొక లోలత్వ మున్నది. అది లోలత్వమనుట కన్న మోహనత్వమనిన బాగుండును. కంచుకము కూడ బంగరుపూవులుగల తెలిపట్టుది. అపుడామె తెలిమొగిలి పొరవలె నున్నది.

ఆనాడామెను మీనాక్షి చూచినంత నే పూర్వమామె నెప్పుడో చూచితి ననిపించినది. ఉలికిపడి మరల చూచినది. ఇంతలోఁ బరిచారిక తెచ్చిన మెత్తసేలువ నేకవీర కప్పుకున్నది. మీనాక్షికి మరల తన పరిచితురాలే కనిపించెను. ఏకవీర వివాహమైనదిమొదలు ఆకుపచ్చచీరలు ధరించును. సర్వావయములయందు నేడు వారముల సొమ్ములు తాల్చును. వివాహాత్పూర్వము తెల్లనిపట్టుచీరలు తాల్చెడిది. తలయెప్పుడు పొడిపొడిగా నుంచుకొనెడిది. వివాహానంతరమున తెలిచీర తాల్చినది. కుట్టాన్ తఃశయ్యమీద నామె నిద్రించినది చూచినరాత్రియే మొదటిసారి. అది మొదలు కుట్టాన్ పెట్టిన గడుపుమొదలు నెలనెల కమావాస్యలనాడు తాల్చుచు వచ్చినది. గడువు రెండేండ్లు గడచినది. ఏకవీరకు కుట్టాన్ మాటలయందు నమ్మకము పోయినది. మనసు క్రమక్రమముగాఁ దాను తొల్లి ప్రేమించిన యతని మీదికి తిరుగుచు వచ్చినది. అతనిని గూర్చి యూహాలు వచ్చినప్పుడెల్ల నేకవీర తెలియుడుపులు ధరించుచుండెను.

ఏకవీర కతనియూరు తెలియదు; అతని పేరు తెలియదు. మరి యేమి తెలియును? చంద్రసుకుమారమైన యతని మొగము తెలియును. అతని దీర్ఘాకృతి తెలియును. అతని సూదులవంటి కనులు తెలియును. అతని తుమ్మెద రెక్కలవంటి మీసములు తెలియును. ముందు పాయలుగాఁదీసి వెనుక ముడికొదిగిన యతని కేశపింఛము తెలియును. తమ యిద్దరి నడుమ త్రెంచరానిదిగా నున్న స్వచ్ఛప్రేమబంధము తెలియును. తన మొగములోని సౌందర్యమంతయు తాను తెల్లచీరధరించి తల పొడిపొడిగా నుంచినప్పుడు పట్టరానిదిగా నుండుననికూడ నామెకు తెలియును. వివాహమైన రెండుసంవత్సరములుగా నేకవీర యాతని మరచిపోయినది. అతనిస్థానమున కుట్టానునకు వసతి నిర్మించినది. కుట్టా నావసతిలో నిలచినాడు కాడు. తాను నిర్మించిన ప్రేమసౌధమునకు కుట్టాన్ తీసిన నిర్దయాద్వారమునుండి తన తొల్లిటి వలపుకాడు ప్రవేశించినమాట యేక

వీర కవగతము కాలేదు, తన కిప్పుడు పెరిగిన తెల్లపట్టుచీరలమీాది మక్కువ వెదకి చూచుకొనలేదు. తన తొల్లింటి ప్రేమోమూర్తి యామెకనులకు కట్టినట్లుండెను. ఆమె యతని ప్రత్యక్షమైన మూర్తినిగూర్చి, దాని నిలుకడను గూర్చి వితర్కించుకొనలేదు. అది యామెకు సర్వలోకములనుండి తాను గుప్తపరచుకున్న ధనము. ఆధనమునకు యాథార్థ్యము లేదని యామెకు తెలియును. ధర్మమునకు సాధనము యాథార్థ్యమునకు దవ్వైనది. అందుచేత నామె ధర్మబద్ధయై యాధనముమాట మరచిపోయినది. ధర్మముతోడి ధనము నభిలషించినది. ఈక్రొత్తధన మామెకు స్పర్శదూరమతిగ మించినది. ఈరెండుధనములామెకయథార్థములైనవి. మొదలిధనము మధురప్రేమమయమైనది. రెండవధనము ధర్మప్రేమమయమైనది. తనకు దూరములైన యీరెంటిలో నేది మనస్సున నిల్పుటకు యోగ్యమైనదో ఆమెకు తెలియలేదు. తెలిపికొలది రెండవ దానిని మనసు నామె నిలుపును. తనకు తెలియకుండ మొదటిది తానువచ్చి తనమన సావరించును. ఆయావృత్తి యామెకు తెలిసీ తెలియనట్లుండును.

తన్ను చూచినంతనే మీనాక్షి యులికిపడినదెందు కాయనుకున్నది. ఏకవీర మరల తనసౌందర్యమునకు ముగ్ధురాలయినదని సమాధానము చెప్పుకున్నది. ఇంతలో నిద్దరు తొల్లింటి పరిచితులవలె మాటలాడుకొనిరి. ఆ యులికిపాటు మీనాక్షి మరచిపోయినది. ఏకవీరకు మరపురాలేదు.

ఇరువురును జాజిపందిరి క్రిందుగా నేకవీరగదికి పోవుచుండిరి. ఒక పసరుమొగ్గ యేకవీరపై పడినది. ఒక పచ్చియాకు మీనాక్షిపైఁబడినది. పందిరి యంతయు వర్షముకొరకు నెదురుచూచుచున్నట్లు చెదరుపూలు విరిసినది. వర్షమును రమ్మన్నట్లు చిన్నగాలి కాకులు కదులుచున్నవి. పందిరిలోఁ జీకట్లు క్రమ్మినవి.

ఆకసమునఁ బడమటిదిక్కున బురదవలె వ్యాపించిన నల్లని పెద్దమేఘము నుద్ధృతి చూచి బండివాడు వర్షాశంకి శకటమును దూరాననున్న శకటములు నిల్చుచావడికిఁ గొంచుబోయి యెడ్లతలత్రాళ్లు చక్రములకు బిగించికట్టి సేతుపతుల శకటసారథుల పసిపిల్లతో నెనిమిదేండ్ల బాలికతో ప్రసంగములోనికి దిగెను. దానిపేరు అమృతము.

పిల్ల—ఎవరు వచ్చినది?

బండివాడు—స్థానాపతిగారి అమ్మవారు.

పిల్ల పరికిణీతోడపైకిలాగి జనపనారత్రాడు పేనుచుండెను. ఆపిల్ల తలవెండ్రుకలు సంస్కారహీనములై రాగిబొచ్చువలె దాని మొగముమీాద వ్రాలుచుండెను. త్రాడు పేనుచుండగా నాపిల్లకు తొడ మంటపెట్టి యుమ్మితీసి తొడకురాచుకొని బండివానివంకచూచి యతడు తనవంక చూచుటలేదని మరల తనత్రాడు పేనుకొనుచుండెను. చల్లని యీదురుగాలి యొకడువచ్చి యాపిల్లతలమీాద నెండుతుంగ

గుబురుమీదవలె యథేచ్ఛముగా విజృంభించెను. దానికనులలో చల్లగాలిచొరబడి చిన్నికన్నీటిబొట్లు తెచ్చెను.

బండివాడు—కుట్టా సేతుపతి మహారాజులుంగారు రేపుడు వత్తురు.

పిల్ల—ఎవరు?

బండి—బాబుగారు.

పిల్ల—బాబుగారా? (అని ఆగి) నాకు తెలియదు.

చిన్నతుప్పర మొదలుపెట్టెను. అది పెద్ద వర్షమునకు మొదలని బండివాడనుకొనెను. పిల్లలేచి చూడుదాకపోయి తనచేతులు వానలో చాచి చేతులు తడిసిన తరువాత రెండు చేతులు మొగమున రాచుకొనెను. బండివానిని చూచి నవ్వెను. అంగడినుండి యేవో సరుకులు కొనితెచ్చు సేవకుడు తడిసిపోదునని తొందరగా నడచుచుండెను. తుప్పర పెద్దదయ్యెను. గుఱ్ఱపుసాలలలో కట్టివేయబడిన గుఱ్ఱములు పెద్దచినుకులు నేలపై నాకులపైఁబడి చేయు సవ్వడికిఁ గనులు పెద్దవిచేసి వెనుతిరిగిచూచెను. ఒక గుఱ్ఱము సకిలించెను. ఆ సకిలింపు నందిపుచ్చుకొని గుఱ్ఱములన్నియు సకిలించెను. ఆరుబయటనున్న తడియరాని వస్తువులను పరిచారికలు లోనికిఁ దీసికొనిపోవుచుండిరి.

ఇరువురును గలసి లోనికిఁబోవు లోపుగా నేకవీర సేలువంచు తడిసినది. ఇరువురును గదిలో పట్టుపరుపులపైఁ గూర్చుండిరి. ఒక పరిచారికవచ్చి యేకవీరపై సేలువతీసి దులిపి దూరమున గాలికారఁ బెట్టెను. ఇంకొకదాసి మరల నింకొక సేలువతెచ్చులోపల మీనాక్షి చకితయయ్యెను. ఎక్కడనా యీమెను చూచితినని యామె పోల్చుకొనలేకపోయెను. మీనాక్షి యాకదలిక యేకవీరకు తెలియకపోలేదు. ఆకదలిక కేకవీర చెప్పుకున్న యర్థము వేరు.

మీనాక్షి గార్హస్థ్యవృత్తాంత మేకవీరకు తెలియదు. ఏకవీరసంగతి మీనాక్షికి తెలియును. మీనాక్షికి తెలియునని ఏకవీరకు తెలియదు. ఏకవీర యూహాలో తమప్రేమల గూర్చినంతవరకు ఒకరిసంగతి నొకరు తెలియరాని గూఢతఁజేసి గౌరవమునందు సమాన ప్రతిపత్తికలరని విశ్వాసము. మీనాక్షికి స్థానాపతికి గాఢప్రేమము కాబోలును. లేకున్న మీనాక్షికింత యుత్సాహ మెక్కడిదియని ఏకవీర మీనాక్షి యూహాలో నేకవీరరహస్యము తనకు తెలిసి యునికి నసమానప్రతిపత్తి. ఆ మెరహాస్యము తనకు తెలిసియుంటఁజేసి యేకవీరయునిన యొకవిధమైన లోకువ. ఆలోకువతనములో నగౌరవ మీషత్తును లేదు. ఆరహస్యము తెలిసిన మీనాక్షికి నేకవీరతోఁ జనవు సహజముగాఁ బుట్టినది. ఈ సంగతి తెలియుని యేకవీర కాచనవుభాగ మవగతము కాలేదు.

స్త్రీలు సామాన్యముగాఁ గలసి కొన్నపుడు తమ భోగములనుగూర్చి వారికి తెలియజేయుట యలవాటు. దొడ్లు, త్రోవలు పడకగది, జవాహిరీ యితరస్త్రీకి చూపించి వారి

దృష్టిలోఁ దానుగౌరవము సంపాదించుకొనుట స్త్రీలకు సహజము. ఆ సంగతి తెలిసికొనఁ బ్రయత్నించుట నూతనలకు సహజము. ఇన్ని నాళ్లేకవీరామీనాక్షులు కలసికొనినను మీనాక్షి యీప్రసంగము తెచ్చినది కాదు. ఏకవీరకనుమానము. తమ వైముఖ్యము స్థానాపతికి తెలియునని కుట్టాఁ తనకు చెప్పినాడు. స్థానాపతిభార్యతో చెప్పి యుండవచ్చును. ఇది యేకవీరకు మనస్సులో నొక కష్టశల్యము.

ఆనాఁ డేకవీర మీనాక్షిని తీసికొనిపోయి, యిల్లంతయుఁ జూపించెను. ఆ మహాసౌధమున నున్న శిల్పమునకు వైశాల్యమునకు భాగ్యమునకు మీనాక్షి తల తిరిగిపోయెను. చివరకు పడకగది చూపించెను. ఆ యెత్తయిన మంచము ఆమంచమునందలి పనితనము, గోడలలోనున్న దేవతావిగ్రహములు మీనాక్షి కదియొక స్వర్గమనిపించినది. ఇరువురును మెట్లమీదుగా పెద్ద మంచముపై కెక్కి దానిమీదఁ గూర్చున్నారు. బయట జాజిపందిరిమీద చినుకులు పటపటధ్వనులు చేయుచుండెను. చల్లనిగాలి గవాక్షముగుండ గదిలోనికి రొయ్యిమని పోసుకొన్నది. ఇద్దరి సేలువలు తొలగిపోయినవి. వారు మరల సర్దుకొనలేదు. మీనాక్షి మనస్సులో నొకవర్షాకాలగాఢనీలావిల శర్వరీ మధ్యవేళాగగనభాగపరివ్యాప్తకాలమేఘ గర్భభేదియైన సౌదామని మెరసి మరల గాఢాంధకారములు క్రమ్మివైచెను. పరిక్షాళితమైన యొకపాపవాంఛాస్మృతి యామె మనసు లోతులలో సంగతమయ్యెను. లోనిమాధుర్యానుభవము ధర్మభీతి నంకురించనీయ లేదు. ఏకవీర పయ్యెద తొలగెను. నేత్రములర్ధనిమీలితము లాయెను. వాన జోరుమని కురియుచున్నది. వంతెన క్రిందితూములనుండి నిండు కాలువ నీరు వడ బోసుకున్నట్లు మరల నీదురుగాలి గదిలోనికి పోసుకున్నది. మంచముపైన దుప్పటిలేచి వారి యిరువురిపైన పడ్డది. ఆగాలి చలి తాగలేక యేకవీర తన సేలువతీసి కప్పుకొని లోని తన దేహము ముడుచుకున్నది. ఆగాలి చలి కొడలు పులకించి మీనాక్షికంచెల ముడిసడలనిచ్చి యెదఱొమ్మున వానచినుకులుపడి రెండుచేతులు చాచి చల్లనిగాలిని కౌగిలించుకున్నట్లు చేతు లెద నదుముకున్నది.

కొంత సేపటికి వాన వెలిసినది. బండివాడు శకటము తెచ్చినాడు. మీనాక్షివచ్చి శకటమధిరోహించెను. బండితరలిపోయెను. బండిలో పోవుచున్న మీనాక్షికన్నులు నేకవీరకన్నులు కలసినవి. అదే వీడుకోలు. వచ్చినది మొదలు వెళ్లువరకు మీనాక్షికి నేకవీరకు నొక మాటయైన జరుగలేదు. ఏకవీరకు విచిత్రమైనది. సేతుపతులసౌధము దాటిపోవుచున్న మీనాక్షికి చెరసాలనుండి బయలుపడ్డట్లయినది. ఆమె పెద్దయూపిరి తీసికొన్నది. వానచేత రాజబాట యంతయుఁ దడిసినది. దారిప్రక్క నీళ్లునిలచినవి. ఇంతవాన కురిసినదని మీనాక్షికి తెలియనే లేదు.

వర్షర్తువు సకలముఖముల విజృంభించినది. గగనకూటపు టెల్లలయందు గుంపులు

గుంపులై మవ్వపుశంపలవంపులు సొగసుదాల్లు హరించినవి. మొగిళ్లు అంపిలి నద్దెసల మొరసినవి. ఆకాశమునందు దూరమునుండి రివ్వుమన్న సవ్వడి వరుసకట్టిన బలాకముల ఱెక్కలదో, పరుగెత్తుకొనివచ్చు వానజల్లుదో తెలియుటలేదు. భూతమాంత్రికునిచేత బలాత్సమాహూతమైన యొకశక్తి వాయువీథికల ఛేదించుకు వచ్చినట్లు వాయువులు పెల్లురేగి మహాధ్వానముతో విజృంభించినట్లు నిశ్శబ్దనిశావేళ తుపానురేగిన సముద్రపుహోరు వినవచ్చినటు దూరమునుండి వానజల్లుప్రమోత వినవచ్చె. జనులు వెనుదిరిగి చూచుచుండిరి. వడగళ్లకై వెదకులాడి యొక చప్పని వడగల్లు నోట వైచుకొని పిల్లలు తమకు తగిలిన దెబ్బలు మరచిపోవుచుండిరి.

అందందు చిన్నపడెలుపడెలుగానైన వాననీళ్లలో గోరంకలు దంపతీయుక్తముగా కీచుకీచుమని రెక్కలుతడుపుకొనుచుండెను. శిశిరచంద్రజ్యోత్స్నకలహంసరీతివోలె జలదాంతర్నిగూఢబాష్పమై విముఖకా మొగలిపొట్టలలో నీరు నిలచి ఖండితసజలదీర్ఘసితాపాంగభ్రాంతి కల్పింపరాజహంసి భీతయై ప్రోషితభర్తృకవలె తామరతీగ గొడుగాకుక్రింద తలదాచుకోగా, నెమ్మి పురివిప్పి స్వాధీనపతికవలె నృత్యాభిరామమూర్తికా, మందారపూవును వదలి రాలేక రాలేక వచ్చిన తుమ్మెదయెడ నెఱ్ఱగన్నేరు ఈర్ష్యాకషాయితకా, వాసకసజ్జికవోలె నలంకరించుకుని కడిమి మేఘనాథునకు స్వాగతము పూన, బలాకాపాంగ మేఘనీలపటపరివృత యాకాశలక్ష్మి కాలపురుషుని నభిసరించ, విప్రలబ్ధాకృశీభూతదేహయష్టివలెఁ బోకభ్రమానుపై మొవ్వలోని యాకులవెంట కన్నీరుగార్చు వర్షాశ్రీసర్వాసాకృతివలె మోహనాతిమోహనయయ్యెను. నాగలి యఱ్ఱున లాగుచున్న పొలము కాపుబెద్దుండియుండి తన మొగమున నిలచిన వాననీరు తలకదల్చి విదల్చుకొనుచుండెను. పెద్దచినుకు రాయిపెట్టి కొట్టినట్లు పడగమీద విసురుకొనగా బుస్సుమని యెగిరి కోడెత్రాచులు గాలి కబళము ప్రక్కవాటుగాఁ గొరికి దున్నిన మెట్టచాలుల వెంట పొలము కోరడివెంట కంచెలలోని పుట్టలకు పరువులెత్తెను. పాచిపట్టిన పెద్దపొలము బావుల నీటిమట్టపు కొండరాళ్లు వెలికివచ్చి ప్రక్కదాగులు పడియున్నట్లు బావురు కప్పలు వర్షాలక్ష్మి లంబాడీయువతివేషము వేసి కాలధరించిన నత్తగుల్లల గొలుసుల బాణుగురు రవమువలె రాత్రిందివము లోకచే యరపులరచినవి. వాన వెలిసి క్రింద బురదపైన తూనిగలాడుట గాలిలేమి సాయంసమయములందు పొలము కాపులకు కిచారైపోయినది.

౨౦

ఆ సంవత్సరమున శ్రావణశుద్ధమున నే వర్షములు విజృంభించినవి. కాళయ్యార్ కోవెలలో నుదయర్ సేతుపతి కోటకట్టి కొంత సైన్యమచటఁ గాపుంచెను. హఠాత్తుగా నుదయర్ సేతుపతి వెళ్లిపోవుటయు కుట్టార్ సేతుపతి వచ్చుటయు సూచనగా రాజువ్యాధి, యాయన

ప్తి రామనాథమున వార్తగాపాకి వ్యాపించెను. కుట్టాణ్ కుబ్జవాడు. అతని ప్రతాప మెరుగని కాళయ్యార్ కోవెలలోని దోపిడి గుంపులకు అతడన్న భయము లేకపోయినది. చెదరిపోయిన గుంపులను చేరఁదీసికొని యొక నాటి రాత్రి హఠాత్తుగా పోర్చుగీసువా డొకడు నాయకుడుగా కాళయ్యార్ కోవెల దుర్గము ముట్టడింపఁబడెను. లోన రెండువందలసైన్యము మాత్రమే యున్నది. వారే కోటతలుపులు మూసి యుద్ధ మిచ్చిరి. రెండువందలమంది మధుర రాజసైనికులు నిరాయుధులై బయట నుండి పోయిరి. వార్త కుట్టానునకు మరునాడు ప్రొద్దున తెలిసెను, ఆవరకే దుర్గము శత్రువులకు స్వాధీనమై యుండునని వార్తావహులు వచ్చిరి. కుట్టాణ్ మాటాడలేదు. మరల మరల రాయబారులచేత నడుగఁబడి కుట్టాణ్ తా నప్పుడు రామనాథమును వదలివచ్చుటకు వీలు లేదనియుఁ దానువచ్చినచో రామనాథములో నల్లరులు పేటురేగవచ్చుననియు జెప్పి వారిని పంపించెను. రాయబారులు విషణ్ణవదనులై వెడలిపోయిరి. ఈవార్త రామనాథమున వ్యాపించెను. కాళయ్యార్ కోవెలకును వ్యాపించెను. కాని రామనాథమున పట్టమంగళమున దుర్గములు యుద్ధములకు సిద్ధములు చేయబడుచుండెను. రాజసైనికులు ఆయుధములు పదునుపెట్టుకొనుచుఁ గోటలోనికి సాధన సామగ్రి నింపుకొనుచు ముట్టడి కెదురు చూచుచున్నట్లే తోచిరి. అందఱును కాళయ్యార్ కోవెల శత్రుహస్తగతమైన దనుకొనిరి. లోని సైనికులు నిరాశులైరి. వారిలో కొందఱు కోట శత్రువులకు స్వాధీనము చేయుదమని మఱికొందఱు వద్దని వాదపడిరి. కోట వెలుపల నాలుగువందలమంది ప్రజలు కత్తులు కటారులు తుపాకులు ఉన్నవిగాని వారికి గుఱ్ఱములు, ఏనుగులు, పిరంగులు లేవు.

మూఁడవనాటి సాయంతనమున ముట్టడి. ప్రజలు కోటతలుపులవద్ద ద్వారభేదన ప్రయత్నములు చేయఁజొచ్చిరి. వారందరిలో నొక యువకుఁడు మిగుల నుత్సాహము చూపుచుండెను. అతఁడు సుభువుగా తక్కినవారి హృదయ మాకర్షించెను. గడ్డపలుగులతో భేదించి పెద్దదూలములను ద్వారములకానించి రెండువందలమంది పూనినెట్టి తలుపులు ఛేదించ వీలు లేక చివరకు నొక యుపాయ మాయువకునికి తట్టెను. తలుపుక్రింద చిన్నగొయ్యిగాఁ ద్రవ్వి తమవద్దనున్న తుపాకిమందు దానిలోకూరి యగ్ని ముట్టించవలెనని అందఱును సంతోషించిరి. గుంపులోనున్న పోర్చుగీసువారుకూడ శ్లాఘించిరి. ఈప్రయత్నములు లోపలివారికి తెలిసెను. వారిలో వారు క్రిందమీదఁబడి తలుపులు తెరచుటకు నిశ్చయించుకొనిరి. ఆ వార్త బయిట నున్నవారికి తెలియజేసిరి. జయజయధ్వానములు పిక్కటిల్లిపోయెను. కాని తలుపులు తెరవబడకపూర్వము కొన్నిషరతులకు వా రంగీకరింపవలెను. కోట కధికారి హిందువుడే యై యుండవలెను. లోపలనున్న సైనికులుకూడ కలిసెదరు. వారినికూడ ముట్టడివారిలోఁ జేర్చుకోవలెను. కొంతవిచారణ

యైన తరువాత నీమరతుకు ముట్టడివారిలోని పోర్చుగీసులుకూడ నీనిబంధనల కొప్పుకొనిరి. సంధ్యారాగము కృశించి చీకట్లలముకొను వేళ కోటతలుపులు తెరచిరి. లోని వెలి సైనికులు మొదట బెరుకుతో, తరువాత చిరునవ్వుతో మరికొంతసేపటికి కొంత చనవుతోఁ గలసికొనిరి. ఇరుపక్షములవారును పెద్దకాగడాల వెలుతురున సభ చేసిరి. కోట యెవరి యొద్దికలో నుండవలెననియు మరల రాజసైన్యమువచ్చి ముట్టడివేసినచోఁ గోట నెట్లు రక్షించవలెననియుఁ బ్రశ్నలు బయలు దేరెను. కోట ముట్టడివేళ నుత్సాహము నెఱపిన యువకుడు కోటకు నాయకుని తీర్మానించిన చో నతడే తక్కిన సంగతులు విచారించుకొనునని చెప్పగా నందఱును సంతసించిరి. పోర్చుగీసుల కితని ప్రాముఖ్యము మనస్కరించలేదు. కాని వారిసంఖ్య ముప్పదికిమించి లేదు. అందుచే వారు నంగీకరింపక తప్పినదికాదు. సర్వజనీనముగా నా యువకుడే కోటకధికారిగా నెన్నుకొనఁబడెను.

అతడు మఱునాడు కందకము బాగు చేయించెను. క్రొత్తగా నీరు పెట్టించెను. కోట గోడ సడలినచోట బాగుచేయించెను. ముట్టడి వేళ బయట మిగిలిపోయిన రాజసైనికులకుఁ గబురంపి వారినికూడ రప్పించి యందరిని కలియ నిచ్చెను. ఊరిలోనున్న వారిలో నెవరైనదండులో చేరెడివా రుండిరేమో యని వెదకింపగా నుత్సాహముకొలది రెండువందలమంది వచ్చి చేరిరి. సైన్యము వెయ్యిమంది యయినది. వెయ్యిమంది సైన్యమును పదిభాగములుగా జేసి కోటలోనున్న రాజసైన్యములో వారిని ఆరితేరిన వృద్ధులనుతొమ్మండుగురను, తానును పదిభాగముల కధికారులనుగా నిర్ణయించెను. పోర్చుగీసువారిని ముప్పదిమందినొకభాగములో నుంచి తక్కినసైన్యమునుండి యాభాగములో నుండుట గౌరవ మనుకున్న వారి నందరిని తెప్పించి యాభాగములోఁ జేర్చెను. ఈ భాగమునకు తానే నాయకుడు. తాను వారిని మిక్కిలి పొగడి కోటముట్టడివేళ వారే సహాయపడవలెనని యుద్బోధించి తక్కిన తొమ్మిది వందలమందిని కోటకు నాల్గువైపుల నాల్గు రెండువందల నునిచి వందమందిని తనకు ననుచరులుగా నేర్పరుచుకొని యాపోర్చుగీసు భాగమునకు పనినేరుపరచక వదలెను. కోటకు మిక్కిలి యపాయము వేళఁగాని వారినికదల్ప రాదని చెప్పెను. వారును ప్రమత్తులై యథేచ్ఛముగా నూరివెంటఁ దిరుగుచు కోటకు వచ్చుచుఁ బోవుచుండిరి. రెండుమూనాళ్లైయిన తరువాత నాయకుడు వారిని గ్రామములోనికిఁ బోవునపు డాయుధములను కోటలోననే వదలిపోవలెనని యాజ్ఞ యిచ్చెను. వారు ప్రమత్తులై త్రాగి యారెండునాళ్లుగా గ్రామములో చేసిన యల్లరుల మూలముగా నీయాజ్ఞ సైన్యమంతకు సమంజసముగానే కనంబడెను. ఒకనాటి రాత్రి పోర్చుగీసు సైన్యభాగము కోటలోనికి రాలేదు. రాతిరి కోటతలుపులు వేయబడెను. వారు వెళ్లిపోవునపుడు వారాయుధములు కోటలో వదలియే పోయిరి. ఆ

రాత్రి నాయకుడు సభ చేసి వారారాత్రి కోటకు రాకపోవుట దోష మని నిరూపించి నెమ్మది నెమ్మదిగా వారు గర్వముగలవారని పోర్చుగీసు వారిని నమ్మరాదని, వారిని తాను పొగడిన పొగడ్త యబద్ధమని, వారెవ్వరుగాని తక్కిన వారికన్న పెద్దయుద్ధనిపుణు లేమికాదని సైన్య ము మనస్సు వారియెడల విముఖముగా జేసెను. రాజసైన్యముమీద తిరుగుబాటు చేసిన ముట్టడి నాయకులనందరిని నాయకు డా భాగములోనికి దీసెను. నాయకుడు వారిని గూర్చి చెప్పుచు వారే ముట్టడికి ప్రధానులని 'మొన్న రాజసైన్యముమీద దిరుగబడిరి. రేపు తమమీద దిరుగబడెద' రని చెప్పెను. సైన్యములో నెక్కువభాగము వారియెడల విముఖత దాల్చెను. ఆ పెద్దసభను వదలి నా యకుడు సైన్యభాగముల నాయకులను బిల్చి ప్ర త్యేకసభ చేసెను. వారు తొమ్మండుగురు రాజ సైన్యములోని నమ్మిక బంట్లని నాయకునకు తెలియును. అందుచేత నాయకుడు వారితో నిట్లనెను 'రేపు ఉదయ: సేతుపతి ఫిరంగులను తెచ్చును. పదివేల సైన్యమైనను తెచ్చును. రాజసైన్యము ముందు మనము నిలువలేము. మనము పోర్చుగీసులను సహాయత పిలువ వలెను. లేదా రాజునకు లొంగవలెను. ఇందు మీకేది యిష్టము!' పదిమందియు నొకరిమొగ ము లొకరు చూచుకున్నారు. నాయకుడు మరలనన్నాడు. 'మీరీసంగతి పోయి మీసైన్య ములతో సంప్రతించి రేపు నాకు సలహానిండు నేను రేపుదయమున పోర్చుగీసు సైన్యభాగము తో నొక సాహస కార్యమునకు బోవు చున్నాను. ఎల్లుండి సాయంకాలమున కిందుం డెదను. ఈలోపుగా కోట వీరయ్యప్ప నాయ కుని క్రింద నుండును.'

వీరయ్యప్ప నాయకుడు తెలుగు కాపు. మధుర రాజుల క్రింద పేరుమోసిన జోదు. ఏబదియేండ్లు దాటినవాడు. కోట యిట్లు దోపిడి కాండ్ర వశమగుటకు దుఃఖించుచున్నవాడు.

మరునాడు పోర్చుగీసు సైన్యభాగము ప్రొద్దుననే కోటలోనికి వచ్చెను. వచ్చిన దాల స్యముగ నాజ్ఞమీద సాయుధమై నాయకుడు ముందుగా గుర్రములమీద కోటనుండి వెడలి పోయెను. వెనుకతలుపులు కిర్రుమను ధ్వనితో మూయబడెను. నాయకునకు ముప్పదియేండ్ల లోపు. నల్లనివాడు. కొంచెము పొట్టివాడు. విశాలములైన నేత్రములు. మీసములునల్లగా దుమ్మెదరెక్కలవలె నుండును. శరీర మాయ స స్తంభమువలె నున్నది. అతని సేనానాయక లక్షణములును, గుఱ్ఱముమీదపోవు నతనిలాఘ వమును చూచి వెనుకనుండి సైన్యము కోట గోడలమీదికి, అతనివెనుక నేవచ్చునది,యతని యెడల భయభక్తులు పెంచుకున్నది.

వింట విడిచిన శరము వలె సైన్యము రెండుజాములవరకు స్వారి చేసెను. నాయ కుని యాజ్ఞ నొకచోట దిగి వారు గడియ పాటు విశ్రాంతి తీసికొనిరి. వెంట తెచ్చు కొనిన యాహారమును భుజించిరి. మరల గుఱ్ఱములెక్కి యెక్కువవేగముతో బోయిరి. సైన్యభాగముననున్న దేశీయులకందఱకు వారు

రామనాథమును సమీపించుచున్నారని తెలియును. వారు తమనాయకునియెడల నాశ్చర్యము పొందుచుండిరి. అతని సాహసమునకు నివ్వెఱపోవుచుండిరి. ఆనందపడుచుండిరి. ఆయానందములో నాయకుడు తమయెడల నెంతో యాశపెట్టుకున్నా డందువలన గలిగిన గర్వము నున్నది. ప్రొద్దుగ్రుంక బోవువేళకు రామనాథము చేరిరి.

నాయకుడు దూఱబయట సైన్యభాగము నాపి యిట్లు చెప్పెను: 'ఇది రామనాథము. రామనాథ దుర్గవృత్తాంత మంతయు నాకుఁ దెలియును. ఇప్పు డొకమహాసాహసము చేయుచున్నాను. మీరందరు రామనాథ సైన్యపుదుస్తులలో నున్నారు. మీకేమియు గుర్తుపడిపోవుదుమన్న భయము లేదు. ఈ కార్యము నెగ్గినా మీయశస్సు దిక్కుల నిండగలదు.' అని పోర్చుగీసుసైనికుల ముప్పదిమందిని ఒకభాగముగాఁ దక్కిన డెబ్బదిమందిని ఏడుపదులుగాఁ జేసి మూడుపదులు తనతో రమ్మని తక్కిన నాలుగుపదులు కోట నాలుగుదిక్కుల నున్న ద్వారములకడకుపోయి రాతిరి రెండుజాములకు వేచియుండుడనెను. ఆనాల్గుపదులును విడివడి పోయెను. రివ్వున నరువదిమంది సైనికులతో నాయకుడు కోటవద్దకుపోయెను. దుర్గద్వారము తీసియున్నది. నిరభ్యంతరముగ లోన ప్రవేశించెను. ప్రవేశించినంతనే కోటతలుపులు మూయబడెను. నాయకుడు రాజసౌధమువద్దకు శరవేగమునఁ బోయెను. రాజసౌధము ముందు విశాలమైన ప్రదేశమున వేయిమంది యశ్వసైనికులు కవాతు చేయుచుండిరి. నాయకుని చూచినవెంటనే సైన్యమంతయు జోహారు చేసెను. సేనానాయకుడు గుఱ్ఱమును నాయకునివద్దకు తెచ్చి వంగి నమస్కారము చేసి 'స్వామీ! యేమియాజ్ఞ!' అనెను. నాయకుడునవ్వి! 'సుందరేశ్వరనాయకుడా! మీకు పోర్చుగీసుబంటులు కావలయునేని యీముప్పదిమందిని మీరు సైన్యమున జేర్చుకొన వచ్చును. తక్కిన ముప్పదిమంది కాల్బలము. వారికి శిక్షచాలదు. గోవిందనాథుడుగారికి చెప్పి వారిని పదాతులలో చేర్చుకొనుడని చెప్పుడు' అనెను. వెంటవచ్చిన యరువదిమంది మొగములు వెలవెలఁబోయినవి. అందఱును గుఱ్ఱములు దిగుటకు వెంటనే యాజ్ఞాపింపబడిరి. వెయ్యిమంది యాశ్వికదళము నెదురుగా జూచుచు వారేమి చేయుదురు? గుఱ్ఱములు దిగిరి. కొత్వాలు వారిపేరులు నమోజు చేసికొనెను. ఆరాత్రి నాల్గుద్వారములవద్ద కాచిన నలుబదుండ్రు సౌజన్యముగా నాయకుని ప్రత్యేక దర్శనము పొంది రామనాథ సైన్యదళములోఁ జేరిరి. ఆనూఱుగురు నీవిచిత్రమైన వంచనకు ముగ్ధులై పోయిరి. పరవశులయిరి. భీతిగొనిరి. కొందరు కోపగించిరి. వారికోపములు చుట్టున నున్న వేలకొది సైన్యముచూచినంత రంగు వేసిన గుడ్డతో చేసిన గులాబిపూవుల రంగువలె జారిపోయినవి. వారిలోఁ గొందఱకు నాయకుడెవరో తెలిసినదికాదు. అందులో నొకనికి రాజసైన్యమున నెఱిగినవా డొక డుండెను. వానితో రహస్యముగ 'నాయన ఎవరు' అని

యడిగెను. అతడాశ్చర్యపోయి, 'నీవెరుగవా! కుట్టాన్ సేతుపతి మహారాజుగారు, ఉదయన్ మహారాజుగారి కుమారుడు' అనెను. వానికి చేయి గుండెలోపలకుఁ బోనిచ్చి గ్రుద్దినట్లయ్యెను. రాతిరి తెల్లవార లానూరుగురకు నిదుర పట్టలేదు. వారితోపాటు మరి నూరుగురకు పట్టలేదు.

గడచిన మూడునాల్గుదినములుగా మబ్బు పట్టినయాకాశము నాఁటినాఁడెండ కాచినది. కాళయ్యార్ కోవెలలోనున్న నాల్గువందల రాజసైన్యములో నున్నవారికి బంధువులు, స్నేహితులు రామనాథసైన్యమునుండి రెండు వందలమంది యేరబడిరి. వారితో కుట్టాన్ సేతుపతి కాళయ్యార్ కోవెలకు నాటిసాయం కాలము ప్రయాణమై ఆమఱునాడు సాయం కాలమునకు నెమ్మదిగా కాళయ్యార్ కోవెల చేరెను. నాయకు డిబ్బడిసైనికులతో వచ్చుట చూచి కోటతలుపులు సంతోషముగా తెరువబడెను.

స్నేహితులు స్నేహితులు కౌగిలించుకునిరి. బంధువులు బంధువులు చనవుకొలది యోగక్షేమము లడుగుకొనిరి. క్రొత్తవారందరు రామనాథసైనికులని క్రొత్తవారిలో నాలుగువందలమందికి పైగాఁ దెలియును. ఈ విచిత్రసంయోగము నిగూఢార్థవంతమై పోయెను. అంతలో సైన్యమంతయు సమావేశము కావలెనన్న పిలుపు హాజారపుగంటలు పిలచెను. పదునొకండువందల సైన్య మాచిన్ని కోటలోని బయలున క్రిక్కిరిసిపోయెను. నాయకుడు సైన్యము నిట్లు సంబోధించెను. 'నా వెంట రామనాథసైన్యము వచ్చుటకు మీ రాశ్చర్య పోవుచుంటిరి. ఇచటినుండి పోయిన నూర్గురు సైనికులు రామనాథసైన్యములోఁ జేరి నిన్ననే మొదటినెల జీతము ముందుగా బుచ్చుకొనిరని మీకు దెలిసినచో మీరు మరియు నాశ్చర్య పడెదరు. మీసంశయము తీరుట కొక కథ చెప్పెదను. ఉదయన్ సేతుపతిగారికి కుట్టాన్ సేతుపతియని కుమారుడు. శ్రీ ముద్దుకృష్ణప్ప నాయక మహారాజగారికి మరణసమయము ప్రాప్తించి యుదయన్ సేతుపతిగారు మధురకు వెళ్లి కుట్టాన్ సేతుపతిని రామనాథమునకు పంపించిరి. కాళయ్యార్ కోవెల తిరుగబడెను. కుట్టాన్ ముట్టడివాండ్రలో చేరి తాను వారికి నాయకుడయ్యెను. ముట్టడివాండ్రకు కుట్టాన్ నకు వారికి భక్తి వీనికి ప్రేమ కుదిరెను. ఈ విచిత్రసంఘటనమువలన ముట్టడివారందరు కుట్టాన్ద్వారా మధురరాజు సైనికులైరి. ఒకవందమంది ముట్టడిదారులలో నాయకులా రాజుసైన్యమును ముందుగా చేరిరి. తక్కిన వారు నేడు చేరనున్నారు.' అని నాయకుడాగెను.

రామనాథసైన్యము క్రొత్తమంది మహారాజు కుట్టాన్ సేతుపతిగారికి జయము జయమని ఘోషించిరి. నాయకుడు మరల 'ఇక్కడనున్న ప్రాతసైన్యము నాలుగువందల మందికిని రామనాథమునుండి నా వెంట వచ్చిన రెండు వందలమందికిని పీరయ్యప్ప నాయకులుగారు జీత మిప్పుడే యిచ్చెదరు' అనెను. ఆరువందల

కంఠములు జయజయధ్వానములతో నాకాశమంటెను. వీరయ్యప్ప నాయకులు చేయిపైకెత్తగా సవ్వడి యాగినది. నాయకుడు మరల 'తక్కిన యయిదువందల మందిని నేటినుండి మహారాజ సైన్యములో చేర్చుకున్నాము. ఇప్పుడు వారికిఁగూడ నెలజీతములు ముందు ఇచ్చుచున్నాడు. వారికి బహుమానములు మధురనుండి కొద్దిదినములలో రాగలవు.' అనెను. అప్రయత్నముగాఁ బదునొకండువందల మంది జయఘోషము చేసి వాయువీథులసహజ శబ్దగుణసామర్థ్యమును బద్దలుకొట్టిరి. సైన్యము శాంతపడినతరువాత కుట్టాన్ మహారాజు వెలరాళ్లు పొదిగిన పిడులతోడి తొమ్మిది ఖడ్గములు తొమ్మండుగురు సేనానాయకులకు బహుమతి చేసెను. వీరయ్యప్ప నాయకుని మొగ మానంద బాష్పములచేత చల్లని చెరువునీటి కెరటాలు చిందిన తామరపూవువలె నుండెను. తక్కిన యెనమండుగురు నాయకులును కన్నులలో నాశ్చర్యము, పెదవులలో కదలిక, గుండెలలో భీతి, శరీరములందు వినయము, శిరస్సులయందు కృతజ్ఞతా నమ్రత్వము తాల్చిరి. సైన్యమంతయుఁ గూర్చున్నది కూర్చుండగానే డబ్బుపంచి పెట్టబడెను. సైన్యమునకంతకు తెల్లవారువరకు నిద్రలేదు. తరువాత కొంచెమునిద్ర. అందులో సుఖస్వప్నము. ఆనాడు వాన ఘోరముగాఁ గురిసెను. అగస్త్య సముద్రమువలె తెపకలు కొట్టుకొనుచుండెను.

నాలుగురోజు లయినతరువాత కుట్టాన్ రామనాథమునకు బోయెను. వెంటనే తాను రామనాథమునుండి తెచ్చిన రెండువందల సైనికులలో నేబదిమందిని, ముట్టడివేళ ప్రమాదిల్లిన రెండువందలమందిని, క్రొత్తసైనికులలో మూడువందలమందిని, కోటముట్టడివాండ్రకు స్వాధీనము చేయుమన్న నూటయేబదిమందిని కలిపి యేడువందలమందిని, యెనమండ్రు నాయకులను రామనాథమునకు తీసికొనిపోయెను. కాళయ్యార్ కోవెల నాల్గువందలమంది సైనికులు వీరయ్యప్పనాయకుని సంపూర్ణాధికారము క్రింద నుండెను. కోటవదలిపోవు కుట్టానునకు, వీరయ్యప్ప 'నాయకుడా! సెలవు' అనెను. కుట్టాన్ నవ్వి 'ఇక మీరు నాయకులు' అనెను.

౨౧

ఉదయన్ సేతుపతి మధురలో పట్టాభిషేకోత్సవములు పూర్తియైనతరువాత భాద్రపద శుక్ల పాడ్యమినాడు బయలుదేరి పంచమినాటికి రామనాథమునకు వచ్చెదనని కొడుకునకు కబురంపెను. కాళయ్యార్ కోవెల తిరుగుబాటునుగూర్చి కుట్టాన్ తండ్రికి వర్తమానమంపెను. సేతుపతి కోవెలతిరుగుబాటు రాజుతో జెప్పెను. రాజు సేతుపతిని పొమ్మని తొందర పెట్టెను. తిరుమలనాయకుడు 'కుట్టానున్నాడు ఫరవాలేదని. పట్టాభిషేకోత్సవము లైనతరువాతనే సేతుపతి పోవచ్చునన్నాడు. ఉదయన్ సేతుపతికి తొందరయెక్కువైనది. చిత్రముగా దాను పూర్వము రాజుమాట తీసివేయజాలనట్లు తిరుమలనాయకునిమాట కాదనజాలమి నెఱింగికొని యుదయన్ సేతుపతి

యాశ్చర్యపోయెను. అదిమొదలు తిరుమల నాయకుని తాను కలసికొనినప్పుడెల్ల నతనిని పైనుంచి క్రిందకు దిగజారచూచెడివాడు.

నాడు శ్రావణబహుళ దశమి. వర్షము జోరుమని కురియుచున్నది. కుట్టాన్ రామనాథమున రాజసౌధముపై గూర్చున్నాడు. కాళయ్యార్ కోవెల గెలుపువలన నతని మనస్సు మహానందమున మునిగియుండెను. కాని యతనిమనస్సులో నొక శంకకూడ నుండెను. క్రొత్తగా నైదువందలమంది సైన్యము చేర్చుటకు దన కేమి యధికార మున్నది. తండ్రి కోపగించును. అట్లు చేర్చుకొనకపోయినచో మరలం దాను అల్లరులకవకాశమేర్పరచినవాడ నగుదునని కుట్టాన్ తలచెను. తృప్తిలేని యైదారువందలమందిని వదలినచో నొక పెద్దశత్రుసైన్యమును రేపి వదలిపెట్టినట్లగును. అట్లువదలినచో దానుచేసిన వంచనకు వారిలో బ్రత్యపకృతిబీజమును నాటినవాడగును. అందుచేత వారిని సైన్యములోనికి దీసికొనక తప్పినది కాదు.

జరిగిన వ్యవహారమంతయు గుట్టాన్ లేఖ వ్రాసి రాజుగారికిని, తండ్రికిని పంపించెను. ఒకవేళ రాజీ క్రొత్తసైన్య మంగీకరించనియెడల దానేమిచేయవలెను? దూరమున నాకసములో నొకమెరపు మెరసెను. కుట్టానున కేకవీర కనులకు కట్టినట్లు కనిపించెను. కట్టతెంచిన బోదెనీరు పొలములోనికి బోసుకున్నట్లు వాని మనస్సు జలజల ప్రవహించి యేకవీర తన యిన్నాళ్లపొందికలేని జీవనము, మీనాక్షీ వీర భూపతుల వివాహము, తన మనఃపరివర్తనము, తన మనస్సులో నేకవీర తాల్చిన ప్రణయరూపము, ఆమెను తాను చూడరాని రాచకార్యముల యభ్యంతరము నూహాపై నూహగా నతనిని క్రమ్ముకొనెను.

రెండుసంవత్సరములనుండియు తనమామగారు రాలేదు. కూతును చూడలేదు. తనకు తన మామగారికి పూర్వమేమియు సంబంధము లేదు. మామగారు సైన్యమును తాను తీసికొనునేమో. ఆయన మంచి సరదారు.

ఏకవీర మొదటిసారి తలంటిపోసుకునితన మంచముమీద తెల్లని చీరతాల్చి నిద్దురవోయిన-పెండ్లియయిన తరువాత మూడునెలల నాటి కథ స్మృతికి వచ్చెను. మెరపు తటాలున మెరసెను. కుట్టానునకు తెల్లచీర తాల్చిన యేకవీరను చూచినట్లయ్యెను. ఏకవీర తనకు భార్యయగుటచేత, తన సుముఖతయే యభ్యంతరమగుటచేత నిరభ్యంతరముగా మనసులో కుట్టాన్ ఏకవీరను కౌగిలించుకొనెను. ఆమె భుజములు, కంఠము, నేత్రములు ముద్దులతో నింపెను. ఆమె రహోవిస్రబ్ధయై యతని యెదురొమ్ముపై విశ్రమించెను. అప్పుడు తమగుజ్జుపు వాళ్లపిల్ల అమృతము తొంగిచూచెను. కుట్టానునకు నవ్వువచ్చెను.

మరల సైన్యముమాట తోచెను. తండ్రి కోపగించెను. మామగారు తాను భరించలేననెను తానే స్వంతముగా సైన్యమును పోషించుచుండెను.

ము సేపయినను నిల్పుటకు వీలులేకుండెను. తుమ్మెదలు పందిరిమీద నిలువలేక పందిరి క్రిందకుఁ బోయెను. మరల నొక చల్లనిగాలి తెర యేకవీరమీద పోసుకొనెను. ఆగాలివేగమునకు జాజిపందిరి కదలాడి పోయెను.

ఏకవీర జుట్టుముడి వీడి యామె భుజముల మీద వ్రాలెను. ఆమెపయ్యెద తొలగి పోయెను. ఆమెకనులు మూసికొని పోయెను. ఆమె త్వగింద్రియము రక్తప్రవాహదఘ్నముగా నీచల్లగాలిని కొలుచుకొనెను. గాలి మరల మరల నామెమీదికే వినరుకొన్నది. గాలి పొరవచ్చినపుడెల్ల నామె సరిగా కొలుచుకొన్నది.

వర్షమింకను పెద్దదైనది. పందిరిమీద చినుకులు పడుటయేగాని పడుట మరలపడుట యనుకాలవ్యవస్థ గోచరించుటలేదు. వానకు తడిసి కంచుమోతపోయిన నగారామీద సన్నని పుల్లలతో నెడతెరిపిలేక మ్రోగించిన మ్రోగించుటలోఁ గొరివి గిరున త్రిప్పినచోఁ దిప్పుచున్న జ్ఞానముపోయి యొక్కటియే యొజ్జని యగ్నివలయాకృతి యేర్పడినట్లు వేగముగా మ్రోయించిన నొక్కడే మొదలు, తుద, మధ్యస్థితిలేని ఏకమైన మ్రోతకలిగినట్లు పందిరిమీద ధ్వనికలుగుచుండెను వానబరువునకు పందిరి కదలిపోవుచుండెను. వర్షధ్వని తప్ప యింకొకధ్వని గాలిలో లేదు. మరల పెద్దగాలి రివ్వున వినరెను. పందిరి సౌధముమీది కొరిగెను. మంచముమీద పరచిన బందరు కలంకారుదుప్పటి యెగిరి యంచులు ముడుచుకొనెను. ఏకవీర విడివడినజుట్టు ఆమె మొగమున పడుచున్న భుజములమీదఁ బ్రవాహవేగమున విధూతమైన శైవలమువలె నల్లలాడెను ఏకవీరకన్నులు గట్టిగాఁ దారకలపైన కనురెప్పలు, రెప్పలకండలు నాలుగంగుళముల పొర యేర్పడునట్లు మూసికొనెను. నిష్కంచుకమైన యామె యెదఁబొమ్మ నవవరాహముదూసి చన్న వెనఁరుపాదవలె సోగ్యాధోభాగముగఁ గంపించెను. ఆమె త్వగింద్రియముయొక్క స్పర్శగుణవ్యాప్తి చర్మము దాటి లోని నోరువెచ్చని రక్తప్రవాహము దాటి శల్యములదాక తాకెనని తోచినదామెకు. ఆమెకు బాహ్యజ్ఞానము పోయినది. ఇంతలో నీదురుగాలివెంట చిక్కని వానజల్లు వచ్చి యామెమీద దుపాను మొదలుపెట్టువేళ సముద్రపుకెరటము లొడ్డున నున్నవానిమీద కొట్టుకొన్నట్లు కొట్టుకొనెను. ఆమె పంచేంద్రియగుణములు స్పర్శగుణత్వము పొందెను.

కొంతసేపటికి పెద్దవాన దూగిపోయి మరల తుపరలోనికి దిగినది. అంతసేపటికి ఏకవీరకు స్మృతి కలిగినది. తన్ను తా జూచుకొన్నది. తల విరబోసుకున్నది. ఎదఁబొమ్మ దిగ్వాసముగా నున్నది. వాన తగ్గినది. సన్నని గాలి రేగినది. జాజిపందిరి యాకులు పూవులు సన్నని నీటిబిందువుల బరువుచేత గదలలేక కదులుచున్నవి. ఏకవీర ప్రక్కగా చూచినది. గుజ్జుపువాళ్లపిల్ల అమృతము తన పెద్ద కన్నులు మరింతపెద్దవిచేసుకుని ఏకవీరవంకతదేకదృష్టితో జూచుచున్నది. ఏకవీరకు నిలు

వెల్ల సిగ్గయినది. తొందరగా తల ముడివేచుకుని నేలువ యెదఱొమ్ముమీదికి లాగుకొన్నది. మరల నమృతమున్నయెడ జూచినది. అమృత మందు లేదు.

ఏకవీరకు భయము వేసినది. ఆపిల్ల తన వంక నేల యట్లు చూచినది. ఈసారి దానిని చూచినప్పుడు కోపించవలెననుకున్నది. మరల నేమో విచారించ నారంభించినది.

చిన్నప్పటినుండియు నేకవీరకు వర్షాకాలమన్న దన్మయత్వము. మరియు జిన్నప్పుడు వానలోదిరిగి తండ్రిచేత దెబ్బలుదిన్నది. మఱి కొంచెము పెద్దయైనతరువాత పట్టుచీరలు వానలో దడిపి తల్లిచే జీవాట్లుతిన్నది. ఒకసారి వానలో నిలుచుండి బిగుసుకుపోయినది. ఇదివర కామె వానలకు, జల్లగాలులకు దన్మయత్వము భజించెడిది. రెండు సంవత్సరములుగా నామెలో నొక క్రొత్తమార్పు వచ్చినది. ఆమెకు గాలి తన చల్లదనము కొలిచి చెప్ప మొదలుపెట్టినది. ఆమె దేహము క్రమక్రమముగా వాయువుయొక్క శైత్యోష్ణతల పరిమాణము కొలుచు విచిత్రయంత్రమువలెనైనది. కస్తూరిపూత, మంచిగంధపుపూత, కప్పురపుపొడి, వట్టివేళ్ల విసనకర్ర, మలయానిలము వీని ప్రత్యేకస్పర్శసుఖానుభవ మామె మనస్సునకు చక్కగా నేరుపరచి చదివిన పొత్తములోని యర్థమువలె విజ్ఞాతతత్తద్గూఢత్వకించిద్గూఢత్వాగూఢత్వముగా విస్పష్టముగా దెలియవచ్చెను.

అమృతము మరలవచ్చి తొంగిచూచి పారిపోయెను. ఏకవీర కలవరపడెను.

వర్షాసాయంసంధ్య వచ్చెను. పగలెల్ల వెలుగురేక లెరుగని రోదసి యావేళకు పడమటిదిక్కున నల్లనిమేఘముల నలుపులో గ్రుడ్డి మెఱుపులు తిరిగెను. శివరాత్రినాటి కృష్ణపక్షగాఢయామినీవేళ గర్భగుడిలో నేకాభిషేకముచేత చెమ్మగిలిన యవకాశమున కర్పూరనీరాజనము వెలిగించగా దట్టమై నల్లనైన హారతిపొగ హారతిజ్వాలను కమ్ముకొన్నట్లు పొలిచిన దా వర్షాసాయంసంధ్య. దీపము వెలిగించు పరిచారిక గదిలోనికివచ్చి యేకవీరను సవినయముగా బిలచెను.

శ్రావణశుద్ధ దశమినాడు వత్తునని కబురంపించిన వీరభూపతి బహుళ పాడ్యమినాడు గాని యింటికి రాలేదు. వచ్చి భోజనముచేసి మరల రాజసౌధమున కేగెను. ఆనాటి కీనాడు బహుళదశమినా డింటికి వచ్చెను. ఈకాలములో మీనాక్షి ప్రేమ బీరువో లేదు. క్రొత్త క్రొత్తరుచుల వంటకములతో బతి నారగింపించి తాను గబగబ రెండుమెతుకులు తిని మేడపైకి పతి ననుసరించెను. వర్షము ద్రుతతాళ మందుకున్నది.

మీనాక్షి గవాక్షపక్షములు మూసినది. లోపల చీకటియయినది. వీరభూపతి మంచముపైన గూర్చున్నాడు. మీనాక్షి ప్రక్కనిలుచుండి తామలపాకుల కీనెలుతీసి సున్నము రాచి చేయిచాచినది. వీరభూపతి చేతనందుకున్నాడు. కొంతసేపటికి పతి చాలుననెను.

చాలునన్న తరువాత మీనాక్షి యొకయాకు చిలకచుట్టి వీరభూపతి నోటి కందిచ్చినది. అతడు నోరు తెరువలేదు. మీనాక్షి ప్రక్కఁ గూర్చుండి యాకుతో పెదవుల నడుమ సందు చేయఁ జొచ్చెను. అతడు కోపగించెను. ఆమె చిన్న పుచ్చుకొనెను. అత డంగీకరించెను. వర్షము గవాక్షపు తలుపులను రంయిమని గొడ్డళ్లతో గొట్టినట్లు కొట్టుచుండెను.

మీనాక్షి—మీరు సరిగా నింటికివచ్చి నెలనాళ్లయినది. అంతపనియున్నదా యేమి?

వీరభూపతి సమాధానము చెప్పలేదు. నిద్రవచ్చుచున్నట్లునటించెను. మీనాక్షి యది గ్రహించి మంచము దులిపి ప్రక్కవేసెను. అతడు పండుకొనెను. మీనాక్షి పాదము లొత్తబోయెను. అతడు వారించెను. బయటవర్షము ను గాలియు గవాక్షమును బ్రద్దలుకొట్టునేమొ యనిపించినది. వీరభూపతి యాపాదమస్తకము ముసుగుపెట్టుకుని మంచమునకు నడుమ పండుకొన్నాడు. ఆమెప్రక్కన పండుకున్నది. ఆమె ఒడ్డున నున్నది. క్రిందబడునట్లున్నది. అతడు జరుగలేదు. కొంచెము సేపున్న తరువాత నత నిని జరుగుమన్నది. అతడు జరిగి యటు తిరిగి పండుకొనెను.

అట్లు గంటసేపైనది. వీరభూపతి నిద్ర పోయినట్లున్నది. ఉచ్ఛ్వాస నిశ్వాసములు ముక్తపరిగృహీత వేళాసమానముగా కనిపించెను. మీనాక్షి యతనిపైఁ జెయివైచి మరి కొంచమాగి గట్టిగా దగ్గరకులాగెను. అతడు కదలలేదు. నెమ్మదిగా నొకచేతిమీద లేచి ముసుగుతీసి మొగమున చూచెను. గాలి విసురునకు గవాక్షము తోసుకొనివచ్చి ఒక జల్లు వచ్చి మంచమును తడిపెను. మీనాక్షి లేచి మరల తలుపులుమూసి గడియవేయు లోపల నామె మొగమున వానచినుకులు గ్రుడ్డుపోసినట్లుండెను. పైటయు రైకయు తడిసెను. వీరభూపతి మేల్కొనెను. మీనాక్షి రైకయు, జీరయు మార్చినది. వీరభూపతి అంగీ చల్లబడెను.

మీనాక్షి—గాలికి కిటికీ తోసుకొని వచ్చెను. నిద్రభంగమైనది.

వీర....(కొంచెమాగి) నిద్ర పట్టనే లేదు.

మీనాక్షి కలవరపడినది. కాని లజ్జ ప్రథమసోపానము దాటితి ననుకొన్నది. విచారించినది. తా నేమి తప్పుచేసినది? తన వాంఛ ధర్మబద్ధమైనదే ననుకున్నది.

వీర—రాజసౌధమునకు బోవలయును.

మీనాక్షి—బండివాడు రాలేదు.

వీర—నడచిపోయెదను.

మీనాక్షి—తడిసిపోదురు.

వీర—పని యున్నది. మీనాక్షి నవ్వియేదో అన్నది. వీరభూపతి కది వినపడలేదు. అతనికిఁ గోపము వచ్చినది.

మొగ మట్టుత్రిప్పుకున్నాడు. మీనాక్షి దగ్గరకుఁబోయి "కోపమెందుకు 'పని తడిసిపోవునా' అంటిని. క్షమించుడు" అనెను. వీరభూపతి కుక్కిరిబిక్కిరయ్యెను. దొడ్డిలో నేదో పెద్ద ధ్వనియయ్యెను. మీనాక్షి భయఁపడెను. వీరభూపతి 'దొడ్డిలో నేదో చెట్టు గాలికిపడెను'

కాబోలు నన్నాడు. ఆమె పతిదగ్గరగా నిలుచున్నది. వీరభూపతికి ఒక కాలువ తూర్పుగట్టు మీద నిలుచుండి పడమటిగట్టున కెట్లు చేరుదునా యనుకున్నట్లయినది. ఇంతలో నతనికి కన్నులు గిర్రునతిరిగి రెక్కలు వచ్చినట్లయి పడమటి ·గట్టుమీదికి పోయి తూర్పుగట్టున కెట్లు చేరుదునా యనుకొనుచున్నట్లు తోచినది తనజీవితము. పూర్వము తాను చేరవలసిన స్థానము పడమర నున్నది. అది విచిత్రముగా తూర్పునకు తిరిగివచ్చినది. తాను పడమటిగట్టుపై నున్నాడు.

వర్షము బయట కొంతసేపు మద్దెలలు వాయించినట్లు, కొంతసేపు వెదుళ్లూదినట్లు కొంతసేపు తాటియాకు లీడ్చినట్లు కొంతసేపు అవ్వాయిచువ్వ లెగురవైచినట్లు, తోటాలు కాల్చినట్లు పిచ్చివానివలె నల్లరిచేయుచుండెను. ఇరువురును రెండవగదిలోనికి బోయిరి. మీనాక్షి కనులు తనచిత్రముమీదికి పోయెను. దానికి దూరముననున్న వీరభూపతి చిత్రమును తెచ్చి యామె రెండును దగ్గరగా నుంచెను. వీరభూపతిబొమ్మ కలకల నవ్వినది. స్థానాపతి యాలోచనా నిమగ్నుడైనాడు. మీనాక్షి బొమ్మ విచారముఖము సూచించినది. మీనాక్షి మొగము కలకలలాడినది.

పతి మాటాడలేదు. మీనాక్షికి కనుల యెదుట తెరగా నాడినది. ఆమెచూపు తన పతి పూర్వప్రణయిని చిత్రముమీద నిలచినది. ఆచిత్రమున నామె తెల్లనిచీర ధరించినది. కేశపాశము పొడిపొడిగానై ముంగురులు గాలికి కదలుచున్నవా యనున ట్లుండెను. మీనాక్షి యులికిపడినది. 'శ్రీ సంస్థానంచాప్సర స్తీర్థమారా దాశ్లిష్యైనాం జ్యోతిరేకం తిరోభూత్.' అన్న వాక్యములోని యనుభవమునకు సాజాత్యమైన యొకయనుభవ మామె మనోనేత్రము నెదుట గలిగినది.

బయట వాన తగ్గిపోయి మరల మొదలు పెట్టుచున్నది. ఇంక జాముప్రొద్దుండవచ్చును. మీనాక్షి నిరస్తభూషయై యింట బనులు చూచుకొనుటకు బోయినది. వీరభూపతి సంకల్పవికల్పశక్తి గోల్పోయిన మనస్సుతో మరల నిద్రకు బడినాడు.

పట్టాభిషేకోత్సవములు వర్షాకాలమున బడిపోయినవి. ఉత్సవములకన్న క్రొత్తరాజు క్రింద జేయవలసిన రాజ్యపు కట్టుబాటులకే చాలకాలము పట్టుచున్నది. వర్షము వెలిసిన సాయంకాలముల రాజసౌధపు టేనుగులు మొగసాలనుండి రతనాలుకుట్టి వెలగల జరీపనులు చేసిన పట్టుహౌదాలతో నూరుతిరిగి రాబోయి మరల రాజసౌధమునకు బురద మరకలతో వచ్చుచుండెను. ఉత్తమజాత్యశ్వములకుగూడ గాలుజారుచుండెను. రాజసౌధపు ముంగిళుల నౌబత్తుఖానాల మ్రోతకూడ వానలకు చెమ్మగిల్లినట్లు మందముగా వినబడుచుండెను. విద్వద్బ్రాహ్మణులు రాజుగారిచ్చిన క్రొత్తసేలువల బంగారము దర్భాసనములలో దాచి తడిసి పోవునని భయము వదలక వంగివంగి పోవుచుండిరి. సాయంసంధ్యలు నల్లనల్లనై విషాద భావము మూర్తికట్టినవి. (సశేషము)

మంగలిమేళం



మొదటి దినము



రెండవ దినము.



మూడవ దినము



నాల్గవ దినము.



ఆఖరు దినము.

దివ్యవిభూతి

సోమంచి అన్నపూర్ణేశ్వరశాస్త్రిగారు

సాయంకాలమున నొంటరిగ నిర్మానుష్య ప్రదేశమున నదీకూలమున గూరుచుంటిని. ఆలోచింప మొదలిడితిని. ఈలోకమున సౌఖ్యమునకు మార్గమేది?—ప్రాయశఃమానవుడు మానవునకీ సౌఖ్యరహస్యమును బోధింపలేదు. ఒకచో బోధించినను వీలైనమార్గమున కాదని కొందరు తలతురు.—ఈచుట్టుపట్టులనుండు భూతములయైన నది బోధింపగలుగునా?—చాల సేపటులనే యాలోచింప మొదలిడితిని. చుట్టునుచూచితిని.

ఆకాశమున జాబిల్లి షోడశకళాపూర్ణుడై ప్రజాలోకవర్తనకు నవ్వుచుండెను. నదీజలము లాతని జూచి నవ్వుచుండెను. తారకలు నవ్వుచుండెను. చంద్రికాస్నాతలై పంచభూతములును సంతసించుచుండెను. సకలవిశ్వమును సంతసముతో నోంకారమంత్రము నుపాసించుచుండెను. కాని నా క్షుద్రహృదయమునమాత్రము సంతసము లేదు, శాంతిలేదు. భూదేవి నిరుపమానక్షమాధురంధరయై, కేవలము తనసుఖమును మఱచి, తనమీద నివసించియున్నవాని కన్నిటికిని సౌఖ్యప్రదాయినియై యుంటినన్నగర్వమున విఱ్ఱవీగుచుండెను. రేవెలుంగు తానే లోకము నంధకారపిశాచమునుండి తప్పింపగల్గితినని కేరింతలు కొట్టుచుండెను. అట్టి వెలుంగు తనకంటెను తామే ఘనమైనవని తలచుచున్నటులు నదీతోయములు, జాబిల్లి తనకరములుసాచి, వానిలో తెలుంగుదమని తలంచుచుండినను తా వీయకుండుటకు ప్రయత్నించుచుండెను. ఇట్టి తోయములనుకూడ దానుచలింపజేయు శక్తి గలిగినట్లు గంధవహుడు తలచి సంతసించుచుండెను. సర్వభూతములు నిట్లున్నవి. కాని అంతటను శాంతి. అపూర్వశోభచే వెలుంగు నాసర్వభూతములు నాయోంకారము నుచ్చరించుచు పరమేశ్వరు నుపాసించుచుండెను. తమతమ శక్తులదెలిసికొనియుండియు, వానిని ప్రకటింపజాలు నహంకారమున్నను, సకలభూతములును పరమేశ్వరు నుపాసించుచున్నవే!—వీనిశాంతియు, సంతసము నీమంత్రమహిమచే కాబోలును!—ఎంతటియహంకారమున్నను శాంతి నందవచ్చును. సంతసమున నుండుటకు మార్గమున్నది:—

ఎప్పుడట్లు నిష్కళంకములగు తారకాచంద్రు లాకసమున వెలుంగుచుండునో, ఎప్పుడట్లు సకలప్రకృతియు నాయనంతుని మహాకీర్తిని పొగడుచు నోంకారమున నుపాసించుచుండునో, అట్టియతడే మానవుడు. పరమేశ్వరధ్యానయుక్తుడగుటకును, ప్రకృతిరహస్యము నరయుటకును నిశ్శబ్దతను, శాంతిని గోరును.—అపుడే మానవుడు తానాయనంతశక్తునికభిముఖుడైయున్నటులు దెలిసికొనగల్గును. అపుడే మానవున కుద్రేకముగలిగి, మహత్తరరహస్యముల దెలిసికొన ప్రయత్నించును. అపుడే యాతడు తనకాలదిని తెలిసికొనుటకు శక్తుడగును. ఈయనంతవిశ్వమున దానసహాయుడై, విచారగ్రస్తుడై దీనుడగును. ఆయనంతుని దివ్యనామోచ్చారణమున సకలవిశ్వమునకును గలిగిన ప్రతిభయు, సుఖమును తనకెట్లు చేకుఱనేరవో యనెడి విచారము గలుగును. అపుడే మానవు డాపరబ్రహ్మమునుగూర్చి, ఈవిశ్వమేమి? మానవు డెవడు?"—అని ప్రశ్నించును. ఇట్టిస్థితియే నాకును గలిగినది. ఈ మానవజీవితమునకు ఫలితార్థమేమి?—

ఓంకారమంత్రోచ్చారణమునచే సకలభూతములకు నిట్టి చిదానందమొదవుచున్నదే! ఇట్టిపరమావధ ముండగా మానవున కిందుల కేచింత?—సుఖములనఱచుకొనుట కింకను నుపాయము లెందులకు?—ఎపుడైన మానవు డిట్లొంటిగ, రాత్రియందు, ఉదాసీనభావము లేకుండగ, నిశ్చలముగ, సరిగనర్థముచేసికొనుచు చూచినాడా! ఈస్వర్గీయానందవిభూతినలరుచున్న యీ సకలవిశ్వమును వీక్షించినాడా!—వీక్షించియుండినయెడల తప్పక సరియైనమార్గము దివ్యవిభూతి నొందుటకై దొంకియుం

డును. సచ్చిదానందముతో నటు దేవులాడుటయే కాని మార్గము వెదుకవక్కఱ లేదా? ప్రపంచమంతయును తల్లడిల్లి పోవుచున్నది!—ఐశ్వర్యము, భోగము, సుఖము—యీ మూడును ప్రతిమానవునకు కావలసినవే. ఇది యంతయు నెందులకు? ఎల్లప్పుడును సుఖముగనుండుటకే యీ యైశ్వర్యములు. కాని యెట్టి విధమైన యైశ్వర్యము ప్రపంచమునందు సర్వసాధారణముగ సౌఖ్యప్రద మయినదని ప్రశ్నించినయెడల నిర్ణయవిధానము దుర్ఘటము. ప్రతిమానవునికిని, ప్రతిజీవికిని ప్రత్యేకముగ నొకవస్తువే యైశ్వర్యప్రదమయినది; సుఖము నిండించునది. వ్యక్తిభావమునుబట్టి యది మారుచున్నపుడు జనసామాన్యమునకు సౌఖ్యరహస్యబోధన యెట్లుచేయుట? కాని ప్రతిమానవుడును దీనినిగుఱించియే మాట్లాడును. ఏది తనకు సరిగ తెలియదో దానినిగూర్చియే మానవుడు యెల్లపుడును వాగుచుండును. కనుక నాకు మాత్రము తెలిసియుండునా? కాదు కాదు. నే నెప్పుడును ఈ సకలానందకరవిభూతినుండి విముక్తుడనైననేమి? ఈ వివిధశృంఖలాబద్ధసంఘసమూహములనుండి దూర మేగిననేమి. ఈ మానవప్రపంచమునుండి నిష్క్రమించిన నేమి" అనియే చింతించుచుంటిని. ఇట్టిస్థితిలోనే యీ నదీతీర సంచారము కలిగినది.

అపుడే యెన్నడును లేని ప్రౌఢి యబ్బినది.

నేను మానసికలోకమున కష్ట జీవిని. అందుననే జీవితము దుఃఖదాయక మని తలచియుంటిని. మానవు డెవ్వడైనను యీ యైహికసుఖ మనుభవించినను, ఎంత కాల మనుభవించినను దాని ననంతమని పిలచినాడా? ఏ జీవియైనను సుఖమాశించి పొందినను, చాలకాల మనుభవించినను దానిని త్వరగ మఱచిపోవును. అనగా ఆసుఖము క్షణికముగనుండును. అందుచే మానవుని మానసికస్థితి ననుసరించి జీవితము చాలభాగము దుఃఖభాజనముగనే భావింపవలయును. అనగా మానసిక ప్రవృత్తిలోనే యీ దుఃఖ మిమిడియున్నది. కష్టకాలమే, కొలదియైనను యెక్కువగనగుపడును సుఖకాలమే క్షణికమగును. కనుక సంపూర్ణమైనదియు, విచ్ఛిత్తియెఱుగనిదియు, నగు సుఖముకంటె మానవునకీప్రపంచమందు కావలసినదేది? అట్టి సుఖము నెట్లుపొందుట? ఏవిధమైన సుఖమైనను, ఐహికమైనపుడు, క్షణికమైనదే!—కాని క్షణికముకాని, యలౌకిక సౌఖ్యముగలదా యని ప్రశ్న.—దేవుడనిన మండిపడు మానవులుకూడ నెప్పుడే నొకప్పుడు, కొన్ని వేళలందు, మానవజీవిత మపేక్షించు సుఖముకంటె, నీభౌతికవిషయజనిత సుఖముకంటెను మహత్తరమైనది. యీ పంచేంద్రియవ్యాపారసుఖముకంటె విశేషమైనది. మానసికమైన సుఖమెద్దియోగలదని నమ్ముచున్నారు. కాని మానసికమైనదయినను అనంతమైనదగునా? కాని కొందఱు మానసమే శాంతమైనపుడు మానసిక మనంత మెట్లగునని ప్రశ్నించుచున్నారు. మానసికసుఖ మనంతమా?

ఇట్లాలోచించుచు నూరుచుంటిని. ఒంటరిగ నాయనంత సాగర నదీతీరమున నుంటిని; చుట్టునుచూచితిని. అదివఱకెన్నడు నెఱుగని యపూర్వభావప్రౌఢి యబ్బినది. నావలె మానసిక వికలతనెఱుంగని వృక్షములు చంద్రికాలహరిలో నీదులాడుచు, నేవిధమైన విచారము నెఱుంగక యొండొంటిని కౌగిలించుకొనుచు, వాయుప్రసారము చలించిన యాకులమధ్యనుండి ప్రసరించుచున్న ధవళచంద్రికాకిరణమివలంబున నవ్వుచు, సౌఖ్యరహస్యముల గుఱించి గుసగుసలాడుచుండెను. అనిర్వచనీయమౌనమునవలంబించుండిన వివిధజంతుజాలమెవరించు నవ్యక్తమధురస్వరములచే ప్రకృతిశోభాయమానమై కనుపట్టెను. ముగ్ధత వహించెను. సర్వభూతసమ్మోహనమైన యామాధురి ననుభవించుటయే నిశారమణికిష్టము కాబోలును! సకలదేవతాపరివారుడై, యిట్టి పవిత్రసమయమున నేగాబోలు దివ్యసుందరుడగు నామహానటుడు క్రీడించుట! ఇట్టి సమయముననే గాబోలు సకలమానవబృందమును ఆ విశ్వమోహనునివేణునాదము నాయోంకారమున నాపాదించి తన్మయతనెందునేమో! ఇట్టిసమయములనేకాబోలు మానవుని హృదయమందు నద్వితీయమయ్యు క్షణికమగు నట్టి, యనిర్వచనీయమయ్యు శేముషీధురంధరమైనట్టియు, నవ్యక్తసుందరమధురమయ్యు మహత్తరమైనట్టియు, నాయనంతసాగరప్రాంతముల నించుకచేరుచుండిన మహోద్రేకములు వెల్లివిరియును! ఇట్టిరాత్రియందే గాబోలు నాయపూర్వప్రకృతి ప్రతిభ తనమహాశక్తిచే మానవుని

వశీకరణ మొనర్చును:—ఇట్లాలోచించుచు నిశ్చలముగ నా ప్రకృతిసౌందర్యమును జూరగొనుచుంటిని.—

ఉన్నట్టులుండగానే యేదే నొకయసంబద్ధమగు సత్యమొకటి స్ఫురించినట్టులు దోచెను. అవశ్వరమగునీసకల ప్రకృతిభూతియు, ప్రతిభయుకూడ నిశ్చయమైనదేనా? ఇదివఱ కెన్నడెఱుగని యొక యవస్థ లోనైతిని.— హృదయము గభీరముగ చలించెను. విచారముచే క్రుంగిన నా క్షుద్రహృదయమున నొకానొక యాశాజ్యోతి యుత్పన్నమయ్యెను. వదనమున విన్నదనముపోయి యొకవిధమైన చిరునవ్వు తోచెను. అహంకారమదమున నేను దానిని పూర్వమనేకపర్యాయములు మహాపురుషులు తామాస్వర్గవిభూతి ననుభవింప సంతసముతో నాయనంతుని సన్నిధిని తలంచినపుడు వారిముఖశ్రీల వెలువొందిన దానిగ దలంచితిని. అయ్యో! ఎంతవెఱ్ఱి!

కాని, దానివంత చులకనగా త్రోసివేయజనదు. ఎందుకనగా, నెవడేని యొకమానవుడు తనజీవితమందున నెట్టి మహదాశయములు లేకనే, మహదాదర్శముల జేరుటకై ప్రయత్నింపకయున్నను సంఘము సహించును. పైగ గౌరవించును. కాని, యెవ్వడైన నొకడట్టివి గలిగి యుండి వానిని జేరుటకై యష్టకష్టములబడియు, చివరకు దారిలేక, వ్యధితుడై సాధారణజీవితమున బడినయెడల సంఘము వానిని వెక్కిరించును. వాని నీసడించి ధిక్కరించును!

కాని యీ యజ్ఞతయేమి?—సంఘము నాకేమి యగును?-ఇది భ్రాంతిమూలకము నాయహంకారమదమే నన్నిట్లు చేయుచున్నది. అగును! నే నింకను సాధారణ మానవప్రకృతికి భిన్నుడను కాలేదుగాదా? అందుచే తనేకాదా యీ వికలత్వము, యీసౌఖ్య రహస్యశోధన!

మానవుడు బహిఃప్రకృతిని జయించి సౌఖ్య మనుభవింపజూచుచున్నాడు. అది నిజముగ నద్భుతమే!— కాని మానవుని యంతఃప్రకృతిని జయించి సుఖమందుట మఱియు నద్భుతము!—నిజముగ నీగ్రహముల యొక్కయు, తదితర ఖేచరగోళములయొక్కయు గతుల నెఱుంగుటయు, నాగతులకు మూలమైన శక్తిని దెలిసికొనుటయు ఘనమే; కాని మానవునిలోనున్న యహంకారమునకు నుద్రేకములకును, హావభావములకు కారణమైన యలౌకికశక్తి నెఱుంగుట మఱియు నద్భుతము! ఈ మానవునిలోని త్రిగుణములను జయించుటయు, మానసిక ప్రవర్తన నరికట్టుటయు మఱియు నద్భుతము. సాధారణ మానవుడు ప్రాపంచిక మగునట్టియు, తనకు కానబడు నవియునగు విషయములచేత దఱచిచూడ బ్రయత్నించుచునుగాని మనోనేత్రమునజూచి గ్రహింప బ్రయత్నింపడు. అట్టిమానవుడెపుడును ప్రాపంచికవిషయముల గ్రహించి వానివలననే సుఖమొనగూర్చికొన బ్రయత్నించును. పంచేంద్రియములకు గలిగెడు సుఖములకే యాతడాసించును. వానిని గనియేస్వర్గవిభూతితో తులదూగుచున్నట్టుల సంతసించును. కాని యిట్టిసుఖమే యనంతమైనదా? సాధారణముగ మానవుడు సుఖాపేక్షచేతనే యీకాలప్రవాహమున గొట్టుకొని పోవుచున్నాడు. ఆసుఖమునైనను క్షణికములను వానిమూలముననే పొందగోరుచున్నాడు. కాని నిజమగువది యేదియు,ననంతమైనదియు నగు సుఖము నెట్లు పొందగల్గునో తెలిసికొన బ్రయత్నించుట లేదు!

కాని కొందఱు మహాత్ములు "ఈ పంచేంద్రియ వ్యాపారములవలన నిజమగుసుఖము గలుగనేరదు. నిజమైన సుఖమెప్పుడును ఆత్మయందే యుద్భవించును. అట్టి సమయమున నాత్మచోదితములగు మానసాదులుగూడ దాని ననుభవింపగలుగును. అట్టి ఆత్మానందముపొందుటకై మాయనుండియు మమతనుండియు విముఖుడైయుండవలెను. అపుడే మానవుడు పరమేశ్వరుని యనంతసన్నిధినుండుటకు సమర్థుడు."—ఇది నిజముకాదని చెప్పుటకు మానవునికి హక్కుగలదు? మాయనుండియు, మమతనుండియు విముఖుడైయుండుటవలన నుపయోగము లేదనుటకు హక్కుగలదు?—ఉపయోగము పైకికనుపడకపోయిన విషయములన్నియు నబద్ధములేనా? ఉపయోగానుపయోగవిమర్శన తత్త్వరహస్యమునరయువారికొప్పునా?—ఉపయోగము కలుగుటయే నిజమైనదానికి తార్కాణమా? అదిగాకపోయినను మానవుడు భౌతికమైనయెడల సుఖమును క్షణకాలమే పొందుచున్నాడుకాని, సర్వదా యనుభవిం

చుట లేదు! ఇట్టిసంగతియే మానవుని యనంతసుఖశోధనయందు ప్రవేశింపజేసినది. అందు మూలముననే చిదానందస్వరూపులగు మహానులగూర్చి ప్రశంస యీ ప్రపంచమున వినబడుచున్నది. ఆత్మజ్ఞాని యొక్క డనుభవించిన సుఖము మన మెప్పు డనుభవింపలేము. ఆతడెల్లప్పుడును స్వర్గవిభూతితో — దివ్యవిభూతితో — తులతూగుచుండును.

ఈస్వర్గీయమగునట్టియు, యనంతమగునట్టియు, చిదానంద మొందకుండుటకు సాధారణమానవుడు తన్నే యీ పాంచభౌతిక దేహముగను, లేకమానసముగను తలచుటయేకారణము. మహర్షులు "ఏ 'నీవు'సర్వశక్తుడవో, సర్వమయుడవో, నిష్కల్మషుడవో, పరిపూర్ణుడవో, అట్టి 'నీవు' యీమాయలోబడి, అహంభావముతో, స్వలాభపరాయణతతో సకలవిధములైన వికలతకును, కష్టములకును, సకలాపజయములకు లోనగుచున్నావు. ఒకప్పుడు భౌతికవిషయములవలన దేహసుఖ మనుభవించినను, మానసిక సుఖమనుభవించినను, ఆ సౌఖ్యసమయము దాటి పోగానే కష్టసముద్రమున బడుచున్నావు." అని చెప్పుచున్నారు. కావున మన యీలోకమున సాధారణమానవుని లౌకికజీవితము సుఖమైనదని దలచుట యెట్లు?—

ఇట్టి విషయములగూర్చి తలచుచు కూరుచుండుట బట్టి యిట్టి భావములు స్ఫురించుచుండెనా! లేక యిట్టి మహావాక్యములలో నిజముగలదనితోచుటయుపజ్ఞయా? ఏమో!—అప్పటి నామనోవృత్తము సరిగ తెలియుట లేదు కాని హాయి కల్గుచున్నది.——మానవుడెపుడు తానీ చిన్నశరీరమని యనుకొనుచున్నాడో యపుడే తాను చుట్టునున్న సకలప్రపంచమునుండియు వేఱగుచున్నాడు. ఈ భేదభావము కల్గుటవలననే సకలకష్టములకు లోనగుచున్నాడు. మానవుడెపుడు తన యల్పత్వము, నీచత, యజ్ఞతవదలుచున్నాడో యపుడీప్రపంచము విచార క్లేశములేయుంగని స్వర్గమగును.—— మానవుడు సకల ప్రకృతిని జయించుగాక, యెంతకాలము తానెవ్వరో తెలిసికొనక యుండునో యంతకాలములను ఈ క్లేశపాశముల నుండి తప్పించుకొనలేక తన్నుకొని చావవలసినదే!

ఇట్టిభావము లుదయించుసరికి నాకు దేహము తెలియలేదు. శరీరము తేలికయైపోయినది. వికలత్వముపోయినది.——ఉన్నటులుండి యంతయు శాంతము. క్రమముగ భావములకుకూడ తావులేకుండపోయెను. కాని యొక విధమగు నత్యంతానంద మనుభవించితిని.——నేనేమి యెట్లు తలంచుచుంటినో తెలియలేదు. ఏది యెట్లు విమర్శించుచుంటినో యవగాహముకాలేదు. ఇట్టిభావములు గల్గుటకు గల కారణముగూడ తెలియలేదు. ఎందుల కిటు లాలోచించుచుంటి ననుకొంటిని.——మానసికతత్త్వ మరయుట కష్టముగదా!

కొలదిసేపటికి భావస్ఫురణకూడ తగ్గిపోయినది. తరువాత యెప్పటి మనఃస్థితియే! మానసిక సుఖము క్షణికమని యనుభవమైనది.

"ఈ జీవితమున సుఖమందు కెట్లు? ఈజీవితమునకు ఫలితార్థమేమి?" అని యాలోచించుటవలన కాబోలు యిట్టిభావస్ఫురణము. కాని యీయలౌకిక భావప్రౌఢి మానవున కిట్టి ప్రకృతిసాంగత్యమున జనించునేమో? అని తలంచుచు నాకసమున నాదృష్టినిల్పితిని. అపు డొకచిత్రము కానవయ్యెను.

ఒక మేఘశకలము స్వచ్ఛమగు నీలాకాశమున నెటనుండియో వచ్చినది. ఉన్నటులుండి యామేఘము రెండుముక్కలయ్యెను. నే వారెంటియందును రామలక్ష్మణులను చూచితిని. భావప్రపంచమున వీలు లేని దేమున్నది! వారిద్దఱును సల్లాపము చేసికొనుచుండిరి. వారి ముఖశ్రీయం దెచటను చింతారేఖ లేదు. సౌభ్రాత్రమున తన్మయులై సర్వమును మఱచియుండిరి.

కొలదిసేపటికి వారి మధ్య నొకమానిసి, మేఘశకలమున సృష్టింపబడెను. అదియే సీత. ఉన్నటులుండి రామలక్ష్మణులు పనాటులైరి. సీతమాత్రము మాఱలేదు. ఆమె రామునిభుజముపై తలనిడికొని క్రింది ప్రపంచ లక్షణముల పరీక్షించుచుండెను. శ్రీరాము డన్నియు నామెకు చూపుచున్నాడు. ఆమె దుఃఖించుచుండెను. లక్ష్మణుడు కూడ విచారించుచుండినటులు కన్పట్టెను. క్రమముగ సీత మాయమయ్యెను. లక్ష్మణు డేదువ నారం

భించినాడు. రామునిపాదములో వ్రాలి యేదియో ప్రతిమాలినాడు. రాముడు లక్ష్మణుని లేవదీసి యాతనితో "వత్సా! మన మెట్టింటిమో, యేరీతిని ప్రపంచమును విమర్శింతుము. మనలోని ప్రకృతియే మనము బయటను జూచుచున్నాము. కనుక, ఎపుడును క్లేశములను గుఱించియు, దుర్మార్గములను గుఱించియు, పాపములనుగూర్చియు మాటాడకుము. ఇందఱు తత్త్వవేత్త లుదయించి యాత్మతత్త్వమును బోధించిన నిట్టి పాపములును, దుర్మార్గములు నీప్రపంచమున జూచుచున్నందులకై విచారింపుము. ఎపుడును కష్టములకై విచారింపకుము. ఎపుడు నీవీప్రపంచవిషయమై, నిజముగ విచారించి, మానవునకుపకారము చేయదలతువో యపుడు నీవు చూచుచున్న పాపముల విమర్శింపకుము. ఈ పాపములును, దుర్మార్గములును సకలబాధలును ప్రపంచమున మానవుని శక్తిహీనతకు ఫలములే! — ప్రతిమానవుడును, చిన్నతనమునుండియు, తా నీవిశ్వమున నణుమాత్రుడనియు, శక్తిహీనుడనియు, పాపభూయిష్ఠుడనియును బోధింపబడుచున్నాడు! నీవుపకారముచేయదలతువేని, ప్రతిశిశువునకును "బ్రహ్మాస్మి" అను సత్యము నుపదేశింపుము! ప్రతివానికి తా ననంతశక్తుడనియు, పరిశుద్ధుడనియు, నెఱింగింపుము! ఈ సత్యము నెఱింగించి దాని ననుసరించి ప్రవర్తింపజేయుము. ఇదియే సత్యజ్ఞానము. ఇదియే సౌఖ్యరహస్యము. ఇది తెలిసికొనక మానవు డటులున్నాడు!" అని నుడివినట్లు నాకు వినబడినది. ఈ కొన్నిమాటలే నాకు వినబడుటకు కారణమేమి? ఇది యెల్లను నామనఃకల్పనమేమో? కాని జాగ్రదవస్థయందుండిన నాకు మోహముగల్గుటకువీలు లేదే!

ఇట్లనుకొనుచుండగా రామలక్ష్మణు లొండొరుల గాగిలించుకొనిరి. రెండు చిత్రము లేకమైపోయెను. దానినుండి మరల యిద్దరుద్భవించినారు. లక్ష్మణుని స్థానమున నర్జునుడు గాండీవము ధరించి నిలబడినాడు. రాముని స్థానమున మురళీధరుడు, కృష్ణుడు!— అర్జునుడు కృష్ణుని నుతించి ప్రార్థింపమొదలిడినాడు! ఆదివ్యసంగీత మాపంచభూతముల యోంకారమున లీనమైపోయినది. శ్రీకృష్ణుడు చిరునవ్వుతో నొకహస్తము నర్జునునిచేత నిడినాడు. అర్జునుడు మోకరించి యందికొనినాడు!— కృష్ణు డాతనిజూచి, యాతని విన్నదనమును జూచి "మిత్రమా! నీ వెందులకు విచారించెదవు? నీవెవరవో నీవెఱుంగలేక యిట్లు చింతించుచుంటివి. నీవమృతుడవు! నీవు జన్మాంతరహితుడవు! నీ కట్టిచింతగాని, క్లేశముగాని లేదు. దేనిచేతను నీవు బాధింపబడవు. నీ వాయనంత నీలాకాశమువంటి వాడవు. ఆయాకసముమీద నెట్లనేకవిధములగు చిత్రవర్ణములుగల మేఘము లనేకము వచ్చుచుండునో, మాయమగుచుండునో, కాని యెట్లు ఆకసమెపుడు స్వభావముచే ననంతనీలమో, అట్లే నీవును! నీవే యీ యనంతవిశ్వప్రభుడవు; అనంతశక్తుడవు; పరిపూర్ణుడవు; పరిశుద్ధుడవు; మంగళస్వరూపుడవు. ఈ విశ్వమందున్న శక్తియంతయు నీయందణగియున్నది. నీవు చిదానందస్వరూపుడవు. విచారించు టేల? అని మందహాసమొనర్చి అర్జునుని కౌగలించుకొనినాడు. ఒక్క మెరపు మెరసినది. మేఘము మాయమయ్యెను. నే నత్యంతవిస్మయాక్రాంతుడనైతిని. ఇది నాకు సందేశమా? నేను నాచుట్టునున్న భూతములలో లీనమైపోయినటుల దోచెను. ఇదియే స్వర్గసౌఖ్యమా? ఇదియే దివ్యవిభూతియా? ఓం తత్సత్.

ప్రేమ సూత్రం

పూడిపెద్ది వెంకటరమణయ్య గారు (కవితానమితి)

"అబ్బ! తెరిపయిందీ? పోనీండి! అంతే చాలును! తెల్లవారీదాకా రావడం మానేశారుకా! అదే పదివేలు. మీ కెప్పటి కయినా యీనిర్భాగ్యురాలు జ్ఞాపకంవస్తేఅదే మహామేరువు. స్త్రీముఖం కంటె శ్రీనివాస రావుముఖం మీ కందంగా కనబడుతుంది కాబోలు! స్నేహమైతే పగలల్లా కలుసు కుంటారు. చాలిందికాదూ? రాత్రి పన్రెండు గంటలదాకా మీరక్కడ బాతాకానీ చేస్తూ వుంటే నేనొక్కర్తినీ యిలా కూర్చోనా? బాగా నేవుంది!"

ఆమాటలు విని సుందర్రావు జేబులో వాచీతీసి చూచేడు. పావుతక్కువ తొమ్మి దయింది. కమలం మొగం చూచేడు. ఆమె కళ్లలో నీటిజాడలు కనబడ్డాయి. సుందర్రావు తగ్గివున్న దీపంతో సరిగా చిన్నబోయాడు. కమ లం అనురాగానికి మెచ్చుకొని కలకలలాడేడు. తన ముఖకళతో సరిగా దీపం హెచ్చించేడు. "కమలం!" ఇంకా తొమ్మిది కాలేదు. ఏమంత తొందర?

కమలం—"ఒక్కర్తెనూ ఉండలేకా. మరే ముంది? నాకేలాతొందర? నే నందరిలాగా తొందరపడీదాని నయితే బాగానే ఉండును. నేనెంత చేసుకున్నానో అంతేగాని యెక్కువ రమ్మంటే యెలావస్తుంది? నా తొందరచూచి మీ రాశ్చర్యపడితే తప్పలేదు. "మనసుకురాని మనువుకు నిలుచుచోటే నిద్ద"రట

సుందర్రావు:—"ఇప్పుడేమయిందిచెప్పూ?"

కమలం:—"ఏమిటవుతుంది? ఏమీ కాదు!" ఎందుకలా బొమముడేసి చూస్తారు? నాదే తప్పా? వసంతుడితో విరహవేదన చెప్పకుంటే కోకిలకంఠంతో కొప్పడ్డాడట. మన్మథుడు గదా అని పూలదండ కానుక పెడితే పుష్పబాణా లతో హృదయం పగులగొట్టడా? మీదా తప్పు? నాదీ! హృదయం దాచుకోలేకపోతే యిలాగేవుంటుంది. దామరపువ్వులాగు తెంపేసి మీపాదాలదగ్గర పడేశాను నా హృదయం! పరాకుచేతనైనా మట్టేస్తారు. మీ కేమిటి? మీరు మగరాజులు! ఆడుదాని అనురాగానికి కూడా తెరచాటుండాలి కదా?"

సుందర్రావు:— "ఊరికే నువ్విలా రొస రొసలాడితే యెలాగూ? రేపటినుండీ మరి పైకి రాత్రిళ్లు వెళ్లనులే. ఇవాళకు క్షమించేవా?"

కమలం—"అన్నిటికీ వెటకారమే! నే నా క్షమించీదాన్ని? మీ రేమంటే చెల్లదు? మీ యిష్టంవచ్చినట్టూ ఆడండి."

ఆయింట్లో సుందర్రావూ కమలంయిద్దరే వున్నారు. సుందర్రావు స్కూళ్ల ఇన్స్పెక్టరు గుమాస్తా. నల్భైరూపాయీలు కాబోలు జీతం యిస్తారు. మరి భూములూ పుట్లలూ యేమీ

లేవు. సుందర్రావు మంచిజాగ్రతగా కాలక్షేపం చేసేవాడు. కమలంమాత్రం కొంచెం దర్జాఅయిన కుటుంబంలో పుట్టిందేమో వేషంలోనూ, భాషలోనూకూడా తన విశాలహృదయం చూపిస్తుంది. చీరల యెన్నికలో, నగల చేతల నాడెంలో, ముస్తాబులలో, మురిపింపులలో అనుదినం యేదో ఒకవింత కనిపెడుతూనే వుంటుంది. కమలం గదిలో రెండు నిలువుటద్దాలున్నాయి. వండుతూన్న రెండు గడియలూ ఏందూరంగా వుంటుందో కాని తక్కిన కాలమంతా కమలం ఆనిలువుటద్దాల మధ్యనే నిగనిగలాడుతుంది. చెక్కిలు తుడుచుకుంటూ, చెంపలు దిద్దుకుంటూ, ముంగురులు ముడుచుకుంటూ, పెదవులు సవరించుకుంటూ, కనురెప్పలల్లారుస్తూ, ఎగాదిగా తన నీడ అద్దాల్లో చూచుకుంటూ ఒక్కొక్కనాడు వేళకూడా మరిచిపోతుంది. కమలం సారెవచ్చి యేడేళ్లయిందో, యెనిమిదేళ్లయిందో ఇవాళ సారె వచ్చినట్టుంది.

ఆరోజున మెల్లగా యిద్దరూ రాజీపడి వీధితలుపు గడియేసుకుని పడకగదిలో ప్రవేశించేరు. గదిలో ప్రవేశించగానే కమలం మొగాన్న చిరునవ్వు మొలకెత్తించింది. కన్నులరవాల్చింది. నీరులాటి చీర జిలుగుపైట భుజం మీదినుండి సగం జార్చింది. వత్తౌన్ని దోబూచులాడించే వెలితెరవికెలోనుండి మిలమిలలాడే నన్నవాచీగొలుసు చేత్తో సవరిస్తూ కనురెప్పలు బరువుగా వాల్చి, అడుగుసంగోరు పెడుతూ అలా క్రీగంటను అద్దంలో చూచుకుంది. అలాగే సుందర్రావుముఖం చూచింది. ఇదంతా సుందర్రావు చూడనే లేదు. మంచంమీద దుప్పటీ దులిపి పరుస్తున్నాడు. పగలల్లా కచేరీలో కూర్చుని తలవంచికొని వ్రాసివ్రాసి వున్నాడేమో నడుం లాక్కొచ్చింది కాబోలు పాపం అతడలా ఆమంచంమీద సాగిలిపడ్డాడు. కమలం శృంగారచేష్టలు కనిపెట్టలేకపోయేడు. కమలం అలా నిలబడిపోయింది. చేతులు వ్రేలవైచి తలవంచికొని వేడినిట్టూర్పు విడిచింది. అ లా గే సుం ద రా వు ను చూ చి రా? అలాగే తననీడ అద్దంలో చూచుకుంది. ఇంతలో సుందర్రావామెను చూచేడు "కమలం! యిలారా" అన్నాడు. కిటికీలోనుండి వస్తూన్న సన్నగాలిలో పెనగులాడుతూన్న ముంగురులను చేయి అంటీ అంటకుండా సవరించబోతూ, దీపపు వెలుగున మిలమిలలాడే వజ్రపుపొడి ఉంగరంనీడ వైపు అద్దంలో చూచి బరువుగా ఊపిరితీసి యెగసిన హృదయౌన్నత్యంమీద రెండోచేయివేసికొని అద్దంలో నీడ చూచుకుని అలాగే సుందర్రావువైపు చూచి చురచుర లాలికించేసింది. ఆచూపుతో సుందర్రావు వచ్చి, అల్ల కలదిక్కు సవరిస్తాడేమో అనుకుంది. పొడిఉంగరపువ్రేలు ముద్దుపెట్టుకుంటాడేమో అనుకుంది. బరువు ఊపిరిలో పలవరిస్తాడేమో అనుకుంది. అల్లలలాడే హృదయౌన్నత్యానికి అభయహస్త మిస్తాడేమో అనుకుంది. అద్దపు నీడతో అల్లుకొనిపోతాడేమో అనుకుంది. అతడలాచూస్తూ కూర్చున్నాడు. పైటమరింత జార్చేసింది. చీరకుచ్చెళ్లు

జిలజిలలాడించేసింది. నడుంగడగడలాడించేసింది గోడలనున్న పటాలన్నీ ఛాయాగ్రహణ యంత్రాలయి తన విలాసాలను ముద్రించుకోకూడదా అన్నట్టు గదల్లా కలయచూచింది. ఇదంతా చూచిచూచి సుందరావు దిగ్గునలేచి మంచం నడుమను కూర్చున్నాడు. "ఏమిటి? కమలం? నీ వెప్పుడూ విశాలంగా మాట్లాడవు! సినీమా బొమ్మలాగు క్షణానికొకలాగు కనబడతావు! సినీమాలో యిది ఫలానా అని ముందుగా కొంత వ్రాస్తారు. ప్రక్కనొకడు చెపుతూవుంటాడు. నిన్ను తెలుసుకోడానికి నాకలాటి సహాయాలేవీ లేవూ? నా కెలా తెలుస్తుంది? చెప్పమరీ!" అన్నాడు.

"మీకన్నిటికీ వెటకారమే? నే నంతదాన్నా? సత్యభామనా? వరూధినినా? అలాగే అనండి. ఆడదానిహృదయం మీ కెలా తెలుస్తుంది? కానీయండి. నన్నిలా యెన్నాళ్లాడిస్తారో ఆడించండి మీ అక్కర తీరినతరువాత నేను పక్కపాటయినా చేస్తానా? మీ జీవనవిధానం నాకూ తెలియకుండా ఉంది. అనుదినమూ అదే నడకా! మరి మార్పేలేదు. లెక్కలమేష్టరులాగు రెండుమెట్లలో తేల్చేస్తున్నారు. ముక్తసరిగా మూడుకార్యాలతో దినాలు గడిపేస్తున్నారు! భోజనం-కచేరీపని-నిద్ర - ఈ భాగ్యానికేనా నన్ను రంభలాగు నిత్యం కలకలలాడమంటున్నారు? యౌవనం ఒక్కటీ గాజుకాయలాగ మీకంటికి కనబడితే చాలు కాబోలు! మీ అక్కర తీరినతరువాత సగం త్రాగిన సోడాబుడ్డీలాగ ఆడుదాని శృంగారం అంతా అవతల పారపొయ్యవలసిందే? ఆడుదాని నవ్వు వెన్నెలలో మగవాడు శృంగార గీతాలు పాడాలి. ముంగురుతీగలమీద మురళీగీతాలు మ్రోగించాలి. చూపుతీగలతో పూవుటీరాలు గట్టాలి. చెక్కుటద్దాలలో చిత్రలేఖనలు చూడాలి. పైటచెరగులో ప్రబంధాలు చదవాలి."

"అదేమిటో! అవన్నీ నా కర్థం కావు. కమలం."

ఆమాట విని కమలం ఉలికింది. తన ఉన్నతవక్షం క్రిందికి యెడమచేతి ముంజేయి వంచి దానిమొన కుడిమోచేతి నాని ఆ చేతి వ్రేలికొనను ముఖంనిలిపిసుందరావును పుల్కు-పుల్కున చూచి జలజలా కన్నీటిబొట్లు జాలువారించేసింది. క్రిందిపెదవిని మునుపంటిక్రిందికి బిగించి తెలుడుగన్నులతో తీక్ష్ణంగాచూచి తల పంకించింది. చీరకుచ్చెళ్లు నలగకుండా, చెంపకురులు చెదరకుండ పైటచెరగు తొట్రుపడకుండా మెల్లగా ఆ నిలచినచోటనే నేల కొరిగింది. చాచినచేతిదండమీద తల నానుకొని పడుక్కుంది. పైటచెరగుతో నంగోరుముసుగు వేసికొంది. వెక్కి వెక్కి యేడవడం మొదలుపెట్టింది. ఆనిట్టూర్పులలోనే ఆ వెక్కులలోనే "కలకంఠవధూకల కాకలీధ్వను"లు గలగలలాడించేస్తూంది.

"ఏమిటి కమలం! ఉరికేకూర్చొని యేడుస్తావేం? నేను నీకేం తక్కువ చేసేను? నేనెంత నిర్భాగ్యుడనైనా, నా జీతం యెంత తక్కువయినా, అందులోనే సర్దుకొని నీకోరిన చీర, నీవు చెప్పిన రవిక, నీవు చేయింపుమన్న

నగ చేయించేను. నీముద్దు కేంలోపంచేశాను? నీవలంకరించుకుంటే నాకుమాత్రం సంతోషం కాదూ? నీశృంగారం నా ఆనందానికే అని నాకు తెలియదూ? అయితే నాకొక్కొక్కప్పుడు నీ లీలలు అర్థంకావు. అయినప్పుడల్లా ఆనందిస్తూనే వుంటాను. నీశృంగార చేష్టలు గబగబా వర్ణించడానికి కవిని కాను. విశాలంగా పాడడానికి గాయకుడను కాను. పదేపదే పొగడడానికి పండితుడను కాను. అదికాక నీవే చూస్తున్నావు. పగలల్లా పనిచేస్తేనే కాని మాకచేరీలో పని తెమలదు. పని యెక్కువ గుమాస్తాలు తక్కువ. ఎలాగో సాయంత్రం అయి యింటికి వచ్చేసరికి అలసిఉంటానేమో నిద్రకోసం తహతహలాడుతుంది శరీరం. నీచెప్పిన వలపుపందెర లెప్పుడు వేయడం? నాకు కలలోకూడా ఇన్స్పెక్టరు కోపపడుతూన్నట్టే వినబడుతుంది. అదికాక కమలం ఆరేళ్ళయిందో, ఏడేళ్ళయిందో నీకింకా యీసరదాలేమిటి? పోకులు లేకపోతేనేమీ మన సుఖానికి లోటులేదు కదా! నీవు రోజురోజుకీ ఒరదీసిన కత్తిలాగిలా మిలమిలా మెరిసిపడుతూవుంటే, నేనెంత పాషాణాన్నయినా భయపడనూ?" అన్నాడుసుందర్రావు.

కమలం లేచి కూర్చుని కన్నీళ్లు తుడుచుకుంటూ "అయితే మును పలాయెందుకన్నారు? మనమధ్య పిల్లలుంటే శృంగారభాగ్యం జుర్రుకోడాని కవకాశం ఉండదన్నారు. దానిని గురించి కావ్యాలు చదివేరు. నేనెప్పుడూ అనుకోని ప్రేమ నాకు నాయౌవనంమీదకల్పించేరు. నా యౌవనంతోటే మీ జీవనసుఖ మందన్నారు. ఆయౌవనం పిల్లలవల్ల తగ్గిపోకుండా మందులిస్తున్నారు. పిల్లలుపుట్టకుండా యంత్రం తెప్పించేరు. నేనదంతా నిజమను కొన్నాను. మీచెప్పిన కబురులు విని మీకోసమే దినదిన ప్రవర్ధమానంగా యౌవన శృంగారం పెంచుకుంటూఉంటే నాయీప్రయాసాన్ని పోకులనీ సరదాలనీ వెక్కిరిస్తారా? మీకు నిజంగా నా శృంగారం కావాలనుకున్నాను. ఇవన్నీ వట్టి పాటలేనా? ఆగ్రంథకారులేదో వ్రాస్తే మీరు కూడా అదే అని నన్ని పర్వతశిఖరంయెక్కించి యిప్పుడు క్రిందికిత్రోసివేస్తారా? నేను ప్రేమించిన వ్యక్తికి పనికిరాకపోయినతరువాత నాకీ శృంగారం యెందుకూ? ఆహా! అడవిమల్లెపువ్వునయినానే! స్వానుభవాసక్తిచేత తుమ్మెద వాల్తే వాల్తుంది. ఈపరిమళ మేలాదానికి? దానికడుపునిండినతరువాత నన్ను ముంగాళ్లను తంతే తంతుంది. దానిదా తప్పు? ఓఅడవిమల్లెపువ్వా, నాకంటె నీవే మిక్కిలి అదృష్టవంతురాలవు. నీజీవితకాలపరిమితి తక్కువవడంచేత నీదుఃఖంకూడా తక్కువే! నేనీ నిలువుపాటున వాడిపోయి నేలరాలిపోతే యెంత బాగుండును! నేనపురూపంగా వన్నె లిడికొంటూ చిత్రించికుంటూన్న యీ నా శృంగార పటంమీద నా నాయకుడే నిరసించి ఉమ్మివేసినాడు." అని లేచి నిలబడి కమలం తననీడ అద్దంలో చూచుకుంటూ "కన్నులకు దిద్దికొన్న యివి కాటుకకొలుకులుగావు పూలములుకు లనుకున్నాను. నాకన్నిటిలో విన్నబాటున పాపమా కొలుకులెల చెదరిపోయినావో! పాలమీగడ ళ్లాటి

చెర్కులతళుకు చాటుచాటుకుపోయి యెలా సన్నగిలి పోతూందో! ముడిచికొన్న లలాటాన్ని నటించడాని కిష్టంలేక వెనకకు పోవడానికి కాబోలు ముంగురులు తొట్రుపడి ఒకదానితో ఒకటి యెలా పెనగులాడుతున్నాయో! పైకి బాహాటంగా రావడానికి సంకోచించి నాఊర్పులుసైతం గద్గదికతో కాలక్షేపం చేస్తున్నాయి. చేయవూ? నైరస్యమెవరి తె భరిస్తుంది? నేనిక నిలబడలేను! ఏంపతనం! ఎంతగర్వభంగం! నేనిలా కావడాని కేంతప్పు చేశాను. నే నీవంత యెలాభరించేది? భరించలేను! భరించలేను!!" అంది.

౨

. "ఏమయ్యా! రాత్రిల్లా యేంచేస్తున్నావు? కళ్లలా యెఱ్ఱగా ఉన్నాయేం? అందుకేనా యేమిటి? నీకివాళ ప్రొద్దెక్కి తెల్లవారింది? ఎనిమిదయిందిగదా, యిప్పుడా కచేరీకి రావడం? టపా యెప్పుడు కంపుతావు? మాట్లాడవేం? నీకాండక్టేమీ బాగులేదు! ఎందుకాలస్యంగా వచ్చేవో సంజాయిషీ యిచ్చుకో" అన్నారు ఇన్స్పెక్టరుగారు. పాపం సుందర్రావు రాత్రిల్లా ఆనాటకం ఆడి ఆకన్నీళ్లు తుడిచి అలసిపోయేడేమో తెల్లవారి లేవలేకపోయేడు. ఎలాగో మొండికత్తి లేచి వెళ్లేసరికి రోజూకంటె ఆలస్యం అయింది. ఇన్స్పెక్టరలాకోపం పడుతూనే ఉన్నాడు సుందరరావు జవాబు చెప్పకుండా కచేరీ గదిలోకివెళ్లి పోష్టుకు పంపించవలసిన టపాలుసిద్ధంచేసి తనసొంతఉత్తరాలొకటో రెండో కలిపి బంట్రోతు చేతికిచ్చివేసి కుర్చీలో అలా చేరబడి కూర్చున్నాడు. రాత్రి కథంతా ఆలోచించుకున్నాడు. ఏమిటిచేయడం? ఎవరితో చెప్పుకోవడం? మాట్లాడితే కమలం శృంగారం అంటుంది. విలాసం అంటుంది. ఒయ్యారమంటుంది. ఒద్దికలంటుంది. సరే యివన్నీ ఆడుదానిలో తగుమాత్రం ఉంటే ఆనందమేగని, ఇలా విపరీతమయితే యెలాగ? పుంజెడు మెతుకులకోసం ప్రొద్దల్లా పాటుపడే నాలాటివాడికి శృంగారాదులు చూచి మెచ్చుకోవడానికి సమయమెక్కడ చిక్కుతుంది? కమలం అస్తమానం రంభానలకూబరులలాగు రాత్రింబవళ్లు విహరిద్దామంటుంది. నేనిలా విహరిస్తూ కూర్చుంటే నాయీవిహారం యెవరు చూస్తారు? కానీ నేనిలా కమలాన్ని యేడిపించలేను. సరేమా అమ్మ వస్తుందిగదా! ఆమె పెద్దది. ఏదైనా ఉపాయం చెపుతుంది." అనుకొని లేచి భోజనానికని యింటికి వెళ్లేడు.

3

"నాయనా సుందరం! ఏమిటీ కమలం వేషం? ఆమొగదువ్వుడేమిటి? మెడచేతులూ లేని రవికేమిటి? కచ్చలేకుండా కుచ్చెళ్ల చీరేమిటి? ఆసున్నితం ఆ సుకుమారం యివన్నీ యేమిటి? సంసారి కింత వేషమెందుకురా నాయనా? మానాడు మే మిలాగే ఉన్నామా? నగుతూ స్రాపంటె పెట్టుకునే వాళ్లం లేకపోతేలేదు. గంధంపూసినట్టు రవికా కచ్చదోపుకొని చీరావద్దటరా నాయనా? అదేమో మాకిలాంటి వేషాలమీదికి మనసే పోయేదికాదు. ఇంటిపనులునాలుగూ చేసుకుంటూ యజమానికీ పిల్లలకీ సంరక్ష చేసుకునేసరికి పొద్దేచాలేది కాదు.........అన్నట్టు! సుందరం — కమల యేమిటిరా నీ మీదలా చెపుతుంది? ఆడుదాని యౌవనం అలా నిత్యం కలకలలాడుతూఉండాలన్నావట! అలాగ ఉండడాని కేవో మందు

లిస్తున్నావట! ఆడుది పిల్లలను కంటే సొగసు చెడిపోతుందన్నావట. యౌవనం జారిపోతుందన్నావట. పిల్లలుపుట్టకుండా యేవో యంత్రం తెప్పించి దానికిచ్చేవట! ఏమిట్రా బాబూ! ఇదంతా నిజమేనా!" అని తల్లి గట్టిగా అడిగే సరికి సుందర్రావు తలవంచుకొని నిలబడ్డాడు. "అవున్రా నాయనా! ఇవా మీచదువులూ సంపన్నాలూనూ? బాగుంది. మీయిద్దరూ కలిసి భ్రూణహత్యలు చేస్తున్నారన్రా? ఆడుదాని యౌవనమంటే యేమిటనుకున్నావు? పిల్లలూ కాలక్షేపం సంసారం కట్టుబాట్లూ యివన్నీ వుంటేనే ఆడుదాని విలాసాలు భరించలేరూ! అందులోనూ యేకాలక్షేపం లేకుండా స్వశరీరాన్ని నిత్యం అలా సింగారించుకుంటూ మొగాన్నఅద్దం వ్రేలగట్టుకున్న ఆడుదాని నెవరుభరిస్తారురా బాబూ! పిల్లవ్యావృత్తి ఉంటే ఆడుదింత పెచ్చురేగిపోగలదా? అదికాక బాబూ! పిల్లలక్కర లేకపోతే సంసారం యెందుకూ! మీయిద్దరూ ముసలాళ్లయితే మిమ్మల నెవరు కనిపెడతారు! నేనిలా ఉండిపోతానా? ముసలికాలంలో కూడా యౌవనం ఉంటుందని యెవడేనా వ్రాసేడా యేమిటి? "కాలం నాటి పిల్లలూ కాలంనాటి డబ్బూ" అన్నారు. ఇవి లేకపోతే మిమ్మల నెవరు చూస్తారు? ఎంత మాటన్నావు! బాబూ! పిల్లలు నీయౌవనాని కడ్డుతగుల్తారా? పిల్లలలాటి ప్రేమింపదగిన వస్తువున్నదా? అది అలాఉండగా-పోనీ యౌవనం అలా నిలబడుతుందనుకో, అనుభవించే మగవాడేడీ? నీవేం మన్మథుడవా? నలకూబరుడవా? వసంతుడవా? చంద్రుడవా? ఏపూట కచేరికి వెళ్లకపోతే ఆపూట తిండిలేదు గదా? నీలాటివాడా కమలం విలాసాలు కన్నెత్తి చూడగలడూ? అయినా, యిరవైనాలుగు గంటలూ తనముస్తాబూ, తన యౌవనం, తన విలాసం, ఇవ్వన్నీ తలచుకుంటూ కాలక్షేపం చేస్తూన్న ఆడుది గవ్వకేనా పనికివస్తుందా?"

సుందర్రావు:—"అది కాదమ్మా, నా తక్కువ జీతంలో నాయింటినిండా పిల్లలుంటే నేనెలా భరించగలనో చెప్పు! పిల్లలు లేకపోతే మాజీతంతో మేము సుఖంగా కాలక్షేపం చెయ్యవచ్చును. అందుకోసం పిల్లలను కనక్కర లేదన్నాను."

తల్లి:—"అలాగన్రా? నీజీతం యిప్పుడు నీకు సరిపోతూందా? సరిపోతుంది కాబోలు! లేకపోతే యీబుటాలచీరలూ ఆమజిలీను రవికెలూ, ఆ అత్తరవులూ, ఆవాసన నూనెలూ ఆనబ్బుబిళ్లలూ, గడియారపు గొలుసులూ గజ్జెలవడ్డాణాలూ అవిగాక ఆమందులూ యంత్రాలూ ఇవన్నీ యెలావస్తున్నాయి?"

సుందరరావు—"ఏంచెయమన్నావమ్మా! వీటన్నిటికీ మాభోజనానికీ నాజీతం సరిపోతుందా? చాలదు! అలాగే అప్పుచేసి నెల వాయిదాలచొప్పున తీరుస్తున్నాను. క్రొత్తవస్తువులకు మళ్లా క్రొత్త అప్పులు చేస్తున్నాను. ఇంత తంటాలు పడ్డా దానికి సంతుష్టిలేకుండా ఉంది. ఎప్పుడూ చిడిముడిపడుతూనేఉంటుంది. ఎలాగు దీనితో దేవులాడడం!"

తల్లి—"అదేమో నాయనా! నాకేం తెలుస్తుంది. మీచదువులూ మీశాస్త్రిలూను? మీవింతవింతవూహలూ విపరీతాలూ నాలాటి ముసలిముండాకూతురుకేం తెలుస్తాయి? నేనేమేనా అన్నట్టయినా యీముసలిముండ మాయౌవనసౌభాగ్యం చల్లార్చేసిందని నామీద నేడుస్తారు మీయిద్దరూనూ!"

సుందర—"అమ్మా! నువ్విప్పుడిలామమ్మలను వదిలేస్తే యెలాగు? దాని నేదో లాలించి సంసార మార్గంలో పెడతావనే నీ కుత్తరం వ్రాసి రమ్మన్నాను. నువ్వువచ్చీ అలాగేఅంటే నాకింకెవరు దిక్కు?"

తల్లి—"అలా గయితే కమలాన్ని నా పూచీకి ఒప్పచెపతావా? ఆరునెలల్లో చూడు దానినెలామార్చేస్తానో! ఊహా ఉపాయం ఉండాలి. తెలివితేటలూ ధీశక్తీ ఉండాలి. రోగం పోవడానికి మందుగాని ఆరోగ్యం కదలకుండా నిలపెట్టడానికి మందుందా? శిశుకోశాన్ని యంత్రసాధనంవల్ల లొంగతీశావు గాని స్త్రీ హృదయం లొంగతీయడాని కేయంత్రం కనిపెట్టేవు నాయనా! మానసికావస్థలయిన సుఖదుఃఖాలను యంత్రసాధనం వల్ల తారుమారు చెయ్యగలవా? పువ్వు వాడిపోకుండా ద్రావకాలలో కప్పెట్టేవనుకో. ఆద్రావకంలో నుంచి పువ్వుపైకితీస్తే యేమవుతుంది? అలా దాచిన పువ్వు అలంకారానికేనా, అనుభవానికి వస్తుందా? గమగమవాసనలు చిమ్ముతుందా? కలకల విరబారుతుందా?"

సుందర:—ఏమిటో అమ్మా అవన్నీ నే నాలోచించలేదు. అయిందేదో అయింది. నీవేవో సర్దుబాటు చేద్దూ.

తల్లి "అలాగే"

౪

ఏడునెలలయింది. చేతులనిండా గాజులూ, చెక్కులనిండా తెలితళ్కులూ, పలుచపడ్డ శరీరం, బలపడ్డనడుం, ఉల్లిమళ్లవల్లె మల్లిరేకుల కవిశా, ప్రేమపూరితములయిన చూపులూ పెద్దరికం తెలిసేనడకా, వీటన్నిటితో కమలం క్రొత్తదయింది. ఆమె కిప్పుడు సుందర్రావు మీద ప్రేమహెచ్చయింది. ఇప్పు డద్దంలో వాని ముంగురులే దిద్దుతుంది. కమీజుకు బొత్తాయిలు పెడుతుంది. కాఫీ తానే చల్లారబోసి వాని కందిస్తుంది. అద్దంలోనూ పయినీ కూడా సుందర్రావునే చూస్తుంది. ఇప్పుడు సుందర్రావానందతరంగాల నందుకొంటున్నాడు. నెలలునిండి కమలానికి కొడుకుపుట్టేడు.


* * *

ఆవేళ సాయంతనం కచేరినుంచి సుందర్రావు ఇంటికి వచ్చేడు. పాగా అందుకోడానికి కమలం యెదురుగా వచ్చింది. కమలం బాలెంత వేషం కన్నులపండువు చేస్తూంది. గదిలో మంచంమీద కూర్చుని సుందర్రావు ముద్దాపలేక 'యిలారా కమలం'! అన్నాడు. కమలం వచ్చింది మంచంమీద కూర్చోపెట్టుకుని చెదరిన కాటుక రేకలూ, చెక్కులపసుపూ, అసమాన ప్రేమపూరితములయిన కనులూ, పెదవుల తాంబూలపు టొఱుపూ భిగించిన నడుము చుట్టూ, విడీన రవికకట్టూ, ఇవన్నీ చూచి కమలం భుజంమీద చేయివేసి బుగ్గముద్దు పెట్టుకోపోయేడు. "ఇప్పుడు నన్ను ముద్దేమిటండీ! ఉండండీ; బాబును తీసుకొస్తా" అని కొడుకు నెత్తుకొచ్చింది. ఆమంచంమీద ఆపిల్లవాడిని పడుకోపెట్టి "చూడండీ! బాబెలా నవ్వుతున్నాడో" అని వంగి కమల మొకబుగ్గా సుందర్రావొకబుగ్గా ముద్దుబెట్టుకున్నారు. కమల మొగిమొత్తి సుందర్రావు మొగం సంతుష్టితో చూచి "ఇదే ప్రేమసూత్రం" అంది.

కొలంబో మ్యూజియము




ఇత్తడి బుద్ధవిగ్రహము-మకరతోరణము
తొమ్మిదిన్నర అంగుళములయెత్తు. (కొలంబో మ్యూజియము)



అడకత్తెర
(కొలంబో మ్యూజియము)



ద్వారపాలక విగ్రహము
2 అడుగులు $4\frac{1}{2}$ అంగుళముల యెత్తుగలది. (కొలంబో మ్యూజియము)



చుట్టూ ఏనుగులుచెక్కినదిన్నె. కొలంబో మ్యూజియము.




ద్వారపాలక విగ్రహము.
ఎత్తు 2 అ. 9½ అం. (కొలంబో మ్యూజియము.)



ద్వారపాలకుడు, ఎత్తు 3 అ. 8 అం.
(కొలంబో మ్యూజియము.)



శయనబుద్ధుడు, 27 అంగుళములపొడవు



రువనవేలి దాగోబాపైనున్న సచిత్ర శిలాఫలకము.
దీనిపొడవు 6 అ. 8 అం. (కొలంబో మ్యూజియము.)



పిట్టకథలు

వెయ్యి రేకుల కలవపువ్వు

అనగా అనగా ఒకవూళ్లో ఒక బ్రాహ్మడున్నాడు. ఆబ్రాహ్మడికి కొళగయ్యాళిపెళ్లాం వుంది. ఆబ్రాహ్మడింట్లోనే అతని చిన్న చెల్లెలు కూడా వుండేది.

శ్రావణమాసంవచ్చింది. ఎక్కడచూసినా మంగళవారాల శుక్రవారాల నోములు నోచుకునేవాళ్లే, వాయనాలు పుచ్చుకునేవాళ్లే, పేరంటకానికని తిరిగేవాళ్లే.



"ఇదిగో మరి నాపట్టుచీరమీాద...గంధపుపిసరుపడ్డానరే ఒప్పుకునేదాన్ని కాదుసుమా, జాగ్రత్త, భద్రం"

ఇరుగుపొరుగు అమ్మలక్కలు ఆ బ్రాహ్మడి భార్యని చెల్లెల్ని పేరంటకానికి పిల్చేరు. గయ్యాళిపెళ్లాం వెళ్లనంది. ఆడపడచు "వొదినా వొదినా, నేను పేరంటకానికి వెళతాను, మరేమో నీపట్టుచీరొకమాటు కట్టుకోడానికిస్తూ" అంది. 'నాకులేనిపేరంటం నీ కెందుకూ నే నియ్యనుపో' అని వొదిన కసిరేసింది. ఆడపడచు మళ్లామళ్లా అడిగింది. 'పట్టుచీర పాడుచెయ్యనులే, తల్లీ' అంది. "పాడుచెయ్యవు కదూ, పాడుచెయ్యనని ఒప్పుకుంటావ్, వొట్టెయి చూస్తాను. ఇదిగో మరి నాపట్టుచీరమీాద కనక ఆవగింజంత గంధపుపిసరు పడ్డానరే ఒప్పుకునేదాన్ని కాదు సుమా, జాగ్రత్త, భద్రం" అని వొట్లు ప్రమాణాలు చేయించుకుని పట్టుచీరె మరీ యిచ్చింది. ఆడపడుచు పట్టుచీరకట్టుకుంది. పేరంటానికి వెళ్లింది.


పొద్దుపోయింది. చీకటి పడుతూంది. పేరంటకాన్నుంచి ఆపిల్ల తిరిగివచ్చింది. "ఇదిగో వదినా నీ పట్టుచీర యేమీ పడకుండా పట్టుకొచ్చేను. పారాణీ, గంధంకూడా పడలే"దంది 'అలాగా నరేచూస్తానుగా' అంది. చీరపుచ్చు



"చీ రెలా తగలపెట్టేశావే; మండపెట్టేశావు."

కుని చీరంతా విప్పి యిటూ అటూ వెతికి, ఒకఘుడియసేపు వెతగ్గా వెతగ్గా ఆవగింజలో సగమంత గంధపుపిసరు పడివుండడం చూసి చీరెలా తగలపెట్టేశావే; మండపెట్టేశావు. "అయ్యో అయ్యో, నామొహం మండిపోనూ' నేను నీకియ్యనంటూనే వున్నానమ్మా! అమ్మ, శక్తి, తల్లీ నన్ను పీకి పాకంపట్టేశావు; కాని నన్ను బతకనిచ్చేవా. అయ్యో, నాబుద్ధికాలా, నన్నిలా రవ్వపెడతావని అనుకుంటూ నేవున్నా నమ్మా" అనియేడ్చి, కేకలేసి కొట్టి, తన్ని, తిట్టి, చీరలుమ్మచుట్టి ఆడపడుచుమీద పారేసి తలకి వాసెనకట్టుకుని, నులకమంచంమీద పడుక్కుని రాగాలు పెట్టడం మొదలెట్టింది.

బాగా రాత్రిపడింది. మామ్మూలు వేళకు బ్రాహ్మడింటికి వచ్చేడు. 'ఒసేవ్ ఎక్కడున్నావేవ్' అన్నాడు. 'ఏమేవ్ పలకవేం' అన్నాడు. 'అయ్యో నావల్ల యేమపరాధంవచ్చిందో'అనుకున్నాడు. గజగజలాడేడు. ఇంట్లో మూలలన్నీ వెతికేడు. మంచంమీద పడుక్కుని వున్న పెళ్లాన్నిచూసేడు. నెమ్మదిగా దగ్గిరికి వెళ్లేడు. 'ఎందు కిలా పడుక్కున్నావేవ్' అన్నాడు. 'చెప్పేబాబూ...చెప్పవుటే' అన్నాడు. 'నావల్ల యేమిటపరాధంవచ్చిందో చెప్పవమ్మా అయినా' అన్నాడు. 'నిన్ను బతిమాలుకుంటానుగా' అన్నాడు. 'నీకాళ్లు పట్టుకుంటానే' అన్నాడు. అని రెండుకాళ్లుపట్టుకుని తలమీద పెట్టుకున్నాడు. అప్పుడది లేచింది. మహాకోపంతోను



"అని రెండుకాళ్లుపట్టుకుని తలమీద పెట్టుకున్నాడు."

యేడుపుతోను, రాగాలతోను, నీచెల్లెలు నా

పట్టుచీర తగలపెట్టేసింది. ధ్వంసం చేసింది' అని రాగాలుతీస్తూ మళ్లా మంచంమీద పడుక్కుంది మళ్లీ బ్రాహ్మడు బతిమాలేడు. మళ్లీ కాళ్లు నెత్తిమీద పట్టుకున్నాడు. గయ్యాళి మళ్లా లేచింది 'నీచెల్లెల్ని నువ్వే గోతిక్కో నూతిక్కో అప్పగిస్తే సరి లేకపోతే నేనిదిగో నూతులోదిగుతున్నా' నంది. బ్రాహ్మడు వద్దేఅని బతిమాలుకున్నాడు. 'ఇదిగో చస్తా'నని లేచింది. 'నువ్వుచెప్పినట్లు చేస్తా లేవే' అని కేకవేసేడు. గయ్యాళి మళ్లీ పడుక్కుంది.

బ్రాహ్మడు చెల్లెలిదగ్గిరికి వెళ్లేడు. 'చెల్లీ నిన్ను మీ అత్తారింటికి దిగపెడతా రా' అన్నాడు. 'ఇప్పుడేనా అన్నయ్యా'అంది. 'ఇప్పుడే పోదాం రా' అన్నాడు. 'అయితే సరే' అంది. బ్రాహ్మడు నువ్వులుకొన్ని కొంగున మూటకట్టుకున్నాడు. ఇద్దరూ బయలుదేరేరు.

చాలాదూరం నడిచిపోయేరు. అర్ధరాత్రయిపోయింది. ఒక పెద్ద నూతి సమీపానికి వచ్చేరు. 'చెల్లీ, నీకు నిద్రవస్తూన్నట్టుంది, నీ తల నా వొళ్లో పెట్టుకు పడుకో; పేలుంటే కుక్కుతా' అన్నాడు. 'సరే' అని పడుక్కుంది. బ్రాహ్మడు పేలువెతికినట్టుగా నటించి నువ్వుగింజ వొక్కొక్కటే చిటుకూచిటుకూమని నొక్కుతున్నాడు. చెల్లెలు నిద్రపోయింది. బ్రాహ్మడు నెమ్మదిగా లేచేడు.



"బ్రాహ్మడు పేలువెతికినట్టుగా నటించి నువ్వుగింజ వొక్కొక్కటే చిటుకూచిటుకూమనినొక్కుతున్నాడు."

'నిద్రపోతుంది రా' అనుకున్నాడు. కదలనీయకుండా చేతులతో యెత్తుకొని నూతిదగ్గిరికి వెళ్లి గభీమని నూతిలో యెత్తేసేడు. ఇంటికి చక్కా బయలుదేరేడు.

తెల్లవారింది. ఆడవాళ్లునూతికినీళ్లుతోడుకోడానికి వచ్చేరు. చేదలు వెయ్యబోయేరు. నూతి నీళ్లవైపు చూసేరు. కళ్లు జిగేలుమన్నాయి, నిర్ఘాంతపోయేరు. తళతళ బంగారంలా మెరిసిపోతూన్న వెయ్యిరేకుల కలవపువ్వు కనబడింది. 'ఇదేమిచోద్యం' అని బుగ్గలమీద



"ఇదేమి చోద్యం."

వేళ్లువేసుకుని నిలబడ్డారు.

దూర దేశాలనుంచి చాలామంది స్త్రీలు, పురుషులు వచ్చేరు. ఆవిచిత్రపు కలవపువ్వును చూసేరు. 'దీన్ని పైకి తియ్యా' లనుకున్నారు. నూతిలోకి దిగేరు. ఎవరు తియ్యబోయినా,

ముట్టా ముట్టకు నన్ను
ముట్టితే నీచెయ్యి కందు
పాపిష్టివొదినా పట్టుచీరిస్తే
పాపిష్టిఅన్న పడతోసె.

అని పాటపాడుతూ మునిగిపోయేది. ఏ వొక్కతికీకూడా దొరకలేదు.

మన బ్రాహ్మడి బావమరిది అత్తారింటికి వెళ్లి పెళ్లాన్ని తెచ్చుకొద్దామని బయలుదేరేడు; వస్తున్నాడు. దారిలో యీవింత కలవపువ్వు సంగతి విన్నాడు. 'ఇదేమివింతో'అని ఆశ్చర్య పడ్డాడు. 'మనంకూడా చూడాలి' అనుకున్నాడు; నూతిదగ్గరికి వచ్చేడు. కలవపువ్వు పాడే పాట విన్నాడు. 'దాని అర్థంయేమిటి తెలియటం లేదే' అనుకున్నాడు. 'నూతిలోకిదిగితీద్దాం అనుకున్నాడు. దిగేడు. కలవపువ్వు మునిగిపోలేదు. దొరికిందిరా అని పట్టుకున్నాడు. గట్టుమీదికి తెచ్చేడు. కలవపువ్వు మళ్లా పాట పాడింది. బ్రాహ్మడికి కొంచెం అర్థంతోచినట్టనిపించింది. అన్న వొదినఅన్నమాటలు బోధపడ్డాయి. పట్టుచీర అన్నది తెలిసింది. అన్ని సంగతులు బోధపడ్డాయి. గభాలున యేడవడం మొదలుపెట్టేడు. 'తన పెళ్లామే నూతిలోకి తోసివేయబడిం' దనుకొన్నాడు. 'తన పెళ్లామే యీ కలవపు' వ్వనుకున్నాడు. కన్నీళ్లు కాలవలుకట్టేటట్లా యేడ్చాడు. యేడ్చేం ప్రయోజనం? ఆపువ్వును నూతిలోంచి తీసి నెత్తిమీద



"నూతిలోంచితీసి నెత్తిమీదపెట్టుకుని యింటికి పట్టుకుపోయేడు."

పెట్టుకుని యింటికి పట్టుకుపోయేడు. అందరూ ఆపాపపు బ్రాహ్మణ్ణి తెగతిట్టేరు.

సాముద్రికం

సామినేని ముద్దుకృష్ణ గారు

(౩-వ సంపుటము, ౨-వ సంచిక తరువాయి)

హస్తాలు : జాతులు

"నైసర్గికం కాలజం చ
చిహ్నం నైమిత్తికం తథా,
కాలదేశానుమానేన
జ్ఞాత్వా ఫల ముదీరయేత్."
—ప్రహ్లాద.


ఈప్రహ్లాద సూత్రాన్ని సర్వత్రా మనస్సులో వుంచుకొనుట చాలా ఉపయుక్తం.

చేయి చదవడానికి ముందు చేతిని బోర్లించి పరీక్షించవలెను. ఈపరీక్షలో హస్తం జాతినిర్ణయమవుతుంది. ఒక్కొక్క జాతిహస్తానికి కొన్ని కొన్ని ప్రత్యేకలక్షణాలు, గుణాలు శాస్త్రజ్ఞులు నిర్ణయించేరు. జాతిని నిర్ణయించిన తదనంతరం చేతిని వెల్లకితలా త్రిప్పి అరచేతిలో తారాస్థానాలనూ, రేకలనూ పరీక్షించి ఫలం నిర్ణయించవలెను.

తారాస్థానం గాని, రేక గాని ఒకజాతి హస్తంలో ఒకఫలాన్ని, ఇంకొక జాతిహస్తంలో ఇంకొకఫలాన్ని ఇస్తూ వుంటవి; అనగా తారాస్థానం గాని, రేకగాని హస్తంనిర్ణయించిన స్వభావానికి అనుకూలంగా వుంటే అవి గుణాన్ని వృద్ధిపరచి ఉపయోగపడతవి; లేక వ్యతిరేకఫలాన్ని సూచిస్తే సుడిపెట్టి ప్రతికూలంగావుంటవి. అందుచేత ముందుగా హస్తం జాతిని నిర్ణయించడం ముఖ్యం. ఇందునిమిత్తం సాముద్రికాన్ని రెండు భాగాలుగా విడదీశేరు.

గ్రీకు భాషలో 'కీర్' (Cheir) అంటే చేయి. ఈశాస్త్రాన్ని 'కీరోనమీ'(Cheirognomy) అని, 'కీరోమేన్సీ' (Cheiromancy) అని రెండుభాగాలుగావిభజించేరు. 'కీరోనమీ'లో హస్తాలు, వాటి జాతులు, వాటి లక్షణాలు, గుణాలు నిర్ణయించేరు. 'కీరోమేన్సీ'లో తారాస్థానాలు, వాటి ఉచ్ఛ నీచ, సాధారణపు వృత్తులు; రేకలు, వాటి వివిధరూపాలు, వాటి ఫలాలు నిర్ణయించేరు. ఈమొత్తం అంతాకలిపి హస్తశాస్త్రం. దీనిలో ఒకదాన్నివిడిచి ఇంకో భాగాన్నే చదివినట్టయితే చాలా తప్పులు చెప్పడానికి అవకాశం వున్నది. అందుచేత శాస్త్ర గౌరవంగలవారు ప్రారంభం నుంచీ జాగ్రత్తగా అవగాహన చేసికోడం చాలా అవసరం.

చేతినిర్మాణం ఎలాఅంటే, ఇరువదియేడు ఎముకలవల్ల. మణికట్టువద్ద ఎనిమిది ఎముకలూ—[వీటిని 'కార్పల్' ఎముకలు (Carpal bones)—అంటారు.] అరచేయి నొక్కిచూస్తే కనిపించే అయిదు ఎముకలు—[వీటిని 'మెటకార్పల్' ఎముకలు (Metacarpal bones) అంటారు.] బొటనవ్రేలిలో రెండూ తక్కినవ్రేళ్ల



౧. క్రిందను గుంపుగావున్న ఎముకలు 'కార్పల్' Carpal Bones ఇవి మణికట్టులోనివి. ఈ 'కార్పల్' ఎముకలమీదనుంచి నిడివిగా ఉన్న అయిదు పెద్ద ఎముకలు 'మెట కార్పల్' ఎముకలు Metacarpal Bones ఇవి అరచేయిమొత్తం. 'మెటకార్పల్' ఎముకలపైన, బొటనవ్రేలిమీద రెండు, యితర వ్రేళ్లమీద మూడేసి వున్నవి. 'ఫెలేంజస్' Phalanges అంగుళ్యస్థులు.

లో మూడేసి చొప్పున పదునాలుగు—'ఫెలెంజస్' (Phalanges) అనే అంగుళ్యస్థులూ. మొత్తం ౨౭. (ఈ ఎముకల ఒడ్డుపొడుగుల హెచ్చుతగ్గులవల్ల చేతివైశాల్యం)తద్రూపేణహస్తం జాతి ఏర్పడుతుంది. పూర్వీకులు హస్తాలను డబ్బయి, ఎనభయిజాతులుగావిడదీసినారు. కాని ఇటీవల శాస్త్రజ్ఞులు సెయింటుజెర్మైను, షీరో రాబిన్సను మొదలైనవారు సదుపాయం నిమిత్తం ప్రధానజాతులు ఏడుగా అంగీకరించినారు. ఆవిభాగం అనుసరిస్తాను.

౧. సైకిక్—ఆధ్యాత్మికహస్తం

అన్ని చేతులలోను ఇదిసుందరతమమైనది. అందుచేతనే అరుదు. శరీర పరిణామంతో పోల్చిచూస్తే ఈహస్తం ఎక్కువచిన్నదిగాను, నాజూకుగాను కనిపిస్తుంది. తగుమాత్రం అరచేయి. మిక్కిలి మృదువైనవ్రేళ్లు అవగా కణుపులు విశదంగా కనిపించకుండాను. గోటిభాగం చాలాపొడవుగా సూది మొనగాను గోళ్లు బాదం ఆకారంగాను, బొటనవ్రేలు చిన్నదిగా అందంగాను ఉండడము ఈహస్తానికి ప్రత్యేకలక్షణం. వీరు జీవితానికి ముఖ్యంగా సంబంధించిన విషయాలను విస్తారంగా పాటించలేరు. సాధారణప్రపంచాన్ని ఒకఉన్నత శిఖరంమీద నుంచి చూచినట్లు చూస్తారు. అందుచేత ప్రపంచములో ఉపయుక్తంగా జీవించడానికి కావలసిన స్థూలదృష్టి వీరికిలేదు. వీరికి అగోచరాలను అన్వేషించవలెనని, మానవస్వభావానికి మూలసూత్రాలను తెలిసికోవలెనని అభిలాష హెచ్చు. తమవంటి సోదరస్వభావం గలవారితోగాని వీరు విస్తారం సంప్రతించలేదు.

సైకిక్ హస్తం పెద్దదిగాను కణుపులు ఏర్పాటుగాను ఉండడం తటస్థిస్తే శక్తిసామర్థ్యాలు ద్విగుణీకృతం అయినా సహజంఅయిన సమయస్ఫూర్తి తగ్గుతుంది. ఈహస్తాలు మనదేశంలో విస్తారం.

౨. ఫిలసాఫికల్-వేదాంతిహస్తం

వేదాంతిహస్తంలో అరచేయి పెద్దదిగా విస్తారం కండలేకుండా ఎముకలుగాను, బొటనవ్రేలు కొంచం పొడుగుగా రెండుకణుపులూ పెద్దవిగాను వుంటవి. ఈచేతిలో అన్నికణుపులూ విశదంగా తేలివుంటవి. ఎక్కువవింత ఏమిటంటే; వ్రేళ్లకొనలు కొంత 'స్పేచులేటు

గాను, కొంత 'కానిక్'గానుకొంత చతురంగాను వుండి ఈమూటిలోనూ ఏజాతిఅయినదీ నిర్ణయించడానికి వీలుకాకుండా వుంటవి. అందుచేత ఇట్టి చేతు ౨ గలవారికి మూడుహస్తాలలోను వున్న సుగుణాలు అలవడతవి.

వీరికి బాహ్యప్రపంచం ఎంతఅవగాహనో అంతఃప్రవృత్తికూడా అంత సుగోచరము. వీరి జీవితం సర్వత్రా సత్యాన్ని అన్వేషిస్తుంది. అందుచేత వీరు సాధారణ నియమములను పాటించరు. వీరు సాంఘికనియమాలకుగాని, ఆచారలకుగాని, ఏప్రమాణాలకుగాని పట్టుబడరు. వీరుసంపూర్ణమానసిక స్వాతంత్ర్యాన్ని కోరుతారు. ఎంతసేపూ న్యాయదృష్టితో సమస్తాన్ని పరిశీలించి నిజం తెలిసికోవలెనని బోధిస్తారు. వీరికి భూతభవిష్యద్వర్తమానాలు అవగాహనలో వుండడంవల్ల కేవల భౌతిక దృష్టిని ఆదరించరు.

చేతుల జాతులు



౧



౨

౧. సైకిక్-Psychic-ఆధ్యాత్మికహస్తం.

౨. ఫిలసాఫికల్-Philosophical-వేదాంతిహస్తం.



౩



౪

౩. కానిక్- Conic -కళాహస్తం.

౪. స్పేచులేట్- Spatulate -వెడల్పుహస్తం.



౫



౬

౫. స్క్వేర్- Square -చతురహస్తం.

౬. ప్రైమరీ- Primary -అనాగరకహస్తం.

౭. మిక్సెడ్- Mixed -కలగలుపుహస్తం.

ఈ బొమ్మలను జాగ్రత్తగా పరిశీలిస్తే వివిధజాతులకు గల భేదాలు సులభంగా గ్రహించగలరు.

'మిక్సెడ్' Mixed కలగలుపు హస్తం బొమ్మలలో ఉదహరించిన ౬ హస్తాలకలయిక కనుక వేరే బొమ్మ అవసరం లేదు.

3. కానిక్—కళాహస్తం

ఈచేయి పొడుగుగా బాగాకండపుష్టి గలిగి సాధారణంగా గులాబీరంగుగా వుంటుం

డి. వ్రేళ్లు మొదళ్లలో సందులులేకుండా గుండ్రంగా విస్తారం మాంసపుష్టి కలిగి గోటిచివర భాగంవరకూ చక్కని ఆకోకలావుంటవి.

వీరికి చిత్రరచన, శిల్పం, ఎక్కువఅభిలాష సౌందర్యపిపాస హెచ్చు. వీరికి లలితకళలయందు అభిరుచి. ఆందోళనమాత్రమే కాని ప్రవేశం కలగడం కష్టం. ఈజాతికి సోమరితనం హెచ్చు. అందుచేత పట్టుదలతో సాధించడానికి తగినంత ఓపిక ఉండదు. కాని ఈహస్తాలలో వ్రేళ్లు చతురంగా ఉంటే కళలలో సహజంగా ఉన్న రుచులను కష్టపడి ఉపయోగించి గొప్పచిత్రకారులు, గాయకులు, శిల్పులు, కవులు కాగలుగుతారు. వీరు సంభాషణలో మిక్కిలి చతురులు. ఈస్వభావాలలో తొందర హెచ్చువుండడంవల్ల ఇతరుల స్వభావాలను ఆలోచనతో తెలిసికోలేరు. మంచిగానో చెడ్డగానో అభిప్రాయాలను తొందరగాకలుగజేసుకుంటారు. వీరికి కోపం హెచ్చు, కాని వీరికోపం తాటాకుమంటవంటిది. వీరుసాధారణంగా ధార్మికబుద్ధి, దయ, కలిగివుంటారు కాని ఒక్కొకప్పుడు మిక్కిలి స్వలాభాపేక్షకులుగా కూడా మారుతారు.

౪. స్పేచులేట్—వెడల్పుహస్తం

ఈచేయి కొంచం మోటుగా యెక్కువ వంపులతో వుంటుంది. వ్రేళ్లకొనలు పురివిప్పుకుని వెడల్పుగావుంటవి. అరచేయి కొన్నిచేతులలో మణికట్టువద్ద యెక్కువ వెడల్పుగాను, కొన్నిటిలో వ్రేళ్ల మొదళ్లవద్ద ఎక్కువ వెడల్పుగాను వుంటుంది. మొదటిపద్ధతిని వుంటే ఆలోచనలువిస్తారం. రెండవతరహాను వుంటే కార్యసాఫల్యం ఎక్కువ.

వీరు ఎంతైనా శరీరకష్టానికి ఓరుస్తారు. శృంగారం, కవిత్వం ఆట్టేభర్జించవు. జీవితం సౌఖ్యంగా గడిచిపోడానికి కావలసినఅవసరాలు ఉంటేచాలును; తృప్తిగా జీవిస్తారు. వీరికిశక్తి సామర్థ్యాలు మిక్కుటం. వీరికి ప్రేమ, భక్తి మొదలైనగుణాలు ఘడియఘడియకు మారకుండా స్థిరంగా వుంటవి. వీరిబుద్ధి ఎంతసేపూ నూతనత్వాన్ని స్థాపించడానికి యత్నిస్తుంది. వీరుసాధారణంగా యంత్రనిర్మాతలు, ఇంజనీర్లు అయి క్రొత్తవాట్లను కనిపెడతారు. వీరికి తమశక్తి సామర్థ్యాలమీద నమ్మకం అతీతం.

ఈహస్తం పెద్దదిగాను దళంగాను, కండపుష్టిగా మెత్తగా ఉంటే శక్తిసామర్థ్యాలు తగ్గిపోతవి. సరియైన స్పేచులేట్ హస్తానికి ఉన్న గుణాలన్నీ మానసికం అయిపోయి జీవితానికి నిరుపయోగం కావడం తటస్థిస్తుంది.

౫. స్క్వేర్—చతురహస్తం

అన్నిచేతులలోను ప్రపంచంలో బాగుపడడానికి ఈచేయి ఎక్కువమంచిది. చతురం అనగా మణికట్టువద్దా, వ్రేళ్ల మొదళ్ల దగ్గరా చతురంగా ఏర్పాటు కావడమేకాకుండా వ్రేళ్ల కొనలు కూడా నలుచదరంగా వుంటవి. గోళ్లు సాధారణంగా పొట్టిగాను చదరంగాను వుంటవి.

వీరిస్వభావం, ఎక్కువ జాగ్రత్త, నియమానుసరణం, అధికార విధేయత, ఇంటి

లోనూ బుద్ధిలోనూ భద్రం. వీరికి పట్టుదల, ఓరిమి, బాగావుండడంవల్ల పూనినకార్యాన్ని నిర్వహించి తీరుతారు. కళ, కవిత్వం విస్తారం రుచించవు. లాభకరమైన కార్యం అయితేనే కాని మనస్కరించదు. వీరికి వ్యవసాయం, వర్తకం అంటే చాలాయిష్టం. ఈ రెంటి లోనూ ఎంతైనా ఉపయోగ పడతారు. వీరు మిక్కిలి స్నేహపాత్రులు. హృదయం అర్పించి నచోట ప్రాణాన్ని అర్పిస్తారు. మాటదాటరు, పూర్తిగా విశ్వసనీయులు.

అరచేయిచతురం, వేళ్లుచదరంగా పొట్టిగా ఉంటే:

సాధారణంగా చాలాచేతులలో వుండే కలయిక ఇది. విశాలదృష్టి శూన్యం. ధనార్జన కుట్రవల్ల. లోభులు కాక పోయినా డబ్బు విషయంలో పదిసారులు లెక్కపెడతారు. అమితంగా ధనంకూర్చడం వీరి ఆశయం. ఇత రులయందు నమ్మకం తక్కువ.

అరచేయిచతురం, వ్రేళ్లు చతురం దీర్ఘం.

పొట్టివ్రేళ్ల చేతికన్నా ఈచేయి ఎక్కువ మేధస్సును సూచిస్తుంది. వీరు చక్కని తార్కి కులు. జీవితంలో చాలా మెలకువతోనూ, ఆలోచనతోనూ నడుస్తారు.

అరచేయిచతురం, కణుపువ్రేళ్లు:

కణుపువ్రేళ్లు సాధారణంగా పొడవు. వీరు చిన్నచిన్న సంగతులనుకూడా ఎక్కువ పాటిస్తారు. నూతన నిర్మాణాలు వీరికి సరదా. భవననిర్మాతలు, గణితశాస్త్రజ్ఞులు, వైద్యశా స్త్రవిశారదులు.

అరచేయిచతురం, స్పేచులేటువ్రేళ్లు:

ఉపయుక్తమైనసృష్టి వీరిది. గొప్ప ఇంజ నీర్లు, ఇళ్లకు, ఫేక్టరీలకు పనికివచ్చే సామ గ్రులు, మరలు సృష్టించేశక్తి వీరికి హెచ్చు.

అరచేయిచతురం, కానిక్ వ్రేళ్లు:

వీరు కళాభిమానులు, వీరికి సంగీతం, లలి తకళలు, సారస్వతం, కవిత్వం, అంటే ఆదరం. తమకళాకౌశలాన్ని వినియోగపరచి కీర్తి సంపాదిస్తారు. పూర్తిగా కళాహస్తంకాకుండా అరచేయి చతురంగా ఉండడంవల్ల భావంలో గల ఉద్రేకాన్ని నిర్వహణలో చూపగలుగు తారు.

అరచేయిచతురం, సైకిక్ వ్రేళ్లు:

ఇది చాలా అరుదు. ఎన్నిసదుద్దేశాలు ఉన్నా ఎంతపూనికతో యత్నించినా వీరు ఖయాలీబుద్ధివల్ల ఏమీ నిర్వహించలేరు.

అరచేయి చతురం, మిశ్రమంవ్రేళ్లు

ఇది తరుచు కనిపించేచేయి. పురుషులలో విస్తారం. ఈచేతిలో బొటవ్రేలు బాగావెను కకువొంగి మధ్యకణుపు వెనకకువంచితే వల యంగా వంగిపోతుంది. చూపుడు వ్రేలు చాలా సూదిగా వుంటుంది. వీరికి ఊహాలు మెండు; చక్కనిఉద్రేకం ఉంటుంది. ఏకార్యా నికైనా సమర్థులు; కాని ప్రారంభంలో వుండే ఉత్సాహం తొందరలో తగ్గిపోతుంది.

వాగ్వాదంలో నిపుణులు. వీరికి మనశ్చాంచల్యం విస్తారం కావడంవల్ల సాధారణంగా జయం పొందరు.

౬. ప్రైమరీ-అనాగరకహస్తం

మూర్ఖులచేయి చూడడానికి మోటు అసహ్యంగాను, అరచేయిబరువుగా దళంగా పెద్దదిగా వుంటుంది. వ్రేళ్లకన్నా అరచేయి పెద్దదిగా కనిపిస్తుంది. అందుచేతనే మానవత్వంకన్నా, జంతుతుల్యంగా ఉంటుంది స్వభావం. ఈచేతిలో బొటనవ్రేలు బరువుగా, మొద్దుగా, గోటిభాగం ఉండగాను ఉంటుంది.

మానసికశక్తులు చాలాతక్కువ. ఈజాతిని, జంతుజాలాన్నివలె కామక్రోధాలు పూరించి వుంటవి. వీరివద్ద జిత్తులమారితనం హెచ్చు; అదైనా స్వభావంవల్ల వచ్చేదికాని బుద్ధిపూర్వకంకాదు. వీరు కాయకష్టంవల్ల జీవించేవారు. సాధారణంగా కూలీలు, బళ్లవాళ్లు యింకా మోటుపనులవల్ల దైనికజీవనం గడపవలసినవాళ్ల చేతులివి. ఇంకా కొన్నిలక్షణాలువుంటే వీరుసేనలో సాధారణసైనికులుగా ఉపయోగపడతారు. వీరికి పిచ్చి నమ్మకాలు ఎక్కువ.

౭. మిక్సెడ్ కలగలుపుహస్తం

ఈ చేతిలో అరచేయి సాధారణంగా చాలావరకూ చదరంగాను, వ్రేళ్లు కలగలుపుగాను ఉంటవి. ఇటువంటిచేతులు సర్వత్రా వున్నవి. సాధారణంగా చూపుడువ్రేలు 'కానిక్'గాను, మధ్యవ్రేలు 'చతురం'గాను, అనామిక 'స్పేచులేట్'గాను, చిటికెన 'ఫిలసాఫిక్'గాను ఉంటుంది.

వీరికి అనేక శాస్త్రాలలో జ్ఞానం ఉంటుంది. వీరు ఏపరిస్థితుల్లోనైనా ఏసంఘంలోనైనా నిపుణంగా ఖులాసాగా ప్రవర్తించగలరు. శాస్త్రం అయినా, కళఅయినా, మరి ఏయితరమైనా వీరికి సులభంగా అవగాహన అవుతుంది. వీరి వాక్చాతుర్యం అద్భుతం. కబుర్లలో ఎవ్వరితోనైనా ఆనందంగా కాలయాపనచేయగలరు. వీరు అనేకవిషయాలలో ప్రవేశిస్తారు కాని ఏదీ పూర్తిగా నిర్వహించే ఓపిక ఉండదు. చాంచల్యం హెచ్చు. అయినప్పటికీ ఈ చేతిలో బలమైన మేధస్సు లేక ఉన్నట్టయితే వీరికివున్న విశేషం యితరచేతులలో ఉండదు. ఇట్టివారు క్లిష్టపరిస్థితులలో సమయస్ఫూర్తితో ప్రవర్తించి హాయిగా చిక్కులు విప్పుతారు. వీరు రాచకార్యాలలో మంచి శక్తిమంతులు. మామూలు కలగలుపుచేయి గలవాళ్లు ఒకప్రదేశంలో అట్టేకాలం ఉండలేరు. వారు ఏపరిస్థితులలోనైనా ఖుషీగా ఉంటారు; వీరిని దారిద్ర్యం బాధించదు. ఐశ్వర్యం అధికానందాన్ని ఇయ్యదు. వీరికి ధనం సాధనం అంతంకాదు. ఎప్పుడు క్రొత్తక్రొత్త ఆలోచనలతో నిండి ఉంటారు. జీవితం బరువుగా తోచదు.

కళాహస్తాలు భావన, శిల్పము, సౌందర్యము అన్వేషించినట్లు; చతుర హస్తాలు నియమం ఏర్పాటు అంతటా పాటిస్తవి,

కణుపులచేతులు మానవప్రకృతిలోగల న్యాయాన్ని వెతుకుతూ వుంటవి. వేదాంతిహస్తాలు సర్వత్రా ఆధ్యాత్మికానందాన్ని అన్వేషిస్తూ వుంటవి.

ఇక వ్రేళ్లు

వ్రేళ్లు బాగా పొడవుగావుంటే ఆవ్యక్తి కార్యనిర్వహణలో ప్రతిచిన్నహంశాన్ని జాగ్రత్తగా చూస్తాడు. వ్రేళ్లు పొట్టిగావున్నా వ్యక్తి విశాల దృష్టితో ఆలోచనలుచేసి పెద్దపెద్ద ప్లానులు వేయగలడుకాని నిర్వహించడంలో చిన్నహంశాలను జాగ్రత్తపెట్టలేడు.

చూపుడువ్రేలు

రెండవవ్రేలికన్నా పొడుగుగావుంటే— ప్రపంచాన్నంతా సంగ్రహించవలెనన్న వెర్రి పుడుతుంది.

రెండవవ్రేలితో సమంగా వుంటే-అధికారం అంటే ఆశ. రెండవదానికన్నా చాలా పొట్టిగాఉంటే-భీరువు.

మూడవవ్రేలికన్నా దీర్ఘంగాఉంటే-పట్టరాని ఆశలు. మూడవవ్రేలితో సమంగాఉంటే విస్తారంధనం. పెద్దపేరు సంపాదించవలెననేఆశ.

మూడవవ్రేలికన్నా చాలా పొట్టిగా ఉంటే-జీవితంలో ఏవిధమైన ఆశయాలు లేవు. సాధారణ జీవనంతో తృప్తిపడతాడు.

రెండవవ్రేలు

మొదటివ్రేలికన్నా పొడుగుగావుంటే - మందబుద్ధి, ఎప్పుడూ పొరబాటులే చేస్తాడు.

మొదటివ్రేలితో సమంగాఉంటే - తగుమాత్రం ఆశలు. జీవితం చక్కగా నడుపుకుంటాడు.

మొదటి వ్రేలికన్నా చాలా పొట్టిగా ఉంటే-గొప్పవాణ్ణి కావాలెననే ఉపద్రవమైన వెర్రి.

మూడవవ్రేలికన్నా విస్తారం పొడవుగా ఉంటే-బుద్ధిమాంద్యం. అన్నియత్నాలను విఫలంకావిస్తుంది.

మూడవవ్రేలితో సమంగాఉంటే-జూదగాడు.

మూడవవ్రేలికన్నా చాలా పొట్టిగా ఉంటే తెంపరి. ప్రతివిషయంలోను అనవసరంగా తెగించి చొరబడతాడు.

మూడవవ్రేలు

మొదటిదానికన్నా ఎక్కువ దీర్ఘంగా ఉంటే-కళాభిమానం హెచ్చు; కాని నిరుపయోగం. నిర్వహించే ఓపికలేదు.

మొదటివ్రేలితో సమంగాఉంటే-ధనం, కీర్తిసంపాదించే ఆశ.

మొదటివ్రేలికన్నా చాలా పొట్టిగా ఉంటే-స్వశక్తిని తెలిసికోలేని అనవసరపు ఆశలు మెండు.

రెండవవ్రేలికన్నా అతిదీర్ఘంగాఉంటే - తెంపరి.

రెండవవ్రేలితో సమంగాఉంటే-జూదరి, పక్కా.

రెండవ వ్రేలికన్నా చాలాపొట్టిగా ఉంటే-దుర్బుద్ధి సర్వాన్ని నాశనం చేస్తుంది.

నాల్గవ వ్రేలికన్నా బాగా ఎక్కువ గాపొడవుగాఉంటే-కళాసంపత్తిలో ఎక్కువ ఉత్సాహం. జయప్రదంగా నిర్వహిస్తాడు.

నాల్గవ వ్రేలితో సరిసమానంగాఉంటే- అనేకవిషయాలు చక్కగా గ్రహించ గలుగుతాడు. ఏవిషయమైనా బాగా నచ్చజెప్పగలడు.

నాల్గవవ్రేలు


మొదటి వ్రేలితో సరి సమానంగ ఉంటే రాచ కార్యాల్లో నిపుణుడు; అద్భుతమైనయెత్తులు వేస్తాడు.

రెండవ వ్రేలితో సమానంగాఉంటే అసమానమయిన శాస్త్రజ్ఞానం. మూడవ వ్రేలితో సమంగాఉంటే అనేకవిషయాలు బాగా తెలిసికోగల జ్ఞాని. మంచి పలుకుబడి సంపాదించగలడు.

'దీర్ఘా కనిష్ఠికా యస్య
నఖరారుణసన్నిభః;
ధనవాన్ రాజమాన్యశ్చ
భూపాలోభవతిధ్రువమ్.'


(చిటికెనదీర్ఘంగా గులాబీ రంగు గలిగిఉంటే ధనవంతుడు; రాజపూజితుడు; లేక రాజు కాని కాగలడు.)

గోళ్లు



౧


౧. రక్తం, హృదయం జబ్బు.



౧ ౧ ౨ ౨ ౨

౧. గొంతుక జబ్బులు.


౨. ఊపిరి జబ్బులు.



౩ ౩ ౪ ౪ ౪ ౪


౩. ఊపిరితిత్తులు బహుకున్నిలేం. వాటి సంబంధించిన రోగాలు

౪. ఉబ్బసం.




౫

౧. పక్షవాతలక్షణాలు.



౫ ౬ ౭ ౮ ౯ ౧౦

౫. పొట్టిగా, చదరంగా, నీలిగావుంటుంది. హృదయం, రక్తం జబ్బు.
౬. పొట్టిగా, ముక్కోణంగా వుంటుంది. పక్షవాత చిహ్నం.
౭. పొట్టిగా, సన్నగా, వంపుగా వుంటుంది. వెన్నెముక పోటు.
౮. వెడల్పుగా, పెద్దదిగా వుంటుంది. మంచిఆలోచన పరుడు.
౯. నిరంతరజాడ్య పీడితుడు.
౧౦. పొడవుగా, సన్నగా, పెళుసుగా-విరుగుతూవుంటే నీరసం, బుద్ధిమాంద్యం.



౧౧ ౧౨ ౧౩ ౧౪

౧౧. సన్నగా పొడవుగా ఉంటే పిరికితనం.
౧౨. బాదంరూపుగా పల్చగాఉంటే సౌమ్యుడు.
౧౩. పాలిపోతూ వంకరటింకరగా ఉంటే కోపిష్ఠి.
౧౪. ఎక్కువ వెడల్పు పొట్టి పెడసరితనంకోపం.

గోళ్లు

గోళ్ల పరీక్ష న్యాయంగా ఆరోగ్యరేఖతో కలిపి చూడవలసినది, కాని చేతిని తిప్పకుండా యిప్పుడే పరీక్షించడానికి వీలు కనుక ఇక్కడ నే తెలియజేస్తున్నా. ఆరోగ్యరేఖ పరిశీలించినప్పుడు ఈ గోళ్లవల్ల తెలుసుకున్న సంగతులు తప్పక మనస్సులో ఉంచవలెను.

ఈ బొమ్మలవల్ల గోళ్ల ఆకారనిర్ణయం, అవిసూచించే వ్యాధులు విశదం కాగలవు.

గోళ్ల రంగులు

"హారిద్రనఖరో భూయా
ద్దురాచరరతో నరః;
రోగీతు నీలనఖరో
రిక్తశ్చ శిథిలో నఖైః."

గోళ్లు పసుపు రంగుగా ఉంటే- దురాచారి, నీలిగా ఉంటే - రోగి. పెళుసుగా ముక్కలుగా విరిగిఉంటే-దరిద్రుడు ఫ్రెంచి శాస్త్రజ్ఞుల ప్రకారం.

వెలవెల పోతూఉంటే- శుష్కించే దేహి. స్వలాభాపేక్షకుడు.

పసుపుగాఉంటే-పైత్యం మందబుద్ధి.

విస్తారం ఎర్రగాఉంటే-వాతం, తొందర స్వభావం-అన్నిమతాల ప్రకారం.

మంచిఆరోగ్యాన్ని చక్కని మేధస్సును సూచించే గోళ్లు బాదంఆకారంగా తగుమాత్రం గులాబీరంగుతో ఉండవలెను.


బొటనవ్రేలు



౧ ౨

౧. వంగిన వ్రేలు_కలివిడిగల మనిషి. ఏపరిస్థితులలోనైనా, ఎవరితోనైనా సఖ్యంగా మంచిగా ఉండగలడు.

౨. నిడివిగా కొంచెంకూడా వంగకుండా ఉంటే పెడసరి, బిరుసుదనం హెచ్చు.



౧ ౨ ౩

౧. నడుము సన్నగా ఉంటే-మంచి ఆలోచనపరుడు, కళలలో, కవిత్వంలో రుచిగలవాడు.

౨. వ్యవహార వేత్త.

౩. బుద్ధికుశలత కొంతతక్కువ.



౩ ౨ ౧

౧. మూడుకణుపులు చక్కగా ఉన్నవి. మంచిది.

౨. గోటిభాగం పెద్దది. తెంపరి చొరవ హెచ్చు.

౩. గోటిభాగం చిన్నది. మధ్యకణుపు పెద్దది_వాగాడంబరం హెచ్చు. కార్యశూన్యులు.




౩ ౨ ౧

౧. పెంకె కోపిష్ఠి.

౨. దాత. కళానైపుణ్యం గలవాడు.

౩. చక్కని శిల్పి. కళలలోగాని సారస్వతంలోగాని.



గోటిభాగం ఎక్కువ కండపుష్టి గలిగి ఉండగా వుంటే పట్టరాని కోపం. తరుచు ఖూనీలు చేసేవాళ్ల చేతిలో ఉంటుంది.

బొటవ్రేలు

ఇక 'పీరోనమీ' పూర్తి కావడానికి బొటవ్రేలు పరీక్ష అవసరం. తొలిపలుకులో ఈవ్రేలిప్రాముఖ్యమును గురించి చర్చించేము ఒక్కబొటవ్రేలి పరీక్షవల్లనే చాలావరకూ సాముద్రికాన్ని సాధింపవచ్చును. కాని ప్రస్తుత రచన హస్తం మొత్తంగా చదవడానికి కనుక, ఎక్కువ అవసరమైన సంగతులు మాత్రం తెలియజేస్తాను.

బొటవ్రేలు విడదీసినప్పుడు చేతికి విస్తారం దూరంగాను, బొత్తిగా దగ్గరగాను కాకుండా ఉండవలెను. ఈ పరిమాణం కొన్ని చేతులు చూస్తే ఎవరైనా ఉజ్జాయింపుగా నిర్ణయించగలుగుతారు. బొత్తిగా దూరంగాఉంటే - మనిషి పెడసరి, పెంకెగా ఉండీ, మానవస్వభావాన్ని తెలుసుకుని మెలకువతో ప్రవర్తించే సామర్థ్యం తక్కువ కలిగిఉంటాడు.

బొత్తిగా దగ్గరగాఉంటే-ఎక్కువ మెత్తదనంవల్ల వృథాగా యితరులకు లోకువఔతాడు.

మధ్యస్థంగా ఉంటే - సమర్థతతో జాగ్రత్తగా పరిస్థితులను చూసుకుని మెలకువతో ప్రవర్తించగలుగుతాడు. రాచకార్యాలలో ఎక్కువ ఉపయోగిస్తాడు.

బొటవ్రేలి ఆకారం, దానిగుణం; కణుపుల అన్యోన్యదీర్ఘత్వం బొమ్మలలో విశదంగా తెలుస్తుంది. బొటవ్రేలు మణికట్టువద్దనుంచి గోటిచివరవరకూ తొమ్మిది భాగాలుచేస్తే గోటిభాగం రెండువంతులు, తరువాతభాగం మూడువంతులు, చేతిభాగం నాలుగువంతులు ఉండవలెను. ఇక పీరోనమి పూర్తి. ఇందులో తెలిసికొన్న సమస్తం జ్ఞాపకం ఉంచుకుంటే పీరోమేన్సీలో, చాలా ఉపయోగిస్తుంది.

మా వ్యాసకర్తలకు

వ్యాసములు చిన్నసైజు కాగితములపై ఒకవైపున మాత్రమే విడిఅక్షరములలో బంతులు దూరదూరముగా దిద్దుబాట్లు లేకుండ, తిన్నగా వ్రాసి వర్ణక్రమమునను తప్పులులేకుండ చూచుకొని పంపవేడికోలు. లేకున్న ముద్రణకార్యములయందు మిగుల కష్టము కలుగుటయే కాక తప్పులుకూడ నిలిచిపోవునని మనవి.

సంపాదకుడు, 'భారతి'

కుంతీ సందేశము

శ్రీ శేషాద్రిరమణ కవులు

ఓయి జగత్త్రయాభరణ ఓ యదునందన నిన్నుఁ గట్టఁగా
దాయలు బూనినారె? నిజదర్పభరంబునఁ బిచ్చలించి నీ
కే యెడ రాచరింపఁ బరికించిన దుష్టు లిఁకెంత దౌష్ట్యముల్
జేయఁగలేరు పాపులకుఁ జెట్టయు మంచితనంబు తోఁచునే.

కటకట యిద్ది కూడదని కానని కన్నుల వృద్ధుడైనఁ జె
ప్పట కెద సాహసింపఁడొకో? పోటుదనంబున నుత్సహించి వ
చ్చుట గని యాసుయోధనుని జూచియు సాత్యకి యెట్లు సైచె నీ
వెటుల సహించినాఁడవు హరీ, పగవారల బుజ్జగింతురే.

మనసామ్రాజ్యము ద్యూతరంగమున సంపాదించి సుంతేని సి
గ్గు నెదం బొందరు ధార్తరాష్ట్రు లిది నీకుం దెల్లమైయుండ నే
మని సంధింపఁగ నేగుదెంచితివి కృష్ణా? రాజవయ్యున్ సుద
ర్శనముం గేల ధరించియున్ సయిచితే శత్రుక్షమాధీశులన్.

బిచ్చపుఁగూటి కియ్యకొని బీరము కోల్పడి ధర్మజుండు నిన్
బుచ్చిన నెట్లువచ్చితివి పోటరివయ్యును; సంధిఁగూర్పఁగా
వచ్చునె ధార్తరాష్ట్రులకుఁ బాండుతనూజుల కాహవంబులోఁ
జచ్చుట కియ్యకొన్న కలుషప్రతిపక్షులు రాజ్యమిత్తురే.

బీరం బేమయిపోయెనో సహజగంభీరంబు * గోల్పోయె ధ
ర్మారంభుండగు ధర్మరాజు కులధర్మాదుల్ విసర్జించి దు
ర్వారిప్రవాత మొసంగు బిచ్చమునకై వాపోవుచున్నాఁడు నీ
వేరీతిన్ సహియించి వచ్చితివి శౌరీ సంధిగావింపఁగన్.

ఆరిపోయిన దేమొ యనితరవిక్రమక్రముఁడైన భీముని క్రౌర్యపటిమ
కూలారెనో యేమొ కురుకులవిద్రోహకరమైన పార్థుని కౌశలంబు
మఱుపయ్యెనో యేమొ యరిరక్తమునఁ దల నవరింపఁదలఁచు పాంచాలి కినుక
కడబట్టెనో యేమొ కవల మానసమందు నతిశయించెడి యుగ్రహాతిశయము.
అకట! నాల్గూళ్లు బిచ్చ మిమ్మనుచు నీవు-పగతురను వేఁడు విధ మెంచఁ బాండవులకు
రాచసిరి స్రుగ్గెనని తోఁచె; రాజతనయు-లిచ్చగింతురె పరపిండ హేయగతికి.

---

* గాంభీర్యంబు ?

ముల్లోకంబుల నేలఁగా భువి భవంబుం గొన్న కృష్ణుండు నా
యల్లుం డైదుగు రాత్మజాతులును వీరాగ్రేసరుల్, జీవితం
బెల్లన్ మార్తురపంచలో గడపఁగా నే నిట్లు పాలైతి, నే
తల్లుల్ సైతురు పుత్రదుర్వ్వరమహాచింతావ్యాప్తి నన్నుంబలెన్.

పగతురనొంచి క్షత్రియుఁడు భాగ్యము లొందుట మేలు, కానిచోఁ
దెగుట హితంబు, మార్తురను దిక్కఱి యాచన చేయు టొప్పునే?
తగవరియయ్యు ధర్మజుఁడు దైన్యభరంబు సహించి భిక్షుగో
రఁగ నిను బంపెనన్న నుడి అంపపుఁగోతలు కోసె నామదిన్.

పదమూఁడేడులు కాననాంతరములన్ బ్రహ్మజ్ఞులం గొల్చి తా
నెది యార్జించెనో యట్టిజ్ఞానమున కొనే యాచనావృత్తి, బె
ట్టిదుఁడై ధర్మజుఁ డున్నఁ జాలుసుమి, గాండీవోగ్రటంకారముల్
ప్రిదులన్ బార్థుఁడె తీర్పఁగాఁగలఁడు వైరివ్యూహసంఘాతమున్.

తానొక కొంతసేపు తనతమ్ముల నాపకయున్న యాజ్ఞ నే
నీనిరుపాధికాగ్రహ వినిష్ఠురసూక్తి విబోధితాత్ములై
పూనరె భీమ పార్థు లరిపుంజములన్ దెగటార్ప; ధర్మజా
ధీనుల కెట్లు లబ్బును స్వదేశము నీదయ కల్గియుండినన్.

పేడికె యాగ్రహంబు నొదవించును ద్రౌపది నిష్ఠురోక్తు లె
గ్గాడిన నోర్చుకొంట నృపులందునఁ గంటిమె? రాచపాడి తా
వీడుటెగాక తమ్ములను వీడ్వడఁ జేయుచు నుండె; నీభరం
బాడుది సైప; దెట్లు లకటా! మన ధర్మసుతుండు సైచెనో.

పదునాల్గేడుల దుర్వియోగమునకున్ వాపోవ నోకృష్ణ, నే
తుదిదాఁకన్ భరియింతుఁ గష్టములఁ బుత్రుల్ జేరి నామాటగా
మదికెక్కన్ వచియింపు మిట్లు సురధామంబైన, సామ్రాజ్య సం
పదమైనన్ గదనంబె గూర్చుఁ బరులన్ బ్రార్థింప లాభించునే.

ఇత్తురుగాక కౌరవు, లదెక్కడి ధర్మము, రాజ్యభాగముల్
తొత్తు విధానఁ గైకొనుట? దోర్బలసాధ్యములైన సంపదల్
కత్తులతోఁ గడించిన యఖండజయంబులె రాచపుట్టువుల్
తెత్తురు; బిచ్చపుం బ్రదుకు ధీరులు మెత్తురె? యెన్నఁడేనియున్.

మును ముచికుందుఁడన్న నృపపుత్రుఁడు యక్షుని సేవఁజేసి పూ
జన మొనరింప నాతనికి సర్వవసుంధర యక్షుఁ డిచ్చె, న
జ్జనపతి యేలనాఁకు నిజశక్తిసమార్జిత రాజ్యలక్ష్మితో
మనియెద నంచుఁ బల్కె-నట; మాతనయుల్ విన రిట్టి ధర్మముల్.

తానొకరుండె రూపఱిక ధర్మము వంశము రూపుమాపఁగాఁ
బూనిన కౌరవాగ్రజుఁడు పోటుదనంబున గాక రిత్త న
న్మానము నిచ్చగించి కొనుమా యని రాజ్యము పంచియిచ్చునే?
కానఁడు ధర్మజుండు రణకాతరులన్ దనియించు పద్ధతుల్.

పాండవుల కైదుగురకు ద్రౌపదికి నీవ-నేను దెలిపితి నని వచియింపుమయ్యా
కాఁగల విధంబు కాలమే గడపు; నవలఁ-గలవు మాపాలి చక్రరక్షకుఁడ వీవు.

అయ్యయో కౌరవు లధములు సంధికిఁ గొసరి వేఁడిన నియ్యకొందురయ్యా
పరపిండములు దిని బ్రదుకఁగా నినుబోలు రాచబిడ్డకు నెట్లు తోఁచెనయ్యా
స్వారాజ్యమో స్వరాజ్యమొ పొందనగుఁగాని కొదువ బిచ్చము లియ్యకొందురయ్యా
పగ దిగ్ద్రావి యిప్పగిది దాయలతోడ దిట్టతనాన వర్తింతురయ్యా
అనికిఁ బురికొల్పు మరుల నీ కది యసాధ్య-మైనఁ గానలలో దేహయాత్ర గడిపి
పరము గడియింపు మొండొక తెరవు నమ్మి-దాస్యమున కియ్యకొనకుమో ధర్మరాజ.

బిచ్చపుఁగూటిపైఁ దనకుఁ బెద్దయుఁ గోరిక గల్గెనేని పో
వచ్చును గ్రొత్తచోటులకు, వైరుల యాచనజేయు టొప్పునే
చచ్చుట కియ్యకొన్నయెడ సంగర మొప్పు; ఫలించు జన్మ; సం
పచ్చయ మబ్బు; కాలమదివచ్చినఁ జేకురు రాజ్యభోగముల్.

మనికికిఁ జేటుగూర్చి మన మార్తుర పంచలఁ బాయసాన్నముల్
దిని సుఖియించుకంటె నతిదీనత వేఱొక రుండఁ బోదు; పా
వనమగు రాజవంశమును బంకమునన్ బడద్రోయుకంటె నీ
ల్గిన యశమంచు నెంచి యనికిన్ జనుదెమ్మిఁక ధర్మనందనా!

నాఁడు సభాప్రదేశమున సాతుక వల్వల నీడదీయుచోఁ
బాడికి నీవు పాలుపడి భండన మాపితి వట్లు గానిచో
వాఁడి మెఱుంగుటంపరను బార్థుఁడు గాండివమందుఁ జేర్చి గో
రాడఁడె యేన్గుపోల్కి-ధృతరాష్ట్రతనూజుల నూచముట్టుగన్.

వదలవు శాంతవృత్తి, మది వైరము తోఁచిన నిద్రనేనియున్
బ్రదుకఁగనీవు, కోపమును భావములోపల దాచు పేర్మితో

వదరవు ధర్మశాస్త్రములు, వైరులునీవనఁ దల్లడిల్లుచుం
డెద రెటులోర్చుకొంటివి పటిష్ఠరుషాభర మో వృకోదరా!

గద చేఁబట్టి మహోగ్రవిక్రమ మెసంగన్ గౌరవవ్రాతమున్
దుదిముట్టింపఁగఁజాలు శూరమణివై, దుర్నీతి సైరించి ద్రో
వదికష్టంబులఁ గెట్టులోర్చితివొ నీ ప్రఖ్యాత బాహాబలా
స్పదరోషాగ్ని విరోధికాననము గాల్పన్ లేదె వాతాత్మజా!

ఆపఁగరాని కోపభర మాశయమందు ధరించి దీనవై
ద్రౌపది కుందుచున్నయది తత్ప్రతికారము సేయకున్నచో
నీ పటు విక్రమ స్ఫురణ నీ రణకౌశల మేల కాల్పనా ?
ఓపినవార లూరకొనుచున్న నికన్ గతియెద్ది పుత్రకా!

అవభృత † పూతమైన ద్రుపదాత్మజ పెన్నెరి బట్టినాఁడు కౌ
రవకులపాంసునుం డదరి అచ్చకు నీడ్వఁగ నోర్చికొన్న నీ
యవమతి నెంచినంత హృదయంబు జలించుఁ దదీయరోష మె
ట్లవునని విస్మరించితివొ యార్యులు నవ్వుచునుండఁ బుత్రకా!

బంధించి నిన్నుఁ బ్రవాహంబునం ద్రోచి చంపఁగా యత్నంబు సలిపినారు
నినుఁ గడతేర్ప దుర్నీతికిఁ బాల్పడి వివిధదుష్కృతులు గావించినారు
లక్కతో నిలుగట్టి చిక్కె భీముండని-క్రూరాత్ములై దరికొల్పినారు
తుదలేని విద్వేష మెద నించి నీ యంత్యమునకయి ధర్మంబు చెనకినారు
ధార్తరాష్ట్రులు చేయని దౌష్ట్యమున్నె-బిరుదు మగఁడవు నీ వెద వెఱపుగొన్న
‡ గుంతితో సాటి గాకున్న గొడ్డురాలు-పృథులవిక్రాంతిజీవన భీమసేన!

పరకష్టంబు సహింపనేరని జగత్ప్రఖ్యాతవీరుండ వీ
వరిదౌష్ట్యంబు నెటుల్ సహించితివొ నీ యర్ధాంగలక్ష్మిన్ సభాం
తరమందున్ బలుబాములన్ బఱచుచో దైన్యంబుగా నెట్టులన్
బరికింపం దొరకొంటివో తెలియదో పార్థా, సముద్యద్ద్యుతా!

కోపము నన్న యాపె ననుకొందము కొంచెము సేపు, తేపకుం
డేపకు యాజ్ఞసేని యతిధీరవచోహతి నొవ్వఁజేయఁగా
నోపితి వెట్లు? శాంతమును నోర్మియుఁ బాలులయందకాని, ది
గ్వ్యాపితశౌర్యులైన నరపాలురయందు రుచించునే సుతా!

† అవభృథ?. ‡ కుంతి గొడ్రాలితో సాటియగునా? గొడ్డురాలు కుంతితో సాటియగునా?

ఎక్కటి కయ్యమందు శివునే యెదిరించిన దిట్టవీవు; నీ
యుక్కును సాహసప్రతిభ యుత్తరగోగ్రహణంబునాఁడు నల్
దిక్కులవెల్గె; నిత్తఱిని దీనునికైవడి సంధిపేరిటన్
గ్రక్కునకూటి కాసపడఁ గల్గునె మోక్షము రాచబిడ్డకున్.

కవ లెదిరిం జయింపఁగల గండరగండలు, భీమసేనుఁ డా
హవమున నిస్సమానుఁడు, రణాంగణమందు భవత్ప్రసక్తి నా
కవగత, మన్నిరీతుల దయానిధి కృష్ణుఁడు జూచుచుండెఁ గౌ
రవులకు నీకు సంధికుదురన్ సహియింతునె నేను పుత్రకా!

గాండీవంబును నీవు సంగరమునన్ గౌరవ్యదౌష్ట్యంబుచే
బెండై చచ్చినఁ జింతనొందను, రణోర్విన్ దాయలన్ గూల్ప కె
న్నండో వచ్చినయట్లు సంధియని కృష్ణస్వామి నంపించు నీ
బండారంబు తలంచి వందురెద భావంబందు వీరవ్రతా!

ఓకవలార! నాదునుడి యొండు వినుండు, దురాత్మకుల్ రుషా
వ్యాకులురైన కౌరవులు ప్రాణముబోయిన రాజ్యభారమున్
గైకొనుమంచు నీయ; రిఁకఁ గాఁగల కార్యము సంగరంబు; మీ
ఢాకకు నెవ్వరోర్తురు; కడంగుఁడు యుద్ధమొనర్ప నిత్తఱిన్.

కుంతికంటె రాచకూఁతురా మాద్రియే-వీరమాత యనుచు విశ్వమెల్ల
స్తోత్రమాచరించు సుదినంబు దిలకింపఁ-జిక్కబట్టియుంటి జీవములను.

ముడువకుమమ్మ పెన్నెఱిని, ముమ్మరమై తగు రోషభారమున్
విడువకుమమ్మ సుంతయును, వీరవధూమణివైన నీవె యె
ప్పుడయిన శాంతవృత్తి నెదఁబూనినఁ బాండవులెల్ల దీనులై
యడవులకేగు దుర్గతుల కాయితమౌదురు సుమ్ము ద్రోవదీ!

నాఁడల దుస్ససేనుఁడు జనంబులు చూడఁగ-నేను నోటితో
నాడగరాని చెట్ట కటు లాయితమాటయుఁ గృష్ణుఁ డంతలో
నాఁడు మొఱన్ దలంచుటలు నా కురువంశము గూలుదాఁక లో
వీడఁగనీకు; సాధ్వులను వేచిన పాపము రూపుమాపదే.

పాండవులకును ద్రుపదసంభవకు నిట్లు-కడఁకమై చెప్పుమయ్య, నా కామితంబు
మరల రాచఱికంబు నీమఱఁదులకు నో-కింత దయయుంచి కూర్పుమా కృష్ణ! నీవు?



మన చిత్రరచన

తలిశెట్టి రామారావు గారు, బి. ఎ., బి. యల్.,

ఆంధ్ర దేశములో చిత్రరచనయందు నూతనమైనరుచులు ప్రబలుచున్నవనియు, జాతీయ రచనను ప్రజ లామోదించుచున్నారనియు, మనచిత్రకారులు క్రొత్తమార్గములనుద్రొక్కి యితరరాష్ట్రములవారి పొగడ్తను బడయుచున్నారనియు, చిత్రకారులసంఖ్య పెరుగుచున్నదనియు, స్త్రీలుకూడ చిత్రములను వ్రాయుచు మార్గదర్శకు లగుచున్నారనియు సంతోషించుచున్నాము. కాని సంతోష మధికమగునప్పుడు ఆత్మవిమర్శనము తగ్గును. ఆత్మవిమర్శనము లేనప్పుడు తప్పుత్రోవల ద్రొక్కుట సహజము. ఆంధ్రదేశమున చిత్రరచనను గూర్చి యిట్టిపరిస్థితులు ప్రబలియున్నవి. మన పొరపాటులను మనమిట్టియెడనున విమర్శించుకొనక పోయినయెడల శుభప్రదముగ వ్యాపించిన యుత్సాహము అనర్థమును చేకూర్చును.

బౌద్ధయుగమున వన్నెకెక్కిన చిత్రరచన ప్రపంచమునం దంతటను వేనోళ్ల బొగడ్త బడయుచున్నది. అజంత, 'బాఘ్', సింహగిరి (సీగిరియా) యందలి చిత్రములయొక్క భావప్రదర్శనమే యాకీర్తికి ముఖ్యమగు కారణము. వర్ణలేపనము పూర్వ మెటుల నుండెనో కాని యిప్పుడు మలినమై యుండుటవలన వర్ణలేపనమునం దగ్రగణ్యులైన పాశ్చాత్యుల దృష్టి నిది యాకర్షించియుండజాలవు. ఆకాలపు చిత్రకారులు రేఖల నతిలావణ్యముగ వ్రాసినను ఛాయాప్రదర్శనమున కలవడినదృష్టి నాకర్షించుటకు రేఖారచన ప్రధానకారణము కాజాలదు. వ్యక్తుల లావణ్యము వారి యంగముల పొందిక, వ్రేళ్లయందును వ్యక్తపరుపబడిన భావము, స్త్రీపురుషుల యేర్పాటు, అలంకారములు, భావపూరితము లైయున్న చిత్రములవిలువ ననేకవిధముల నధికపరచుచున్నవి. వీనియన్నిటికంటె మనము మనస్సునం దుంచుకొనవలసిన విషయము మరియొకటి కలదు. ఈ చిత్రములందును, బౌద్ధమతము క్షీణించి హిందూమతము పునరుజ్జీవనమునుబడసిన కాలమున దేశమునందంతటను నిర్మింపబడిన శిల్పసంపత్తియందును అద్భుతముగ హిందువుల నాగరికత, వారి చిత్తవృత్తి, వారి

సాంఘికజీవనము ప్రతిఫలించుచున్నవి. ఈ విశేషమువలననే యీచిత్రములు చిత్రరచనయందు హిందూదేశముయొక్క వ్యక్తిత్వమును నిలువబెట్టియున్నవి.

గ్రీకులు భారతదేశమునకు వచ్చినప్పుడు తమ శిల్పవిధానములను గాంధారదేశమున బ్రవేశపెట్టిరి. వాటి ననుసరించుటలో హైందవశిల్పులు గ్రీకురూపములను నిలువబెట్టినను, హైందవచిత్తవృత్తిని బ్రదర్శించువిధమున నారూపములను మార్చి, హైందవకళాభాగములుగ వినియోగించి క్రొత్తరుచులను జూపజాలిరి. ఈవిగ్రహముల నిప్పుడు గ్రీకో బౌద్ధశిల్పములుగ పండితులు పేర్కొనుచున్నారు. గ్రీసు, రోము దేశములందు పూర్వకాలమున నిర్మింపబడిన అద్భుతమైన విగ్రహములతో నేపాటిపరిచయమున్నవారైన నీగాంధారవిగ్రహములు గ్రీకుప్రతిమలను బోలియున్నవని యంగీకరింపక తప్పదు. ఇట్టివి హైందవకళాభాగము లెటులయ్యెను?—హైందవనాగరికత నివి వ్యక్తపరచుచున్నవి కనుకనే.

అక్బరు మొగలుచిత్రరచనను డిల్లీయందు ప్రవేశబెట్టెను. ఆవెంటనే యీనూతన విధానము ననుసరించి హిందూచిత్రకారులు రచనను ప్రారంభించి మొగలాయీలను కూడ మించిరి. డిల్లీయందు పాలించినను ప్రభువునాదరణను బడయుచుండిన యీ రచన రాజపుత్రస్థానము, పంజాబు, అయోధ్య, వంగదేశము, దక్షిణ హిందూదేశములందు వ్యాపించెను. హైందవ చిత్రకారుల హస్తములందు బడి, ఆయాప్రాంతముల రుచులనుబట్టి వేరురూపములను దాల్చి కంగ్రాచిత్రరచన, రాజపుత్రచిత్రరచన, అయోధ్యచిత్రరచన, దక్కనుచిత్రరచన, తంజాపూరు చిత్రరచన మొదలయినవిగ ప్రబలెను. రచనయందు మొగలుచిత్రములకును యీ వేరువేరు ప్రదేశముల చిత్రములకును విశేషము భేదములేదు. అన్నిచిత్రములయొక్క వర్ణలేపనము, విగ్రహములతీరు, చెట్లు మొదలగునవన్నియు సుమారొకేవిధమున నుండును. 'రాజపుత్ర' (కంగ్రా, రాజపుత్ర, అయోధ్య) చిత్రరచనయు, తంజాపూరు చిత్రరచనయు హైందవము లెటులయ్యెను? ఈరచన హైందవమైనయెడల డిల్లి, లక్నోచిత్రరచన హైందవమేల కాకూడదు? హైందవుల నాగరికత, చిత్తవృత్తి రాజపుత్ర తంజాపురచిత్రములందు కానవచ్చుటయు, డిల్లి, లక్నోచిత్రములందు కానరాకపోవుటయు దీనికి ప్రత్యుత్తరము.

ఆంగ్లప్రభుత్వము ప్రారంభమైనప్పుడు ఆంగ్లవిధానముల ననుసరించి కొందరు చిత్రకారులు చిత్రరచనను చేయ ప్రారంభించిరి. వీటిని జానుకంపెనీచిత్రములని సాధారణముగ బిలుతురు. రవివర్మ పాశ్చాత్యచిత్రరచనకు హిందూత్వమును చేకూర్చి నూతనశకమును ప్రారంభించెను కాని వీరిచిత్రములు చరిత్రకు దూరమగుటచేతను, పూర్వపు విధానములను పునరుజ్జీవితములుగ జేసి జాతీయతకు అగ్రస్థానము నొసగుటకు ప్రయత్నములు ప్రబ

లుటచేతను రవివర్మశకము శైశవావస్థయందే నన్నగిల్లుట కలుగుచున్నది.

రవివర్మచిత్రరచన జాతీయము కాదని కొందరు చిత్రకారులు తలచుటవలన సనాతన (అనగా బౌద్ధ, రాజపుత్ర) చిత్రరచనను లేవదీసి, వాటి ననుసరించి చిత్రములను వ్రాయబూనిరి. వీరిచిత్రములందు హిందూత్వము బాగుగ కానవచ్చుచున్నది. కొందరు పాశ్చాత్య కళావిమర్శకులు ఇట్టిరచనను హేళనచేసినను మరికొందరు పొగడప్రారంభించిరి. తుదకు ఆంగ్లచిత్రకళాసమితివారు (Royal Academy of Artists) హైందవవిధానములు హిందూదేశమునకు తగినవనియు వీటిని హైందవులు విడనాడుట ఆత్మవినాశకరమనియు గ్రహించి తమయభిప్రాయమును లోకమునకు వెల్లడిచేసిరి.

చిత్రములందు ఈ హిందూత్వ మెచ్చట గలదు? ఈప్రశ్నకు ప్రత్యుత్తరము సులభసాధ్యము కాదు. ఇతర లలితకళలందు కల హిందూత్వము చిత్రరచనయందును కలదు. పైకి వెల్లడిచేయుటకు సాధ్యము కాకపోయినను ప్రతిహిందువుడును ఈ హిందూత్వమును గ్రహించియే యున్నాడు. ఇదివరలో భారతి సంపుటములందు ప్రచురమైన 'భారతీయచిత్రరచన—కొన్నివిశేషములు' అను మూడు వ్యాసములందు దీనినిగూర్చి నాకుతోచిన విషయములను వ్రాసియున్నాను. ఇప్పుడు చిత్రములను వ్రాయుచున్న ఆంధ్రులీ 'విశేషములను' ఇకముందైనను దృక్పథమున నుంచుకొందురని మనవి.

ఆంధ్రదేశమునం దీరచన ఆమోదమును బడయుటకు రెండు కారణములు: వంగదేశీయు లీవిషయమున మార్గదర్శకు లగుటవలన యిరువురు వంగదేశీయులను రప్పించి బందరు జాతీయకళాశాలయందు ఆంధ్రయువకులకు నేర్పించుట; దామెర్ల రామారావు నూతనరచనను రాజమహేంద్రవరమున నొకసంస్థగ నిలుపజాలుట. ఇతర చిత్రకారు లచ్చటచ్చట విడిగ చిత్రించుచున్నను శుద్ధముగ పాశ్చాత్యరచననే యనుకరింపనివారు బందరు ననుసరించువారుగనో, రాజమహేంద్రవరము ననుసరించువారుగనో యున్నారు.

అజంత, వంగ చిత్రరచనలందు రేఖ ప్రధానము కనుక వీరందరును రేఖలతోనే చిత్రములను నిర్మించుచున్నారు. రాజపుత్ర, కంగ్రా, తంజాపూరు చిత్రములందు రేఖలు కానవచ్చుచున్నను మొగలు సాంప్రదాయముల ననుసరించుటచే లేతచాయకు ప్రాముఖ్యము కలిగెను. చాయకు ప్రాముఖ్యము కలుగుకొలది రేఖలయొక్క ప్రాముఖ్యము తగ్గుట తప్పదు కనుక 'రాజపుత్ర' రచనయందు రేఖ రెండవస్థానము నాక్రమించవలసి వచ్చెను. ఇంతమాత్రమున యీ చిత్రములందు హిందూత్వము తగ్గలేదు. రేఖలపైనే వ్యక్తినిర్మాణమాధారపడియుండిన యెడల శిల్పమునందు హిందూత్వమునకు తావులేకయుండవలసినది.

రాజపుత్రచిత్రము లన్నియు చిన్నవగుటవలన రేఖలతో వ్రాయుట అచ్చటచ్చట తప్పనిసరియయ్యెను. కాన చిత్రములందు హిందూత్వము చూపించుటకు రేఖారచన తప్పకయుండవలెనన్న వాదము సరియైనది కాదు. రేఖలుండరాదని నేను చెప్పుటలేదు. రేఖల నుపయోగించుటకు కొంతయనుభవము, ధైర్యము కావలెను. అజంత, బాఘ్, సీగిరియాచిత్రములందు రాజపుత్రచిత్రము లందువలె ఛాయయుండె ననుటకు నిదర్శనములు కలవు. కాలక్రమమున తక్కినరంగులన్నియు తీవ్రతను విడనాడునప్పుడు ఛాయనుజూపు లేతరంగులు మాయమైనవి. ఛాయను వాడినప్పటికిని ఆ బౌద్ధసన్న్యాసులు రేఖ నెంతమనోహరముగ నుపయోగించిరో కొంచెము పరిశీలించిన బోధపడగలదు. ఈ విషయములను పాటింపక పెద్దలు రేఖల నుపయోగించిరి కనుక తాము కూడ రేఖల నుపయోగింపవలెనను నిర్ణయము కావించుకొనుటచే ఎవరో కొందరు చిత్రకారులు తప్ప తక్కినవారందరు రేఖల నుపయోగపరచి తమచిత్రములను పాడుచేయుచున్నారు. ఛాయ వెలుతురులను ప్రదర్శింపజాలనివారికి రేఖ యొక్క శరణ్యామైనటులు కనబడుచున్నది. ప్రకృతియందు కనబడునటుల దృశ్యములను వ్రాయకుండుటకు కొంతధైర్యము కావలెను. ఇట్టిధైర్యము కలుగుటకు అనుభవము, భావగభీరత ముఖ్యము. భావపూరితమైన చిత్రములలో కొన్నిటియందు ప్రకృతి నియమములను విడనాడుటయే శ్రేయస్కరము. కాని యిప్పుడు ఆంధ్రదేశమున ప్రమరింపబడుచున్న జాతీయచిత్రములలో నధికములం దేదీ యీ భావము? ఈ హిందూత్వము?

బందరుచిత్రములను చూడండి. ఆ శుష్కాంగములేల? అజంతచిత్రములలో యీ దుమ్ముల ప్రోగులు కానవచ్చుచున్నవా? రాజపుత్రచిత్రములలో కానవచ్చుచున్నవా? శుష్కమైన అంగములను వ్రాయుటవలన చిత్రములకు హిందూత్వము వచ్చుననియా? భారతజాతి, భారతచిత్రరచన యిట్టి శుష్కస్థితియం దున్నదని లోకమునకు చాటుటకా? ఎవరో కొందరు వంగచిత్రకారు లిటుల వ్రాసినంతమాత్రమున వారేల యిటుల వ్రాసిరోయని యొక్కనిముషమైనను, విచారించక, వారి ననుకరించుట యేలనో గ్రహింప శక్యము కాకున్నది. ఆధ్యాత్మికదృష్టియే సనాతన హైందవచిత్రకారుని తలంపగుటచే స్నాయుపుష్టిని జూపుటకు వారికగత్యము లేకపోయెను. కాని యిట్టి శుష్కశరీరములను వారెప్పుడును చిత్రింపలేదు. గాంధారశిల్పములందు స్నాయువులను జూపకయే అంగపుష్టిని జూపిరి. తపఃకృశుడైయున్న బుద్ధుని విగ్రహమొక్కటి మాత్రము కలదు. ఇట్టిరచనవలన చిత్రకారుడు చూపజాలిన బుద్ధభగవానుని ధైర్యము, ఓర్మి, పట్టుదల, జ్ఞానోదయమునకు గావలసినయనుభవము ప్రస్ఫుటితము లయ్యెను. రోగపీడితులైయున్న స్త్రీలను వ్రాయునప్పుడుకూడ ఆచిత్రకారులకు శుష్కాంగము

లను వ్రాయుటకు చేతు లాడినవి కావు. ఇది వారిదృక్పథమునకు అగత్యము లేకపోయెను. నిజమిటులుండ సర్వాంగసుందరు లని మన పురాతనకవులచే వర్ణింపబడిన పురాణవ్యక్తులను కాని, శిల్పశాస్త్రములందు వర్ణింపబడిన దేవతారూపములను కాని, భావజనితములైన ఆధ్యాత్మికరూపములను కాని, పురుషులను కాని, స్త్రీలను కాని, వీరు వారననేల యే మానవవ్యక్తిచిత్రమును వ్రాసినను శుష్కాంగములే యిప్పటిచిత్రములందు ప్రధానములైనవి! దీనికితోడు భావము శూన్యము- ఇట్టి కొన్ని చిత్రములను చూచుటతో నిక నిట్టి జాతీయచిత్రకళ చాలుననుపించుచున్నది. ఈ శుష్కాంగముల కర్త మేచిత్రకారుడైనను ఈ భారతిద్వారా చూపించినయెడల ఆంధ్రులు కృతజ్ఞు లయ్యెదరు.

ఇక రూపనిర్మాణమును చూడండి. స్త్రీలను కాని పురుషులను కాని వికారముగ వ్రాయుట వీరి కానందముగ దోచుచున్నది. సనాతనహైందవచిత్రములను జూచినయెడల సౌందర్యము తప్ప వేరు కానరాదు. అజంత, బాఘ్ గుహాలందలి స్త్రీ లతిసుందరులని మహాకళాకోవిదుల యొక్కయు, కళాయాత్రికుల యొక్కయు అభిప్రాయము. స్త్రీలు మానవలోకమున కలంకారములని పూర్వపుచిత్రకారులు భావించిరి. ఎన్నిచిత్తవృత్తులు కలవో అన్నివిధముల స్త్రీల నతిప్రేమతో సృజించిరి. వస్త్రవిన్యాసమునందు వింతరుచులు చూపుటకు ఆ కాలమున దుస్తులతో అంగములను గప్పుట విశేషముగ లేకపోయినను అలంకారములతో ఆవ్యక్తుల నెటు లలంకరించిరో చూడండి. వీరి శిరోజబంధములను పలువిధముల రచించి, నాగరికులైన యిప్పటిస్త్రీలకు కూడ క్రొత్త మార్గములను నేర్పసమర్థులైరి. స్త్రీలను ముత్యములతో పోల్చిరో యనునటుల నెచ్చటజూచినను వీరియంగములు ముక్తాలంకృతములే. 'రాజపుత్ర' చిత్రములందును స్త్రీ లతిసుందరులు. మొగలుసాంప్రదాయముల నీరాజపుత్రచిత్రకారు లనుకరించుటచే గృహమునందే మెలగెడి స్త్రీలను వీరు చిత్రింపజాలకపోయిరి. మొగలాయీలకాలమున స్త్రీలు మరుగునందుండుట ఆచారసామాన్య మగుటవలన, కాని వీలగునప్పుడెల్ల—ప్రత్యేకవ్యక్తులను, వారిరూపచిత్రములను, కృష్ణలీలాదిపురాణచిత్రములను, రాగిణిచిత్రములను—ఎంత యాహ్లాదకరముగ వ్రాసిరో యీచిత్రములను చూచినవా రందరికిని బోధపడగలదు. సుందరవిగ్రహములను వ్రాయుటయందు బౌద్ధయుగమునందలి చిత్రకారులతో వీరు పందెము వేసిరా యనిపించును. మన సనాతనచిత్రరచనాసాంప్రదాయముల నుద్ధరించుటకు సమకట్టియు, ఆధునిక జాతీయచిత్రకారు లిట్టి వికారరూపములను చిత్రించి పూర్వపుచిత్రకారు లేర్పరచిన మార్గముల నేల కంటకమయములుగ జేయుచున్నారో గోచరమగుటలేదు. ఏవో వికారములైన ఛాయాచిత్రములను హిందువులుగ ప్రచురించి

మనలను హాస్యాస్పదములుగ జేయుచున్న పాశ్చాత్య పత్రికాధిపతులకు వీరు తోడ్పడి హిందూదేశమున కపారమైన నష్టమును కలుగ జేయుచున్నారు.

ఇట్టిచిత్రములను వ్రాయువారిలో చాలా మందికి ప్రకృతిననుసరించి చిత్రములను వ్రాయుట చేతగాదేమో! ఎట్టి చిత్రములను తరువాత వ్రాయ నుద్దేశించినను ప్రారంభమున ప్రకృతి ననుసరించి చిత్రములను వ్రాయుట నేర్చుకొనుట మంచిది.

రాజమహేంద్రవరము చిత్రములం దీలోపములు కానరావు కాని వీటియందు చాలా భాగములు భావరహితములై యుండుటచే నిష్ప్రయోజనము లగుచున్నవి. వరవివర్మచిత్రమునో, పాశ్చాత్యచిత్రమునో తీసుకొని, అటులనే రేఖలతో వేరుకాగితముపై వ్రాసి చాయ నచ్చటచ్చట కొంచెముసూచించి, తక్కినభాగమును రంగులతో నింపినయెడల రాజమహేంద్రవరపుచిత్రములవంటివి కావా యనిపించును. హిందూసాంఘికజీవనము, హిందూఆధ్యాత్మికదృష్టి, హిందూ కళాసంప్రదాయములు హిందూచిత్తవృత్తి యీచిత్రములందు మరికొంచెము స్ఫుటముగ కానవచ్చినయెడల నివి మంచి జాతీయచిత్రము లగును. రామారావుగారి భావపటుత్వము, వ్యక్తుల కూటమియందు పాందిక వారిశిష్యు లింకను నేర్చుకొనవలసియున్నది. ఛందస్సును నేర్చుకొని పద్యముల నల్లినంతమాత్రమున కవియెటులుగాడో, చిత్రములను వ్రాసి రంగులను పూసినంతమాత్రమున చిత్రకారుడు కాజాలడు. భావమే కవిత్వమునకుగాని, సంగీతమునకుగాని, చిత్రములకుగాని పునాది-జీవము. ఈభావము ననుసరించి వృత్తమును, రాగమును, రంగును ఉండును. కళాకోవిదులకు కలుగు పవిత్రభావములు చదువువారియందును, వినువారియందును, చూచువారియందును కలుగజేసి వారి హృదయములను పవిత్రములుగ జేయుటయే హిందూదేశపు లలితకళలయొక్క యుద్దేశము.

ఈజిప్టును ఆదర్శముగ దీసికొంటిమని రాజమహేంద్రవరమువారు చెప్పుకొనుట కలదు. ఈజిప్టునందు ఆంధ్రత్వ మెచ్చట గలదు? పూర్వులు మనకేర్పరిచిన రాజమార్గములు తగవనియా? కళలు జాతిభేదము లెరుగవనియు, అన్నిదేశములందును కళలయుద్దేశ మొక్కటియే యనియు, పరదేశములందు నూతనవిధానములు కానవచ్చినయెడల మనము నేర్చుకొనుట శ్రేయస్కరమనియు, వీరు వాదించవచ్చును. దేశములందుకల నాగరికత, జ్ఞానము కళలవలన పైకి కానవచ్చును. ఆపిమ్మట కళలు నాగరికతను, జ్ఞానమును తగుమార్గముల నడిపింపగలవు. నానాదేశముల చిత్రరచనను జూడ నాయాదేశముల నాగరికతను కళలను అనుసరించియున్నవి. అందువలననే ఐరోపా, అమెరికా చిత్రరచన, ఈజిప్టుచిత్రరచన, మహమ్మదీయచిత్రరచన, భారతీయచిత్రరచన, చైనా జపాను చిత్రరచన భేదించియున్నవి. హిందూదేశపు చిత్రరచనా

విధానములు చైనా జపాను దేశములందు మార్పు చెందెను. మహమ్మదీయచిత్రరచన, గ్రీకు శిల్పరచన హిందూదేశమునందు మార్పుజెందినవి. ఈజిప్టు దేశపు రుచులకును, భారత దేశపు రుచులకును చాలావ్యత్యాసము కలదు. వారి దృక్పథము వేరు; మనదృక్పథము వేరు. వారి రచన మనకు సరిపోవుననుటకు కారణములు చాలవు. ఆలోచన, భావము ఒక్కటైనచోటు లందును భాషాభేదమువలన వేరువేరు కావ్యములు పుట్టుచున్నవి. భావ చిత్రరచనావిధానములో బోల్చదగును. ఇంతకును భారతీయ చిత్రరచనకు సంపూర్ణవ్యక్తిత్వము కలదనియు, భారతీయరచనకు మించిన భారత దేశమునకు సరిపోవురచన వేరులేదనియు, మనసంస్థల యెడల సానుభూతిలేని పాశ్చాత్యకళావిమర్శకులుకూడ అంగీకరించియున్నారు. ఈ విషయమును నేరచించిన 'భారతీయచిత్రరచన—కొన్నివిశేషములు' అను వ్యాసములందు వివరించియున్నాను.

ఇటుల వ్రాసితినని కోపగించక యిట్టి లోపములలో చిత్రించుచున్న చిత్రకారులు ఆత్మవిమర్శనమును గావించుకొందురుగాక! ఇకముందైనను భావపూరితములైన చిత్రరాజములు వెలువడుగాక! ఆంధ్ర దేశమున జాతీయ చిత్రరచన పెరిగి, క్రొత్త రుచులను జూపి భారతభూమికి వన్నె దెచ్చుగాక!

చాటుపద్యములు

వడ్డాది సుబ్బారాయఁడుగారు

గణములు ప్రాసముల్ యతులు కావ్యమునన్ గుణముల్ ఘటింపఁగా
రణములు; పద్యమల్లను దొరంకొనుచో, ననుకోనిభావజృం
భణ పదబంధశోభలటఁ బొటిలుఁ దన్నియమానుసారితన్;
సృణి కరిణింబలెం, గవితసీమమె సూ నడిపించు నింపుగన్.

మంచట్టుల్ చలిగాలిచేఁ గరఁగ యుష్మద్రూప మూర్తిన్ ఘనా!
ముంచు న్నీరము నింగి డిగ్గి; యదియొప్పంగాని, యా నీ రెటుల్
గాంచున్ సన్నపుఁజిల్లులంబలె దొరంగన్ ధారలై? చాతకో
దంచ చ్చంచుపుటీప్రణాళికలచే నం చాత్మ నూహించెదన్.

సకలం బీశుఁ డొసంగె సౌఖ్యమునకై సంసారి; కైనన్ దదా
ప్తికి సంతృప్తి ప్రధానసాధనము; వేవే లెవ్వి యె న్నుండినన్

సుక వీయంగను జాల వర్ధి వెలిగాఁ; జోద్యంబు, సంపన్నుఁడున్
శిబిరం బెత్తెడువాఁడువోలె, నధి లేమిన్ లేవడిన్ గుందెడున్.

చెలిమిని గొన్ని నాళ్లె మను స్త్రీ పురుషుల్ జలవాసి వేఱువా
రల మరగన్, మఱుంగును బరస్పర మిథ్యారయుల్లముల్; గటా!
మెలమి ననేకవత్సరము లేకశరీరత నుండి యమ్మల
య్యలు విడియాకులం బెఱల కాల్మగలై యెటుమండ్రొ నెమ్మదిన్.

నాటకమందుఁ బాత్రలయి నాయకులన్ వరియించి యాటలం
బాటల హావభావపుఁ జమత్కృతులన్ యువతుల్ నటింప, న
చ్చోటను వారిభర్త లదిచూచి ప్రహర్షితులైన, నార్హతుల్
నాటెడు నట్టిమోహముఁ దలంతుఁ గరిష్ఠమటంచు వారికిన్.

కల రిలఁ జిత్రకారు లధికంబగు కౌశలి వర్ణతూలికా
దులను, సచేతనప్రతికృతుల్ పటముఖ్యములన్ లిఖించువా
రలు; లవమైన, వారు నరిరారుసుమీ మకరాంకశిల్పికిన్;
దలఁపుల, బైలఁ, బాంధుల యథాస్థితి వ్రాయునతం డనంగుఁడై.

కల్పవల్లియుండ, గడ్డిపోఁచను జేరి - కాళ్ల వేళ్లఁ బడెడు కాముకుండ!
చులుకి నగుటెగాక కలదె దాన ఫలంబు?-మరుఁడు పశువుఁ జేయు దొరకు మొఱకు.

ఆదిమదృక్సంగ మక్షరాభ్యాసంబు మఱిమఱిచూ పోనమాల వ్రాఁత
యరుగుచోఁ దిరిగిచూ పతుకులు గుణితంబు పిలుచుట, పలుకులు వేళ్ల చదువు,
పరిచయాధిక్యంబుపట్టుట పొత్తంబు, సరసభాషలు కావ్యచయపఠనము
లలితవిభ్రమభంగి లక్షణజ్ఞానంబు, కలయికపైఁ గాంక్ష కవనచింత
ప్రణయలేఖలిఖించుట పద్యరచన-గా, ననంగగురుండు శృంగారవిద్య
దిద్దుటను, నైకబంధాద్యధికచమత్కృ-తుల రమణి రసికుమది రంజిల నొనర్చె.

వెనుపల్లెమ్మను నీళ్లనించి, నడుమం బెంచుంచి, యచ్చో గుడం
బునుపం, బాత్రను మూఁగు చీమగుమియం దొక్కండు నీరీఁది చ
చ్చిన, నల్లన్నియు దోరి సేతు నగుడున్, సేమంబుగాఁ బ్రాఁకి చే
రెను దక్కన్నియు బెల్ల; మిట్టులె జయశ్రీఁగంద్రు శూరాగ్రణుల్.

ఒంటిమిట్ట శ్రీరామమహోత్సవ చిత్రములు




ఒంటిమిట్ట శ్రీరామాలయ సింహద్వారము



శ్రీరామ సామ్రాజ్యపట్టాభిషేకము




శ్రీరామ రథోత్సవము



శ్రీరామ గజోత్సవము



ఫిలడెల్ఫియాలోని స్వాతంత్ర్యమందిరము.



స్వాతంత్ర్యమందిరమునందలి స్వేచ్ఛాఘంటా సౌధసోపానములు. ఫిలడెల్ఫియా.

౩౧

కూనలమ్మపదాలు

'కూనరాగాలు తీస్తున్నా'డని మధ్యాంధ్రదేశమందున్నూ, 'కూనలమ్మ సంగీతాలు తీస్తున్నా'డని దత్తమండలమందున్నూ వాడుకలో నానుడి పలుకు ఉన్నది. అది ఈ క్రింది పదాలనుబట్టి పుట్టినది. ఇట్టిపదము లెన్ని ఉన్నవో తెలియదు. అరవములో అవ్వయార్ పదా లెంత విలువగలవో తెలుగులో కూనలమ్మపదాలుకూడా అంతవిలువగలవేఅన వచ్చును.

జప తపంబులకన్న
చదువుసాములకన్న
ఉపకార మేమిన్న
ఓ కూనలమ్మా!

అన్నమిచ్చినవాని
నాలినిచ్చినవాని
నవమానించుట హాని
ఓకూనలమ్మా!

మగనిమాటకుమాటి
కెదురుపల్కెడు బోటి
మృత్యుదేవతసాటి
ఓకూనలమ్మా!

కాపువాడే రెడ్డి
గరికపోచేగడ్డి
కానకుంటేగుడ్డి
ఓకూనలమ్మా!

కవితారసపుజల్లు
ఖడ్గాలగలుగల్లు
కరణాలకే చెల్లు
ఓకూనలమ్మా!

దుర్యోధనుడుభోగి
ధర్మరా జొకజోగి
అర్జునుండే యోగి
ఓకూనలమ్మా!

భీష్ముడనుభవశాలి
భీముడేబలశాలి
కర్ణుడే గుణశాలి
ఓకూనలమ్మా!

ఆడితప్పినవాని
నాలినేలనివాని
నాదరించుట హాని
ఓకూనలమ్మా

౩౨

జడుపు

పసిబిడ్డను ముందు కూర్చుండబెట్టుకుని యీ క్రిందిపదము చెప్పుతూ చివరకు కళ్లలో ఉఫ్ అని ఊదితే బిడ్డ కళ్లుమూస్తుంది. "అదుగో జడిసినావులే" అని గేలిచేస్తారు. అందాకా జడవను జడవను అని బదులు చెప్పుతుంది.

"నూకలుపెడతాను మేకలుగాస్తావు? కాస్తా
పెద్దపులివస్తే జడవవుగద జడవను
చిఱుతపులివస్తే జడవవుగద జడవను
ఎలుగుబంటివస్తే జడవవుగద జడవను



సివంగివస్తే జడవవుగద జడవను
తోడేలువస్తే జడవవుగద జడవను

అన్నింటికీ 'జడవను' అని చెప్పాను.
నేవస్తే జడవవుకద.

(ఇది చెప్పి కళ్లలో ఊదవలెను; కన్నులు మూసుకొనును)

జడిసినావులే అమ్మా జడిసినావు!!

౩౩

వరుసపరాచకము.

వదినగారూ మీరు వాసిగలవారు
వండబోయినచోట కుండ నాకేరు
బావగారూ మీరు ప్రతిభగలవారు
నిండిన్నసభలోను పిండిబొక్కేరు
చక్కిలాలాబుట్ట చంకబెట్టుకొని
సభలోను మాబావ సంగీతపరుడు,

* * *

అందలముకోరింది కుందనపుకుచ్చు
అతిభోగికోరాదు అత్తవారిల్లు
పల్లకీకోరింది పచ్చన్నికుచ్చు
పరదేశికోరాదు పంచటరుగుల్లు

౩౪

పరాచకాలు.

అత్తింటికోడలూ అలిగిపడుకుంది
ఆలుకల్లుతీర్చవే ములుకుల్ల కఱ్ఱ
అట్లుతిని అన్నయ్య అలిగి పడుకంటే
తిట్లుతిని వదినమ్మ తీపులందింది.
పొద్దోయిపొద్దోయి అన్నయ్యావస్తే
జల్తారుచీరల్లు కట్టువదినమ్మ
చింతాకు చక్కన్న చీర చక్కన్న
సిరిదేవి మావదినచీర చక్కన్న

౩౫

చక్కిలిగింతలు

పసిబిడ్డలను పెద్దవారు దగ్గరకూర్చుండబెట్టుకొని అరచెయ్యిపట్టుకొని ఈక్రిందిపదము చెప్పుతూ ఆయా పనులు చేస్తున్నట్టు అభినయిస్తూ చివరకు బిడ్డచంకలో చక్కిలిగింత పెట్టుతారు. బిడ్డ నవ్వుతుంది.

"పప్పుపెట్టి పాయసంపెట్టి
అన్నంపెట్టి అప్పచ్చిపెట్టి
కూరపెట్టి ఊరుగాయపెట్టి
నెయ్యివేసి ముద్దచేసి
తినిపించి తినిపించి



చెయిగడిగి మూతిగడిగి
తాతగారింటికి దారేదంటే
(అత్తవారింటికి దారేదంటే)
ఇట్లాపోయి ఇట్లాపోయి
మోచేతిపాలెం ముందర్నుంచి
ఇట్లాపోయి ఇట్లాపోయి
ఇదిగోఇదిగో వచ్చాంవచ్చాం
చక్కావచ్చాం చక్కావచ్చాం
చక్కిలిగిలిగిలి చక్కిలిగిలిగిలి.

౩౬

దో స పం డు

త్రోవలో ఒకరాజుతోటేసినాడు
తోటలోపల పండ్లుదోర్లుతున్నావి



దోర్లుతున్నవి తియ్యదోసపండ్లన్ని
ఆపండ్లు పంపాడు ఆరగించంగ
తింటేను తియదోసపండ్లే తినాలి
కంటేను కొడుకుల్ల కాన్పేకనాలి
కంటేను కొడుకుల్ల కాన్పేకనాలి
అందితే అన్నతో వియ్యమందాలి
అందితే అన్నతో వియ్యమందాలి
ఆడితే వదినతో జగడమాడాలి.

చమత్కారచంద్రిక

తాడూరి లక్ష్మీనరసింహారావు గారు

మూ ల ము

ఆదిశూన్యేతు కేదారం
మధ్యశూన్యే శివాలయమ్,
అంత్యశూన్యే పయోధారా
త్రయః కాచన వల్లరీ.


తెనుఁగు పద్యము

ఆ. మొదలుపోవఁబొలముతుదిపోవఁగానొక్క
పాలధార నడుము పాసెనేని
యగుశివాలయంబు నలమూఁడుఁ గలసిన
నొక్కతీవెయాచు నొప్పనుర్వి.

వి వ ర ణ ము :

ఇందుద్దేశింపఁబడ్డ శబ్దము "గుమ్మడి"
మడి=పొలము, గుమ్మ=పాలధార, గుడి=
శివాలయము, గుమ్మడి=తీగపేరు.

మా కొత్తవకీలు





నలందా విశ్వవిద్యాలయము—క్షీణదశ

బౌద్ధులు స్థాపించిన యీ విశ్వవిద్యాలయము, ఇసింగు వచ్చి యిచట పదివత్సరములు విద్యనభ్యసించు చుండినపుడు ఉన్నతదశయందుండెను. దాని పేరు ప్రతిష్ఠలు నల్దడల వ్యాపింప, క్రీ. శ. ౭౫౦ సం॥ న, అచట ప్రధానాచార్యులగు కమలశీలగారిని టిబెట్ ప్రభువు తన రాష్ట్రమందు నాస్తికత్వము నడుగంటించి బౌద్ధమతమును పునరుద్ధరించుటకై, రాయబారుల బంపి పిలిపించుకొనినట్లు తెలియుచున్నది. తరువాతి కాలము నసే అది క్షీణముకా ప్రారంభించెను. రాజపోషణ వలన విక్రమశిలయందు విశ్వవిద్యాలయ మేర్పడుటయే దీనిని కృశింపజేసియుండును. విక్రమశిలయే ఉత్తర హిందూస్థానమున కంతటికిని విద్యకు ముఖ్యస్థానమైనను, రెండు విద్యాలయములకును రాకపోక లుండియుండ వలెను. విక్రమశిలయందలి 'అసిత' గారిని తీసికొనిరమ్మని టిబెటు ప్రభువు పంపగావచ్చిన యీ దేశపుసన్యాసి, మార్గమధ్యమున నలందాయందు బసచేసియున్నట్లు తార్కాణ కలదు. నలందావిశ్వవిద్యాలయము వేయివత్సరములు వెంపొందగలదని హియాంసాంగ్ ఐతిహ్యము నొకదానిని నుడివియున్నాడు; కాని అంత కాలము దానికి ప్రసిద్ధియున్నట్లు కన్పట్టదు.

పదియవ, పదునొకండవశతాబ్దములందు గూడ నలందావిశ్వవిద్యాలయము విక్రమశిలతో పోటీలు మెఱయ వాసికెక్కియుండెనని కొందఱ అభిప్రాయపడు చున్నారు. దీనికి తార్కాణగా, మహీపాలుడు రాజ్యమునకు వచ్చిన వెనుక ఆరుసంవత్సరములకు నలందాయందు వ్రాత ప్రతి కొకదానికి ప్రతివ్రాయఁబడియున్నది. అది యిప్పుడు 'ఏషియాటిక్ సొసయిటి'వారి గ్రంథాలయమున గలదు.

డా. కీల్హారన్ గారు తమ ప్రాచీనశాసనాది పరిశోధనలం బట్టి తొమ్మిదవశతాబ్ది చివరకాలమునుండి నలందా పేరు మాసిపోజొచ్చెనని చెప్పుచున్నారు. వీరి కాధారము, కాప్టన్ కిట్టోగారు బయటికి తీసిన ఘోస్రవణశాసనము. ఘోస్రవణము బీహారునకు నైరృతి మూలను, ఆరుమైళ్లుదూరమున కలదు. ఈశాసనమందు దేవపాలుడను రాజు వీరదేవుని నలందా విశ్వవిద్యాలయమున ప్రధానాచార్యునిగా నియమించినట్లు లిఖింపబడియున్నది.

ప్రసిద్ధికెక్కిన యీ విశ్వవిద్యాలయము క్షీణించుటకు రెండుకారణములు చెప్పుచున్నారు. మొదటిది: దాని కట్టడములు పురాతనములై, కాలపరిణతి వలన నశించియుండ నోపును. రెండవది: విక్రమశిలయందు విద్యాలయము స్థాపింపబడుట, దానికి రాజపోషణ కలిగి, యిందుల కది కొఱవడుటయు, నందుచే విక్రమశిలకీర్తి ముందు నలందాకు మాపు ప్రాప్తించుట. ఇంతటికిని ఫలితముగా యిట్టి 'సంఘారామము' విశేషమాదరణ లేక కృశించి, మహమ్మదీయులు దాడివెడలి వచ్చి, ఇతర విశ్వవిద్యాలయములతోఁబాటు దీనిని ధ్వంసమొనర్చి

నపుడు, పూర్తిగా నంతరించెను. 'పాగ్ని ముజంగ్' వ్రాత ప్రకారము, మహమ్మదీయులదాడితీరినవెనుక గూడ ముదికిళ్ళి ద్రుంగ డనుబుషి దేవాలయాదులను పునరుద్ధరించెననియు, మగధరాజున కమాత్యుడొకడు నలందాయం దొక దేవాలయమును నిర్మించెననియు దెలియుచున్నది మఱియొకసంగాథ యిట్లుకలదు. ఇంతటికి తీర్థికభిక్షువు లిరువురు రాగా, వారిపై నెవరో క్రొత్తశిష్యులు మైల నీళ్లను చల్లిరి. అందులకు వారు కినిసి, పండ్రెండుసంవత్సరము లు సూర్యారాధన గావించుటవలన మహత్వముపడసి యజ్ఞగుండమునుండి భస్మమును చేతికెత్తుకొని బౌద్ధదేవాలయము పయిజల్లిరి. ఇంతటితో నచటి గ్రంథాలయమే కాక, కట్టడములన్నియును భస్మీపటలంబులై పోయెను. బాలాదిత్య శాసనమందును నిట్టిగాథయే కానిపించుచున్నది.

మే (ఇండియన్ స్టేట్ రైల్వేస్ మేగజీన్ నుండి)

హిందువులు—రాబోవు జనాభా

రాబోవు జనాభా లెక్కలలో హిందువులు తమ సంఖ్యను గూర్చి జాగ్రత్తపడవలెనని హిందూమహాసభ కార్యద్రష్ట, పండిత దేవరత్నశర్మ వార్తా పత్రికలందిట్లు వ్రాయుచున్నారు.

"మహమ్మదీయులందును, క్రైస్తవులందును కుల భేదములుకలవనియు, ఆ కులములు తరతరములుగా పరస్పర వైరుధ్యము కలిగినవనియు నందఱికిం దెలిసియేయున్నది. కాని, వారినిమాత్రము మహమ్మదీయులు, క్రైస్తవులని మొత్తములుగా సూచించి, హిందువుల ననేక భాగములుగా బ్రాహ్మణ, ఆర్య, బ్రహ్మో, సిక్కు, జైన, బౌద్ధ, ఆటవిక, ఇత్యాదులుగా విభజించి వ్రాయుచున్నారు. ఈవిధముగా దేశములోనిహిందువులను కొంచెపఱచి, అనేకులకు దురభిప్రాయమును కల్గించుచున్నారు. ౧౯౨౧ సం. జనాభా ప్రకారము హిందువులు ౨౧౬, ౭౩౪, ౫౮౬, మంది, మహమ్మదీయులు ౬౮, ౭౩౫, ౨౩౩, మంది, క్రైస్తవులు ౪,౭౫౪,౦౬౪, మంది అనితోచుచున్నది. కాని, హిందువులమొత్తమును సరిగా వ్రాసినయెడల ౨౪౭,౫౧౫,౫౯౪, అగును. ఇంతేగాక, అనేకులు హిందూసంస్కారమును కలిగి, హిందువుల యాత్రాస్థలములను సేవించుచు, హిందూ పురోహితులచేతనే వివాహాది కార్యముల నిర్వర్తించుచు నేకో యొకటిరెండు మహమ్మదీయులదో, లేక క్రైస్తవులదో ఆచారములనుకలిగియున్నారు. వారిని హిందువులనుగాచూపక, మహమ్మదీయులుగనో, క్రైస్తవులుగనో చూపుచున్నారు. మఱి ఆటవికులును, కొండజాతివారును అగుభిల్లులు, గాండ్లు, హిందూదేవతల నారాధించువారుగానుండి, హిందూమతభిన్నులగువారుగా జనాభాలెక్కలందుంగలరు. ఈసారికి, "అస్పృశ్యులను"నిమ్న జాతివారిని హిందువులనుండి విడదీసి వ్రాయుదురని భందియము వొడముచున్నది. క్రైస్తవులందును, మహమ్మదీయులందునుంగూడ యిట్టి నిమ్నజాతులు కలవని మాత్రము వీరు గుర్తింపరు. ... ...

కావున ప్రతిహిందూసంస్థయును, ప్రతిహిందూ ప్రచారకుడును, రాబోవు జనాభాలో యెట్టి అన్యాయమును హిందువులకు గలుగకుండునట్లు చూడవలెను. ఈసంవత్సరము లోగా అస్పృశ్యులనబడు హిందువులేకుండునట్లు మనము కృషిసల్పవలెను. అదిగాక, అస్పృశ్యుడుగాభావింపబడు వాడే, అస్పృశ్యుల లెక్కలో చేరునట్లు చూడవలెను. రెండవది: ఎన్నివిభాగములున్నను, వాని ప్రత్యేకసంఖ్య లొసగ బడినను హిందువులను మొత్తముగా చూపించునట్లు చేయవలెను. మూడవది: భిల్లులు, గాండ్లు, కోళియులు మొదలైన ఆటవికులందఱును, హిందూఆచారములను పాటించువారు, హిందూదేవతలను కొల్చువారు, హిందువులుగనే లెక్కలందు పరిగణింపబడవలెను. నాలుగవది: మాల్కానాలు, ఇతర రాజపుత్రులు గుజారులు జాటులు, మొదలైనవారు, కష్టనష్టములకోర్చి ఇప్పటికిని హిందూఆచారములను, హిందూ సంస్కారములను వీడనివారు, శుద్ధివిధినిపొందక పోయినను సరియే, హిందూమతమును వారు నమ్ముచుందురేని హిందువులుగనే లెక్కలందు చూపింపబడవలెను."

(మాడర్న్ రివ్యూ)

ఆంధ్రాభ్యుదయము



శ్రీయుత డా. చిలుకూరు నారాయణరావు
పంతులుగారు, యం. ఏ.

ఇటీవల వీరికి చెన్నపురి విశ్వవిద్యాలయమువారు పి. హెచ్. డి. బిరుదము నొసంగిరి. వీరు ప్రస్తుత మనంతపురము దత్తమండల కళాశాలలో నుపాధ్యాయపదవి నధిష్ఠించియున్నారు.



శ్రీయుత అంచూరు సుబ్బానాయుడుగారు,

వీరిది నెల్లూరుకు తూర్పుననున్న ఇందుకూరుపేట గ్రామము.

ముప్పదియైదు ఏండ్లకుపూర్వము నెల్లూరుమండలము రాపూరుతాలూకాలో పొదలకూరికి మూడుమైళ్లదూరమున అభ్రకపు గనిని త్రవ్వించి అందులభించిన అభ్రకమువలన కోట్లకొలది గడించిన లక్ష్మీపుత్రుడు, మహాదాత. ఇతనినిగూర్చి భారతి శుక్ల సంవత్సర జ్యేష్ఠమాస సంచికలో ౮౮౦ అ. పుటయందు విశేషముగ గలదు.

మాతృప్రేమ

జి. జాషువ గారు

మా తల్లికడుపులో మనల్కుప్రేముడిచింది జలధులై యిలమీద నిలిచెనేమొ!
మాయమ్మ నామీద మలపుచల్లనిచూపు మంచువెన్నెలఁ బుక్కిలించునేమొ!
మామాత నోటి కమ్మనిమాట తేనెయే కలశవారాశిలో మొలిచెనేమొ!
మాయంబ కౌఁగిటి మరుగునగలహాయి స్వర్గీయధృతి కన్నుప్రానమేమొ!
చేరి తనమేని నెత్తురుచేరులందు-నేను నిలువీఁతలీదని నెలవు లేదు
జననదినమునఁ బురిటిమంచాలమీద-నేను తనగుండెకాయనై నిలిచినాను.

నాతలనొచ్చినం దన మనంబున మిన్నులుగూలిపోవ శో
కాతురయై యెదుర్కొను మదంబ మొగంబునఁ బంచప్రాణముల్
బాతరలాడుచుండు బహుభంగుల నాకొఱకై శరీరముల్
గోతకు నప్పగింపఁగలుగుల్ భగవంతుఁడు సృష్టిచేసినన్.

అరువదియేండ్లు నాదగు శిరోగ్రము నెక్కెనఁ దల్లికంటికిన్
జిరుతనుగాకపో నిది విచిత్రము నేనిలుదాటిపోయినన్
మరలినదాక నావెనుక మాతృక (?) జీవము మూడుగాళ్లతో
దిరుగుచునుండ నీఋణముదీరదు రక్తము ధారవోసినన్.

తల్లిగర్భానఁబాడము వాత్సల్యజలధి-పుట్టుమొదలుగ నామీద పొరలుచుండు
మానవాకారమునఁ జెప్పలేనుగాని-దానిపరిమితి గొలుచుకొన్నాను నేను.

పొదుగుగిన్నియఁ బాలువోసిదూడకుఁద్రాపి(?)యట్టినాకెడుపాఁడి యావుచెంత
బొండెంపుఁదిత్తులు నిండఁ దెచ్చినబువ్వ బిడ్డకుఁ దినిపించు పిట్టచెంత
పాలిండ్ల పట్టుద ప్పనిపిల్లతోఁగూడఁ గొమ్మకొమ్మకుదాటుక్రోతిచెంత
తాంబూలరాగదం తములనువ్వులసంతతులమోయుదానిమ్మ పొలఁతిచెంత
చలువకన్నీట నాదుమస్తకమునంటి-వృద్ధమాతృకయభిషేక మిచ్చుచుండు
పడకుఁదనమేలు తనకశాబ్దములనీడ-బదికెదనుగాక నూరేండ్లవఱకు నేను!



ఆంధ్రభారత కవితా విమర్శనము

ఆంధ్రగ్రంథమాల ౧౭వ కుసుమము. వెల రు. ౩. గ్రంథకర్త: శ్రీయుత కోరాడ రామకృష్ణయ్యగారు, యమ్. ఏ., మద్రాసు విశ్వకళాపరిషత్తులో 'రీడరు'

మదరాసు విశ్వకళాపరిషత్తు రీడరు శ్రీయుత కోరాడ రామకృష్ణయ్య, యమ్. ఏ. గారు ఈగ్రంథము రచించిన వారనినప్పుడే యిందు విశేషగుణములుండునని యెల్లరకుఁ దోఁచును. మఱి గ్రంథము నాద్యంతముఁ జదువఁగా, నందలి గుణము లెంత అమూల్యములో తెలుసు మిన్నయనియు, గ్రంథకర్తగారు 'రీడరు' మాత్రము లేకాక ఆంధ్రదేశవిద్వద్విమర్శకాగ్రగణ్యులలో నొకరనియు రూఢిపడినది. వీరియందుఁ, బూర్వకవుల యెడ ముఖ్యముగా తిక్కనపై భక్తి విశేషమును, ఆనునిక విమర్శన దృష్టియును 'తమలోఁ గడల్కొని' వీరి కబ్బమున కెక్కుడువిలువను గూర్చినవి. ఆంధ్రచరిత్రాంగములగు మతసాంఘిక రాజకీయ సారస్వతోద్యమములందు వీరికిఁగల విశేషపాండితి యీతద్గ్రంథరచనా సందర్భమున మిక్కిలి యుపకరించినది. "తనకావించిన సృష్టితక్కొరులచేతంగాదునా" యని ప్రబంధపరమేశ్వరునిచేఁబొగడ్తఁగన్న తిక్కనార్యుని కళావైశారద్యము, మనోవృత్తి వివరణ, జాతీయత, 'యల్లిక జిగిబిగి' మున్నగు విషయములు నతి విపులముగఁ జర్చించుటవలన వీరు తమరసికతను, విమర్శనకౌశలమును ఆంధ్రలోకమునకుం బ్రకటించినారు. ఇందలి వీరి యాశయము లించుమించుగ నన్నియు సాధువులే సహృదయమోదావహములే యని నేఁదలంతును; ముఖ్యముగా కవి బ్రహ్మనుగుఱించిన వీరి ప్రశంసావాక్యములు, భక్తిపారవశ్యముచేఁ గాఁబోలు వారి యావేశము వీరియందు నావహించినట్లు తోఁపింప యమందానందమును గూర్చినవి. మచ్చునకివిగో యొకటి రెండు ఉద్ధృతములు:

"ఈ భారతరచనా విషయమున తిక్కనయెట్టి పూజ్యభావముల, నెట్టి భక్త్యావేశమును, ఎట్టికవితాకౌశలమును, ఎట్టిజ్ఞానసంపత్తిని, ఎట్టి ధర్మపరత్వమును, ఎట్టి అద్వైతభావనిరూఢత్వమును, ఎట్టి ముముక్షుత్వమును, ఎట్టి వైదికమార్గనిష్ఠమగువర్తనమును, ఎట్టిమాతృభాషాభిమానమును ఈ యవతారిక మూలమున వ్యక్తముచేసినాఁడో పరికింపుఁడు. ఇట్టి మహాపురుషుఁ డాంధ్రదేశమున మఱియొకఁడు బయలుదేర లేదనుట యతిశయోక్తి గానేరదు. ఆంధ్రవాఙ్మయమున నిట్టి మహనీయగుణసంపన్నుఁడగు కవి మఱియొక్కఁడు లేఁడనుట సాహసము కాదు. ఆంధ్రభాషాసతిని స్వస్వరూపమున నిలిపి యుద్ధరించిన వారిలో నీతఁ డగ్రగణ్యుఁడని చెప్పవలసి యున్నది. ఈతని మూలమున నాంధ్రవాఙ్మయము, ఆంధ్రభాష, ఆంధ్రదేశము ఆంధ్రజనము, వేయేల, ఆంధ్రత్వమునదే ధన్యత్వమును బొందుచున్నది."

"ఇట్టి యద్భుతంబగు మానసికవృత్తి వివరణముఁ జిత్రకల్పనము నాంధ్ర వాఙ్మయమున మఱి యెచ్చటను గానము. ఈ విషయమున నీతఁ డొక్కొకప్పుడు షేక్స్పియర్, కాళిదాసాది మహాకవులఁగూడఁ దలదన్నుచున్నాఁడా యని తోఁపించును."

ఇట్టి 'రివ్యూ'లయందు గ్రంథవిషయ సంగ్రహము (Summary) నొసంగుట ఆచారమని మామిత్త్రులొకరు సూచించినారు. కాని సంగ్రహములఁ జదివినమాత్రానే, అసలు గ్రంథము పొంతఁబోవకయే, గ్రంథర

మామూలాగ్రము 'దిగఁద్రావి గఱ్ఱునఁ ద్రేఁచినట్లు', పఠించుచు విఱ్ఱవీఁగు మహనీయు లనేకులు కలరని యెఱిఁగినవాఁడ నగుటచే ఆపని నిట మానినాఁడను. గ్రంథవిషయము సర్వము చదివి సంతసింపవలయునదేయైనను, మదీయదృష్టి నత్యంత మాకర్షించిన యంశములలోఁ గొన్నింటిఁజేని తడవుటయు, అవసరము నెడ నాయభిప్రాయమునుగూడ సూచించుటయు విధ్యుక్తముగఁ దోఁచెడిని.

౧. "తిక్కన మొదట నిర్వచనోత్తర రామాయణమును రచించిచూచి, యది తన కవితావిలాసోన్నతి కోర్వదని కాఁబోలు నీ భారతకథను చేపట్టినాఁడు." తిక్కన కవిత్వశిల్పము తొలికబ్బమున కన్న మలి కబ్బమున మఱింత పరిణతిం గాంచుట సహజము, వాస్తవము. కాని దీనినిబట్టి పూర్వగ్రంథమునందు కళాప్రౌఢి లోపమని మాత్రము పాఠకులు భ్రమింపకుందురు గాక, నిర్వచనోత్తర రామాయణము ఉత్తకావ్యరాజమే. తిక్కన 'కవితావిలాసోన్నతి' నెంతయు 'నోర్చినదే.'

౨. ఆంధ్రజాత్యుత్పత్తిని గూర్చి గ్రంథకర్తగారి యభిప్రాయము. "ఉత్తరదేశమందలి యాదిమ నివాసులతోఁ గలిసిన కలయికచేఁ గాఁబోలు వైదికాచారములందు శ్రద్ధలేనివారై యనార్యాచారముల నవలంబించుటంచేసి యార్యజనసంఘముచే వేదబాహ్యులుగఁ దలంపబడిన వారును, విశ్వామిత్రసంతతి వారును, తచ్ఛాపహతులుగను నైతరేయ బ్రాహ్మణమునఁ బేర్కొనఁబడిన వారునగు మిశ్రతెగలవారు కొందఱు ఆ యార్యదేశమును వీడివచ్చి యార్యదేశపరిసర భూములందు, అనఁగా వింధ్యకు దక్షిణభాగమునను దక్షిణాపథమని చెప్పఁబడు మధ్యదేశమున దండకారణ్యభాగములను జేరుట తటస్థించినది. అంధకారబంధురంబగు నరణ్యప్రదేశమునఁ జేరి నివసించుటచే వీరిలోఁ గొంద ఱాంధ్రులని పిలువఁబడిరి. కాలక్రమమున వీరు తూర్పు దక్షిణభాగముల నాక్రమించికొనివచ్చు సందర్భమున మధ్యపరగణాలలోని 'తేల్' నామక నదీప్రాంతవాసులగుటచే తెలుఁగువారని చెప్పఁబడిన దేశీయజనసంఘములోఁ గలసిపోయియుందురు......తరువాతివారు దీనికి 'త్రిలింగ' 'త్రినగ'ములనుండి వ్యుత్పత్తిని గల్పించిరి." ఇయ్యది చరిత్ర పరిశోధకులు గమనింపఁ దగియున్నది.

3. నన్నయభట్టు కన్నడభాషలో పంపకవి భారతమును జదివి, యాతని ననుసరించియుండునని యీ గ్రంథకర్తగారి యభిప్రాయము. సంస్కృత ప్రాకృత కర్ణాటభాషలయందు కవిరాజశేఖరుఁడైన నారాయణభట్టు ఇతనికి సహాయుఁడగుటయు, స్వయమితఁడు 'సకలభాషావాగనుశాసనుఁ'డని బిరుదుఁ గాంచుటయు నీ యాశయమున కాధారములు. ఆంధ్రకర్ణాట భాషాకోవిదులగు విమర్శకు లీ రెండు గ్రంథములఁ బోల్చిచూచి, యెంతవఱకు నన్నయ పంపకవి ననుకరించెనో నిర్ణయింపవలసి యున్నది.

4. ఐరోపాయం దొకప్పుడు లాటిను భాషకుఁ గల గౌరవము దేశభాషలకు లేదని తలఁపఁబడినట్లే, యిప్పటికిఁగూడ, మనదేశమున సంస్కృతమునకు గౌరవాధిక్యమేగాక, సంస్కృతపండితులు పలువురు దేశభాషలఁ జుల్కనగాఁ జూచుటయు నెల్లరకు విదితమే. ఇట్లే సంస్కృతమునకును దెలుఁగునకును పూర్వమునుండి స్పర్థ కలదనియు, సంస్కృతభూయిష్ఠ రచనకుం బ్రతిమల్లముగ 'జానుతెనుఁగు' పేర నొకయుద్యమము ప్రబలియుండెననియు ఈ గ్రంథమువలనఁ దెలియనగుచున్నది.

"ఉరుతర గద్య పద్యోక్తులకంటె
సరసమై పరఁగిన జానుఁదెనుంగు."

"ఆరూఢ గద్యపద్యాది ప్రబంధ
పూరిత సంస్కృత భూయిష్ఠ రచన
మానుగా సర్వసామాన్యంబుగామి
జానుఁదెనుఁగు విశేషము ప్రసన్నతకు."

ఇత్యాదులవలన 'జానుఁదెనుఁగు' స్వరూపము గోచరమగుచున్నది. సంస్కృతపదముల శబ్దాడంబరము తెనుఁగున లేదనువాదమునకు

"అల్పాక్షరముల ననల్పార్థరచన
కల్పించుటయె గాదె కవి వివేకంబు"

అని సమంజసముగు సమాధాన మొసఁగఁబడినది. విన్నకోట పెద్దనకాలమునఁగూడ గ్రంథకర్తగా రన్నట్లు తెలుఁగునివ సెట్టి యుపాసించు ప్రబలియుండెనో యీ పద్యమువలనఁ దెలియుచున్నది:

మ. "విలసద్భావరసాద్యలంకృతులచే
విప్పారి, గీర్వాణ భా
షల కబ్బంబుల కెన్ని యుండి తనముల్
సంధిల్లు నానందమై
వెలియుం బ్రాసయు నంత కగ్గలములై
వర్తిల్లు పత్కావ్యముల్
దెలుఁగంచుం జెవిఁబెట్టలేమి యొకొ సం
దేఁగల్గునే యందిలన్."

ఈనాఁడును మన భోజనమునకు వలయునవి 'లవణము' 'సూపము' లేగాని "యుప్పును"ను "పప్పు"ను గావు గదా! మఱి సంధ్యావందనము తెలుఁగున నేల చెప్పఁగూడదని యెవరే నన్న మన మెంత మండిపడుదుమో!

౫. ఉ. "పాయకపాకశాసనికి
భారతఘోరరణంబునందు నా
రాయణునట్లు, దానును
ధరామరవంశవిభూషణుండు నా
రాయణభట్టు వాఙ్మయ ధు
రంధరుఁడుం దనకిష్టుఁడుం సహా
ధ్యాయుఁడునైన వాఁ డభిమతం
బుగఁ దోడయి నిర్వహింపఁగన్"

అను పద్యమున 'భారత ఘోరరణము'ను ఉపమానముగాఁ జెప్పుట గ్రంథాదియందే రాఁబోవుకథను సూచించుటకును, భారత రచనయు భారతయుద్ధమంత మహత్కార్యమేయని తెలుపుటకును, నారాయణ శబ్దముం జమత్కరించుటకును అని తలంచి యుంటిని. కాని యీ గ్రంథమున నొక నూతనార్థమిట్లు గాన్పించుచున్నది. "భారత ఘోరరణముయొక్క యౌపమ్యమువలన.... అనూయాపరత్వాది దుర్గుణాఘంజయుక్తులతోఁగూడి, సత్పురుషుల కగమ్యములగు కొన్ని సభాంతరములందు భారతసంహితను దెనుఁగుసేయుట విషయమగు వాదములు కలిగెననియు, నట్టి సందర్భముల నారాయణభట్టు నన్నయకుఁ దోడయినిల్చి....కన్నడభాషా వాఙ్మయసాదృశంబును దెలిపి, ప్రతిపక్షులవాదంబున నోడించియుండునని...... యూహింపఁదగియున్నది." ఇయ్యది మిక్కిలి గమనింపఁదగి యున్నది.

౬. భారతమును నన్నయ వైదికదృష్టితోడను, తిక్కన కావ్యకళాదృష్టితోడను రచించినారని యీ గ్రంథకర్తగారి దృఢాశయము. నన్నయ వైదికాభిమానమునకు నిదర్శనములం జెక్కంటెని వీరు తొలి మూఁడు పర్వములనుండిచూపినారు. నన్నపార్యుఁడు వైదికకర్మలను వైదికాచారములను, కొన్నిచోట్ల స్వతంత్రించి యు సతిమాత్రముగాఁ బొగడిన మాట వాస్తవమే. కాని దానినిఁబట్టి, నన్నయకుఁ గావ్యకళాదృష్టిలోపమని చెప్పఁదగునా? తన్నుఁగూర్చి నన్నపార్యుఁడే "లోకజ్ఞు నుభయ భాషాకావ్యరచనాభిశోభితు, సత్ప్రతిభాభియోగ్యు...మత్యమరాధిపాచార్యు" ఇట్లు చెప్పికొన్నాఁడు గదా. కవి బ్రహ్మగూడ నన్నయను "ఆంధ్రకవిత్వవిశారదుఁడు" "విద్యాదయితుఁడు" అని పొగడియున్నాఁడు గదా. రాజసూయము, ద్రౌపదీవస్త్రాపహరణము, నలచరిత్రము మున్నగు రమ్యతమఘట్టముల నన్నయకన్న మెఱుఁగుగాఁదిక్కన యేమియు రచించియుండునా యని తోఁచుచున్నది. మొత్తముమీఁద కవిత్రయమువారి కవితామార్గము ఇంచుమించుగ నొకటియేయనియు, కావ్యకళాదృష్టి యందును నన్నయభట్టు తరువాతి యిరువురకు మార్గదర్శియే యనియు, తిక్కన నన్నయలకుఁ గుడి యెడమ భేదము దక్క నెక్కుడు వ్యత్యయము లేదనియు నాయల్పబుద్ధికిఁ దోఁచినది.

౭. తిక్కనార్యుఁడు నన్నయ రచనమును జూచియుండఁడనియు, మూఁడు కృతులు లాతఁడు రచించెనని విన్నమాత్రముననే వానిని విడలి తక్కిన పర్వములఁ దానాంధ్రీకరింపఁ బూనియుండుననియు, అదియే తిక్కన యరణ్య పర్వశేషముం బూరింపకుండుటకుఁ గారణము గావచ్చుననియు ఈ గ్రంథకర్తగా రూహించినారు. ఇందులకు వీరొసఁగిన యుపపత్తి యిట్టిది.

i "నిర్వచనోత్తర రామాయణమున నన్నయ ప్రశంస గాన్పింపదు"—కాని యటఁ దిక్కన యేకవిని గాని పేర్త్తి ప్రశంసింపలేదు గదా. 'ఆది కవీంద్రుల నూత్నసత్కవీశ్వరులను' అన్నాఁడుగదా. వారిలో నన్నయయేల చేరరాదు?

ii తిక్కన తన యవతారికలో

"...ఆదిదొడంగి మూఁడుకృతు
లాంధ్రకవిత్వ విశారదుండు వి
ద్యాదయితుండు దొనర్చె మహి
తాత్ముఁడు' నన్నయభట్టుదయాళుఁడా."

అనుటయందు 'విద్యాదయితుఁడు' 'మహితాత్ముఁడు' అనునవి నన్నయనుగూర్చిన విశేషణములుగాని యాతని కృతిని గూర్చినవి గావనియు, ఆంధ్రమున మొదట సుద్గ్రంథమును రచించిన వానిని 'ఆంధ్రకవిత్వవిశారదుఁ' డనుటలో విశేషము లేదనియు ఈ గ్రంథకర్తగారి సమర్థనము—కాని యిట్లు కావ్యమునుండి కవిని వేఱుపఱచుట సమంజసమా! తిక్కన దేనినాధారము చేసికొని నన్నయను బొగడియుండును? 'ఆంధ్రకవిత్వ విశారదుఁడు', 'విద్యాదయితుఁడు' అనుటవలనఁ దిక్కనకు నన్నయ కవితయందును గల యాదరము వ్యక్తముగాదా? మీఁదు మిక్కిలి, మూఁడుపర్వములు నన్నయ 'దక్షత' నై రచించెనన్నాఁడు గదా తిక్కన. తాను నన్నయ కృతులను జదివి మెచ్చియుండకున్న, అతఁడు దక్షతమై రచించెనని తిక్కన యెట్లు కనుఁగొని యుండును?

మఱి తిక్కన అరణ్య పర్వశేషము నేల పూరింపలేదు! తనకును నన్నయగతియే పట్టునని కవిబ్రహ్మ భీతిల్లి దానిని వదలెనను 'ప్రక్కిటిపురాణమే' శరణ్యమా? తిక్కన యరణ్యపర్వశేషమును వదలుటకు శ్రీశ్రీ పానగల్లు రాజాగారు, పార్థసారథి రాయణింగారు హృద్యమగు సమాధానమునిట్లొసంగినారు. దీర్ఘమగు నవతారికతో, ఇష్టదైవప్రార్థన, స్వప్నగాథ, అంకితము, షష్ఠ్యంతములు మున్నగువానితో సక్రమముగఁ గావ్యము రచింప దొరకొనిన తిక్కన పర్వమధ్యమున నారంభించుట పాడిగాదు. వీలయినను నిదియెల్ల అందముగదు. కావున తిక్కన నాలవపర్వముతో మొదలుపెట్టి పైశేషమును గడమ గ్రంథమును బూర్తిచేసిన వెనుక వ్రాయుదమని తలంచి యుండెను. మఱి యీపదునేను పర్వములు రచించిన వెనుకనైన దానిని బూరించుట కేమియాటంకమన్యో యనుటకు జర, రుగ్మత, మృతి మున్నగు సమాధానములు సులభముగ నూహ్యములు.

౮. అరణ్యపర్వచరమభాగము క్రిమిదష్టమై శిథిలముకాఁగా ఎఱ్ఱన నన్నయపేరే పెట్టి యందప్పటప్పట పోయిన వర్ణములకు, పదములకు, పాదములకు అతుకులువెట్టియుండునను క్రొత్త సిద్ధాంతమునెడ ఈ గ్రంథకర్తగారు తమయసమ్మతిని దెలిపినారు. అరణ్యపర్వశేషపూరణము ఎఱ్ఱన స్వతంత్రరచనయే యనుటకు వలయు నుపపత్తినిగూడ వీరు సమగ్రముగా నొసంగియున్నారు. 'శారదరాత్రులతో నన్నయకవితా 'సుధాంశు' వస్తమించెననియు 'స్ఫురదరుణాంశు'వుతో ఎఱ్ఱనకవిత్వ 'వాసరముఖము' వెలిఁగెననియు నైతిహ్యము రూఢికెక్కియున్నది. ఇయ్యది యసత్యమనుటకు ప్రబలాధారమేదేని యుండవలయును. ఇటనయ్యది యరయనై యున్నది.

౯. విరాటపర్వరచనయందుఁ దిక్కన యెంతవఱకు మూలము ననుసరించెను? ఎటనెట నెట్లెట్లు స్వతంత్రించి మార్చుకొనెను? అనువిషయమును ఈ గ్రంథకర్తగా రతివిపులముగఁ జక్కఁగఁ జర్చించి, మూలానువాదములకుఁగల ప్రతిపద్యతత్వమును తిక్కనార్యుని యౌచిత్యపరిజ్ఞానమును కావ్యకళానైపుణిని జాటుచున్నవని నిశ్చయించినారు మఱి, తిక్కన గ్రహించిన మూలప్రతి యెట్టిదనుటకు ఇప్పుడు దొరకిన వానిలో నతిప్రాచీనమని తలంపఁబడుచుండి బండార్కరు పరిశోధనాలయమువా రవలంబించిన పాఠమునకు మూలమైనట్టి ప్రతికే యది దగ్గఱగా నుండియుండునని వీరి యాశయము. మఱియు, తిక్కనమార్పుల ననుసరించి క్రొత్తపాఠములు కొన్ని దక్షిణదేశపు మూలప్రతులలోని కెక్కుట సంభవించి యుండుననియు వీరి మతము. ఇందులకుఁ గావలసినంత యుపపత్తిని వీరు

సేకరించి యిటఁ బొందుపఱచి యున్నారు. ఇయ్యది మిక్కిలి శ్రద్ధతోఁ జరుప వలయు భాగము. వీరి సిద్ధాంతము నంగీకరింతుమేని, యది తిక్కనార్యుని కళాప్రతిభలకు మఱింత ప్రబలనిదర్శనముగాఁ గైకొనఁదగి యుండును.

౧౦. ద్రౌపది సుదేష్ణ యొద్దకేఁగు ఘట్టమున "కనుఁగొని గారవంబును మొగంబున" ఇత్యాది పద్యమును వీరు ప్రాఁతపాఠముతోడనే యుద్ధరించినారు. ఈ పద్యమునందలి కవితారసము 'గోదావరి అవఁగాయవంటి' గాని శ్లాఘించిన కీర్తిశేషులు కళాప్రపూర్ణులు వేదము వేంకటరాయశాస్త్రులవారు బజారుపాఠము అన్వయదోషపూరితము అసాధువని సిద్ధాంతీకరించి యిట్లు సవరించినారు.

చ. "కనుఁగొని గారవంబును మొగంబునఁ
గేలుఁ బురఃప్రసారముల్
దనువున నమ్రభావమును
దంతమరీచులు హాసనిర్గమం
బును దనలోఁ గడల్కొనఁగ
భూరితరాదరరేఖ నిండర
మ్మనవుడు నంత నంత ద్రుప
దాత్మజ నేరి వినీతి నిల్చినన్."

ఈ సవరణ వీరికిని ఉపాదేయమగునని నమ్మెదను.

౧౧. భీముఁడు కీచకుని వధించుటకు నర్తనాగారమున కేఁగుచు ద్రౌపదినిగూడఁ దోడ్కొని పోయినట్లు తిక్కన మూలకథ నేల మార్చెనను ప్రశ్నకు, "తన భర్త కీచకవధలో రహస్యవిభేదమార్గము నవలంబింపకుండఁ జూచుటకే ద్రౌపది యాతని వెంటఁ దగిలి లోనఁ బ్రవేశించి యనతిదూరమున నోసరిలి కనిపెట్టి యుండె"నను సమాధానము నీ గ్రంథకర్తగా రూహించినారు. కాని, పోరాటమున రహస్యవిభేదము గాకుండ ఆమె యేమి చేయఁదలఁచినదో, యేమిచేయఁ గలదో దురూహ్యము. ప్రకరణముం బట్టి, భీముఁ డామెను నర్తనాగారమునకుఁ దోడ్కొని పోవుట స్వప్రతిజ్ఞా నిర్వహణార్థమని స్పష్టము. తొలుతనే యతఁ డా సాబగునిం దెగఁజూచి, నీకుం జూపి నీచిత్తంబు వచ్చెద'నని ప్రతిన పూనెను గదా. కీచక శవము నామెకుఁ జూపునప్పుడును భీముఁడు "చూచితే, సంతోషించితె" యని గదా పల్కెను. మఱి భీముఁ డట్టి ప్రతినయేల పూనెను? అను ప్రశ్న నిలిచియున్నది. తన ప్రియకు ఉత్సాహము, సంతోషము ఎక్కుడగుటకు అబలను అట్టిచోటికిఁ గొంపోవుట అపాయము గదా యనిన, భీమునకుఁ గీచకవధ దుష్కరము నొక మహాశ్చర్యముగాఁ దోఁపనే లేదు. అది లీలామాత్రము నొక వినోదముగా నాతఁడు భావించెను. ఆ వినోదమునకు అంగములే స్త్రీ వేషము వేయుటయు, తన ప్రియ నివిపించుటకుఁగా కీచకుని వలపుఁబలుకులకుఁ వలపుఁగత్తెవలెనే 'మృదురీతిని' మాఱుపల్కుటయు. మనము 'సినీమాల'కు, నాటకములకు మనయాఁడువారిని దోడ్కొనిపోవుట యెట్టిదో అట్టిదే భీముఁడు తనకాంత నీయంతర్నాటకముంజూడ వెంటఁబెట్టుకొనిపోవుటయు. ఈసంవిధానమెల్ల మూలమునందలి లోపముఁబూరించుటకుఁ దిక్కన కల్పింపవలసివచ్చినది. ఎట్లన, కటికిచీఁకటి గదిలో నిజస్వరూపముననే యెదిరి కగోచరుఁడై హఠాత్తుగా నాతనిపైఁదుమికి వానింబొలియించుట సులువై యుండఁగా, భీముఁడేల ఆడువేషముఁదాల్చి, యాడుదానివలెనే పల్కి, కీచకుని మోసగింపవలసివచ్చెను? అను ప్రశ్నకు సమాధానము మాతృకయందు మృగ్యము. ఏతన్నిమిత్తమే తిక్కన పైసంవిధానముం గల్పించెనని నాయూహ.

పాఠకులకు శ్రీయుత రామకృష్ణయ్యగారి గ్రంథము సాంతముగ సావధానముగఁ జదివి యానందవ్యుత్పత్తుల నొందవలెనని కుతూహలము జనించుటకు ఈపాటి చాలునని తలంతును. ఆంధ్రసారస్వత ప్రపంచమున కిట్టి మహోపకారముఁ, గవిత్రయవాణికి-అందును కవిబ్రహ్మకీర్తికి ఇట్టి పరిష్కారం గావించిన శ్రీయుత రామకృష్ణయ్యగారిని, ఈ యుద్గ్రంథముచేఁ దక్షిణాంధ్ర గ్రంథమాల నలంకరింపించికొన్న దేశోద్ధారక శ్రీయుత కాశీనాథుని నాగేశ్వరరావు పంతులవారిని ఎంతనుతించినను తనివితీఱదు. శ్రీయుత రామకృష్ణయ్యగారు ఈ గ్రంథమును మొదటి భాగముగా భావించి, యిందు

విరాటపర్వమును విమర్శించినట్లే భారతమునందలి కడమ పర్వములఁగూడఁదిలకించి 'భారతామృతము కర్ణపుటంబుల వారఁగ్రోలు'టయేగాక, చిత్తసరోవరంబుల నింపికొని యాంధ్రావళి యిత్యోధికమోదముం బొరయుట కంతేని సాయపడుదురుగాక యనియు, ఆంధ్రవాఙ్మయముయొక్క విపులచరిత్రము నొకదాని రచించి, తెలుఁగునట్టి గ్రంథము లేని కొఱంతం దీర్తురుగాక యనియు, ఇట్టి సదుద్యమములందు దైవమును ఆంధ్రభాషాభిమానులును, విద్యాధికారులను వారికిఁ దోడ్పడుదురుగాక యనియు నభిలషించువాఁడను.

గుఱ్ఱం వేంకట సుబ్బరామయ్య.

విఘ్నేశ్వర చరిత్రము

ఇది తొమ్మిది ప్రకరణములుగల యొక యాంధ్ర వచనకావ్యము, ఇందు క్రౌను సైజున ౭౦ పుటలు గలవు. వీతద్గ్రంథకర్తలు. శ్రీయుత గొబ్బూరు వెంకటానంద రాఘవరావుగారు. ఈవిఘ్నేశ్వర చరిత్రము మన దేశమునం దాబాలవృద్ధ మెల్లరకు దెలిసినదే. అయినను గ్రథనకౌశలముంబట్టి కావ్యములకుఁ బాఠకుల నానందపరవశులం జేయు శక్తి పొడముచుండును గదా? గ్రంథప్రణేత లీగ్రంథ రచనమునకు భాగవత విష్ణు పురాణముల యందలి కథను మూలముగఁ గైకొని యున్నారు. ఇంతేకాక ఆయా తావులందుఁ దత్తదుచిత రీతిని భాగవత విష్ణుపురాణాంతర్గతములగు శ్లోకములను పద్యములను మహాకవుల చాటువులను గూడ నుదాహరించియున్నారు. శ్రీ శ్రీ శ్రీ మారేపల్లి రామచంద్రశాస్త్రిగారు ఈ గ్రంథ పీఠికలో 'దీనిశైలి సులభము. మృదుమధురము, రసవంతము' అని యుగ్గడించి యున్నారు. అదికేవలము సత్యేతరము కాఁజాలదు, కాని కొన్నిపట్టుల దీర్ఘతమములైన సమాసములు సంఘటితము లగుటంబట్టియు, కొన్నిస్థలములందు వ్యాకరణ విరుద్ధములు కాకున్నను, సులభతమమును సాధారణముగా వాడుకలో నుపయోగించునట్టివియును నగు పదములును ప్రయుక్తములగుటంబట్టియు, నీగ్రంథశైలి సరళముగా లేదని చెప్పవచ్చును. మరియు గజాసురుని హృత్కమలమున మృడుఁడు ప్రవేశించుటచే నిజభర్తృ వియోగమును సహింపఁజాలక భవానీదేవి యారాక్షసుని సంహరించి తనకు భర్తృసంయోగమును గావింపవలయునని బ్రహ్మాదులను వేఁడుకొనును. అత్తఱి కమలాసనాదులు నందీశ్వరుని గంగిరెద్దుగాఁజేసి తాము గంట, డోలు, వీరణము సన్నగువాయిని కేలబూని యాడుచు వాయించుచు గంగిరెద్దు నాడించుచు, గజాసురుని కొలువునకుఁ బోవుదురు. ఆసందర్భమున నారాజు కొలువునందు వారు గ్రామ్యభాషతో మాట్లాడుదురు. ఆ సంభాషణ మెంతయు సరసముగను, హృదయంగమముగను నున్నదని వక్కాణింప వచ్చును. దీనివెల ౧౨ అణాలు. వలయువారు: ఆంధ్రావళీ గ్రంథమాలిక, ఎలమంచిలి, విశాఖపట్నంజిల్లా, అని వ్రాసినఁ బడయఁగలరు.

ఉభయభాషాప్రవీణ, బు. స. శా.

Co-operative Reader: సహకారవాచకము

గంజాంజిల్లా బరంపురంలోని, సహకార సంఘముల రిజిష్ట్రర్ ఎక్ట్రా అసిస్టాంటు రిజిష్ట్రారు, రావుసాహెబ్ ఎమ్. వి. అప్పారావు పంతులుగారిచే వ్రాయబడి క్రౌను సైజున సుమారు ౪౦ పుటలుగలది. వెల ౮ అణాలు, గ్రంథకర్త ఛాయాచిత్రమొకటియు, పాఠములకు సంబంధించిన ౧౭ యితరచిత్రములు నిందుకలవు.

ఈ గ్రంథకర్త సహకారవాచకములను ఆంగ్ల, ఉత్కళ, ఆంధ్రభాషల మూఁడింటను వ్రాసి ప్రచురించెను, ఈ పుస్తకము ౧౯౩౩లో వేసిన రెండవకూర్పు. గంజాంజిల్లాలోను యితర రాంధ్రోత్కళ ప్రాంతముల లోను ౪వ తరగతికి పైబడి ౩వ ఫారమువరకు నుండు బాలబాలికలకు పాఠ్యపుస్తకముగ పెట్టబడుట కిది జిల్లా విద్యాసంఘము వారిచేతను, అధికారులచేతను అంగీకరింపబడి, పెద్ద ఉద్యోగస్థుల ప్రశంసగన్నది. ఇందు ౨౫ పాఠ విభాగములున్నవి చిన్నగీతపద్యములు, నొకపెద్ద గేయముతోనుకూడి బాలబాలికలు చదివి సహకారము, ఐకమత్యము, పరపతిసంఘముల యావశ్యకము — లాభములు

ము. వానినిగూర్చి తెలిసికొనుట కెంతో యింపుగనున్నది, గ్రామపునర్నిర్మాణకార్యమున భాగమగు నీ సహకారోద్యమతత్త్వము అందరి క్షేమమున కొక్కడును ఒక్కని క్షేమమునకందరును, పాటుపడవలెనని. ఈ పుస్తకమును సుబోధముగ రచించి గ్రంథకర్త కృతకృత్యులైరి. ఇంకను ఇట్టివాచకముల కవసర మెంతేని కలదు.

ఐ. బ్రా.

శ్మశానవాటిక

గ్రంథకర్త:— శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారు. పాదాకాగితములు, ౨౨౦ పుటలు, దళసరికాగితపు బైండు, ౧౯౧౭ సం|| కళాభివర్ధనీ గ్రంథనిలయము వారి ప్రచురణము.

ఇది యొక చారిత్రక పారిశోధకనవల. కథజరిగిన చోటు ఆంధ్రదేశము. కథ ఆమూలాగ్రము కల్పితమే.

ఈ నవలయందు విరోధిపాత్ర భుజంగరాయడు. ఇతడు సహజముగా సుస్వభావుడు. అన్యాయ్యమగు ద్రోహబుద్ధి యేమాత్రమును లేదు. కాని తనకు గల్గిన స్వల్పాపకారమునకు ప్రభుత్వముగాక తానే ప్రతీకారము చేయవలెనను దుర్మార్గపుసంకల్పముచే, ప్రభుద్రోహియై పోయినాడు. ఇతని అంత్యకాలమున దేశమునకు ప్రజలకు, తన ద్రోహదృష్టిచే కలిగిన ఆపదలకు, కష్టములకు మిగుల పశ్చాత్తాపపడినాడు. ప్రసాదరాయుని మరణమునకు మిగుల విచారించినాడు. ఇదంతయుగూడ నీతని అంత్యవాక్యములలో (౨౧౮ పుట) విశదమగుచున్నది.

ఈనవలా పాత్రలలో కుమారస్వామి మిగుల గట్టివాడు. ఇతనియొక్క యుక్తులచేతను, జిత్తులచేతను విద్రోహిసంఘమంతయు ధ్వంసమైనది. భుజంగరాయడు పట్టుబడినాడు. ప్రసాదరాయనిమరణ మతివిషాదకరముగ నున్నది. ఒక ప్రసాదరాయని మరణమే యననేల, కథ విషాదముతోనే ప్రారంభించి విషాదముతోనే అంతమొందినది. ఇందలి ముఖ్యరసము విషాదము.

రాజదంపతుల సౌజన్య మపారము, అద్వితీయము. కథాకల్పన దిట్టముగానున్నది. కథాపూరణకై తేబడిన అసందర్భములు లేవు. నిష్కారణముగా కథపొడుగింపబడలేదు.

నవలాఘటనలయందు మనకు గల్గు ఉత్కంఠయు, ఆకర్షణము, అధికము. గ్రంథకర్త సంఘమును, జీవనమును, దేశమును లోతుగను, సూక్ష్మముగను పరిశీలించెను. వీరి భావన సాధారణముగ లోకాతీతముగ నుండక జ్ఞానయుతమై ప్రపంచకజ్ఞానముతో నిండి వెలయుచుండును. కాని, నవలలో నొకటి రెండు స్థలములలో వీరి ప్రపంచక జ్ఞానము కొంచెము సడలినది. ప్రసాదరాయడు తన భార్యయొక్క సహగమనమును కోరినాడు. ఆమె యొప్పుకొనినది, గ్రంథకర్త సతిని జరిపించినారు. విద్రోహిని ఉప్పుపాతర వేయించినారు. ఈపట్టున గ్రంథకర్తయొక్క ధర్మశాస్త్ర జ్ఞానమును ప్రకటించినారు. సతి దురాచారము కాదనికాబోలు వీరి తాత్పర్యము! విగ్రహారాధనను గుఱించి వ్రాసిన "తాతలనాటి యాచారములను మాన్పించుట భారతదేశములో కష్టసాధ్యము. భారతభూమి దౌర్భాగ్యమునవలన భారతీయుల సూక్ష్మబుద్ధి యిపుడు "శాంతియే మంచిది గాదన్న బూర్వు లేల యాచరింతు" రనుమహోన్నత సిద్ధాంతము చేయునంతటి పరిపక్వస్థితిబొందినది" అను వాక్యములు వీరికే చెల్లుచున్నవి, భారతదేశము నిజముగా అభివృద్ధికావలెనన్నచో క్షుద్రధర్మములు, క్షుద్రాచారములు నశించి జ్ఞానమును, ప్రపంచకజ్ఞానమును అభివృద్ధి చెందవలెను. ఇట్లు తెగించికొన్నగాని దేశము ప్రజలు అభివృద్ధినిగాంచరు.

శిక్ష లతిక్రూరముగను దారుణముగను ఉండవలెననికాబోలు గ్రంథకర్త భుజంగరాయనిని ఉప్పుపాతర వేయించినారు. కథాకాలమునందట్టి దారుణశిక్ష లున్నమాట నిజమే. వాని కట్టిశిక్ష విధించుటయు సహజమే. కాని గ్రంథకర్త అట్టి దండనను ఖండించుచు విమర్శింపకుండుట చూడ తానుగూడ దాని నంగీకరించినట్లుగనే భావింపవలసియున్నది.

రచయితయొక్క మానవస్వభావచిత్రణయు, ప్రకృతి పరిశీలనయు, అతిసూక్ష్మమని చెప్పియుంటిని. ఏకవింశ (ఇరువదొకటవ) ప్రకరణమందలి 'కొమ్మకొమ్మ కాటు' చదివినచో నీవిషయము స్పష్ట మగును.

ఈకథ తెలుగునాడులో జరిగినదన్న మాటయే గాని ఇందలి ఉత్తమ స్త్రీపురుషపాత్రము లన్నియు వంగపాత్రములే! వంగనవలా పఠన ఫలితము కావచ్చును.

కథలో నొకటి రెండు చోట్ల పాటల అవసరము గలదు. అందు పాటలభావము పద్యములలో పెట్టబడినది. గ్రంథకర్త పాటలగానము తలపెట్టినపుడు వాటి భావమును స్పష్టముగా సరళమగు పద్యములలో జెప్పుట యుత్తమము. కతిపయసమాసభూయిష్ఠము లగు పద్యముల ప్రయోజనమేమి?

గ్రంథశైలి: గ్రాంథికము, సులభముగా తెలుగు మాటలలో తేలిపోవుచోట సంస్కృతపదములు ప్రయోగింపబడినవి. అన్ని జాతులవారి, తరగతులవారి సంభాషణలు గ్రాంథికములోనే జరుపబడినవి. వాక్యము లక్కడక్కడ తరుచు శబ్దాలంకారయుతములై అసహజముగ నున్నవి. శైలియంతయు పూర్వపుధక్కే.

సాధారణముగా గ్రంథకర్త లొక్క నాటకములకే పాత్రలపట్టిక చేర్చుచున్నారు. నవలలకు గూడ నట్టి పట్టిక అవసరమే. అట్లు చేయకున్న పాత్రలసంబంధముల పట్టిక చదువరులు తయారుచేసికొనవలసి వచ్చును. గ్రంథరూపము దోషలోపములు, రహస్యమును, గూఢమును నవలా కళావిషయములే కాని వాటికి భంగమురాకుండ సాధ్యమైనంత వరకే పాత్రలపట్టిక చేర్చవచ్చును. ద్వితీయ ముద్రణయందీ గ్రంథమునకు పాత్రల పట్టిక చేర్పబడుగాక!

గ్రంథము వలయువారు పండిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, కలాభివర్ధనీ పరిషత్తు, రాజమండ్రి అని వ్రాయవలెను.

కే. కా.

ఆంగ్లదేశచరిత్రసంగ్రహము.

గ్రంథకర్త. పుంగనూరు బసవరాజా హైస్కూలునందలి సహాయచారిత్రకోపాధ్యాయులగు భాస్కర సుబ్బయ్యగారు బి. యె; యల్. టి. మద్రాసు వేపేరి యందలి వి. రమణా అండుకో వారిచే ప్రచురితము. ఈ గ్రంథము రెండుభాగములుగ రచియింపబడి యున్నది. మొదటిభాగమున క్రీ. పూ. ౫౫ మొదలు క్రీ. శ. 1485 వఱకు గల చరిత్రయు; రెండవభాగమున ట్యూడరు పీరియడు మొదలు చివరవఱకు (1603) గల చరిత్రయు వివరింపబడినది. ఈభాగములు విద్యాశాఖాధికారులు నూతనముగ ప్రచురించిన ప్రణాళిక ననుసరించి నాలుగవ ఐదవఫారముల విద్యార్థుల ఉపయోగార్థము వ్రాయబడినవి. దేశభాషల మూలమున విద్యగఱపుటకు తగిన పాఠ్యగ్రంథములు లేవని చెప్పుట పరిపాటియైయున్నది. ఇట్టిగ్రంథముల ప్రచురణము అట్టి పరిపాటికి వీడ్కోలు యిచ్చి దేశభాషల మూలమున విద్య గఱపవలయునను ఉద్యమమునకు పోషణమిచ్చును. కావున ఇట్టి గ్రంథరచనమునకు కడంగిన గ్రంథకర్తగారిని శ్లాఘింపవలసి యున్నది. చరిత్ర తేదీలవారీగా వ్రాసి జరిగిన సంగతుల నన్నియు గుదిగ్రుచ్చి చరిత్రను విన సొంపుకానిదానిగ జేయక వీరీ గ్రంథమున విషయవిభాగమున చరిత్రకథా నిర్వహణమునంతను ఒక్కచోటనే చేర్చుచు ఒప్పిదమైన పద్ధతి ననుసరించిరి. ఈ విషయమున వీరు (The Ground work of British History) ని ఆదర్శము నుంచికొనియుండుట మెచ్చదగినది. గ్రంథమునం దుపయోగింపబడిన భాష నిర్దుష్టము కాదనవలయును. సహజముగ ఉత్తేజకరముగ నుండవలసిన కొన్నిపట్టులు బొత్తిగ నిస్సారములుగ నున్నవి. నిదర్శనముగ రెండవ భాగములోని 'ఆంగ్లస్పానియా రాజ్యములపోరు' అను ప్రకరణము చూడవలయును. దేశభాషల మూలమున విద్యగఱపు ఉద్యమము పోషించుటకై బయలుదేరిన ఈ గ్రంథమున దేశపటమున ప్రదేశముల నామములు ఇంగ్లీషుననే ముద్రింపబడియుండుట శోచనీయము. రెండవ కూర్పునైన ఈ లోపము ప్రచురణకర్తలు తప్పక సవరింపవలెను. ప్రథమభాగము క్రౌనుసైజు 116 పుటలు, వెల 10 అణాలు. రెండవభాగము క్రౌనుసైజు, 90 పుటలు, వెల 8 అణాలు. వలయువారు ప్రచురణకర్తల పేర వ్రాయవలెను. ఆంధ్ర శేషగిరిరావు, బి. ఏ.

గోలీస్తూప బౌద్ధ శిలా చిత్రములు

(గ్రంథకర్త:— టి. యన్. రామచంద్రన్ గారు యమ్. యే. ఈ గ్రంథము మద్రాసు గవర్నమెంటు చిత్రవస్తు ప్రదర్శనశాల ప్రచురణము. చెన్నపురి గవర్నమెంటు ముద్రణాలయమున ముద్రింపబడినది.

వెల రు. ౨-౧౨-౦ లు.

రమారమి అర్ధశతాబ్దము క్రితము చెన్నరాజధానిలోని ప్రాచీనవస్తు శిథిలావశేషములను పరిశీలించుతలంపుతో న్యూయెల్ దొర పర్యటనము సలుపుచు గుంటూరు జిల్లా పల్నాడు తాలూకాకువచ్చి, ఆ తాలూకాలోని మల్లవరము గ్రామము దగ్గర నొకదిబ్బ యుండుటను గాంచెను. పరిశీలింపగా తత్పరిసరమున అమరావతి బౌద్ధస్తూపము నందలి వానింబోలిన పాలరాతి శిలాఫలకములు రెండు కానవచ్చెను. అందొకటి ఏడుతలలనాగము, మఱియొకటి కడు దీర్ఘమైన శిలాచిత్రఫలకము. ఇది ఏడరులుగ విభాగింపబడియున్నది. ఒక్కొక్క అరయందు బౌద్ధమతమునకు సంబంధించినగాథలు చిత్రితములైయున్నవి. వీటిలోని చాలచిత్రములు బుద్ధునిజీవితమునకు సంబంధించినవే. వీటిని గమనించి న్యూయెల్ దొర ఆదిబ్బను త్రవ్వినయెడల ఇంకను అందుండి యమూల్యములైన శిల్ప చిత్రములు బయలుపడవచ్చుననియు, అందువలన ఆదిబ్బ జాగరూకతతో కాపాడదగినదనియు వ్రాసియున్నాడు. అటుతరువాత కొంతకాలమున కా ప్రాంతమునందే బుద్ధపాదములు, స్తూపాకృతి చెక్కిన రెండు శిలాఫలకములు బయలుపడెను. కాని గ్రామస్థులకీశిల్పచిత్రములు విలువకాని, యర్థముగాని బోధపడక వారు పరిమాణమున కడు పెద్దదిగనున్న నాగశిలను దెచ్చి, దాని కొకగదికట్టి దాని నందుంచి నాగుమయ్య అను పేర బూజింప మొదలిడిరి. బుద్ధపాదములు చెక్కిన శిలాఫలకమును ద్వారము కుడిప్రక్కను, స్తూపాకృతిగల శిలాఫలకమును తలక్రిందుగ ద్రిప్పి ద్వారము ఎడమ ప్రక్కను స్థాపితము చేసిరి. దీర్ఘశిలాఫలకమును గోడలోవేసి కట్టివేసిరి. ఇపుడచ్చట ఆబుద్ధపాదములను అమ్మవారిపాదములందురు.

దక్షిణహిందూదేశ చారిత్రమున నెక్కుడు కృషిచేసి యమూల్యచారిత్రకవిషయములను గనిపెట్టిన పరాసుదొర డుబ్రెయిల్ ౧౯౨౬వ సంవత్సరమున ఆదిబ్బను త్రవ్వించి అందలి కళానిధిని వెలువరించినంతవఱకు గవర్నమెంటు పురాతత్త్వశాఖవారుకాని మరెవ్వరుకాని ఆదిబ్బ 'పరిమానా'కు పోలేదు. డుబ్రెయిల్ దొర త్రవ్వించి యందలి శిలాఫలకములను బయలుపెట్టగానే గవర్నమెంటువారు వాటినిగుఱించి శ్రద్ధతీసికొనిరి. వాటినన్నిటిని నేడు మదరాసు చిత్రవస్తుప్రదర్శనశాలలో చూడవచ్చును. అవి బహుకాలము భూగర్భమున అజ్ఞాతవాసము చేసి నేటికి మదరాసుచేరినవి. ఈ శిలాఫలకముల మీది చిత్రములనుగుఱించి వ్రాయబడినదే యీగ్రంథము. ఈశిలాఫలకములు దొరకిన స్థలమునకు మల్లవరము మూడు మైళ్లదూరమున నున్నది. గోలీ ఒకటి నర మైళ్ల దూరమున నున్నది. అందువలన సామీప్యమునుబట్టి వీటిని గోలీస్తూప బౌద్ధశిలాచిత్రము లనియే పేర్కొనియున్నారు.

స్తూపముయొక్క ప్రాక్పశ్చిమోత్తర దిశలనుండు దీర్ఘములైన శిలాఫలకములు మూడును, ఆ ఇతరఫలకములును గోలీనుండి కొనిరాబడినవి. గోలీలోని నాగమయ్య గుడిగోడలో అమర్పబడిన దీర్ఘశిలాఫలకము స్తూపపు దక్షిణదిశది కావచ్చునని యూహింపదగును. అమరావతి సాంచీలలోవలెనే గోలీలోని శిలాచిత్రములుకూడ బుద్ధుని ప్రాక్తన జన్మకథలను—వీటినే జాతకకథలందురు—, బుద్ధుని జీవితకథలను దెల్పునవే. మారుడు సిద్ధార్థుని తపస్సుభంగముచేయ ప్రయత్నించుట, సుజాత బోధిసత్త్వుని కాహారప్రదానము చేయుట, మృగదావమున బుద్ధుడు ధర్మచక్రమును ప్రవర్తింపజేయుట, బుద్ధుడు యశోధరను జూడబోవుట, నలగిరియను ఏనుగును బుద్ధుడు స్వాధీనపఱచుకొనుట—ఈ బుద్ధజీవితగాథలు గోలీశిలాఫలకములమీద చిత్రితములైయున్నవి. ప్రాక్తన జన్మకథలలో చిత్రితములైనవి 'ఛద్దంత' (షడ్దంత), 'వెస్సంతర' (వైశ్యంతర), 'మాతృపోసక' (మాతృపోషక), శిబిజాతకములు. ఆయా చిత్రములు ఏయే గాథలకు సంబంధించినవో విమర్శించి గుర్తించుటలో

గ్రంథకర్తగారయిన శ్రీరామచంద్రన్‌గారు గొప్ప సామర్థ్యమును, గొప్ప పరిశీలనాశక్తిని జూపియున్నారు. బహు బౌద్ధగ్రంథావలోకనమునగాని యీ చిత్రముల గాథలకు సంబంధించినవిగ చక్కగ నిరూపించి గుర్తింప సాధ్యముకాదు. ఏతచ్చిత్రవివరణమున వారు చూపిన కుశలత వారివిమర్శనశక్తికి నిదర్శనముగ నున్నది.

జాతకకథలన్నిటిలో ఛద్దంత, వెస్సంతర జాతకములు శ్రేష్ఠమైనవి: తిలమానికములవంటివని చాలమంది బౌద్ధవాఙ్మయవేత్తల యభిప్రాయము. సంగ్రహముగ ఛద్దంతజాతకకథయిది. పూర్వజన్మము లొకదానిలో బోధిసత్త్వుడు యూథనాయకుడైన మహాగజముగ ఆఱు దంతములతో పుట్టి ఛద్దంతుడను పేరబరగెను. అతని కిరువురు భార్యలు. అందొకతెకు, రెండవయామెను తన మీదకన్న నెక్కువ ప్రేమమతో ఆదరించుచుండె నన్న కారణమున భర్తపై అసూయా క్రోధములు కలుగును. ఆమె కొంతకాలమునకు విధివశయై మఱల జన్మమెత్తి కాశీరాజుకు ప్రేమపాత్రమైన రాణియై వఱలును. అప్పటికిని పూర్వజన్మవాసన గలిగి ఛద్దంతునిపై పగ దీర్చుకొనవలె నను తలంపుతో వ్యాధిగ్రస్తురాలైన ట్లభినయించి ఆఱు దంతములు కలిగిన మహాగజముయొక్క దంతములను దెచ్చిననేకాని తన వ్యాధి కుదురదని భర్తతో చెప్పును. పిదప కాశీరాజానుమతిప్రకారము శోణుత్తరుడను నొకవ్యాధుడు రాణివలన వట్టి ఏనుగుండుతావు తెలిసికొని తుదకు ఛద్దంతునికడకు వచ్చి, వానినిపట్టుటకై యొకగోయితీసి ప్రాంతమున వేచియుండును. ఏనుగుల తండముతో బయలుదేరి అరణ్యమున పర్యటనముచేయుచున్న ఛద్దంతుడు యూథమును విడిచి ముందుపోవుచు శోణుత్తరుడు త్రవ్విన గోతిలో కూలును. అంతట ఆవ్యాధుడువచ్చి ఛద్దంతుని బాధింపబోవ అతడావ్యాధుడువచ్చినకారణమును గ్రహించి తన దంతములను గోసి రొంపంగుటలో దానే యాతనికి దోడు పడును. దంతభగ్నమైన పిదప ఛద్దంతుడు మరణించును. శోణుత్తరుడు దంతములను గొనిపోయి రాణికి చూపి ఛద్దంత మరణవార్త వినిపించును. ఆవృత్తాంతమును విన్న పిదప రాణి అత్యంత దుఃఖాకులితస్వాంతయై చేష్టడి తుదకు కాలవశత నొందును. ఇక వెస్సంతర జాతకము బోధిసత్త్వుని దానవీరతను వర్ణించును. వెస్సంతరుడు చేతికెముక లేని మహాదాత. ఎచ్చటికివెళ్లిన వచ్చుట వర్షమును కురిపింప శక్తిగల శ్వేతగజమును నాతడొకప్పుడు కళింగబ్రాహ్మణులకు దానముచేసి తనతండ్రి రాజ్యమునందలి ప్రజల యాగ్రహమునకు పాత్రుడగును. ప్రజలందఱును పోయి రాజకుమారుని యనుచిత కార్యమును గుఱించి రాజుతో మొఱపెట్టుకొని తుదకు రాజకుమారుని రాజ్యమునుండి అడవులకు వెడల నడిపింతురు. రాజకుమారుడు తనకుటుంబముతో నడవులకు బోవును. రాజ్యబహిష్కృతుడును, అరణ్యగామియు నగు ఆ రాజకుమారుని కడకు నిరుపేదలైన బ్రాహ్మణు లర్థింపరాగా మొదట తా నెక్కివెళ్లురథమును, పిదప గుఱ్ఱములను, ఆటుపిమ్మట ఇరువురు పిల్లలను తుట్టతుదను అతని వితరణౌదార్యములను బరీక్షింపవచ్చిన సురాధిపతి శక్రునిచే నర్థితుడై తన భార్యనుగూడ దానముగ నిచ్చివేయును. శక్రుడు నిజరూపమును దాల్చి వెస్సంతరుని దానవీరత ప్రశంసించి, యాతనిభార్య నాతని కిచ్చివేసి, పెక్కు వరములనుగూడ నిచ్చును. పిల్లలతోగూడ వారిని దానముబడసిన బ్రాహ్మణుడు వెస్సంతరుని తండ్రి రాజ్యమునుండి పోవుచుండ ఆ రాజువారిని బ్రాహ్మణునుండి విడిపించి తన కాపిల్లల మూలమున వెస్సంతరుని గనుగొని, అతనిని భార్యాసహితముగ రాజ్యమునకు గొనివచ్చును. చిత్రితములైన జాతక కథలన్నిటిలో నీవెస్సంతర జాతకమునకే చిత్రము లెక్కువ గలవు. గోలీశిలాఫలకములలో ఈ జాతక కథ ఎనిమిదరలలో చిత్రితమైనది. ఛద్దంతజాతకమున రెండు దృశ్యములు మాత్రమే చిత్రింపబడినవి. మాతృపోషక, శశజాతకములు లొక్కొక్క దృశ్యముతోనే ముగిసినవి.

శిలాఫలకముమీద ఒక కథకు, మఱియొక కథకు సంబంధించిన చిత్రములను వేఱుపఱచి చూపుటకై నడుమ నడుమ కొమ్మక, యక్షచిత్రములు చిత్రితములైనవి. బొమ్మలన్నియు చూచుట కతిమనోహరముగ నున్నవి. వీటిలో చాలవఱకు చెడిపోకుండ సుస్థితిలోనే భద్రముగ నున్నవి. అమరావతీస్తూపచిత్రములను, వీటిని పోల్చి చూచినచో ఈ రెండు చోట్లను బని చేసిన

శిల్పులు ఒకే పంథకు చెందినవారే యని స్థూలముగ గుర్తింపవచ్చును. ఈప్రతిమల తీర్పుతీరువలు నిరుపమానములై నయనానందకరముగ నున్నవి. ఇందు చెక్కబడిన స్త్రీపురుషప్రతిమల దుస్తులను, ఆభరణములను, తలకట్టులను జూచినచో ఈప్రతిమలు చెక్కబడిన నాటి సంఘ పరిస్థితులు—వేషభూషణాదుల విషయములు—చక్కగ విశదము కాగలవు. ఏప్రతిమను చూచినను జీవకళ యుట్టిపడుచుండును. ఈచిత్రములలోని కడుసూక్ష్మ విషయములనుగూడ రామచంద్రన్ గారు గమనించి చక్కగ వివరించియున్నారు. శిల్పులుగూడ కేవలము గ్రంథస్థమును పరంపరాగతమునైన వట్టి కథానకమునకు తమ బుద్ధినిగూడ గొంత యుపయోగించి కథలకు జీవము పోసియున్నారు. కుటీరప్రాంగణమున నిలిచి వెస్సంతరుడు తనపిల్లలను ఛత్రిధారియైన బ్రాహ్మణునికి దానమిచ్చుచుండును. వెస్సంతరుడు నివసించునది అరణ్యమధ్యమున. అరణ్యమని తెలియజెప్పుటకు చెట్లు చేమలు, జింకలు చిత్రితములయినవి. అడవుల కోతు లుండుట కూడ అరుదు కాదు. శిల్పి కథలోలేని కోతులనుదీసికొనివచ్చి చిత్రకథా చమత్కృతికి రసపోషణ మొనరించియున్నాడు. రాజ్యమును, రథమును, గుఱ్ఱములను కోల్పోయి వనవాసియైన నిరుపేద వెస్సంతరునివంటి యాతని పిల్లలను గూడ దానముగ గైకొనుట అనుచితమని సూచింపగా బోలు ఒకకోతి బ్రాహ్మణ యాచకుని వెనుక జేరి యాతని బట్టచెరగుపట్టుకొని వెనుకకులాగుచున్నది. మరియొక కోతి బ్రాహ్మణుని గొడుగును పట్టుకొని లాగుచున్నది. వేఱొకకోతి వెస్సంతరుని కుటీరముపైనిలిచి, "ఓ బ్రాహ్మణుడా! ఇంకను నీయాచనను విడువక, మా వెస్సంతరుని పిల్లలను గొనిపోవుచో చూడు ఏమిచేసెదనో," యనునట్లు బ్రాహ్మణుని వైపుతిరిగి హుంకరించి యాతనిపై దుముకబోవుచున్నది. నోరులేని జీవజంతువులును ప్రకృతియుగూడ బాధితులైన సాధువులకు సానుభూతి చూపుచుండును కాబోలు! ఈ విధమున చిత్రవిశేషములనెన్నిచో ఎన్నిపుటలైన బట్టును. చూచి, యానందింపదగినవే కాని వ్రాయవలసినవి కావు. బౌద్ధయుగమున పరమోచ్ఛ్రమందిన యాంధ్రుల శిల్పకళ కివి నిదానములు.

ఈ చిత్రములు చిత్రింపబడిన కాలము మనకు స్పష్టముగ తెలియదు. కాని రామచంద్రన్ గారు అమరావతీస్తూప చిత్రములను, వీటిని కడుసూక్ష్మముగ పరిశీలించి పరిశోధించి పోల్చిచూచి యీ గోలీస్తూప చిత్రములు క్రీ. శ. మూడవశతాబ్దినాటివికా దగునని తేల్చియున్నారు. శాసనముల యాధారము లేనప్పుడు చిత్ర కాలనిర్ణయమునకు ఇంతకన్న మార్గము లేదు. ఒకానొక శిలాఫలకము మీద "పికమలతి [శ్రియ]" అనియున్న శాసనమును కూడ కాలనిర్ణయమున కాధారముగ గొని దానిననుసరించి కూడ గోలీచిత్రములు క్రీ. శ. మూడవశతాబ్ది నాటివే యని నిర్ణయించియున్నారు. కాలనిర్ణయము విషయమున రామచంద్రన్ గారు చేసినకృషి స్తవనీయము.

బౌద్ధాంధ్రుల శిల్పకళ కిరవునకు అమరావతియే తార్కాణముగ నున్నది. కాని అమరావతీస్తూపచిత్రములలో ఉత్తమములైనవి ఖండాంతరముల కేగుటచేత అమరావతీశిల్పకళయొక్క ఉత్కృష్టతయును, శ్రేష్ఠత్వమును తెలిసికొనుటకు నవకాశిచ్చుట తగిన చిత్రనిదర్శనములు లేవు. ఉన్నవాటిలో మిన్నగ నెన్నదగినవి కలకత్తాపిళ్లినవి ఇప్పుడు బయలుపడుచున్నట్టియు, ముందు బయలుపడబోవునట్టియు ఇట్టి శిల్పకళానిధులను ఇంతటిమంచివైన ఆంధ్రులు భద్రపఱిచి కాపాడుకొనిననే కాని ముందు పేరు పోగలరు. ప్రాచీనాంధ్రుల యశస్సంపద కాధారభూతములైన వేనియున్న ప్రశ్నమునకు సమాధానమిచ్చునవి యీయమర్ఘ్య చిత్రరత్నములే. ఈ సంపద వీక్షించినచో ఆంధ్రులకు కళాదారిద్ర్యము కాక వేఱేమికలదు? బౌద్ధయుగమునాటి ఆంధ్రదేశచారిత్రము మహోన్నతమైనది. ఆంధ్రులప్పుడు ద్వీపాంతరముల నెలసలు స్థాపించిరి. దేశాంతరములు విజ్ఞానజ్యోతిని వెలిగించిరి. సముద్రాంతరముల దాటి ఖండాంతరములతో వర్తకవ్యాపారమును సాగించిరి. అహింసామూలకమైన ధర్మమతసందేశమును నలుదెసలకు బ్రాకించిరి: సిద్ధహస్తులై కళావల్లరిని ప్రోదిసేసి పుష్పవృష్టిని గురిపించిరి. బౌద్ధాంధ్రము ఎవ్వనిశరీరమును సంతోషపులకాంకితము కావింపదు?

అమూల్యములైన యీ గోలీచిత్రములను వెలువ తెచ్చిన దుబ్రెయిల్, రామచంద్రన్ గార్లు ఆంధ్రుల ప్రశం

సకు పాత్రులు. బయలుపడిన యీ గోలీచిత్రములు ఆంధ్రులహృదయములలో ప్రాచీన బౌద్ధాంధ్ర శిల్పచిత్రకళాభిరుచిని రేకెత్తించి ఏతద్విషయముపై వారిని కృషిచేయ ప్రేరేపింపగలవని మా విశ్వాసము.

మ. సోమశేఖరశర్మ.

వావిళ్లవాచకములు

(ఒకటవ తరగతిమొదలు నాలుగవ తరగతివఱకు)

ఎలిమెంటరి పాఠశాలల బాలురకొఱకు ఆంధ్ర వాఙ్మయమున ఎన్నియో వాచకములు పుట్టియున్నవి. బాలుర మనస్తత్త్వమునకు సరిపోయి వారిబుద్ధిని వికసింపజేయుచు నీతిబోధను, భాషాభివృద్ధిని గలిగించునవి వానిలో నాలవవంతు సైతము కానరాదు పేరొందిన దగిన కొన్ని వాచకములలో వావిళ్లవాచకము లగ్రగణ్యములు. ఈ వాచకములను రచియించిన శ్రీ జయంతి గంగన్న పంతులుగా రాంధ్రలోకమునకు క్రొత్తవారు కారు. వీరు చిరకాల ముపాధ్యాయులుగనుండి బాలుర మనస్తత్త్వమును చక్కగ బరిశీలించి గుర్తింపగలిగిరను టకు వీరి యీ యుత్తమ వాచకములే నిదర్శనము. ఈ వాచకములలో మొదటిదానిని సంపూర్ణముగ నభ్యసించిన బాలబాలికలు వర్ణక్రమ గుణితదోషములు లేకుండ పదములను వ్రాయగలుగుదురు. మఱియు సచిత్రములయి పెద్దయచ్చునను యిందలి పాఠములయొక్క యను క్రమమును చిన్నపిల్లలు వర్ణసమామ్నాయమును, గుణితాదులను సులువుగ నభ్యసింప ననువుగ నున్నది.

సచిత్రములగు రెండు మూడు నాలుగు వాచకములయందు జాతీయములు, చారిత్రకములు, పౌరాణికములు, శాస్త్రసంబంధులు నగు చిన్నకథలు, వేమన సుమతిశతకాదులలోని సరసములగు నీతిపద్యములు, ప్రాచీనములు కొన్ని, స్వీయకృతులు కొన్ని అగుగీతములు గలవు. ఇవి అన్నియు పిల్లలబుద్ధిని పెంపొందించుచు వివిధసారస్వత శాఖలయందును ప్రవేశమునుగలిగించి వారి మనములయం దుత్సాహబీజములను నాటగలిగినవి. వీని శైలి క్లిష్టముకాక విషయ మా యా తరగతిపిల్లల మనస్సుల కెక్కునట్లు సుగమముగ నున్నది. సంధులు, అర్ధానుస్వారములు, శకటరేఫములు ఆయాతరగతులకు తగునట్లు నిర్దిష్టముగ ప్రయోగింపబడినవి. ఇట్టి పెక్కు తెలుగుల సుగుణభూయిష్ఠములయిన యీ వాచకములు తెలుగుపిల్లలందఱు చదువదగినవి. ఆంధ్రదేశమున అన్ని ఎలిమెంటరి పాఠశాలల అధికారులును ఈవాచకములను తమపాఠశాలలయందలి అందఱు పిల్లలచేత చదివించి వారికి మేలును సమకూర్చు టావశ్యకము. ఇట్టి మంచి పుస్తకములు లభించునపుడు వానిని చదివించుట ఉపాధ్యాయుల ధర్మము. ఈ చక్కనివాచకములను వ్రాసి తెలుగుపిల్లలకు మహోపకారమును కావించిన శ్రీ గంగన్న పంతులుగారు ఎంతయు ప్రశంసార్హులు.

X

గ్రంథస్వీకారము

పల్లెటూరిపాఠశాల (Village School)

తెలుఁగుఫార్సు

గ్రంథకర్త: శ్రీ. హరివేంకటేశ్వర్లుగారు. వెల రు. 0-10-0. విలయువారు మదనపల్లెకు గ్రంథకర్తగారి పేరిట వ్రాయవలయును.

శంకరమహామనన (కన్నడ)

గ్రంథకర్త: వై. సుబ్బారావుగారు వెల, రు 0-2-6. అధ్యాత్మప్రకాశ కార్యాలయము, రెండవవీథి, చామరాజపేట, బెంగళూరుసిటీ.

రాజరాజేశ్వరీ శతకము.

గ్రంథకర్త : గూడ కృష్ణకవిగారు, పెరవలి (తెనాలితాలూకా) వెల తెలియదు.

సీమంతిని

శిష్ట్లా వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రికృతము. వెల రు. 0-5-0. ప్రకాశకులు: సత్యనారాయణ అండుకో, గుంటూరు.

వందేమాతరస్తోత్రమ్

మహావిద్వాన్ శ్రీమత్కోమాండూర్ రామానుజాచార్యులవారిచే విరచితము. వెల రు. 0-1-0. కోమాండూర్ గోవిందరాజాచార్యులు, రాజమహేంద్రవరమునకు వ్రాసిన లభ్యముగలదు.

గంగావతరణము (నాటకము)

గ్రంథకర్త: సోమరాజు రామానుజరావుగారు వెల రు. 1-0 0. ప్రకాశకులు: కస్తూరి సుబ్బారావు గారు, సరస్వతీ బుక్కుడిపో, బెజవాడ, (కృష్ణాజిల్లా)

ఆంధ్రమహిళామణుల శోకమనవి

కూచి నరసింహకృతము వెల రు. 0-1-6. ప్రకాశకులు: ముద్దా సోమప్పశాస్త్రి అండుసన్స్ 'వ్యాసకుటీరము' మేలుపాక (విశాఖపట్నముజిల్లా)

Some Problems of Vijayanagara History.

శ్రీ డా. చిలుకూరి నారాయణరావు, యమ్. ఎ., యల్., టి. పి. హెచ్. డి. గారిచే వాంగ్లమున విరచితము. వెల తెలియదు. పలయువారు దత్తమండల కళాశాల, అనంతపురమునకు గ్రంథకర్తగారికేరిట వ్రాయవలయును.

కలగీవాలేకే ఆదర్శ (హిందీ)

వెల లేదు, ప్రకాశకులు: ప్రచారసహాయక్ కమిటీ, శహీద్ సిఖ్ మిషనరీకాలేజి, అమృతసరము.

భక్తిరస శతక సంపుటము. (3)

వెల రు. 2-0-0. ప్రకాశకులు: వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండుసన్సు, ఎస్ప్లనేడు, మదరాసు.

నీతిశతక సంపుటము (1)

వెల తెలియదు. ప్రకాశకులు. వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండుసన్సు, ఎస్ప్లనేడు, మదరాసు.

The Children of the Kaveri.

(కథలు - ఇంగ్లీషు)

క్రౌను ౧౬ పుటలసైజున ౧౦౩ పుటలు

వెల రు. ౦-౧౨-౦.

గ్రంథకర్త. శంకరరామగారు ప్రకాశకులు: వి. యల్ శాస్త్రి అండు కో, తిరువల్లిక్కేణి, చెన్నపురి.

భారతదేశము-నేడు

భారతదేశమందలి స్థితిగతులు క్రమముగ విపరీతస్థితిని జెందుచున్నవి. అవతారమూర్తియగు మహాత్ముని నాయకత్వమున స్వాతంత్ర్యమునుగడింప అహింసాబద్ధులయి భారతీయులు నడుముగట్టినారు; విదేశ ప్రభుత్వమునుండి విడివడి స్వతంత్రులుగ నుండగోరుచున్నారు. బ్రిటీషువారు ఎట్టులయినను భారతదేశమునకు స్వాతంత్ర్యము నొసంగ నిచ్ఛగింపకున్నారు. స్వాతంత్ర్యమునకయి భారతీయులుచేయుచున్న అహింసాత్మక ప్రశాంత ప్రయత్నముల నానా ముఖముల నరికట్టుచున్నారు. స్వాతంత్ర్య సంపాదనకై కావించు ప్రసంగములు కూడదన్నారు. పత్రికలు పడిపోవు శాసనములను ప్రకటించినారు. అహింసాపరాయణులగు భారతీయులకు పెక్కు తెరగుల నొత్తిడి కలిగించుచున్నారు. ఎంతయొత్తిడి కలిగినను భారతీయులు అహింసాబద్ధులై తమప్రయత్నమును సాగించుచునే యున్నారు. స్త్రీలును పురుషులతోపాటు నడుముగట్టుచున్నారు. వేలకొలది భారతీయనాయకులును శిక్షితులయి కారాగారములకు పోయినారు. ఇంకను పోవనున్నారు. తత్ఫలముగ ఆసేతుశీతాచలము భారతదేశమునందంతటను మహాసంచలనము కలిగినది. భారతీయుల హృదయభూమియందు చిరకాలముననే మొలకెత్తిన స్వాతంత్ర్యాపేక్ష క్రమముగ నభివృద్ధినిగాంచి నేటికి పుష్పించినది. ఇట్లే ఫలవంతమును కాగలదు. ఇకను భారతీయులు పరాధీనతను సహింపజాలరనుటను ఈమహాసంచలనమువలన బ్రిటీషువారు తెలుసుకొనవచ్చును. ఇప్పటికైన పాలకులు పాలితులు, స్వార్థపరమును, సంకుచితమునునైన తమభావమును ధర్మపరమును, విశాలమును గావించుకొని ఉభయతారకమును, ఉభయక్షేమంకరమును నగు మార్గము నవలంబించదగుదురు. ముప్పదిమూడుకోట్లు ప్రజలు ఏకగ్రీవముగ నాకాంక్షించుచున్న స్వాతంత్ర్యము నచిరకాలమున బ్రిటిషువారు భారతీయుల కొసగదగుదురు.



శ్రీమతి గుమ్మిడిదల

దుర్గాబాయిగారు

ఈ వీరనారీమణి ఆంధ్రదేశమున అవతరించిన అహింసాధిదేవత; ధైర్యవతి. దేశమాతకు స్వాతంత్ర్యమును గడింప నడుముకట్టిన నాయకురాలు. ఈమె పుట్టువుచే నాంధ్రదేశము ధన్యమయినది. ఈ యువతీమణి నామాక్షరములు సువర్ణముతో లిఖించి పూజింపదగినవి.

స్వరాజ్య సత్యాగ్రహము-అరెస్టులు-శిక్షలు

1. శ్రీ మారేపల్లి రామచంద్రశాస్త్రిగారు
2. శ్రీ భమిడిపాటి చినయజ్ఞ నారాయణశర్మగారు
3. శ్రీ తెన్నేటి విశ్వనాథంగారు
4. శ్రీ దిగుమర్తి రామస్వామిగారు
5. శ్రీ కొల్లూరు సూర్యనారాయణగుప్తగారు

వీరు 5 గురు 18 వ తేదీ సాయంకాలమున విశాఖపట్టణమున అరెస్టు చేయబడిరి 24 వ తేదిని వీరికి 5 గురికిని ఆరేసి నెలలు కఠినశిక్ష వేయబడెను.

6 మహర్షి బులుసు సాంబమూర్తిగారు,
7. శ్రీ వెన్నేటి సత్యనారాయణగారు
8. డాక్టరు బ్రహ్మజోశ్యుల సుబ్రహ్మణ్యముగారు
9. శ్రీ కళా వేంకటరావుగారు

వీరిని నలుగురిని 19 వ తేదీ ఉదయము కాకినాడలో అరెస్టు చేసిరి. ఆనాడే విచారణకూడ జరిగినది. ఒక్కొకరికి ఒక సంవత్సరము విడికైదు వేయబడెను.

10. శ్రీ స్వామి నారాయణానందజీగారు

వీరు పూర్వాశ్రమమున పింగళి లక్ష్మీనారాయణగారు. వీరిని బెజవాడలో 19 వ తేదీ రాత్రి 8 గంటలకు అరెస్టుచేసిరి.

11. శ్రీ చెరుకువాడ వెంకట నరసింహంగారు

20 వ తేదీ ఉదయమున 9 గంటలకు బందరులో అరెస్టు చేయబడిరి, 22 వ తేదీని ఒక సంవత్సరము విడికైదు వేయబడెను.

12. శ్రీ డా॥భోగరాజుపట్టాభిసీతారామయ్యగారు
13. శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారు

21 వ తేదీ ఉదయము 9 గంటలకు వీరినిద్దరిని బందరులో అరెస్టుచేసిరి. పట్టాభి, కాళేశ్వరరావు, స్వామిజీ గార్లకు 21 వ తేదీని ఒక్కొకరికి ఒక సంవత్సరము విడికైదు వేయబడెను.

14. దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావుగారు
15. శ్రీ గద్దె రంగయ్యనాయుడుగారు
16. శ్రీ డాక్టరు పి. యస్. శ్యామ్యం శెట్టిగారు

వీరిని ముగ్గురిని 21 వ తేదీ మధ్యాహ్నము ఒంటిగంటకు చెన్నపురిలో అరెస్టుచేసి వెంటనే విచారణచేసి ఒక్కొకరికి ఆరేసి నెలలు కఠినశిక్ష వేసిరి.

17. శ్రీ నేతి వేంకటాచలపతిగారు

వీరు గంటూరు జిల్లా వాడరేవులో దళాధిపతి. వీరికి 22 వ తేదీని చీరాలలో జిల్లా మేజస్ట్రేటు 6 నెలలు విడికైదు వేసెను.

18. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశంగారు

23 తేదిని ౧ సంవత్సరము విడికైదు వేయబడెను. అరెస్టును శిక్షయును 23 తేదినే జరిగినవి.

19. సర్దారు శ్రీ దండు నారాయణరాజుగారు
20. శ్రీ ఆత్మకూరి గోవిందాచారిగారు

వీరిని ఇద్దరిని 23 వ తేదిని ఉదయమున మట్లపాలెంలో అరెస్టుచేసిరి. ఆనాడే నరసాపురములో వీరికి ఒక్కొక్కరికి ఒకసంవత్సరము విడికైదు వేయబడెను.

21. శ్రీ నడింపల్లి లక్ష్మీనరసింహారావుగారు,

(గుంటూరు-శిక్ష 24-4-30. ఒకసంవత్సరము విడికైదు.)

22. శ్రీ మండపాక రంగయ్యనాయుడుగారు
23. శ్రీ పారుపూడి సత్యనారాయణగారు
24. శ్రీ మొసలికంటి తిరుమలరావుగారు

కాకినాడలో అరెస్టు. శిక్ష 25-4-1930. చెరియొక యేడాది కఠినశిక్ష వేయబడెను.

శ్రీయుత అన్నాప్రగడ కామేశ్వరరావుగారు

గుంటూరు; శిక్ష 23-4-30, 6 నెలలు విడికైదు.

26. శ్రీ దేశభక్త కొండ వెంకటప్పయ్యపంతులుగారు

గుంటూరు-అరెస్టు 29-4-1930. శిక్ష 1-5-1930. ఒకసంవత్సరం కఠినశిక్ష.)

27. శ్రీ వడ్లమూడి ముక్తేశ్వర ప్రసాదరావుగారు

28 శ్రీ కవుతా చలపతిరావుగారు

29. శ్రీ జనాబు గౌసుబేగు సాహెబుగారు

30. శ్రీ మంత్రవాది వేంకటరత్నంగారు

ఒంగోలు-అరెస్టు శిక్ష 27-4-1930. చెరియొక వత్సరము కఠినశిక్ష.

31. శ్రీ రాజా కోటగిరి వేంకటకృష్ణారావు బహదరుగారు-గంపలగూడెము

32. శ్రీ కాకుమాను లక్ష్మయ్య చౌదరిగారు

(బెజవాడ అరెస్టు) శిక్ష 30-4-1930. రాజాగారికి ఒక శిక్ష. చౌదరిగారికి ఒక సంవత్సరం విడికైదు.

33. శ్రీ గొల్లపూడి సీతారామశాస్త్రిగారు

(చీరాల-అరెస్టు - 29-4-1930. శిక్ష 1-5-30 ఒక సంవత్సరం కఠినశిక్ష.

34. శ్రీ మఠం బాలసుబ్రహ్మణ్య గుప్తగారు

(బెజవాడ-అరెస్టుశిక్ష, 1-5-1930. ఒక సంవత్సరం విడికైదు.

35. శ్రీ ధారా గోపాలశాస్త్రిగారు

36. శ్రీ సూరపరాజుగారు చీరాల. అరెస్టు శిం

37. శ్రీ భట్టిప్రోలు సూర్యప్రకాశరావుగారు

చీరాల-అరెస్టు 30-4-1930, రెండుఏండ్లు కఠినశిక్ష 2-5-1930.

38. శ్రీ శ్రీ కాకుళపు పట్టాభిరాములు గుప్తగారు

39. శ్రీ చీరాల రంగయ్యగారు

చీరాల-అరెస్టు శిక్ష 2-5-30. శ్రీ పట్టాభిరాములు గుప్తగారికి రెండేండ్లు కఠినశిక్ష—శ్రీ రంగయ్యగారికి ఒక సంవత్సరము కఠినశిక్ష.)

40. శ్రీ వల్లభనేని రామబ్రహ్మం చౌదరిగారు

41. శ్రీ మోటూరి వెంకటాచలపతి చౌదరిగారు

42. శ్రీ వల్లభనేని వెంకటకృష్ణయ్య చౌదరిగారు

43. శ్రీ అరెకపూడి కోటయ్యగారు

44. శ్రీ రాళ్లబండి దుర్గా నాగేశ్వరరావుగారు

45. శ్రీ కొమ్ము సత్యనారాయణగారు

(గుడివాడవద్ద కొమరవోలు 1-5-30. అరెస్టు 2-5-30 చెరి ఆరు నెలల కఠినశిక్ష వేయబడెను.

ఏప్రిల్ 27_వ తేదిన

ప్రెస్ ఆర్డినెన్సు అమలునకు వచ్చిన పిమ్మట ఈ క్రింది దినపత్రికలు ప్రకటన మానివేయవలసి వచ్చెను.

ఢిల్లీ

1 హిందుస్థాన్ టైమ్సు ఇంగ్లీషు పత్రిక

2 అర్జున్ దేశభాషా పత్రిక

3 తేజ్ ,,

4 మిలాప్ ,,

5 రిసాయత్ ,,

కలకత్తా

6 అడ్వాన్సు ఇంగ్లీషుపత్రిక

7 లిబర్టీ ,,

8 అమృతబజారు పత్రిక ,,

9 హిందీ పంచ్ దేశభాషా పత్రిక

10 బంగబాసి ,,

11 స్వతంత్ర ,,

12 ఆనందబజారు పత్రిక ,,

13 భారతమిత్ర ,,

14 విశ్వామిత్ర ,,

15 హితవాది ,,

16 నాయక్ ,,

లాహోరు

17 వీర్ ,,

18 భారత్ ,,

19 కర్మవీర్ ,,

20 మజ్దూర్ ,,

గభిప్రాయ విశేషములు



'విశ్వదాత,' 'దేశోద్ధారకుడు,' దేశసేవా పరాయణుడు నగు సన్మజ్జనుడు దేశమాతకు స్వాతంత్ర్యమును సంపాదింప ప్రయత్నించి తత్ఫలముగ నాఱు నెలల కాలము కృష్ణజన్మస్థాన నివాసమును బడసెను. ఏప్రిల్ నెల ఇరువదియొకటవ తేదినాడు తత్ స్థానమును అలంకరించెను. నా తండ్రికి నాయెడగల వాత్సల్య మపారము. అనుమానము నా తండ్రి నా కొసగు నూత్నాలంకారములను తచ్ఛుభాగమనపర్యంతము బడయజాలను. తదారోగ్యమును, అచిరకాలమున తచ్ఛుభాగమనమును, తద్వాంఛిత మగు దేశమాతృ స్వాతంత్ర్యమును అనుగ్రహింప విశ్వమంగళప్రదాత యగు సర్వేశ్వరుని ప్రార్థించుచున్నాను.



—భారతి



గాంధి మహాత్ముడు

వీరు 'అరెస్టు' అయిరి

వార్త ౫-౫-౧౯౩౦.

Printed and Published by K. Nageswara Rao, at the Andhra Patrika Press, No.7, ThambuChetty St., Madr